# తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం

ఆచార్య గారపాటి ఉమామహేశ్వర రావు
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

ప్రచురణ

**తెలుగుజాతి (ట్రస్టు)**

విజయవాడ – ఆంధ్రప్రదేశ్

**తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం**
ఆచార్య గారపాటి ఉమామహేశ్వర రావు

*Telugu Raashtralalo Bhasha samkshobham*
*(Language in chaos in Telugu States)*
*Prof. Garapati Umamaheswara Rao*


కాపీరైట్ : రచయితది
ప్రచురణ : తెలుగుజాతి ట్రస్టు
తొలి ముద్రణ : 23 నవంబరు 2017
ప్రతులు : 2000
ముఖచిత్రం : చిదంబరం


ప్రతులకు:

1. **తెలుగుజాతి (ట్రస్టు)**
   జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
   మాచవరం, విజయవాడ–520 004.
   ఫోన్ : 0866–2439466, 91–9848016136.
2. **'అమ్మనుడి'** పత్రిక కార్యాలయం,
   8–386, జీవక భవనం, అంగలకుదురు (పోస్టు),
   తెనాలి, గుంటూరు జిల్లా – 522 211
   ఫోన్ : 91–9440448244
3. **శ్రీమతి గారపాటి భరణి**
   82, లక్ష్మి విహార్–2, నల్లగండ్ల, శేరిలింగంపల్లి
   హైదరాబాదు – 500019
   ఫోన్ : 040–23014782
4. **నవోదయ బుక్ హౌస్**
   డోర్‌నెం. 3–3–365, ఆర్యసమాజ్ ఎదురుగా,
   కాచిగూడ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్ – 500 027.
   ఫోన్ : 9000413413.

   **అన్ని పుస్తకాల అంగళ్లలో లభించును.**


ముద్రణ :
శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ, ఫోన్ : 9490634849
వెల : 100/–

# విన్నపం

భాషాప్రాతిపదికన రాష్ట్రాలకై జరిగిన ఉద్యమాల ఫలితంగా తొలుత ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటుచేయడం, ఆ తర్వాత నైజాంలోని తెలుగుభాగాన్ని కూడా చేర్చి ఆంధ్రప్రదేశ్ ఏర్పరచడం – ఇదంతా భాషా ప్రాతిపదికన జరిగిన ప్రక్రియే. తెలుగు ప్రజలు తమ భాషలో తమను తాము పరిపాలించుకోవడానికీ, తమభాషలో తామూ తమసంతానమూ చదువుకొంటూ అనంతవిజ్ఞానాన్ని అందుకోవడానికీ, భారతదేశంలోని ఒక అత్యధిక సంఖ్య గల బలమైన భాషాజాతిగా స్వాభిమానంతో ఎదగడానికీ రాజ్యాంగబద్ధంగా జరిగిన ఏర్పాటు అది.

ఈ ఏర్పాటు జరిగి 60ఏళ్లు నిండుతూనే ఈ రాష్ట్రం రెండుగా విడిపోయింది. దీనికి కారణాలు అనేకం ఉన్నప్పటికీ అన్నింటికీ మూలకారణం మాత్రం ఇంతకాలం పాలించిన రాజకీయ పార్టీల, నేతల వైఫల్యం. వివిధప్రాంతాల మధ్య ప్రజల మధ్య ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ సంతులనాన్ని సాధించడం పట్ల ఎన్నడూ ఆ నాయకులు శ్రద్ధ చూపకపోవడంతో ఈ పరిణామం ఏర్పడింది. ఐక్యతకే గాక అనైక్యతకు కూడా భాష కారణం కాగలదనే చర్చకు దారితీసింది. రెండుప్రాంతాలవారికి ఎక్కడికక్కడ తమవే అయిన కొన్ని ప్రత్యేకతలున్నాయి. వాటిని కాపాడుకోవడంలోనే ఆప్రాంతాల భాషాప్రత్యేకత ఇనుమడిస్తుంది. తమ ప్రజలభాష తెలుగు గనుక – ఇప్పుడు రెండు రాష్ట్రాలూ మౌలికంగా తెలుగు రాష్ట్రాలే గనుక తొట్టతొలుత భాషాప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు ఏ లక్ష్యాలతో, ఏ ఆశయాలతో జరిగిందో ఇప్పుడూ ఈ రెండు రాష్ట్రాల ఆశయ లక్ష్యాలూ ప్రజల భాష తెలుగుతోనే ముడిపడి ఉన్నాయి.

నాటికీ నేటికీ, ముమ్ముందు కూడా మన మనుగడకు, ప్రగతికీ కీలకం మన అమ్మభాష. మన భాష మనకు సహజ సాధనం, ఆయుధం కూడా. అయినా తెలుగు భాషను అన్ని విధాలా నిరుపయోగం చెయ్యడానికీ, ఆవిధంగా ప్రజలను శక్తిహీనులను చెయ్యడానికీ వారి సృజనాత్మకతను, ముందడుగును నిరోధించడానికీ జరిగిన, జరుగుతున్న కుట్రకు తెలుగుప్రజలు బలి అవుతున్నారు. దురదృష్టవశాత్తు ఇందులో ప్రభుత్వాలు భాగస్వాములయ్యాయి. అంటే ఈ నేరంలో మన నేతలు భాగస్వాములయ్యారు. ఇది తెలిసి జరుగుతోందా, తెలియక జరుగుతోందా, ఏఏ

వత్తిళ్లకు వారు లొంగిపోయారు, ఫలితంగా జరుగుతున్నదేమిటి – ఇదంతా లోతుగా చర్చించవలసిన సంగతి. వాస్తవాల, గణాంకాల విశ్లేషణతో ఈ చర్చ జరుగవలసిన పరిస్థితి వచ్చింది.

ఇంగ్లీషుభాష చొరబాటుకు చారిత్రక కారణాలుండవచ్చు. ఆర్థిక కారణాలుండవచ్చు. ఇవన్నీ తెలుగు సమాజంపై తీవ్రప్రభావం చూపించనూవచ్చు. అయినా మాతృభాషను– అమ్మనుడిని– మొదలంటా త్రోసిపుచ్చి పుట్టీపుట్టగానే పిల్లలను ఇంగ్లీషు బడిలోకి వదిలివేసేందుకు మనం ఎందుకు సిద్ధపడుతున్నట్లు? ఇందులో ప్రజలెందుకు కట్టుబానిసలవుతున్నారు? ప్రభుత్వాలు, వాటినేతలు ఎందుకు జాతివ్యతిరేక, దేశ వ్యతిరేకచర్యలకు పూనుకొంటున్నారు? పాలనకూ చదువుకూ తెలుగు అక్కరకురానప్పుడు ఇవి తెలుగు రాష్ట్రాలెలా అవుతాయి? ఇదీ అసలు ప్రశ్న.

'ఉనికి కోసం తెలుగు – బ్రతుకుకోసం, భవిష్యత్తు కోసం ఇంగ్లీషు' కావాలంటున్నారు మన పాలకులు. అదేసమయంలో తెలుగువారి ఆత్మగౌరవం అంటున్నారు! ఇదీ మన పాలకులు ఆలోచిస్తున్నతీరు, ప్రజలను పక్కదారి పట్టిస్తున్నతీరు!!

ఇది తప్పు. ఎందుకు తప్పో ఎలా తప్పో అన్ని వివరాలనూ అందిస్తుంది ఈ పుస్తకం.

పాలనకూ, బోధనకూ తెలుగు పనికిరాదనే నిర్ణయంతో ఉంటే మన పాలకులు ఆత్మగౌరవం గురించీ, తెలుగు గొప్పదనం గురించీ మాట్లాడేందుకు అర్హతను కోల్పోతున్నట్లే. ఒక భాషగా 1వ తరగతి నుండి 12వ తరగతి వరకూ తెలుగును తప్పనిసరిగా బోధించేందుకు ఉత్తర్వులిస్తారట! బోధనామాధ్యమంగా మాత్రం పూర్వప్రాథమిక స్థాయి (ఎల్.కె.జి) నుండీ బిడ్డలు తమ అమ్మనుడిలోగాక, పరాయినుడిలో చదువుకోవాలట! ఇదేవిధంగా నిర్ణయమైతే – తెలుగును ఒక ఎదగని మరుగుజ్జుగా, ఎందుకూ పనికిరాని ఒక బొమ్మగా అణచివేసినట్లే. ఇదే మన ఉనికికీ, ఆత్మగౌరవానికీ చిహ్నామైతే ఇక ఈ తెలుగుజాతి మనుగడ ఎందుకు? ఈ తెలుగు రాష్ట్రాలు ఎందుకు?

ఆంగ్లమేకాదు, అక్కరపడిన ఏ భాషనైనా నేర్చుకోవల్సిందే. ఎంతవరకు అక్కఱపడితే అంతవరకూ నేర్చుకోవలసిందే. కావలసినవారు అందులో ప్రావీణ్యతను

కూడా సాధించవలసిందే. అయితే ఇదంతా అమ్మనుడి తర్వాతే. అమ్మనుడిలో సామర్థ్యత వల్లే ఇదంతా బలపడుతుంది. అమ్మనుడిపై ఆధారపడి ఇతర నుడులను కూడా అందుకొన్నవాడి ముందు అమ్మనుడిని విస్మరించినవాడు ఏవిధంగానూ నిలువలేడు. అతడికే తనదైన వ్యక్తిత్వమూ, ఉనికీ, గుర్తింపు, గౌరవమూ, శక్తి సామర్థ్యాలూ అన్నీ ఉంటాయి.

మన పాలకులు ఇంతకాలంగా అనుసరిస్తున్న విధానాలవల్ల- మన రెండు రాష్ట్రాలూ భాషా సంక్షోభంలో పడ్డాయి. ఈ సంక్షోభం ఎంత ప్రమాదకరమైనదో తెలుసుకోవడానికి కావలసినన్ని వివరాలనూ ప్రజలను, ప్రభుత్వాలను మేల్కొలిపేందుకు ఎన్నో వాస్తవాలను, ఎంతో సమాచారాన్నీ ఈ పుస్తక రూపంలో మీముందు విన్నవిస్తున్నాము.

ప్రజాస్వామ్యవ్యవస్థలో పాలకులూ పాలితులూ వేర్వేరుకాదు. ఇప్పుడేర్పడిన భాషా సంక్షోభంలో అందరూ భాగస్వాములయ్యారు. అందుకే మా విన్నపాలు అందరికీ – ప్రజలకూ ప్రజాప్రతినిధులకూ; ఉద్యమకారులకూ ఉపాధ్యాయులకూ; పాలకవర్గాలకూ, ప్రభుత్వనేతలకూను. అందరూ గాఢనిద్రలో ఉన్నారు. ఒక విచిత్రమైన చీకటి రెండు తెలుగు రాష్ట్రాలనూ కమ్ముకుని ఉంది. దీన్నుంచి మనం బయటపడాలంటే తగినంత వెలుగు ప్రసరించాలి. అందుకే ఈ పుస్తకం. ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ఎంతో అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి వ్రాసిన వ్యాసాల సంపుటి ఇది.

ఈ పుస్తకాన్ని అందరూ చదవండి. సమస్య పరిష్కారం కోసం ఉద్యమించండి.

తెలుగు భాషోద్యమంలో భాగంగా ఈ పుస్తకాన్ని తెలుగుజాతి ట్రస్టు ప్రచురిస్తున్నది. తెలుగుజాతి ట్రస్టుకు ఈ బాధ్యతను అప్పగించినందుకు ఆచార్య ఉమామహేశ్వర రావు గారికి కృతజ్ఞతలు.

**– డా॥ సామల రమేష్‌బాబు**

మేనేజింగ్ ట్రస్టీ

తెలుగుజాతి ట్రస్టు

## నా మాటగా మీ ముందు...

# అసలు ఇది ఎందుకు రాయవలసివచ్చిందంటే ...

ఈ నేలమీద జీవుల్లో మనిషితోపాటే పుట్టి మనిషిని మనిషిగా నిలబెట్టినదీ మనిషంత ప్రాచీనమైనదీ భాషే. మానవ వికాసంలో ఒక విశిష్ట లక్షణంగా ఉత్పన్నమైనదీ భాషే. మనిషి పుట్టుక భాషతోనే. అంటే మనిషికి మనిషిగా గుర్తింపువచ్చినదీ భాషతోనే. మనిషి వయసు ఎంతో భాషవయసూ అంతే. దీంతో ఒకరి భాష అతి ప్రాచీనమనీ మరి కొందరి భాష నిన్న మొన్నటిదనీ అనే ఆలోచనలకు ఆస్కారం లేదు. అలాగే ఒక భాష గొప్పదనీ మరొకటి పేదదనీ అనుకోడానికి ఎలాంటి ఆస్కారం లేదు. అంటే భాషలమధ్య ఎలాంటి తేడాలూ, చిన్నా పెద్దా అనే తారతమ్యాలూ లేవు. అన్ని భాషలూ శక్తివంతమైనవే. అన్నింటా అదే సంక్లిష్టతా అంతే సౌలభ్యమూను. భాషలకు వాడుకే ఊపిరి. వాడుకరులే బలం. ప్రాణులలానే భాష జీవభౌతిక అంశాలు కలగలిసిన మనోసామాజిక వ్యవస్థ. భాష మనిషికి ఒక అవయవం. ఉన్న అవయవాన్ని పోగొట్టుకోవటమంటే అంగవైకల్యాన్ని కొనితెచ్చుకోవటమే. అంటే సామాజిక వైకల్యానికి చేరువవ్వటమే. ఇది అనర్థదాయకం. భాషలు మానవవికాస పరంపరలో ఏర్పడిన జీవభౌతిక సృజనలేకాదు, అవి తరతరాల సామాజిక సాంస్కృతిక వారసత్వ సంపదలు కూడా. వాటిని పక్కన పెట్టించే పనులు ఆ సమాజంపై దాడితో సమానం.

ఏదైనా ఒక సమాజం తన వారసత్వ భాషను పక్కనుపెట్టేది రెండు సందర్భాలలో మాత్రమే. ఒకటి, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను కోల్పోయి పర సమాజపు ఆధిపత్యపు నీడలో ఉన్నప్పుడూ,రెండవది, అల్ప సంఖ్యాకసమాజమైనందువలన తన సొంత వనరులతో బతకడం కష్టమైనప్పుడూ. ప్రస్తుతం తెలుగు సమాజానికి ఈ రెండు లక్షణాలూ లేవు. మరి ఇప్పుడు ఈ సమాజం తన పౌరులకు బోధనా మాధ్యమంగా తన వారసత్వ భాషను తొలగించి ఆ స్థానంలో ఇంగ్లీషును ఎందుకు చేర్చుతున్నట్లు?

ప్రపంచ జనాభాలో 22 శాతం మంది మాత్రమే భారతదేశంలో ఉంటే, ప్రపంచంలోని నిరక్షరాస్యుల్లో 46 శాతం వరకూ భారతదేశంలోనే ఉన్నారు. ఇక,

ప్రపంచంలోని మొత్తం బడిబయట ఉన్న పిల్లలలో అత్యధికం భారతదేశంలోనే ఉన్నారు. ఇది మన దేశంలోని చదువుల స్థితిగతులగురించి ఆందోళన పడవలసిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. దీనికి కారణం పాఠశాల విద్యలో విస్తరిస్తున్న ఆంగ్లమాధ్యమ విద్యాబోధనే. ఈ స్థితినుంచి బైటపడటానికి ఉన్న ఒకే ఒక సులువైన మార్గం స్థానిక భాషలలో చదువు నేర్పడం. దీనికి ఇంటిలో ఉన్న పెద్దలూ, తల్లిదండ్రులూ, తోబుట్టువులూ, చుట్టుపక్కల జనం అందరూ సాయపడే అవకాశం ఉంటుంది. అదే ఇంగ్లీషులో అయితే బడి టీచరే బాధ్యత వహించాలి.

మాతృభాష, బడిభాష ఒకటే అయితే బడి వాతావరణం సహజంగానూ నేర్చుకునే విషయం తేలికగానూ ఉంటుంది. అలా కానప్పుడు అనవసరమైన ప్రయాసతోపాటు చదువే భారం అవుతుంది. లౌకిక, నాగరిక, సభ్య, స్వేచ్ఛా సమాజాలు మాతృభాషలోనే చదువుకోవడం సాధారణం, సహజం, తార్కికం, ఆనవాయితీ. ఎక్కడో కొన్ని అభివృద్ధికి నోచుకోని, లిపి లేని అల్పసంఖ్యాక భాషా సమాజాలలో తప్ప అధికశాతం ప్రాథమిక విద్య మాతృభాషామాధ్యమం ద్వారానే నేర్పడం జరుగుతోంది. మరి కోట్లాదిమంది ఉన్న తెలుగు సమాజం తెలుగులో చదువుకోలేని దుస్థితిని కల్పిస్తున్నది ఎవరు? అవగాహనారాహిత్యంతో మంచిచెడుగుల ఆకళింపు కొరవై, ముందుచూపు కరువై, తేలిక పద్ధతిలో స్థానిక వనరులతో తక్కువసమయంలో ఎక్కువమందిని అక్షరాస్యులను చేసే పని మానేసి, కొన్ని విదేశీ ఉద్యోగాలను ఎరగా చూపి, లేని వనరులతో రాని భాషలో తెలియని చదువులతో ఇంగ్లీషు మాధ్యమాన్ని మనమీద రుద్దే ప్రయత్నాలను ఎదుర్కొనే అవగాహనను కల్పించటమే మన ప్రస్తుత కర్తవ్యం.

ఇకపోతే,ప్రపంచ పటం మీద ఐరాస గుర్తింపు పొందిన190కి పైగా ఉన్న దేశాలలో62 దేశాలలో మాత్రమే ఇంగ్లీషు అధికార భాషగా కాకపోయినా వాస్తవానికి అధికార భాషగా చెలామణి అవుతోంది. ఈ అరవైరెండు దేశాలలో కోటికి పైగా జనాభా ఉన్నవి 21 దేశాలు. 75 లక్షలనుంచి 10 లక్షల జనాభా ఉన్నవి 14 దేశాలు. 1 వెయ్యి నుంచి 8 లక్షల జనాభా ఉన్నవి27. ఈ దేశాలు చాలావరకు బ్రిటిషు వలస పాలనలో మగ్గిన దేశాలే. ఐతే వీటిలో 24 దేశాలు ఆఫ్రికా ఖండంలోనూ, 15 దేశాలు మధ్య అమెరికా ఖండంలోనూ, ఆస్ట్రేలియా ఖండ దరిదాపుల్లో15 దేశాలూ, ఆసియా ఖండంలో 6 దేశాలు, ఐరోపాలో 2 దేశాలూ ఉన్నాయి. ఐతే వీటిలో ఇండియా,

పాకిస్తాన్, నైజీరియా, బంగ్లాదేశ్, ఫిలిప్పైన్స్, ఇథియోపియాలాంటివి తప్పించి మిగిలినవన్నీ చిన్నా చితకా దేశాలే. బ్రిటిష్ వలసవాద ఆధిపత్యపు పీడనలో నలిగిన దేశాలే ఇవి. ఆనాటి వలసవాద అవశేషంగా ఇంకా మిగిలిన ఆనవాలే ఇంగ్లీషు. చాలావరకూ ఈ దేశాలలో వాళ్ల సొంత భాషలే మాట్లాడుతున్నా అధికారిక కార్యకలాపాలూ ఉన్నత విద్య మొదలైనవి మాత్రం ఇంగ్లీషులోనే. వీటిలో చాలా దేశాలలో ఇంగ్లీషును పక్కనపెడదామని ఎన్ని ప్రణాళికలు వేసుకొన్నా ఆర్థిక వెసులుబాటు లేని కారణంతోనూ, అంతర్గత రాజకీయ సామాజిక కారణాలచేతనూ ఇంగ్లీషును భరించక తప్పటం లేదు. ఆసలు విషయం ఏమంటే ఇంగ్లీషును సొంతభాషగా మాట్లాడే దేశాలైన ఇంగ్లండు, అమెరికా (సం. రా.), ఆస్ట్రేలియా, న్యూజీల్యాండులలో ఇంగ్లీషు ఈ నాటికీ అధికార భాషగా గుర్తింపుకు నోచుకోలేదు.

ఆసియా ఖండంలో మొత్తం 50 దేశాలు ఉండగా 15 దేశాలలో మాత్రమే పాఠశాలవిద్యలో స్థానిక భాషలతోబాటు ఇంగ్లీషు మాధ్యమం కూడా వాడుకలో ఉంది. వీటిలో కోట్లల్లో జనాభా ఉన్న భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాలులూ, లక్షలలో మాత్రమే జనాభా ఉన్న హాంకాంగ్, లావోస్, సింగపూర్, కువైట్, ఖాతర్, బహ్రైన్, భూటాన్, బ్రునేయ్, మాల్దీవులు ఉన్నాయి. నిన్నమొన్నటివరకు నేరుగా బ్రిటిషు వలస దేశాలుగా ఉండడమే దీనికి ప్రధాన కారణం. మొత్తం 439 కోట్లమందిలో మూడింట ఒకవంతు మాత్రమే ఇంగ్లీషు మాధ్యమానికి మారినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

ఇక ఐరోపా ఖండంలో ఉన్న 49 దేశాలలో ఐర్ల్యాండు, ఐస్ల్యాండు ఇంకా రెండు మూడు చిన్నా చితకా దేశాలు తప్పితే అన్నీ పాఠశాలవిద్య మాతృభాషా మాధ్యమంలోనో లేక స్థానిక భాషలలోనో విద్యాబోధన జరుపుతున్నాయి. అయితే, నెదర్ల్యాండ్స్, డెన్మార్క్, స్వీడన్, ఫిన్ల్యాండ్ జనాభాలో 70 నుంచి 90 శాతం మంది ఇంగ్లీషును రెండవభాషగా మాట్లాడతారు. మిగిలిన ఐరోపా దేశాలలో (జర్మనీ, ఫ్రాన్సు మొదలైన దేశాలలో) 55-20 శాతం మంది మాత్రమే ఇంగ్లీషు మాట్లాడగలరు.

56 దేశాలతో సుమారు 120 కోట్ల జనాభాతో ఉన్న ఆఫ్రికా ఖండంలో 70% ప్రాథమిక విద్య 200 కి పైగా ఉన్న ప్రధాన మాతృభాషలలోనే ఉంది. ఐతే మాధ్యమిక స్థాయి నుండి విద్యబోధన అంతా ఇంగ్లీషు, ఫ్రెంచి, కొన్నిసార్లు యొరుబా, స్వాహిలీ భాషలలోనే జరుగుతోంది. ఉత్తర దక్షిణ అమెరికా ఖండాలలో మొత్తం 35

దేశాలు ఉండగా అమెరికా (సం.రా.), కెనడాలాంటి వాటితో కలుపుకొని మొత్తం 12 దేశాలలో ఇంగ్లీషు అధికార భాష. మిగిలిన దేశాలన్నింటా స్పానిషు, పోర్చుగీసు, ఫ్రెంచి లాంటి ఐరోపా భాషలూ, అమెరికనిండియన్ భాషలైన గ్వరానీ, క్వెచువా, అయమార లాంటివి ఉన్నాయి. ఆస్ట్రేలియా–ఓషేనియాపరిధిలో ఉన్న 14 దేశాలలోఏ దేశంలోనూ ఆధికార భాషగా ఆంగ్లం లేకపోయినా వాస్తవానికి అధికారభాషగా ఇంగ్లీషు చలామణిలో ఉంది. ఆస్ట్రేలియా, పపువా–న్యూగినీ, న్యూజిల్యాండు తప్పితే మిగతావి మిలియను జనాభా దాటని చిన్న దేశాలే. పపువా–న్యూగినీలో ఇంగ్లీషు మాట్లాడగలిగినవారి జనాభా రెండు శాతంకంటే తక్కువే. న్యూజిల్యాండులో మావోరి అధికారభాష. అయితేనేం అన్నింటా ఇంగ్లీషుదే వాస్తవ అధికారం.

ఇక ఆర్థిక విషయాలు చూద్దాం. నిరక్షరాస్యులతో పోల్చితే, ప్రాధమికవిద్య నేర్చినవారి వ్యక్తిగత ఆదాయం 20 శాతంవరకూ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. జాతీయ నమూనా సర్వేక్షణలో సేకరించిన సమాచార విశ్లేషణలో ప్రతి యేటా చదువుకున్న చదువు పురుషులలో 8 శాతం, మహిళలలో 10 శాతంవరకూ ఉత్పాదకతను పెంచుతోంది అని తెలిసింది (ప్రోబ్ నివేదిక, 1998). అందరికీ చదువుకు మాతృభాషామాధ్యమమే సులువైన సాధనమూ మార్గమూ. అంటే 46% మంది బడిమానేసే పిల్లలు ఉన్న తెలుగురాష్ట్రాలలో వ్యక్తిగత ఆదాయానికి గండికొడుతున్నదిఎవరు? మన ఆంగ్లమాధ్యమ ప్రణాళికలే గదా.

పిల్లల్లో నేర్చుకోవడం అనేది పాఠశాలలో ప్రారంభం కాదు. అది, వాళ్ల ఇంటిలో ఇంటి భాషలో మొదలవుతుంది. పిల్లలు బడిలో జేరినప్పుడు, ఈ నేర్చుకోవడం కొనసాగినా,నేర్చుకొనే విధానంలో మాత్రం గణనీయమైన మార్పులు జరుగుతాయి. బడికి రాకముందు, పిల్లలు స్వానుభవం నుండి నేర్చుకుంటారు. ఐతే, పాఠశాల వ్యవస్థ, ముందుగా నిర్ణయించిన పాఠ్యప్రణాళిక ప్రకారం నేర్చుకొనే విషయాలనూ విధానాన్నీ నియంత్రిస్తుంది.

బడిలో జేరినప్పుడు, పిల్లలు తనకు తెలియని ఒక కొత్త వాతావరణాన్ని చూస్తారు. తరగతి గది కొత్తది. బడి పిల్లలుకొత్త. ఉపాధ్యాయులూఅపరిచితులే. బడిలో నేర్చుకునే విధానం కూడా కొత్తదే. వీటికి అదనంగా, బడిలో మాట్లాడే భాషకూడా మారితే, అప్పుడు వాళ్ల పరిస్థితి చాలా క్లిష్టంగా తయారవుతుంది. నిజానికి, ఇది పిల్లల నేర్చుకునే విధానంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. అయితే, బడిలో పిల్లల ఇంటి

భాషని వాడడం ద్వారా, బడిలోని కొత్త వాతావరణానికి అలవాటు పడడంలో పిల్లలకు సహాయం చేస్తుంది. ఇంతేగాక వాళ్లు ఇంటిలో నేర్చినదానికీ బడిలో నేర్చుకొనే దానికీ మధ్య ఇంటి భాష ఒక వంతెనలా పని చేస్తుంది.

రెండవది, బడిలో పిల్లల ఇంటి భాషని వాడడం ద్వారా, పిల్లలు అభ్యాస ప్రక్రియలో పాల్గొనడానికి ఎక్కువ అవకాశం ఉంది. ఈ పద్ధతిలో 'పిల్లలే నేర్చుకునే ప్రక్రియలో ముఖ్యులుగా' ఉంటారు అని విద్యావేత్తల అనుభవం. ఈ విధానంలో పిల్లలు తమ భాషలో తగినంత నైపుణ్యాన్ని పెంచుకొనే వాతావరణంలో పెరుగుతారు. ఈ వాతావరణం,పిల్లల్లోఅడగడాన్నీ, ప్రశ్నించడాన్నీ, సమాధానాలు ఇవ్వడాన్నీ ఇంకా ఉత్సాహంతో కొత్త సమాచారం కోసం ఇతరులతో మాట్లాడేందుకు వీలుగలిగిస్తుంది. ఇది పిల్లలకు విశ్వాసాన్ని కలిగిస్తుంది.అంతేగాక వారికి ఒక సాంస్కృతిక పరమైన గుర్తింపునుపొందడానికి సహాయపడుతుంది. ఇది వారి భావి జీవితాలలోబడి ప్రాముఖ్యతను గురించి సానుకూల ప్రభావం చూపుతుంది.

కానీ ఆంగ్లభాషా మాధ్యమంలో నేర్చుకునేవారికి బడిభాష కొత్త భాషగా మొదలై, అది టీచరే కేంద్రంగా ఉన్న విధానానికి దారితీస్తుంది.ఇది తరగతి గదుల్లో పిల్లల ఉత్సాహాన్నీ ఉత్తేజాన్నీ అడ్డుకొని నిశ్శబ్దాన్ని పటిష్ఠం చేస్తుంది. ఇది పిల్లల సామర్థ్యాన్నీస్వేచ్ఛనూ పట్టించుకోదు. పిల్లల్లో స్వేచ్ఛగా వ్యక్తపరిచే స్వేచ్ఛను అణిచివేస్తుంది. ఇది పిల్లల మనస్సులలోని ఉత్సుకతను నీరుగారుస్తుంది. వారి సృజనాత్మకతను నిరోధిస్తుంది. పిల్లలకు కలిగే అనుభూతిపట్లనిరాదరణ కలిగిస్తుంది. ఇదే చివరకు బడి పట్ల ఏవగింపుకలిగేలా చేస్తుంది. ఇవన్నీ నేర్చుకోవాల్సిన విషయాలపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తాయి.

ప్రాథమిక విద్యలో కీలక లక్ష్యాలైన చదవడం, రాయడం లెక్కలు చేయడం మొదలైన అక్షరాస్యతా నైపుణ్యాలను సాధించడం ప్రధానం. ముఖ్యంగా, చదవడం, రాయడంలో నైపుణ్యాలంటే భాషలోని శబ్దాలను అక్షరాలతో గుర్తించే సామర్థ్యాన్ని పెంపొందించు కోవడం. పిల్లలు మాట్లాడడం, వినడమే పునాదిగా ఈ నైపుణ్యాలను అలవరుచుకుంటారు. పిల్లలు తాము మాట్లాడే భాషనేబోధనా మాధ్యమంగా వాడుతున్నప్పుడు, చదవడం, రాయడం లాంటి నైపుణ్యాలను వేగంగానూ మరింత అర్థవంతంగానూనేర్చుకుంటారు. వాళ్లు, మాట్లాడే భాషలోనే చదవడం రాయడం నేర్చుకొని, అచ్చు పుస్తకాలను చదివి అర్థం చేసుకొంటున్నప్పుడూ, వారి చుట్టూ ఉన్నవారి

పేర్లనూ, వస్తువుల పేర్లనూరాయవచ్చని తెలుసుకున్నప్పుడు వారిలో కలిగే ఆనందంచెప్పలేనిది. చిన్నప్పుడేరాయడం, చదవడంలో నైపుణ్యాలను సాధించిన పిల్లలకే పైచదువులలో రాణించే అవకాశాలు ఎక్కువ.

**మనం మాతృభాషలోనే చదువుకోవాలనడానికి  ఐదు ప్రధానకారణాలు :**

మాతృభాషామాధ్యమంలో చదువు సహజం,  సులభం, వనరులు ఎక్కువ, ఖర్చుతక్కువ, అదిస్వేచ్ఛకు సంకేతం.

మాతృభాషామాధ్యమంలో చదువుతో ఉపాధి ఉద్యోగావకాశాలు ఎక్కువ, భాషా గుత్తాధిపత్యాన్ని నిలువరించవచ్చు.

ఆంగ్లభాషామాధ్యమం ఏకభాషాధిపత్య నియంతృత్వానికి బాటలు వేస్తుంది. భాషావైవిధ్యం అంతరిస్తుంది. అదిఆటంబాంబు లాంటిది. జాతుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించివేస్తుంది.

ఆంగ్లభాషామాధ్యమంతో భాషతోపాటు మనవైన ఉపాధి అవకాశాలనూ, మన  పరిశ్రమలనూచేజార్చుకొని పరాధీనులమవుతాం.

ఆంగ్లభాషామాధ్యమంతో అంతర్జాతీయ ఆర్థిక శక్తుల ప్రాబల్యంతో పాఠశాల, కళాశాల స్థాయిలలో ఔట్-సోర్సింగ్ మొదలై అన్నీ ప్రైవేటు పరమై మనలో  సామాజిక అంతరాలు బలమై అవితరచుగా విద్వేషాలకూ సంఘర్షణలకూ దారితీస్తాయి.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆంగ్ల మాధ్యమ పాఠశాలలకు కట్టుబాట్లు లేని అనుమతులు ఇవ్వడం, వాళ్లు వసూలు చేసే ఫీజులపై సరైన నియంత్రణ లేకపోవడం ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యమే ఔతుంది. నిరుద్యోగ సమస్య మూలాల గురించి పాలకులు ఆలోచించాలి గానీ ఇంగ్లీషులో నేర్పితే ఉద్యోగాలు వచ్చేస్తాయనే భ్రాంతిలో ఎట్లాపడ్డారనేది ఆశ్చర్యకరమే. లక్షలాది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఎట్లా మిగిలి పోయారనేది వీళ్లకి శేషప్రశ్నగా మిగిలిపోవటంలో ఆశ్చర్యమేమీలేదు.

ప్రపంచీకరణ అంటే ఆంగ్లీకరణ కాదు. స్థానికీకరణ మాత్రమే. ఇది భాషావైవిధ్యం ద్వారానే సాధ్యం. పాఠశాల స్థాయిలో ఇంగ్లీషు మాధ్యమం ఈ వైవిధ్యాన్ని నాశనం చేస్తుంది. వందలాది స్థానీయ సాంప్రదాయ వృత్తివ్యాపారాలను ఆధునీకరించి వేలాదిమందికి ఉపాధి అవకాశాలను మెరుగుపరచటం మాతృభాషలద్వారా మాత్రమే సాధ్యం. స్థానిక భాషలలో విద్యాబోధన, వృత్తివ్యాపారాలూ వాణిజ్యం, పరిశ్రమలను చవకగానూ, సులువుగానూ ఎక్కువమందిని కలుపుకుంటూ నిర్వహించే వీలు

కలుగుతుంది. భాషావైవిధ్యాన్ని కాపాడుకుంటేనే విద్యా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

ప్రాథమిక స్థాయిలో మాతృభాషా మాధ్యమాన్ని అనివార్యం చేయాలి. ఇదే ఐరాస నివేదిక, ఐరోపా మండలి భాషా విధానం. మాతృభాషలో చదవడం, రాయడం బాగా నేర్చాకే మరే భాషనైనా నేర్చుకోవడం సులువవుతుంది. అసలు ప్రపంచమంతటా, పిల్లల్ని 5 ఏళ్లు దాటినతరువాతే బడికి పంపించటంలో మర్మం ఏమిటి? ఎందుకంటే అప్పటికి వాళ్లకి మాతృభాష వచ్చేసివుంటుంది. తరగతిగదిలో టీచరు చెప్పేది అర్థమౌతుందనే. మరి మన తెలుగు పిల్లలు బడికి వెళ్లేప్పటికే ఇంగ్లీషు నేర్చేసుకొని ఉంటారంటారా? అంటే కొత్తగా ఆ పిల్లవాడికి బడిభాషగా ఇంగ్లీషు మొదలెట్టాలన్నమాట. అంటే క్లాసులో పనిగట్టుకొని ఇంగ్లీషు బాగా వచ్చిన పిల్లలూ, ఒక మాదిరిగా వచ్చిన పిల్లలూ, కొంచెం వచ్చిన పిల్లలూ, అసలే రాని పిల్లలూ అని వాళ్లలో ఇంగ్లీషుభాషని బట్టి హెచ్చు తగ్గుల్నిబట్టి రేపటి వాళ్ల ప్రతిభను నిర్ణయిస్తామన్నమాట.

ఐరాస కార్యకలాపాలలో ప్రధానమైనవి అభివృద్ధీ, మానవ హక్కులే. ఇది భాషా సంబంధమైన వివక్షతను చట్టవ్యతిరేక చర్యగా పరిగణిస్తుంది. అందుకని, బోధనా మాధ్యమంగా మాతృభాష స్థానం నుండి దానిని తొలగించడం ఈ ప్రాథమిక హక్కును ఉల్లంఘించటమే. మానవ సమాజాల సంక్షేమానికీ వాటి గుర్తింపులోనూ విద్య కీలకం. అంతేగాక, ఆధునిక మానవ సమాజాలభద్రతకూస్వేచ్ఛకూ విద్య తప్పనిసరి. ఈ సందర్భంలో ప్రాథమిక విద్యతో సహా విద్యాభాషా హక్కుల సాధనలో ఆర్థికపరమైన అవాంతరాలను కలగనీయకూడదని ఐరాస నిర్దేశిస్తోంది.

2014లో ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయంలోని అనువర్తిత భాషాశాస్త్ర విభాగంలోని పరిశోధకులు, బ్రిటిషుకౌన్సిలు సిబ్బంది తోడ్పాటుతో ప్రపంచంలోని 55 దేశాలలో జరిపిన ఆంగ్లమాధ్యమ బోధన గురించి ఒక పెద్ద పరిశోధనా నివేదికనే తయారుచేశారు. అందులో కొన్ని అంశాలు ఇట్లా ఉన్నాయి: "సర్వే చేసిన చాలా దేశాలలో ఆంగ్లమాధ్యమ బోధన వేగంగా విస్తరిస్తోంది. కొన్ని దేశాలలో తప్పిస్తే, చాలా దేశాలలో ఆంగ్లమాధ్యమ బోధన అధికారిక ప్రభుత్వ అండతోనే నడుస్తోంది. ఐతే, ఆంగ్లమాధ్యమ బోధనను ప్రవేశపెట్టడంలోనూ కొనసాగించడంలోనూ ఆయా ప్రజల నుంచి మద్దతు రాబట్టలేకపోవడంతో ఈ నిర్ణయం 'వివాదాస్పదంగానూ, అస్పష్టంగానూ ఉన్నా వ్యతిరేకంగా మాత్రం లేదు'"అంటూ నివేదికలో పేర్కొన్నారు.

"ఆంగ్లమాధ్యమ బోధన స్వభావంలోనే సామాజిక విభజన ఉంది" అనే విషయాన్ని నివేదికలో ప్రస్తావిస్తూ,''సామాజికంగానూ, ఆర్థికంగానూ వెనుకబడినవారికి దీనిలో ప్రవేశం పరిమితం కావడం ఒకటీ, సొంతభాష, జాతీయవాదం మరుగునపడతాయేమోననే భయం మరొకటీ, రెండురకాలుగా ఔచిత్యం కొరవడిన ప్రయోగంగా మిగిలిపోయింది" అని తమ నిరసనని వ్యక్తం చేశారు. ఇంకా ఆంగ్లమాధ్యమ ప్రయోగం గురించి ప్రస్తావిస్తూ,"ఈ దేశాలలో, నాణ్యమైన ఆంగ్లమాధ్యమ బోధనకు కావలసిన విద్యాపరమైన మౌలిక సదుపాయాల లోపం ఉంది. భాషాశాస్త్రపరమైన అర్హతలున్న ఉపాధ్యాయుల కొరత ఉంది. ఇంగ్లీషు భాషా నైపుణ్యాలగురించిన ముందస్తు అంచనాలు ఏవీ లేవు"అంటూ ఒక పెద్ద జాబితానే చేర్చారు. ఇంతకీ, బ్రిటిషుకౌన్సిలు పరిశోధనా నివేదికలోని అసలైన విషయం ఏమంటే, "ఈ ఇంగ్లీషు మాధ్యమ బోధనను ఆయా దేశాల ప్రణాళికా రచయితలూ విద్యా విధాన నిర్ణేతలూ విద్యారంగ నిర్వాహకులు నిర్ణయించి అమలుపరుస్తున్నది కాదు, పైనుంచి దిగుమతి చేసుకొన్నదే. అయితే, ఇందులో కీలకమైన భాగస్వాములను సంప్రదించి వారి ఆమోదంతో జరిగితే బావుండేది"అని మెత్తగా చెప్పటాన్ని అర్థంజేసుకోవచ్చు. ఇంతకీ ఎవరు ఈ పైవారు? ఏ పైనుంచి దిగుమతి చేసుకున్నది? ప్రజల ఆమోదం లేకుండా ఏ రాజకీయ ప్రయోజనాలను ఆశించి చేస్తున్న పని? మన పాలన మన చేతులలోనే ఉండాలనే సూత్రం ఎంత సత్యమో మన పాలన మన భాషలోనే జరగాలనేది కూడా అంతే సత్యం. అట్లా కానీ కాదని దొడ్డిదోవన ఇంగ్లీషు మాధ్యమాన్ని నడుపుతున్నదెవరూ నడిపిస్తున్నదెవరు? బహుళజాతి వాణిజ్య సంస్థలా? అంతర్జాతీయ ఆర్థిక సంఘాలా లేక ఆంగ్లో–శాక్సన్ భాషా సాంస్కృతిక సమాజమా? ఎవరైనా కావచ్చు. ఎవరైతేనేం మన సమాజాన్ని సంక్షోభంలోకి నెట్టేదాన్నీ మన ఆర్థిక వ్యవస్థను నేలగూల్చేదాన్నీ మన భాషా సాంస్కృతిక వారసత్వాన్ని తుదముట్టించేదాన్నీ మనం సుతరామూ సహించలేం. మాతృభాషా మాధ్యమంకోసం అందరం కలిసిరావాలి. కలిసి ముందడుగు వేయాలి. దీనికోసం తెలుగు సమాజం ఒక్కటవ్వాలి. మన కులం తెలుగు, మన మతం తెలుగు, మన ప్రాంతాలు తెలుగు, ఆడామగా చిన్నాపెద్దా అందరం కలిసి నడుద్దాం.తెలుగు బలగం అనే కట్టడాన్ని అమ్మమాట పునాదులపై నిర్మించే సమయం ఆసన్నమైంది. ఎలాంటి ఇతర సామాజిక అడ్డుగోడలూ దీనికి అడ్డంకి కాగూడదు.

## ఇంగ్లీష్ నైపుణ్యాల గురించిన కొన్ని అపోహలు

ఎడ్యుకేషన్ ఫస్ట్, EF (బెర్టిల్హల్ట్, 1965) అనే సంక్షిప్తనామంతో, ప్రపంచవ్యాప్తంగాసుమారు 43,500 సిబ్బందితో 50 కిపైగా దేశాల్లో 500 కార్యాలయాలూ పాఠశాలలూ ఉన్న ఓ అంతర్జాతీయ ఆంగ్లభాష ప్రమాణాలను మూల్యాంకనం చేసే విద్యా సంస్థ, భాషా శిక్షణ, విద్యాసంబంధ ప్రమాణాలూ, విద్యా డిగ్రీ కార్యక్రమాలూ సాంస్కృతిక మార్పిడులలో ప్రత్యేకమైన కృషిచేస్తున్న అంతర్జాతీయ విద్యా సంస్థ. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన అంతర్జాతీయ సంస్థలలో పనివారల ఇంగ్లీష్ నైపుణ్యాలగురించిన కొన్ని అపోహలపై చేసిన పరిశోధనలలో వెలువడిన వాస్తవాలను చూడండి:

1. "యువతరం" మంచి ఇంగ్లీష్ మాట్లాడుతోంది.

తప్పు. ఆంగ్ల సామర్థ్యం 31 నుంచి 36 ఏళ్ళ వయస్సు ప్రజలలో ఎక్కువగా ఉంది. కొద్దోగొప్పో ఇంగ్లీషు భాషలో పని చేయగల సామర్థ్యమే కాలక్రమేణా వారి ఆంగ్ల భాషా నైపుణ్యాన్ని మెరుగుపరుస్తోంది.(అంటే చిన్నప్పటినుంచే ఇంగ్లీషు నేర్చుకోవడంకాదు ఉద్యోగంలో ఉన్నప్పుడు అవసరమైన కార్యక్షేత్రంలో ఆంగ్లనైపుణ్యాలనుమెరుగుపరుచుకోవాలి.)

2. మహిళల కంటే పురుషులే మంచి ఇంగ్లీషులో మాట్లాడతారు.

తప్పు. ప్రపంచవ్యాప్తంగా, ఇంగ్లీష్ భాషానైపుణ్యంలో మహిళలే గణనీయమైన రీతిలో పురుషులని మించిపోయారు. మానవీయ శాస్త్రాలలో ఎక్కువ మంది స్త్రీలు ఉండటమే కారణం.

3. టెలికమ్యూనికేషన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, బ్యాంకింగ్ ఇంకా ఫైనాన్స్ వంటి పరిశ్రమలలోనేబలమైన ఇంగ్లీష్నైపుణ్యాలు ఉన్నవాళ్లు ఉన్నారు.

తప్పు. విదేశీయుల కోసం సేవలందించే ప్రయాణ పర్యాటక, సంప్రదింపుల వంటి రంగాలలోనేబలమైన ఆంగ్ల నైపుణ్యాలు గలవారు ఉన్నారు. ఈ అధ్యయనం కోసం ఎంపిక చేసిన ఇరవై విభాగాలలోకెల్లా ఇంగ్లీష్లో చాలా ఎక్కువ నైపుణ్యాన్ని కలిగినవారు ట్రావెల్, టూరిజం కన్సల్టింగ్ వంటి రంగాలవారు మాత్రమే. టెలీ కమ్యూనికేషన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ మరియు బ్యాంకింగ్ & ఫైనాన్స్ వంటి పరిశ్రమలలో పనివారు ఇంగ్లీష్ లో కేవలం పరిమితమైననైపుణ్యంతోనూ, ఆరోగ్య సంరక్షణ, ఆటోమోటివ్, ఉత్పాదనలూ, శక్తి, గనులూ తదితరాలలో తక్కువ

నైపుణ్యంతోనూ, రిటైల్ వ్యాపారాలలోనూ ప్రభుత్వ రంగాలలోనూ చాలా తక్కువ నైపుణ్యాన్ని కలిగినవారూ ఉన్నారు అనీ తెలుస్తోంది. ఆంగ్ల ప్రచారకులూ దానిసమర్థకులూచెప్పుకొంటున్నట్లు ఆంగ్లమేమీ మనం వింటున్నంత ప్రాచుర్యం పొందినదేం కాదు.

4. ప్రపంచవ్యాప్తంగా పరిశోధనా పత్రాలు ఆంగ్లంలోనే వెలువడుతున్నాయి.

తప్పు. ఇంగ్లీష్ ప్రచారకులు అన్నిరకాల వ్యాపార వ్యూహాలతో ఉద్వేగపూరిత వాగ్దానాలతో దూకుడుగా వారి భాషను మార్కెటింగ్ చేస్తున్నారు. ఇంగ్లీషేతర భాషలలోని శాస్త్ర ప్రచురణల సంఖ్య మరింత వేగంగా పెరగటం ఆయా దేశాల్లోని శాస్త్ర సంఘాలు (ఉదా. కుచైనా, ఇండోనేషియా, ఇరాన్, టర్కీ, దక్షిణ యూరప్ మరియు లాటిన్ అమెరికాలలో) విస్తరించడమూ వైవిధ్యం చెందటమూ కూడా కారణం. ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లంలో ప్రచురించబడుతున్న అన్ని శాస్త్ర పత్రికల నిష్పత్తి వాస్తవానికి క్షీణిస్తోంది. (2011, jb3369@ 3369కొలంబియా.ఎద్యు).

చివరిగా 5. అంతర్జాతీయంగా ఇంటర్నెట్ వాడకంఇంగ్లీషు ఆధిపత్యాన్ని సూచిస్తోంది.

పూర్తిగానిజంకాదు. విద్యా ప్రయోజనాల కోసం ఇంటర్నెట్ వాడకం పెరగడంఎలక్ట్రానిక్ సమాచార ప్రసార రంగంలో ప్రపంచంలో ఇంగ్లీష్ కాకుండా ఇతర భాషల పెరుగుదలనే ప్రతిబింబిస్తోంది.

నేడు శాస్త్రవేత్తలు ఎదుర్కొంటున్న ప్రధాన విషయం, ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంపొంది స్థానికంగా పేరు కోల్పోవటమా లేక స్థానికంగా ప్రాచుర్యంపొంది ప్రపంచవ్యాప్తంగా పేరు కోల్పోవడమా అనేది. దీని నుండి బయటపడటానికి యంత్రానువాద సహాయం తప్పనిసరి.

ప్రపంచీకరణ సమర్థవంతంగా పనిచేయాలంటేఅనువాదాలు ఎక్కువ రావటమేకాదు సమాంతరంగా సాగాలి. తద్వారా ప్రపంచవ్యాప్తంగా పాఠకులకు అనేక రకాల విద్యావిషయక పరిజ్ఞానం అందుబాటులో వస్తుంది.

ప్రతి బహుళజాతి సంస్థా లేదా వ్యాపార వాణిజ్య సంస్థా తన విస్తరణకు ఇంగ్లీషేతర భాషను మాట్లాడే సమాజాన్ని తన అభివృద్ధికి అడ్డంకిగా చూస్తోంది. ముందుగా ఇట్లాంటివారి దృక్పథంలో మార్పుతేవాలి. అందుకు ప్రభుత్వాలు సాంప్రదాయ వ్యాపార వాణిజ్య లావాదేవీలలో భాషనుగురించి కొన్ని తప్పనిసరి ఆంక్షలు విధించాలి.

**కృతజ్ఞతలు :**

అనువర్తిత శాస్త్రాలలో చెప్పే మొదటి పాఠం ప్రయోగశాల నుండి క్షేత్రానికి తప్పనిసరి ప్రయాణం. అయితేనేం అలవాటుగా పరిశోధనల ప్రచురణలకే పెద్దపీట వేసే మన విశ్వవిద్యాలయాలూ సంబంధిత రాజకీయాల ఒత్తిడితో క్షేత్రాలవేపు నడకను పట్టించుకోలేదు. అయితే సమాజంలో వచ్చే సంక్షోభాలు అప్పుడప్పుడు ఈ నడకను సరిదిద్దవలసిన అవసరాన్ని గుర్తుచేస్తాయి. అందులో భాగమే ఈ వ్యాసాల సంపుటి.

కొత్తపుంతలు తొక్కుతున్న టెక్నాలజీ ఇంజినీరింగు ఉత్పాదనలు సమాజంలో సృష్టిస్తున్న విపరీతాల ప్రకంపనలలో ఒకటి భాషాసంక్షోభం. అది 20ఏళ్లకిందటే మొదలైనా అది ఒక ఉత్పాతంగా బలంగా మనల్ని తాకడానికి రెండు దశాబ్దాలు పట్టింది. విద్యారంగంలో కేజీటూపీజీ ఆంగ్ల మాధ్యమమే అది. ఇకనుండి దాని పర్యవసానాలూ ప్రభావాలకు సమాజం వచ్చే రెండు దశాబ్దాలలో కోలుకోలేని దెబ్బకు విలవిల్లాడిపోవాల్సిందే. జరిగే ఘోరాలూ అన్యాయాలూ సమాజాన్ని సంక్షోభంలోకి నెట్టుతుంది. ఈ సంక్షోభంనుండి బైటపడాలంటే పాఠశాల విద్యలో మాతృభాషా మాధ్యమం తప్పనిసరి చేయాలని ఉద్యమించక తప్పదు. ఈ ఉద్యమానికి ఊపిరిగా సాంప్రదాయ మాటల మూటలూ తిట్లూశాపనార్థాలూ కాదు కావలసింది, మాతృభాషల ఆర్థిక జవసత్వాలనిరూపణతో ఇంగ్లీషు ప్రచారకులు లేవనెత్తిన సవాళ్లకు దీటుగా తార్కిక పద్ధతిలో హేతువాద సరళిలో లెక్కలు గట్టి సమాధానాలు కూడగట్టి చూపించాం.

ఈ వ్యాసాల్లో మేము చేసింది అదే. ఈ వ్యాసాలు ఇట్లా వచ్చేందుకు ఎంతోమందితో ఎన్నో రోజులు ఎన్నో ఆలోచనలను పంచుకొని చర్చించాం. ఇందులో ప్రధానంగా పేర్కొనదగినవారు భారతీయ భాషలకు సంబంధించి ఇలాంటి ఆలోచనా ధోరణితోనే పరిశోధనలు సాగిస్తున్న పారిస్ లో నివసించే కన్నిగంటి అనూరాధ గారు. ప్రత్యేకంగా, పారిశ్రామిక రంగాలలో వాడుకలో ఉన్న భాషాస్వరూపం, దేశంలోనూ రాష్ట్రాలలోనూ జీడీపీకీ భాషలకూ మధ్య సాపేక్షతా సంబంధాల గురించిన చర్చలు తర్వాత సమగ్ర స్వరూపంతో నిండు పరిశోధనకు దారితీశాయి. దీనికి ఆమె అందించిన తోడ్పాటు ఎనలేనిదే. అనూరాధగారికి కృతజ్ఞతలు. ఇక నా చుట్టూ ఉన్న సహచరులూ మిత్రులూ విద్యార్థులూ వారి పరిశోధనలూ, వ్యాఖ్యలూ, విమర్శలూ, రోజుల తరబడి జరిపిన చర్చలే ఈ వ్యాస సంపుటి ఇట్లా తయారవడానికి దిశానిర్దేశం చేశాయి. వారిలో ప్రధానంగా ఆచార్య రంగనాథాచార్యులుగారూ, ప్రొ. వకుళాభరణం

రామకృష్ణగారూ, ప్రొ. జి. హరగోపాల్, ప్రొ. బాపూజీ, ప్రొ. జోగా సింహ, ప్రొ. గంగిశెట్టి లక్ష్మీనారాయణ, ఆచార్య ఎన్.ఎస్.రాజు, ప్రొ. రామకృష్ణారెడ్డి, ప్రొ. కే.వీ. సుబ్బారావు, ఆచార్య పరిమి. రామనరసింహం, డా. వె. కొండలరావు,డా. కస్తూరి విశ్వనాథం, ప్రొ. అ.ఉషా దేవి, ప్రొ. మనోహరరావు, ఆచార్య కే. యాదగిరి, డా. ముత్యం, డా. పిల్లలమర్రి రాములు, డా. దార్ల వేంకటేశ్వరరావు, డా. పవన్ కుమార్, డా. కే. రాజ్యరమ, డా. అద్దంకి శ్రీనివాస్, డా. చెకే.మూర్తి, డా. అంబేడ్కర్, మొదలైనవారు. ఇంకా ముఖ్యంగా ఈ భాషోద్యమంలో పాల్గొంటున్న కొంతమందితో జరుపుతున్న చర్చలూ వెలువడుతున్న అభిప్రాయాలూ నా ఆలోచనలకు పదును పెట్టాయి.

ముఖ్యంగా ఈ సంపుటంలో వచ్చిన వాటినన్నిటినీ అమ్మనుడి పత్రికలో ప్రకటించి డా. సామల రమేశ్ బాబు ఈ సంపుటికి పునాదులువేశారు. ఈ వ్యాసాలలో చాలావరకు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించినవే. ఈ సందర్భంలో ఆంధ్రజ్యోతి సంపాదకులు కే. శ్రీనివాస్ గారికీ, సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.

ప్రత్యేకంగా పేర్కొనాల్సినవారు నా విద్యార్థి మిత్రులు భరత్, సంపత్, వసంత్, నాగేశ్వర్రావు, ఆంజనేయులు, క్రిష్టోఫర్, ఇమ్మానియేల్, బాపూజీ, ప్రకాశ్, ప్రభాకర్.

**– గారపాటి ఉమామహేశ్వరరావు**

విన్నపం iii
నా మాటగా మీ ముందు... vi
1. తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం 19
2. భాషా సంక్షోభం-ప్రపంచీకరణ 25
3. శాస్త్రీయత కొరవడిన ఇంగ్లీషు
మాధ్యమ ఉద్యమం 31
4. భాష-ఆర్థిక వ్యవస్థ- సామాజిక సంబంధాలు 40
5. తెలుగు వాడుకపై కొన్ని ప్రశ్నలూ సమాధానాలూ 76
6. తెలుగు-ఆంగ్లభాషల సంబంధం:
ప్రభావాలూ పర్యవసానాలూ 94
7. నేడు నేర్వడానికి ఉండని భాష,
రేపు వాడకానికి మిగలదు. 113
8. తెలుగుభాషా ప్రాధికార సంస్థ 115
9. బోధనా మాధ్యమంగా మాతృభాషలు
తూర్పు ఆసియా దేశాల అభివృద్ధి - భారతదేశం 120

# 1

# తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం

**నేపథ్యం:** ఒకప్పుడు, మహా సామ్రాజ్యాలకూ, సంస్కృతులకూ మతాలకూ జ్ఞాన నిధులకూ ఆలవాలమైన సంస్కృతం, లాటినూ, గ్రీకూ, ఈజిప్షియనూ, హిబ్రూ మొదలైనవి ఎన్నో ప్రాచీన భాషలుసైతం తమ స్థితీ గతీ కోల్పోయి నిర్వీర్యమైపోయాయి. నిన్నమొన్నటి దాకా ఊరూ పేరూ లేని చిన్నాచితకా భాషలు గడచిన రెండువందల సంవత్సరాలలో ప్రపంచ భాషలుగా చెలరేగిపోయాయి. దీనికి కారణం ఆయా భాషాసమూహాల ఆధిపత్యపు పోరు.వారు పెంచి పోషించిన సైనిక పటాలాలు, వారు సాగించిన ఉన్మత్త పైశాచిక హత్యాకాండలూ, నరమేధాలూ, అంతులేని ఎల్లలెరుగని జాతుల విధ్వంసమూ. ఇవన్నీ కూడా కారణాలు. వీటిద్వారా ప్రజలను భయభ్రాంతులను చేసి, ఆయా ప్రాంత ప్రజలపై పెత్తనం చేస్తూ తద్వారా తమ భాషలను ప్రపంచపటంపై పులిమారు. రాయడం రాని తుంటరి పిల్లలు తెల్లకాగితంపై చెరపరాని తిక్కిరిబిక్కిరి చిత్తడి రంగులు పులిమినట్లు వారి భాషలను మనపై బలవంతంగా రుద్దివేశారు. దాని పర్యవసానం, ఈ నేలపై వందలాది భాషలకూ ఆయా భాషా సమూహాల సంస్కృతులకూ సంస్కారాలకూ నూకలు చెల్లుతున్న తరుణం ఆసన్నమయింది. నాటు భాషల ఆనవాళ్లు చెరిగేపోయే కాలం దాపురించింది. భాషావిధ్వంసం జాతి విధ్వంసానికి మూలం. మన దేశం వందల ఏళ్ల బానిసత్వంనుండి బైటపడి పూర్తిగా ఒక్క తరమైనా కాలేదు అప్పుడే మానసిక బానిసత్వంతో భావదాస్యంలోకి కూరుకుపోతున్న సంకటస్థితి.

**ప్రాచీన భారతంలో భాషాస్థితి :** భారతదేశంలో ఇప్పటి భాషా సమూహాలు జాతి పరంగా ఎప్పటినుండో ఉంటున్న ప్రాచీన ఆదిమ జాతులూ ఆతర్వాత వచ్చిన ఆర్వాచీన జాతుల సమాహారం.ఆస్ట్రో-ఏశియాటిక్ కుటుంబానికి చెందిన ముండా-సవర భాషలే మొట్ట మొదటగా భారతదేశంలో మాట్లాడిన భాషలు కావచ్చు. ఆ తరువాత వచ్చిన

ద్రావిడ భాషా సమూహాల ప్రభావంతో అప్పటికే ఉన్న ముండా తదితర భాషా సమూహాలు ఎన్నో తమ భాషలను వదిలిపెట్టి ద్రావిడ భాషలనూ, ఆ పైన వచ్చిన హిందార్య భాషా సమూహాల ప్రభావంతో ద్రావిడ తదితర భాషా సమూహాలు ఎన్నో తమ భాషలను వదిలిపెట్టి ఆర్యభాషలను సొంతం జేసుకున్నాయి. ఎన్నోసార్లు భారత ఉపఖండంలోని జాతులు తమ తమ మాతృభాషలను కొన్ని ఇబ్బందికర పరిస్థితులలో వదులుకొని ఆధిపత్య, పాలక భాషలను ఎంచుకోవాల్సివచ్చింది. అది ప్రజాస్వామ్యం లేని కాలం. బలవంతులు బలహీనులను ధన, మాన, ప్రాణాదులతోపాటు భాషా సంస్కృతులను కొల్లగొట్టిన వేళ. చరిత్రకు అందని కాలంలోనూ చారిత్రక ప్రభాత సంధ్యలలోనూ జరిగిన ఈ బలవంతపు మార్పులు కోకొల్లలు. ఐతే బలవంతపు కారణాలవలననే కావచ్చు లేక ఇతరులు సృష్టించిన అత్యవసర పరిస్థితులే కావచ్చు మానవ సమూహాలమధ్య మధ్యకాలీన సమాజాలలో కూడా భాషల బలవంతపు మార్పిడులు జరుగుతూనే ఉన్నాయి. ఐతే వీటి ప్రభావం కొంత మేరకే. ఆనాటి జనాభాకు నేలా నీరూ తదితర వనరులకు కొదవ లేకపోవడంతో బలవంతపు మార్పిడులనుండి తప్పించుకునేందుకు వీలుగా తాము ఉంటున్న జనావాసాలను వదిలి సుదూరంగా వలసవెళ్లారు. ఇట్లా పరుల ఆధిపత్యపు నీడ పడనంతదూరంలో తమ స్వేచ్ఛకు భంగం వాటిల్లనిచోట కొత్తవలసలను ఏర్పరచుకున్న సందర్భాలు చరిత్రలో కోకొల్లలు.

**వలస భారతంలో ఇంగ్లీషు:** 1835 లో మెకాలే తెచ్చిన 'కొత్త విద్యా విధానంతో' ఈ దేశ 'ఆధికారిక భాషగా ఇంగ్లీష్' పరిచయం అయింది. ఆ విధానం ఆంగ్ల భాషా మాధ్యమం ద్వారా భారతదేశంలో పడమటిదేశాల విద్యా వ్యాప్తికీ ఆపై సంస్కృతి వ్యాప్తికీ దారితీసింది. పరిపాలనా విభాగాలలో భారతీయులను నియమించాలి కాబట్టి దానికోసం ఇంగ్లీషులో విద్య అవసరం అని వారి నమ్మకం.

ఐతే మెకాలే ఊహించనిది కొంత నేడు నిజం ఔతున్నదేమోనన్న అనుమానం కలుగు తోంది. ఇంగ్లీషు భాష భారతీయ సామాన్య జనవ్యవహారంలోకి త్వరత్వరగా వచ్చేస్తోంది. కానీ మెకాలే అనుకున్నదల్లా ఇంగ్లీషు భాష ప్రాచ్య విద్యా విధానంద్వారా ప్రాచ్య దేశాల వ్యాపార భాషగానూ సామ్రాజ్యాధిపత్య భాషగానూ విస్తరిల్లాలని మాత్రమే. ప్రజల భాషగా కాదు. మెకాలే దేశభాషల ద్వారా జనాదరణకలిగిన విద్యావిధానంగురించి ప్రస్తావించలేదు. నాడు బ్రిటిషు ప్రభుత్వ పాలకులకూ కోట్లాది

జనులకూ మధ్య దుబాసీలుగా పనిచేసే భారతీయులను రక్తమూ రంగూ భారతీయమైనా రుచీ అభిరుచులలోనూ ఆచారాలూ ఆలోచనలలోనూ నీతికీ బుద్ధికీ ఆంగ్లమానస పుత్రులైన ఒక వర్గాన్ని తయారు చేయాలన్నదే ఆయన కోరిక.

**భారతీయ భాషల హక్కుల హరణం:** 1835 నాటినుంచే పడమటి విద్యావిధానంతోపాటు ఇంగ్లీషు వాడకం వేళ్లూనుకొంది. కొత్తగా ప్రారంభించిన కాలేజీలూ విశ్వవిద్యాలయాలతోనూ వాటివల్ల వచ్చిన ఉద్యోగాల లభ్యతవలన ఇంగ్లీషు నేర్చుకోవాలనే తపన పెరిగింది. ఈ మార్పుతో భారతదేశపు వేల సంవత్సరాల వారసత్వ సంపదగా సంక్రమించిన భాషా సంస్కృతులకు పోయేకాలం దాపురించిపెట్టిన ఘనత మెకాలేకు దక్కుతుంది. ఈ ఆంగ్ల విద్యావిధానం ఒకరకంగా దేశీయ భాషల ప్రయోజకత్వాన్ని ప్రశ్నించేదిగా తయారైంది. ఆంగ్లం చదివినవారికే బ్రిటీషు పాలనలో ఉద్యోగాలు. దీనితో భారతీయ విద్యా బోధన ఒక్కసారిగా ఇంగ్లీషుకు మళ్లడం, ఆంగ్లవిద్యను జీవనానికి ముడిపెట్టడం ఒకేసారి జరిగిపోయింది. ఇది భారతీయ భాషలకు ఊహించరాని దెబ్బ. బ్రిటిషు ఇండియాలో ప్రభుత్వం అధికారికంగా ఒకే భాషతో పనిచేసింది. అదే ఇంగ్లీషు. ఆనాడే భారతీయ భాషలకు చెల్లుచీటీ రాయడం జరిగింది. ఐతే ఉద్యోగాలు తక్కువ అవడం, అత్యధిక జనం, తొంభైతొమ్మిది శాతం మంది, స్థానిక సాంప్రదాయిక వనరులైన వ్యవసాయమూ తదితర వృత్తిపనులపై ఆధారపడడం చేత భారతీయ భాషలకు ఏమంత నష్టం జరగనట్లే అనుకోవాలి. ఇంగ్లీషు కొన్ని రంగాలకే పరిమితమై ఉండేది. ఉదాహరణకు ఉన్నత విద్య, ప్రభుత్వ పాలనా న్యాయ రంగాలకే పరిమితం. తెలుగూ తదితర భారతీయ భాషలను ఇతర రంగాలన్నింటా స్వేచ్ఛగా వాడుతుండేవారు. అయితే ఉన్నత విజ్ఞాన భాషలుగా పాలనాభాషలుగా వాడకానికి వీలులేకుండా చేయడం కాళ్లూ చేతులూ విరిచి రెక్కలు కట్టినట్లు ముందుకు సాగడానికి వీలులేకుండా శాశ్వత వైకల్యాన్ని అంటగట్టింది. ఇది తెలుగూ తదితర భారతీయ భాషలను కోలుకోలేని స్థితికి తీసుకువెళ్లింది.

ఆధునిక యుగంలో ఏర్పడిన సామాజిక భాషాసంక్లిష్టతకు వ్యాపారం, ఉద్యోగం, విజ్ఞానం, సంస్కృతి వంటివాటి ప్రభావమే కారణం. దీనివలన ఆధునిక సమాజంలో వినిమయ వస్తుసముదాయాన్ని పునర్నిర్వచించవలసిన అవసరం వచ్చింది. నేడు 'భాష' ఒక వినిమయ వస్తువు. ఒకప్పటి సాంస్కృతిక ఉపకరణం అత్యంత వేగంతో నేడు సామాజిక ఉన్నతికి ఉపకరణంగా మారుతోంది.

**స్వతంత్ర భారతంలో ఇంగ్లీష్:** నూట పాతిక కోట్ల మంది ప్రజలూ వందలాది భాషలూ ఉన్న భారతదేశంలో ఇంగ్లీషు చాలా మంది చదివి రాయగలిగిన భాష కాదు. ఇంగ్లీషును మాట్లాడేవారు వయోజన భారతీయుల్లో కంటే యువ భారతీయుల్లో ఎక్కువ. ఐతే, భారతదేశానికి పట్టణం, గ్రామీణం అనే రెండు ముఖాలు ఉన్నాయి. గ్రామీణ భారతదేశం ఇంగ్లీష్ మాట్లాడటం లేదు, పట్టణ ప్రజలలో చెప్పుకోదగినంత మంది ఇంగ్లీష్ వాడుతుండవచ్చు. భారతదేశంలో ఇంగ్లీష్ సామాజిక ఉన్నతికి సూచికగా మారింది. ఆంగ్లభాషలో ప్రవేశం జ్ఞానానికీ, విద్యకూ, తెలివికీ సామాజిక స్థాయికీ సూచిక అని కొందరి ఆలోచన. *భారతదేశపు ఉన్నత విద్యా మాధ్యమ భాషగా పిలవని పేరంటానికి వచ్చిన ఇంగ్లీష్, ఆధిపత్య ధోరణిలో నెరపుతున్న దాని కర్రపెత్తనం, భారతీయ భాషలను అటకెక్కించివేసే దిశలో సాగుతోంది.*

**భారతీయ భాషలూ తరిగిపోతున్న వ్యవహార రంగాలు:** షుమారు మూడువేల సంవత్సరాలకుపైగా ఆర్య – ద్రావిడభాషల సంపర్కం నడిచింది. తెలుగూ తదితర ద్రావిడ భాషల ధాటికి సంస్కృతం రూపురేఖలే మారిపోయి ప్రాకృతాలుగానూ, ఆపై అపభ్రంశాలుగానూ తరువాత ఇప్పటి హిందీ, మరాఠీ, బంగాలీలాంటి ఎన్నో ఉత్తరాది భాషలూ ఏర్పడ్డాయి. అయితే, వేలకొద్దీ పదాలు మాత్రమే సంస్కృత ప్రాకృతాల నుండి తెలుగులోకి ప్రవేశించాయి. ఇక, సంస్కృత ప్రాకృతాల ప్రభావం కొన్ని ఉన్నత రంగాలకే పరిమితం. ఈ స్థితి తెలుగు భాషకు జవసత్త్వాలను అందించిందేగానీ నష్టం కలిగించలేదు. క్రీస్తు శకారంభంనుండీ తెలుగు తనదైన శైలిలో స్వంత జవసత్త్వాలను కూడగట్టుకుంటూ 11వశతాబ్దికల్లా స్వచ్ఛందంగా సాహిత్య, సాంస్కృతిక, పాలనారంగాలలో వైవిధ్య భరితమైన ఆరోగ్యవంతమైన ప్రభావశీలమైన భాషగా రూపొందింది. పరిపాలన, జనజీవన రంగాలలోనూ, కవిగాయకవైతాళికులకూ పండితులకూ ఆలవాలమైన తెలుగుభాష పదహారవ శతాబ్దంవరకూ తనకు రావలసిన గౌరవమర్యాదలనే పొందింది. ఐతే, ఈ చారిత్రక ప్రభాత సంధ్యలలో, ఔత్తరాహులైన తురుష్క, పర్షియను, అఫ్ఘను, మొగలాయీ సామ్రాజ్య సేనల పదఘట్టనల కింద నలిగి శల్యావశిష్టమైపోయింది. తన ప్రాభవాన్ని కోల్పోయింది. తెలుగుకు పాలకుల భాషగా గుర్తింపు పోయి పూర్తిగా పాలితుల భాషగా మిగిలిపోయింది. షుమారు నాలుగువందల సంవత్సరాలు ఎవరికీ పట్టని భాషగా బిక్కుబిక్కుమంటూ రెండవభాషగా సర్దుకుపోయింది. ఈ కాలంలో రాజ్యమేలిన ఉర్దూ,

పర్షియన్, ఇంగ్లీషు భాషల తొక్కిడిని తట్టుకొని నిలబడగలగడానికి కారణం అది సామాన్య ప్రజలభాషగా మిగిలి ఉండటమే. అదే దానికి ఆ శక్తిని ఇచ్చింది. తెలుగుభాష నిత్యవ్యవహారం నుంచి వైదొలగలేదు. పాలితులు తెలుగు మాట్లాడినంత కాలం వారిపై పాలకవర్గ భాష మీద పెద్దగా ప్రభావం చూపలేదు. కానీ, ఎప్పుడైతే పాలితవర్గభాష కొన్ని రంగాలకే పరిమితం ఔతుందో, ఆ కొన్ని రంగాలలో విద్య, ఉద్యోగ ఉపాధి రంగాలు లేనప్పుడూ ఇక ఆ భాషల ఉనికికి మంగళం పాడినట్టే. ఈ ప్రభావం ఎక్కువయితే పాలితవర్గ భాష నశిస్తుంది. ఇదే ఇప్పుడు తెలుగుపట్ల జరుగుతోంది.

**కమ్ముకొస్తున్న ఆంగ్ల మేఘాలూ-ముంచుకొస్తున్న ముప్పు:** భాషాశాస్త్రవేత్తలూ, విద్యావేత్తలూ, రాజకీయవేత్తలూ తరచుగా విద్యార్థులకు మాతృభాషా మాధ్యమమే తగినదని చెప్తుంటారు. అలాకాదని ఆంగ్లమాధ్యమం ద్వారా చదివితే ఆంగ్లం బాగా వస్తుందని కొందరు చెప్తుంటారు. కానీ అది అసంబద్ధం. ఇంటా బయటా మాతృభాష వాడుతూ తరగతి గదిలో నేర్చుకున్న ఇంగ్లీషులో వ్యవహారం కుంటువడుతుంది. అడుగడుగునా మన ఆలోచనలకు అడ్డుపడుతుంది. ఆత్మన్యూనతాభావాన్ని పెంచుతుంది. ఈ విధానం జాతీయస్ఫూర్తికీ మానవతా విలువలకూ విరుద్ధం. నూటపాతిక కోట్లమందికి సమస్థాయిలో మాతృభాషకు దీటుగా ఇంగ్లీషునేర్పగల వనరులు మనకు ఉన్నాయా? *గడిచిన నూటయాభై ఏండ్లలో తొమ్మిది శాతానికికూడా ఇంగ్లీషు నేర్పలేని మనం, మిగిలిన తొంభైశాతానికి ఎన్ని వందల ఏండ్లు పడుతుందో. ఈ లోపల జరిగే వేలాది విద్యార్థుల ఆత్మహత్యలూ, లక్షలాది నిరుద్యోగుల హాహాకారాలూ, తల్లిదండ్రుల ఆక్రందనలకూ ఎవరు బాధ్యులు? ఈ జాతి విధ్వంసం దేనికోసం? ఈ జాతి మనుగడనే ప్రశ్నిస్తున్న ఈ భాషా విధ్వంసం ఎవరి పేరున? అసలు ఎవరికీ మాతృభాషకాని ఆంగ్లమాధ్యమం ఎవరికోసం? ఎందుకోసం?* దీనికి కొందరు చెప్పే జవాబు ఉద్యోగభద్రత. భారతదేశం లోపలా భారతదేశం బయటా ఉద్యోగాలకోసం భారతీయభాషలను వాడే పద్ధతికి తగిన విద్యావిధానం భారతదేశంలో లేదు. దీనికి భిన్నంగా చైనా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ వంటి ఆంగ్లేతర భాషలు మాట్లాడే దేశాల భాషావిధానాలను తార్కాణాలుగా చూపవచ్చు. అయితే విద్యామాధ్యమంగా మాతృభాషను తప్పనిసరి చేయడం వ్యక్తుల ప్రాథమిక హక్కులను హరించడం అవుతుందని భారతీయ న్యాయమూర్తుల అభిప్రాయం. తల్లిదండ్రులకు తమ పిల్లల

విద్యావసరాల నిమిత్తం భవిష్యత్తు ప్రణాళిక కోసం భాషను ఎంచుకునే సౌకర్యం రాజ్యాంగం కల్పించిన హక్కు అని న్యాయమూర్తులు అభిప్రాయ పడడం తప్పుకాదేమోగానీ, ఇంగ్లీషు భాషను తప్పనిసరి చేసే పరిస్థితులను కల్పిస్తున్న విషయాన్నీ పొంచివున్న ముప్పును గురించి క్రియాశీలకంగా ఆలోచిస్తున్న న్యాయకోవిదులు పట్టించుకోరా?

అయితే ఇట్లాంటి అభిప్రాయంతో మాతృభాషలో విద్యాబోధన అనేది భారతీయులకు అందరానిదే అవుతుంది. మాతృభాషలో విద్యాబోధన అనేది ఈ పరిస్థితులలో అమలు చేయగలగడం కష్టమే. అంటే దీన్ని ప్రభుత్వాలు చట్టం ద్వారా సాధించబూనడం రాజ్యాంగ వ్యతిరేక చర్య కిందకు వస్తుంది. మరి మాతృభాషలో విద్యాబోధనను ఎట్లా అమలు చేయాలి? ఇది పూర్తిగా సమాజంలోని వ్యక్తుల అభిప్రాయానికి అనుగుణంగా ఉండాలి. అంటే ఐచ్ఛికంగా సాగాలి. మాతృభాషలో *విద్యాబోధన అనే మంచి పని చేయడానికి ఈ సమాజం ఎందుకు వెనకాడుతోంది? అంటే జరగబోయే జాతివిధ్వంసాన్ని నిలువరించ డానికి రాజ్యాంగంద్వారా సంక్రమించిన వ్యక్తిగత హక్కును సడలించడం రాజ్యాంగ వ్యతిరేక చర్య కాబోదు గదా?*

# 2

# భాషా సంక్షోభం–ప్రపంచీకరణ

**భా**షలకు జనసత్వాలూ కాలానుగుణమైన మనుగడనూ చేకూర్చేది వాటి వాడుకే. అంతేకాదు, వాడవలసిన అన్ని రంగాలలోనూ వాడటమే భాషల జవజీవాలకు నిదర్శనం. కానీ, చాలా భారతీయ భాషలు ఇప్పుడు కొన్ని రంగాలకే పరిమితం కావడం ఒక ఊహించ రాని పరిణామం. అంటే విద్య, వైద్య, ఉద్యోగ, పరిశోధనా రంగాలలో తమ వాడకం నుంచి భారతీయ భాషలు మెల్లగా వైదొలగడం భవిష్యత్తులో వాటి ఉనికికే చేటు తెచ్చింది. ఐతే, భారతీయ భాషల వాడకం ఇట్లా కొన్ని రంగాలకే పరిమితం కావడం ఇదే మొదటిసారి కాదు. ప్రాచీన భారతంలో ఆధునిక భారతీయ భాషల వాడకం ఒకటి రెండు అలౌకిక రంగాలలోనూ ఒకటీ అరా లౌకిక రంగాలలోనూ సంస్కృత ప్రాకృతాలకు తావిచ్చిన సందర్భాలు ఉన్నా, అక్కడ వాటి వాడకం కొంతవరకూ పరిమితమే. అది ఆధునిక భారతీయ భాషల ఉనికికి ఎట్లాంటి విఘాతాన్నీ కలిగించలేదు. అది లౌకిక వ్యవహార రంగం కాకపోవడం చేత ఆధునిక భారతీయ భాషలను మాట్లాడే ప్రజలపై దాని ప్రభావం అతితక్కువ. అత్యంత ముఖ్యమైన లౌకిక వ్యవహార రంగాలలో భారతీయ భాషల స్థానే ఇంగ్లీషు వాడకం విస్తరించడంతో– భారతీయ భాషలకు పరిపుష్టిని కలిగించే వాడుకకు బీటలు పడి, వాటి వినాశనానికి బాటలు వేస్తోంది.

కోట్లాదిమంది వాడుకరులనూ కంప్యూటర్లనూ అనుసంధానిస్తూ అనునిత్యం లక్షలాది పుటల జ్ఞాన సృష్టికి వేదికగా నిలుస్తూ, నేటి ఆధునిక మానవ ఆవిష్కరణలో తలమానికమైన అంతర్జాలం, విశ్వ వ్యాప్త జాలికావలయం అత్యంత వేగంతో భూగోళం మొత్తానికీ విస్త రిస్తోంది. ప్రపంచంలో ఆవిష్కృతమౌతున్న సమస్త జ్ఞానమూ ఇప్పుడు అంతర్జాలానికి అందుబాటులో ఉంటోంది. ప్రపంచంలోని సమస్త విపణి వీధులూ అంతర్జాలానికి అనుసంధానించబడుతున్నాయి. విశ్వ విద్యాలయాలూ, పరిశోధనశాలలూ, వైద్య ఆరోగ్య సేవాకేంద్రాలూ, ప్రభుత్వపాలనా వ్యవహారాలూ,

బ్యాంకు సేవలూ, పరీక్షలూ అన్ని రకాల రవాణా సౌకర్యాల సేవలకూ సంబంధించిన విషయాలన్నిటికీ అంతర్జాలమే ఆధారం. ఈ పరిజ్ఞానాన్ని అందుకోవడానికి ప్రాప్తి స్థానం అంతర్జాలంలోని జాలికా వలయాలలోని పరిష్కరిణులు, శోధకాలు, వివిధ ప్రాయోగిక ఉపకరణాలు సమస్తం ఇంగ్లీషులోనే కాదు, కొద్దో గొప్పో అన్ని భాషలలోనూ లభ్యమౌతున్నాయి. ప్రపంచీకరణ ప్రముఖ ఉద్దేశం సమాచార సాంకేతిక ఉపకరణాలను ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడమే. అయినా, అది ఊహించని విధంగా ప్రపంచ మార్కెట్లను ఆక్రమించి అభివృద్ధి చెందుతున్న బడుగు దేశాలను ఆర్థిక, సాంస్కృతిక పరంగా అన్ని విధాలా కొల్లగొట్టి, ఆర్థిక అసమానత లను పెంచుతోంది. ఐతే, దీనికి విరుగుడుగా స్థానికీకరణ లేక ప్రాంతీకరణ కూడా ఉంది. అంటే అంతర్జాతీయంగా లభ్యమయ్యే ప్రతి సమాచార సాంకేతిక ఉపకరణమూ స్థానికీకరణం చెంది స్థానిక లేక ప్రాంతీయ భాషలలో లభ్యమౌతాయి. అంతర్జాలంలో దొరికే ప్రతిదీ స్థానికీకరణం పొందవచ్చు. అసలు నేడు భాష అడ్డుగోడగా మారవలసిన అవసరం లేదు. ఎవరి భాషను వారు వాడుకొనేందుకు అంతర్జాలం వీలు కలిగిస్తుంది. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న సాంకేతిక భాషాశాస్త్రం (లాంగ్వేజ్ టెక్నాలజీ) భాషలమధ్య యంత్రానువాదాన్ని అందుబాటులోకి తెస్తోంది. దీనితో ప్రపంచంలోని ఒక భాషలోని విషయాన్ని మరొక భాషలోకి అతి స్వల్పకాలంలో అనువ దించుకోవచ్చు. భాషలు ఇక ఏమాత్రం అడ్డుగోడలు కావు. ఎవరి భాషలో వారు, వారి వారి కార్యకలాపాలను జరుపు కోవచ్చు. ఎవరి మాండలికంలో వారు రాసుకోవచ్చు, వేరొక మాండలికానికి మార్చుకోవచ్చు. నేడు తనకు వచ్చిన మాండలికంలో రాయడం, నచ్చిన మాండలికంలో చదువుకోవడం సాధ్యం. కాళోజీ కన్న కల సాకారమయ్యే రోజులు ఇవి. ఒకరి మాండలికం మరొకరిపై ఒకరి భాషను మరొకరిపై రుద్దవలసిన అవసరం లేదు. ఏదైనా ఒక భాషను గానీ మాండలికాన్ని గానీ ప్రామాణికమని గుర్తించవలసిన అవసరం లేదు. ఎవరికి ఇష్టమైన భాషలో వారు రాసుకోవచ్చు. రాసినదాన్ని మరొక భాషలోకి మార్చుకొనే ప్రక్రియలు ఉపయోగంలోకి వస్తున్నాయి. ఇవాళ అవి గుణాత్మకంగా లేకపోయినా త్వరలో గుణాత్మకమైన భాషాతంత్ర ఉప కరణాలు అందుబాటులోకి వస్తాయి.

ప్రపంచీకరణతో భాషాసంపర్కం అనివార్యం. పరభాషా సంపర్కం వలన భాషల ఉనికికి ముప్పు రావలసిన అవసరం లేదు. అయితే భాషాసంపర్కంలో తూకం మారినప్పుడు ఆయా భాషల మనుగడలో మార్పులూ చేర్పులూ జరుగుతుంటాయి.

ఈ మార్పులు కీలకమైన సందర్భాలలో భాషాసంపర్కంలోని తూకం కుంటుపడుతుంది. ఇది రెండు రకాలుగా జరగవచ్చు. మొదటిది, భాషలో మార్పులు. రెండవది, వాడకంలో మార్పులు. భాషలో మార్పు, పదజాలంలోనూ, భాషానిర్మాణం లోనూ కావచ్చు. అన్యభాషా పదజాలం ఎంత ఎక్కువగా చేరితే, భాషకు అంత శబ్దసంపద పెరుగుతుంది. దీనివలన భాషలో సందర్భానుసారంగా సాగే గుణం, సర్దుకుపోయే తత్వం పెరుగుతుంది. అయితే నేడు ఆంగ్లభాష వల్ల తెలుగులోని ప్రాథమిక పదజాలం తగ్గిపోతోంది. ప్రాథమిక పదజాలంలో మార్పులు దూరంగా పొంచి వున్న ముప్పుకు సంకేతం. ప్రాథమిక పదజాలంలో మార్పులు వచ్చాయంటే భాషలోని మిగిలిన పదజాలాన్ని అన్యభాషా పదజాలం ఆక్రమిస్తోందని చెప్పాలి. ఇక రెండవ రకానికి చెందిన సమతూకంలేని భాషాసంపర్కం వలన వాడకంలో వచ్చే మార్పులు భాషల విధ్వంస కారకాలు. ఈ మార్పు సాధారణంగా సంపర్క భాషలలోని ఒక భాష మరొక భాషను వాడే రంగాలలో తిష్ఠవేయడం వలన వస్తుంది. అంటే భాషను వాడుతున్న రంగాల కుదింపు మొదలయ్యింది అన్నమాట. ఇంకా చెప్పాలంటే *వాడకంలో తగ్గుదల కనిపించిన భాషలు చావు దాపురించిన భాషల జాబితాకెక్కినట్టే. ఇట్లా భాషల వాడుక రంగాలు తరిగిపోవడం– దాపున పొంచివున్న ముప్పుకు సంకేతం.* ఈ రకమయిన నష్టం అంతకు ముందు సంస్కృత, ప్రాకృతాల వలనగానీ, పర్షియను, అరబిక్ లాంటి పరాయి భాషలవల్ల కానీ తెలుగుభాషకి ఎదురుకాలేదు. ప్రాచీనకాలంలో మత–ధార్మిక రంగాలలో సంస్కృత ప్రాకృత భాషలది పైచేయి అయినా, ఆ రంగాలు భాషల మనుగడకు అంత కీలకమైనవి కావు.

నేటి భాషాసంక్షోభానికి ప్రధాన కారణం మన భాషలు ఉద్యోగ భద్రతను కలిగించలేక పోవడమేనని చాలామంది ఊహ. ఉద్యోగ భద్రతే జీవికకు ప్రధాన ఆధారం, భారతీయ భాషలలో చదువులు ప్రస్తుతానికి ఉద్యోగ భద్రతనూ జీవన హామీని ఇవ్వలేకపోతున్నాయి అని అంటారు. మన ప్రభుత్వాలు భారతీయ భాషామాధ్యమాలలో చదువుకున్నవారికి ఉద్యోగాలు ప్రత్యేకించడం లేదు. దీనికి కారణాలు అనేకం. ఒకటి– ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకున్నవారు ఎక్కువ నైపుణ్యం గలవారనీ, తెలివిగల వారనీ, సంస్కారవంతులనీ, పాండిత్యం ఉన్నవారినీ, ప్రపంచ జ్ఞానం గలవారనీ, మన సమాజంలో ఒక దురభిప్రాయం ఉంది. కొంతమంది పెద్దల ఆలోచన అట్లాగే ఉంది. రెండు– మనవి బహుభాషా సమాజాలు గనుక ఇంగ్లీషు తెలిసినవారు ఎక్కువమందితో వ్యవహారాలు నడుపగలరు. కానీ **ఇవి ఏవీ నిజం**

**కాదు.** మన రాష్ట్రాలలో నూటికి తొంభై పాళ్లు ఒక భాష మాత్రమే తెలిసినవాళ్లు. అంటే **తొంభై శాతం మందికి తెలిసిన భాషను వదిలి, పరాయి భాషలో పాలన సాగించాలనుకోవడం ప్రజాస్వామ్యం ఎలా ఔతుంది?** ఇక, మన విశ్వవిద్యాలయాలు పరిశోధనలో వెనకబడి ఉండడానికి కారణం, పరిశోధనా పత్రాల ప్రకటనలో ఇతర దేశాల వారితో తులనంలో తక్కువ ఉండడానికి ప్రధాన కారణం **మనకు తెలియని, మనకు రాని భాషలో రాయవలసి రావడమే. మన శాస్త్ర సాంకేతిక రంగాలలో రావలసినన్ని పాఠ్యగ్రంథాలను రాయలేకపోవడానికి కారణం మనకి ఇంగ్లీషు మీద పట్టు లేకపోవడమే.** ప్రతి ఏడాదీ మన కాలేజీలూ విశ్వవిద్యాలయాలూ దిగుమతి చేసుకునే ఇంగ్లీషు పుస్తకాల విలువే కొన్ని వేల కోట్ల రూపాయలు, ప్రపంచంలోనే అత్యధికంగా సైన్సూ, టెక్నాలజీ, ఇంజనీరింగు, గణితశాస్త్ర రంగాలలో గ్రాడ్యుయేట్లను తయారుచేస్తున్నా **పరిశోధనలో వెనుకబడి వున్నాం.** ఈమధ్యనే భారతదేశంలో వైజ్ఞానిక రంగానికి తలమానికమైన **బెంగుళూరులోని భారతీయ విజ్ఞానశాస్త్రాల సంస్థలో ఇన్ఫోసిస్ అధ్యక్షుడు నారాయణమూర్తి మాట్లాడుతూ భారతదేశంలో సైన్సూ, ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాలలోని పరిశోధనలలో గత అర్థ శతాబ్దంలో గుర్తించదగ్గ పరిశోధన ఒక్కటి కూడాలేదని** చెప్పడం గమనార్హం. దీనికి ప్రధాన కారణం మన **ఇంగ్లీషు చదువులు కావచ్చు. పరాయి భాషలో జరిగే మన చదువులు, జ్ఞాన సముపార్జనలో కంటే, భట్టీపట్టి తిరిగి పరీక్షలలో రాయడానికి మాత్రమే పనికివస్తున్నాయి.** ఈ చదువులు, మన విద్యార్థులకు, అర్థం చేసుకొని చేసే జ్ఞాన సృష్టికీ అవిష్కరణలకూ దోహదం చేయడం లేదు. ఇంగ్లీషులో చదువుకుంటే ఉద్యోగం వస్తుందనీ, విదేశాలు వెళ్లవచ్చుననేది ఇంకొక ప్రతీతి. విదేశాలకు ఎందరు వెళుతున్నారు? ఎవరు వెళుతున్నారు? **ప్రతి సంవత్సరం మన దేశం నుంచి విదేశాలకు వెళ్లేవారు లక్షమంది వరకూ ఉండవచ్చు. అది మన జనాభాలో ఒక శాతంలో వందోవంతు కన్నా తక్కువ. వారికోసం దేశం మొత్తం మన భాష కాని భాషలో విద్య నేర్చుకోవలసిన అవసరం ఏమిటి?** ఒకప్పుడు ఉన్నత విద్యకు మాత్రమే పరిమితమైన ఇంగ్లీషు మాధ్యమం ఇప్పుడు ప్రాథమిక విద్యకు కూడా విస్తరించింది. అయితే **జనాభాలో రెండున్నర లక్షలమందికి మాత్రమే ప్రథమ భాషగా ఉన్న ఇంగ్లీషును విద్యామాధ్యమంగా నిర్ణయించడం మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వేస్తున్న తప్పటడుగు అని చెప్పక తప్పదు.** ఇంగ్లీషు మాధ్యమ విద్య వలన మన ప్రాంతీయ ఉద్యోగ వనరులు దెబ్బతింటున్నాయి. మనలో భారతీయ భాషలు చదివేవారూ,

వాడేవారూ తగ్గిపోవడం వలన ఆయాభాషలలో పుస్తక రచన, ప్రచురణలు తగ్గిపోవడం జరుగుతోంది. దీనికి తోడు అంతర్జాతీయ విపణిలో వెల్లువలా అందుబాటులోకి వస్తున్న ఇంగ్లీషు పుస్తకాలూ, పత్రికలపై మనం ఆధారపడక తప్పడం లేదు. దీనివలన మన విదేశీ ద్రవ్యం వృధా అవుతోంది. అంతేకాక మన సొంత వనరు లనూ ఉద్యోగావకాశాలనూ బాగా దెబ్బతీస్తోంది. దీనివలన అంతర్జాలంలో ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న మన భారతీయ భాషలు నిరాదరణకు గురవుతున్నాయి. మాతృభాషల విద్యామాధ్యమంలో చదువుకున్నవారి ఆలోచనా విధానంలోనే స్వతంత్రేచ్ఛ, స్వేచ్ఛ, ఆత్మ విశ్వాసం, ఆత్మగౌరవం, ఉదాత్తమైన ఆలోచనలకు స్థానం ఉంటుంది. దీనికోసం భారతీయ భాషల వాడకానికి సంబంధించిన ప్రతిబంధకాలను తొలగించుకునే ప్రయత్నం చేయాలి.

స్థూల జాతీయ ఉత్పత్తి సాధనలో తెలుగూ తదితర భారతీయ భాషల వాటా సింహభాగం. భారతీయ భాషల మనుగడ కోసం, ప్రత్యేకంగా మాతృభాషపైని మమ కారంతోనో తేనె లాంటి తెలుగు అనో, అందమైన అజంత భాష అనో లేక **ఆత్మగౌరవం, సంస్కృతీ సాహిత్యం అంటూనో భాషలు బతికి బట్టగట్టే రోజులు కావు ఇవి. భాషల మనుగడకు అసలు సిసలు ఆనవాళ్లు కావాలి. వాటి ఉనికిని వెదికి పట్టుకో వాలి. ప్రజా సేవల వినియోగంలో, గనులూ, వస్త్రాలూ, మందుల తయారీ మొదలైన బడాపారిశ్రామిక రంగాలలో సమాచార వినిమయంలో, విద్య, వైద్య, వ్యాపార, వాణిజ్య, నిర్మాణ, రవాణా మొదలైన సేవా రంగాలలో, వ్యవసాయం, పాడి, నేత మొదలైన సంప్రదాయ రంగాలలో, సినిమా తదితర మాధ్యమాలలో విరివిగా వాడే భాషలు ఏవి? ఏయే భాషల వాడకం ఎంతెంతో లెక్కలు తేలవలసివుంది. మన స్థూల జాతీయ ఉత్పత్తిలో పద్దెనిమిది శాతంగా ఉన్న వ్యవసాయ సంబంధ రంగాలలో తెలుగూ తదితర భారతీయ భాషలే ప్రధాన భాషలు. సుమారు యాభైఎనిమిది శాతంగా ఉన్న స్థూల జాతీయ ఉత్పత్తికి ఆధారమైన సేవల రంగంలోనూ ప్రధానమైనవి తెలుగూ తదితర భారతీయ భాషలే. ఇక స్థూల జాతీయ ఉత్తత్తిలో ఇరవైనాలుగు శాతంగా ఉన్న పారిశ్రామిక రంగాలలో నగానికి పైగా భారతీయ భాషలే వాడుకలో ఉన్నాయి. అంటే మన స్థూల జాతీయ ఉత్పత్తికి ఆధారమైన మన భాషలను మనం ఎందుకు ఆదరించడం లేదు? వాటిని వాడేందుకు సరైన వాతావరణం కల్పించడం ప్రజా ప్రభుత్వాల బాధ్యత అని గుర్తించాలి గదా. దీనికి ముఖ్య కారణం ఈ రంగాలలో వాడే తెలుగూ తదితర భాషల వాడుకకు అధికారికమైన ఔపచారిక**

**గుర్తింపు లేకపోవడమే. ఉదాహరణకు, వ్యవసాయ రంగంలో పొలాన్ని దున్ని, నాట్లువేసి, మందులు చల్లి, ఎరువులు వేసి, పంటలు పండించి మార్కెట్లకు చేర్చే వరకూ కావలసిన జ్ఞానాన్ని శాస్త్రీయ పద్ధతులలో వారం పదిరోజులపాటైనా రైతులకు తెలుగులో శిక్షణను అందించడానికి మనం చేసిన పని ఏమిటి?** ఇలాంటివే వందలాది రంగాలలో ఉన్న సంఘటిత అసంఘటిత, శ్రామిక వర్గానికి, ఆయా రంగాలలో నైపుణ్యాల పెంపుకు కావలసిన జ్ఞానాన్ని తెలుగులో అందించటానికి ఈ ప్రభుత్వాలు ముందుకు రావాలి. అంటే నైపుణ్యం కొన్ని రంగాలకే పరిమితం కాదు. నైపుణ్యం అన్నిచోట్లా అవసరం. ఎలాంటి పనికైనా ఒక నిర్దిష్ట పద్ధతిలో నేర్చుకున్న నైపుణ్యం ఈ దేశ అభివృద్ధికి దోహదం చేస్తుంది.

చివరికి, దూరదృష్టిలేని మన విద్యావిధానాల వలన మన భాషలన్నీ పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ప్రపంచీకరణ ప్రభావం వల్ల శీఘ్రగతిన విస్తరిస్తున్న ఆంగ్లభాష అధిపత్య పదఘట్టనల కింద దేశీయ భాషలన్నీ నలిగిపోతాయి. **విద్యావిధానంలో మాతృభాషా వ్యవహారానికి అవకాశం లేనప్పుడు భాష అంతరించిపోతుంది. దానితో పాటుగా జాతీ, సంస్కృతీ, తమ అస్తిత్వాన్ని కోల్పోతాయి. తద్వారా భావి భారతంలో సమాజం సంక్షోభంలో పడుతుంది. కుటుంబ సంబంధాలు దెబ్బతింటాయి. పెద్దలపట్ల పిల్లలకు ఆసక్తీ, వ్యక్తుల మధ్య విలువలూ అంతరిస్తాయి. దేశీయ భాషా వ్యవహార జాతులన్నీ త్వరితగతిన అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఇది ముమ్మాటికీ జీవ విధ్వంసమే, పరోక్షంగా జీవ విధ్వంసానికి కారణమయ్యే భాషా విధానాల పట్ల న్యాయస్థానాలూ చట్టసభలూ పునరాలోచన చేయాలి.** జీవ విధ్వంసాన్ని అరికట్టేందుకు మాతృభాషా మాధ్యమం, వినియోగం తప్పనిసరి చేస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి. అట్లా కానప్పుడు త్వరలోనే మనం భాషను ఔట్‌సోర్సింగ్ చేసుకోబోతున్నామన్నమాట. అంటే ఆంగ్లం, ఇప్పుడు ఔట్ సోర్సింగ్ భాషగా అవతారమెత్తబోతోంది. మన చేతులకు తడి అంటకుండా, మనకు అనుభవంలోకి రాకుండా పనికానిచ్చుకోవడమే గదా ఔట్‌సోర్సింగ్! దీంతో సమాచార వినిమయంలో మన భాషల ప్రమేయాన్ని తోసిరాజనడమే.

(ఆంధ్రజ్యోతి - వివిధ- 4 జనవరి 2016 నుండి.. ధన్యవాదాలతో..)

# 3

# శాస్త్రీయత కొరవడిన ఇంగ్లీషు మాధ్యమ వాదం

**మా**నవులు విశ్వాంతరాళాలమధ్య రాకపోకలు సాగిస్తున్న ఈ ఆధునిక యుగంలో కూడా కొన్ని స్వార్థ శక్తులు తమ అధికారాన్నీ ఆధిపత్యాన్నీ కండబలంతోనేగాక బుద్ధిబలంతో కూడా సాధించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి కొందరి బుద్ధిబలానికి బలహీనులు మానసిక దోపిడీకి లొంగిపోతారు. ఈ మానసిక దోపిడీ భావదాస్యానికి దారితీస్తుంది. ఈ పరంపరలో భాష ఒక ముఖ్యసాధనం అవుతుంది. ఒకప్పుడు సంస్కృత గుత్తాధిపత్యం నుంచి బైటపడడానికి తెలుగూ తదితర దేశభాషలకు వేయి సంవత్సరాలకు పైగా పట్టింది. యుగం మారినా మళ్లీ అదే బాటా– ఈ మారు సంస్కృతం బదులు ఇంగ్లీషు దాస్యం. ప్రాథమికవిద్యాదశలోనే మాతృభాషలకు బదులు ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం అనాగరికం. పసివయసులో ఇంగ్లీషును రుద్దడమంటే బలవంతాన భావదాస్యంలోకి తోసివేసినట్లే. దూరదృష్టి లోపించిన స్వార్థపరులైన కొందరు ఉద్యోగాలను ఎరచూపి ఇంగ్లీషును ఇట్లా ప్రోత్సహించడం బలహీనులపై చేస్తున్న మానసిక దాడిగా దీనిని గుర్తించాలి. ఇంగ్లీషు మాధ్యమంలో చదివితేనే ఉద్యోగాలూ బతుకుదెరువూ అని నమ్మించడం అమానుషం. ఈ ఇంగ్లీషుతోనే మనం పేదరికంనుండి గట్టెక్కుతామనడం ఒక బానిస భావన. ఈ భావన మన సమాజానికి ఎక్కుతున్న విష సంస్కృతి ప్రభావమే.

నేటి ప్రపంచంలో సుమారు వందకుపైగా దేశాలు మన తెలుగు రాష్ట్రాలకంటే విస్తీర్ణంలో చిన్నవి. ఇక జనాభాలో ఇరవై దేశాలు మాత్రమే తెలుగు రాష్ట్రాలకన్నా ఎక్కువలో ఉన్నాయి. ఈ విస్తృతినీ ఈ ఆధిక్యాన్నీ ఎట్లా అర్థం చేసుకోవాలి. ఎంతో విస్తీర్ణమూ అధిక జనాభా, వివిధ భాషలూ, పలు సంస్కృతులూ కలిగిన మన రాష్ట్రాలనూ దేశాన్నీ కొన్ని దేశాల సమాఖ్య (ఫెడరేషన్ ఆఫ్ నేషన్స్) గా చూడాలిగానీ పాలనాపరమైన ఏవో కొన్ని అవసరాల కోసం విభజింపబడ్డ రెవెన్యూ భాగాల

సముదాయంగా కాదు. ఇండియాని కొన్ని దేశాలూ జాతుల సమాఖ్యగా చూడలేనివారి ఆలోచనా విధానం అశాస్త్రీయం. ఇట్లాంటి పంథాలోనించి వచ్చిన ఆలోచనలే తెలుగును వదిలి ఇంగ్లీషు భాషను మాత్రమే నేర్చుకోవాలనీ, దీనితో మున్ముందు ఆస్ట్రేలియా, కెనడా, అమెరికాలాంటి దేశాలను మన వలస దేశాలుగా మలచుకోవచ్చనే ఆలోచనలు ఎంత అసంబద్ధమైనవో పునరాలోచించాలి.

ఇంగ్లీషును భారతదేశ ప్రజలపై రుద్దడానికి చేసే దూరదృష్టిలేని దురాలోచనలకు ఆధారాలుగా వలసవాదాన్ని తెరపైకి తీసుకురావడం ఎంత దుర్మార్గమైన ఆలోచనో పరిశీ లించండి. ఇట్లాంటి ఆలోచనల తోటే వలసవాదులు వందల ఏండ్లకిందటే అమెరికా, ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియా ఖండాల ఆదివాసులపై అమలుజరిపిన పైశాచిక దాడులూ, దారుణ మారణకాండలూ జాతులకు జాతులనే తుడిచి పెట్టిన వైనాన్ని మనం మరిచిపోలేదు. ఇట్లాంటి యూరోపియన్ల పైశాచిక ప్రవర్తనలను ప్రశంసించవలసిన అవసరం లేదు. యూరోపియన్ల వలసలకు కారణాలను హేతుబద్ధ తార్కిక పద్ధతిలో ఆలోచించాలి. యూరోపియన్ల వలసలకు ప్రధాన కారణం వారి స్వదేశ వాతావరణం. ప్రపంచంలో బొగ్గు, చమురు, గ్యాసు, విద్యుత్తును కనుక్కోక ముందు యూరోపు దేశాలలో బ్రతకడం మహా దుర్భరంగా ఉండేది. ఒకరకంగా చెప్పాలంటే ఒకప్పుడది శాపగ్రస్తుల ప్రవాస స్థానం. సేద్యానికి అనువైన భూమీ, నీరూ, చాలినంత సూర్యరశ్మి లాంటి వనరులు తక్కువ. సగటున నాలుగు-ఐదు నెలలూ రోజుకు 7-8 గంటలు మాత్రమే ఉండే సూర్యరశ్మిలో తక్కువ వనరులతో పండే చాలీచాలని పంటలూ, మిగిలిన ఏడెనిమిది నెలలు మాంసాహారంపై ఆధారపడే జీవనం. ఆ మాంసాన్ని నిలవచేసుకొనేందుకు తూర్పు దేశాలలో దొరికే సుగంధద్రవ్యాలూ మసాలాదినుసుల వ్యాపారం అవసరం అయింది. వ్యాపారులుగా బయలుదేరినవారు తర్వాత వలసదారులుగా అవతారమెత్తారు. ఐరోపా వలసదారులు కొన్నిసార్లు స్థానికులపై హింసాత్మక చర్యలకు దిగడం, ఆ దేశాల సంపదను దోచుకోవడం, వారి భూభాగాలను ఆక్రమించుకోవడం అడ్డమొస్తే అంతం చేసేందుకు కూడగట్టుకున్న సాయుధ సిబ్బందితో కదిలేవారు. ఐతే క్రమేణా ప్రాకృతిక ఇంధనాలైన బొగ్గూ, పెట్రోలునూ కనిపెట్టడం దానితోపాటే పారిశ్రామికీకరణం కొత్త ఉత్పత్తుల తయారీ వాటి అమ్మకాలకోసం తూర్పు దేశాల అన్వేషణలో వలసవాదానికి ఓ ప్రత్యేక స్థితిని తీసుకువచ్చింది. అంటే కనీస అవసరాలతో మొదలైన యూరోపియన్ల వలసలు

వ్యాపార–వాణిజ్యాల ముసుగు వేసుకొని వలస దేశాల రాజకీయ అస్థిత్వానికి చేటుతెచ్చేంత వరకూ వెళ్లింది. సముద్ర యానం భారతీయులకు కొత్తేమీ కాదు. రెండువేల యేళ్లనాడే వేలాది కిలోమీటర్ల మేర విస్తరించిన ఆగ్నేయ ఆసియా దేశాల మొత్తంపై తమ ప్రాభవ ముద్ర వేయగలిగారు. కానీ ఎక్కడా స్థానిక జాతుల్ని తుడిచిపెట్టిన దాఖలాలు లేవు. భారతీయ సంస్కృతీ, భాషల ఆనవాళ్ళూ అంతటా కనిపిస్తాయి.

తూర్పు దేశాలు, ప్రత్యేకంగా భారత ఉపఖండం సహజ సిద్ధ వనరులతో సంవత్సరం పొడవునా సేద్యానికి అనువైన భూమీ, తగినంతనీరూ, కావలసినంత సూర్యరశ్మి మొదలైన వనరులు ఎక్కువగా కలిగివుండేవి. గుప్పెడు గింజలు చల్లితే గంపెడంతమంది తినేంత పంట దిగుబడి అయ్యే దేశం ఇది.

మన దేశంకన్నా రెండు మూడింతలు పెద్దవైన అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా దేశాలకు వలస పోయేందుకు పనికివస్తుందని మనం మన భాషలను వదిలి ఇంగ్లీషును మాధ్యమంగా ఎంచుకోవాలనడం దారుణం. మన దేశంలో జనాభా సాంద్రత ఎక్కువే. దానిని ఎప్పటి కైనా నియంత్రించక తప్పదు. నేడు వనరులు తక్కువగా ఉన్నాయని చెప్పి మన దేశభాషలను వదులుకొని ఇంగ్లీషును మాధ్యమంగా ఎంచుకోవాలనడం సమంజసం కానేకాదు.

ప్రపంచ దేశాలలో అందుబాటులోవున్న భూమీ మంచినీటి వనరుల నిష్పత్తిలో భారతదేశానిదే పైచేయి. ఉదా. ఐరాస విడుదల చేసిన లెక్కల ప్రకారం వివిధ పెద్ద దేశాల భూవైశాల్యంలో నీటి వనరుల సగటు శాతం వరుసగా ఇట్లా ఉంది:

1. ఇండియా 9.55%
2. కెనడా 8.93%
3. అమెరికా సం.రా. 5.3%
4. ఇండోనేసియా 4.88%
5. రష్యా 4.21%
6. కాంగో(డె.రి.) 3.32%
7. అర్జెంటీనా 1.57%
8. చైనా 1.41%
9. మెక్సికో 1.04%

10. కజఖస్తాన్ 0.92%

11. ఆస్ట్రేలియా 0.76%

12. బ్రెజిల్ 0.65%

13. సౌదీ అరేబియా 0.0%

ఇక, ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ లెక్కల ప్రకారం వివిధ అగ్రరాజ్యాల భూవైశాల్యంలో సాగుభూమి సగటు విస్తీర్ణంలో ఇండియాదే అగ్ర స్థానం: ఉదా.

| | |
|---|---|
| ఇండియా | 52.8% |
| అమెరికా సం.రా. | 16.6%, |
| అర్జెంటీనా | 14.5%, |
| ఇండోనేసియా | 13.0%, |
| కజఖస్తాన్ | 10.9%, |
| బ్రెజిల్ | 9.1%, |
| రష్యా | 7.5%, |
| ఆస్ట్రేలియా | 6.0%, |
| కెనడా | 5.0%, |
| కాంగో(డె.రి) | 3.1%, |
| అల్జీరియా | 3.1%, |
| చైనా | 3.0%, |
| సౌదీ అరేబియా | 1.4%. |

ఇండియా కంటే కొద్దిగా ముందున్నవి అతి చిన్న దేశాలైన బంగ్లాదేశ్ (59%), డెన్మార్క్(56.7%), ఉక్రెయిన్ (56.2%), మొల్దోవ(55.2%) మాత్రమే. ప్రాణుల జీవనాధారానికీ పంటలు పండడానికీ భూమిమీద ఉన్న నీటివనరులేగాక యేడాది పొడవూతా కురిసే వర్షపాతం కూడా అత్యవసరం. ప్రపంచ దేశాల జాతీయ తలసరి ఆదాయం దీనిమీదే ఆధారపడివుంటుంది. ప్రపంచం మొత్తమ్మీద వైశాల్యంలో అతి పెద్దవైన డజను ప్రధాన దేశాల సాంవత్స రిక సగటు వర్షపాతం :

| | |
|---|---|
| బ్రెజిల్ | 1,761, |
| కాంగో | 1,543, |
| ఇండియా | 1,083 మి.మీ.తో మొదటివరసలో ఉండగా |

| | |
|---|---|
| అమెరికా | 715, |
| చైనా | 645, |
| అర్జెంటీనా | 591, |
| కెనడా | 537, |
| ఆస్ట్రేలియా | 534, |
| రష్యా | 460 మి.మీ.తో రెండవవరసలోనూ, |
| కజఖస్తాన్ | 250, |
| అల్జీరియా | 89, |
| సౌదీ అరేబియా | 59 మి.మీ.తో అతితక్కువ వర్షపాతంతో అట్టడుగు |

స్థాయిలో ఉన్నాయి.

ఇక, ఇతర వాతావరణ అంశాల వంటిదే సూర్యరశ్మి కూడా. మానవజాతి మనుగడకూ వృక్ష సంపద పెరుగుదలకూ ఎండ అవసరం ఉంది. ఈ భూమిపై వృక్షసంపద పెరుగుదల మొత్తం ఎక్కువగా సౌరశక్తిచే ప్రభావితమైనదే. దీర్ఘసూర్యరశ్మి గలిగిన పగళ్లతో పంటలు వేగంగా పెరుగుతాయి. అతి తక్కువ కాలంలో పరిపక్వతకు చేరుకుంటాయి. ఎండ చాలా తక్కువ కాసే ప్రదేశాలలో మొక్కలూ జంతువులలో వ్యాధులు అధికం. అందువలన, మొక్కలకూ అలాగే మానవ కార్యకలాపాల కోసం ఏడాది పొడవునా సూర్యరశ్మి కొంత ఎక్కువగా అవసరం. భారత దేశమంతటా సంవత్సరంలో అధిక భాగం రోజుకు సగటున పన్నెండు గంటలపాటు ఎండకాయడం ప్రకృతి సిద్ధ వనరుల లభ్యతకు నిదర్శనం. సగటు వర్షపాతంలోనూ, సాగునేల విస్తీర్ణం లోనూ, నీటివనరులలోనూ, ఎండకాసే వ్యవధిలోనూ అన్నింటా తక్కువే వున్న అమెరికా, ఆస్ట్రేలియా, కెనడాలు కోట్లల్లో వలసవచ్చే భారత జనాభాను ఆదరించి ఆశ్రయమివ్వగల సత్తా కలిగినవని చెప్పలేము. ఈ గణాంకాలను పరిశీలించినవారు ఎవరైనా హేతుబద్ధ తార్కిక బుద్ధితో ఆలోచించేవారు ఎవరూ మన దుకాణం కట్టేసి వలసపోదాం అనరు.

అమెరికా 1917,1924లోతెచ్చిన నిర్బంధ వలస చట్టాలు, అమెరికా సంయుక్త రాష్ట్రాలకు ఆసియా నుండి సాగే వలసలను నిషేధ స్థాయికి తెచ్చాయి. ఇక భారతదేశం నుండి వలస ఇప్పటికే అతి తక్కువ స్థాయిలోకిచేరింది. ఉదా. **2013 వరకూ అమెరికాకు వలస వచ్చిన 4.5 కోట్ల విదేశీయులలో భారతీయుల శాతం 4.7**

**మాత్రమే. అంటే షుమారు 21 లక్షలు. అమెరికా సంయుక్త రాష్ట్రాలు భారతీయుల పట్ల చూపించే వివక్షకు తార్కాణం ఇది. మిగిలిన 4.30 కోట్లమందిలో ఎక్కువమంది ద. అమెరికా, యూరపు నుండీ కాగా బహు తక్కువమంది మాత్రమే ఆసియా ఆఫ్రికా నుండి. ఎంత వివక్ష! వీళ్ళా మిలియన్లకొద్దీ ఇండియన్లను ఆదరించి ఆశ్రయమిచ్చేవారు. ఇక ఆస్ట్రేలియా కెనడా సంగతులు చెప్పనవసరమే లేదు. ఈ దేశాల వలస చట్టాలు బాహాటంగానే ఆసియా ఆఫ్రికావారిపై నిర్బంధాలను అమలుపరుస్తున్నాయి. మరి ఈ పరిస్థితులలో ఈ అసత్య అశాస్త్రీయ ఆధారాలతో ఇంగ్లీషు మాధ్యమ ఉద్యమ ప్రచారం దేనికోసం. ఏం ఆశించి చేస్తున్నారు. ఎందుకు చేస్తున్నట్టు. ఏ లాభం ఆశించి చేస్తున్నారు.**

భారతదేశానికి అనాది కాలం నుండి అనేక జాతులూ, మతాలూ ఇతర సముదాయాల వారు రావడం, వీలుంటే దోచుకుపోవడం లేదంటే ఇక్కడే తిష్టవేయడానికి ఈ దేశ సహజ సంపదల ఆకర్షణే ప్రధాన కారణం. నేటి పేదల కడగండ్లు, ప్రకృతిక వనరులూ సహజ సంపదలూ లేకకాదు స్వార్థపరుల రాజకీయాలూ కొందరి అంతులేని ధనదాహం వలననే. ఇంగ్లీషు నేర్చుకొని సొంతదంతా వదులుకొని పొట్టచేతబట్టుకొని వలస పొమ్మనడం కంటే ఇంటి సంపదను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం అవసరం. దీనికి ఇంగ్లీషు మాధ్యమ విద్య అవసరం లేదు. వేల యేండ్లకిందటే మనతో పుట్టి, మనమధ్య వికసించి మన జీవితంతో పెనవేసుకొని మన జీవనంలో కలగలిసి మనతో మమేకమైన తెలుగును ఒక్క కలంపోటుతో పక్కన పెట్టి ఇంగ్లీషు మాధ్యమానికి తలవూపడం అవివేకం, అనాలోచితం.

ఇప్పటికే కార్పొరేట్ స్కూళ్లలో ఇంటర్‌లో తెలుగు లేకుండా చేశాం. దీనితో, తెలుగులో చదవడం రాయడం తగ్గడంతో పిల్లలు మన నడత, నడవడిక, మనం బతుకుతున్న వైనం, మన కుటుంబ సభ్యులతో పెద్దా చిన్నా తేడాలతో మెలిగే తీరూ తిప్పలూ తెలియ కుండా పోవడం మొదలైంది. తెలుగులో మన జీవన విధానాన్ని ప్రతిబింబించే రచనలను చదవడం తగ్గడంతో ఒకరితో ఒకరు మెలగడం మసులుకోవడం తెలియకుండా పోతోంది. నేడు మన కళ్ల ముందు జరుగుతున్న ఘోరాలూ నేరాలూ, హత్యలూ ఆత్మహత్యలూ, హింసా ప్రతిహింసా రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పిల్లలూ పెద్దలని తేడా లేకుండా ఓర్పును కోల్పోతున్నాం.

తల్లిదండ్రులు కోప్పడితేనో మార్కులు తక్కువ వచ్చినై అనో పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం తనను కాదన్న ఆడపిల్లపై ఆమ్లదాడికి దిగడం మన సమా జంలో తలెత్తుతున్న సహన హననాన్ని తెలుపుతున్నాయి. మాతృభాషలో మానవీయ విలువలున్న సాహిత్యాన్ని చదివించాల్సిన సమయాన్ని మనం కుదించివేశాం. నిర్దిష్టమైన ఆశయాలనూ సమాజంలో ఉమ్మడి బాధ్యతలనూ పాఠ్యపుస్తకాలలో విపులంగా చర్చించకుండా తరువాతవచ్చే దుష్పరిణామాలపై తలలుపట్టుకోవడం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడమే ఔతుంది. ఇట్లాంటి సామాజిక దుష్పరిణామాలను నివారించడానికి మాతృభాషా మాధ్యమం అత్యంత ఆవశ్యకం. పిల్లలకు బడిలో నేర్చినదానికీ ఇంట్లోనూ తన చుట్టూవున్న సమాజంలోనూ తను పాటించాల్సిన మానవీయ విలువలకు పొంతన ఉండాలి. బడిలో ఎంతసేపూ మానవ సంబంధాల బోధనను చులకనచేసి చిన్నచూపు చూస్తూ సమాజంతో మంచిగా మెలగాలని కోరుకోవడం ఒక భ్రమే ఔతుంది. **మన సమాజంలోనూ కుటుంబాల లోనూ వ్యక్తుల హక్కులనూ సామాజిక బాధ్యతలనూ గుర్తిస్తూ మానవీయ విలువలను పాటించే ఓర్పునూనేర్పునూ మాతృభాషద్వారానే నేర్పించాలి. ఇది తల్లి ఒడిలోనే మొదలౌతుంది. మధ్యలో ఆంగ్లభాష పెత్తనం ఎందుకు?**

ఇక తెలుగువదిలి ఇంగ్లీషు నేర్చుకుంటే ఉద్యోగాలు వస్తాయి అనీ, ఆర్థిక పరిస్థితులు మెరుగౌతాయి అనీ అనడం పచ్చి అబద్ధమే. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక 2014-15 గణాంకాల ప్రకారం భారత స్థూల జాతీయ ఉత్పత్తిలో వ్యవసాయం 17.01%, పరిశ్రమలు 30.02%, సేవలు 52.97% (నిర్మాణం, వాణిజ్య-వ్యాపారాలు, హోటళ్లు-రెస్టారెంట్లు, రవాణా, నిలువలూ, సమాచార ప్రసారం, సామాజిక సేవ, బీమా రంగాలు). ఈ గణాంకాలను ఎలా విశ్లేషిస్తాం. ఉద్యోగ రంగ సమాచార వ్యవస్థ : ఉద్యోగ మంత్రిత్వ శాఖవారు విడుదలచేసిన నివేదికలో భారతదేశంలో 52.85% ప్రజలు వ్యవసాయ రంగంలోనూ, 24.08% సేవారంగంలోనూ, 23.07% ఉత్పాదక, అనుత్పాదక నిర్మాణ వాణిజ్య రంగాలలోనూ ఉపాధి పొందుతున్నారు. అంటే వ్యవసాయరంగంలో తెలుగూ తదితర భారతీయభాషలనే గానీ ఇంగ్లీషు వాడరు గదా. సేవారంగంలోనూ భారతీయ భాషలనే ఎక్కువగా వాడతాం, ఇంగ్లీషు వాడకం తక్కువ. మిగిలిన ఉత్పాదక, అనుత్పాదక నిర్మాణ రంగాలలో ఎక్కువ శాతం భారతీయ భాషలను వాడినా చెప్పుకోదగిన స్థాయిలో

ఇంగ్లీషు వాడకం ఉంది ఐతే అది పైస్థాయిలలోనే. అంటే మన స్థూలజాతీయ ఉత్పత్తికి ప్రధానాధారం భారతీయ భాషలేగానీ ఇంగ్లీషుకాదు అని తెలుస్తోంది కదా. మరి మన ఉత్పాదక శక్తికి ఆలంబనగా నిలిచి దేశాభివృద్ధికి తోడ్పడే తెలుగూ తదితర భారతీయ భాషలను వదిలివేయాలనే ఆలోచనా సరళి అశాస్త్రీయంగాక ఏమౌతుంది.

ఇక విదేశాలకు వెళ్లిన మనవారు ప్రపంచం నలుమూలలా ఉద్యోగం చేసి సంపాదిస్తున్నది ఎంత? స్థూల జాతీయ ఉత్పత్తికి ప్రవాస భారతీయుల వాటా 4% మాత్రమే. ఇందులోనూ తక్కువ నైపుణ్యాలు ఉన్నవారూ, అర్ధనైపుణ్యంగలవారే ఎక్కువ. మన ప్రవాస భారతీయులు ఎక్కువగా ఆసియా, మధ్యప్రాచ్యదేశాలలోనే ఉద్యోగాలను వెతుక్కొంటున్నారు. అంటే వీరిలో ఎక్కువమందికి ఆంగ్లభాషా మాధ్యమంతో పనిలేదు. ఐతే, ఇంగ్లీషూ ఇతర విదేశీ భాషలు నేర్చుకొనే సౌకర్యం కావాలి.

తెలుగూ తదితర భారతీయ భాషల స్థానే ఇంగ్లీషును ప్రవేశ పెడితే జరిగే ఘోర విధ్వంసానికి గురయ్యేది సినిమా పరిశ్రమ, ఇంకా దాని ఆధారంగా చేసుకొని నడుస్తున్న బుల్లితెర పరిశ్రమ. సంవత్సరానికి 16,250 కోట్ల వ్యాపారానికి చేరిన సినిమా పరిశ్రమ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోంది. భారతీయ సినిమా పరిశ్రమలో ఎక్కువ సినిమాలతో, ఎక్కువ థియేటర్లతో ప్రపంచంలోనే ముందున్నది తెలుగు సినిమా. తెలుగును పక్కనబెడితే తెలుగు సినిమా పరిశ్రమను ఘోర విధ్వంసానికి గురిచేసినట్లే. తెలుగు సినిమాను నాశనంచేసి ఇంగ్లీషు సినిమాలను తీసుకువచ్చే ప్రయత్నం వెనుక ఓ అంతర్జాతీయ కుట్ర ఉండి వుండాలి. ఇది చిత్రపరిశ్రమపై ఆధారపడి జీవించే లక్షలాదిమంది జీవితాలను తొక్కివేసినట్లే. వేలాదిమంది కళాకారులూ సాంకేతికనిపుణులూ శ్రామికులూ రోడ్డున బడతారు.

ఈ విధ్వంసం ఇక్కడితో ఆగదు. భారతీయ ముద్రణా పరిశ్రమ వ్యాపారం యేడాదికి దాదాపు 25వేలకోట్లకు చేరుకుంది. ప్రపంచం లోనే ఎక్కువ అచ్చుయంత్రాలు ఉన్న దేశమనది. దీనిద్వారా షుమారు 25 లక్షలమంది ఉపాధి పొందుతున్నారు. ముందు ముందు ప్రపంచంలోనే మొదటిస్థానానికి చేరుకోబోతున్న పరిశ్రమ ఇది. ఇక ఇంగ్లీషు మాధ్యమం వస్తే వేలాది రచయితలూ, లక్షలాది ఉద్యోగులూ పనిలేక మూలన కూర్చో వలసిందే. అమెరికా, ఇంగ్లండు, ఆస్ట్రేలియా మొదలైన దేశాలలో కుర్చొని రాసిందే అచ్చయ్యి మనముందుకు వస్తుంది. మన జన విధ్వంసానికి ఇంతకన్నా ఏంకావాలి. ఇంగ్లీషు మీడియం భారతదేశానికి అణుబాంబే. దానితో

ఎన్నో దేశీయ పరిశ్రమలు మూలబడతాయి. లక్షలాదిమంది ఉద్యోగస్తులు ఉపాధి కోల్పో తారు. ఈ జీవ విధ్వంసాన్ని ఎలాగైనా ఆపాలి.

**మాధ్యమిక స్థాయి వరకూ విద్య పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీలో ఉచిత విద్యావిధానంలో నడవాలి. తెలుగు మాధ్యమంలోనే ఉండాలి. దీనివలన పసివయసులో విద్యార్థులమధ్య ప్రభుత్వ బడుల విద్యార్థులనీ కార్పోరేట్ బడుల విద్యార్థులనే భేదభావం రాదు. సమాజంలో చిన్నతనం నుండే ఏర్పడే వైరుధ్య భావాలను కొంత వరకైనా నివారించినవాళ్లం ఔతాం. జపానూ చైనాలు ఇట్లాంటి విద్యావ్యవస్థనే నడుపుతున్నాయి. ఒకవేళ మైనారిటీ సముదాయాల వారూ ఇతర ప్రైవేటు విద్యాసంస్థలూ ఇలాంటి బడులు నడపాలంటే ప్రభుత్వ గుర్తింపుతో నడపవచ్చు కానీ విద్యార్థులనుండి ఎలాంటి రుసుమునూ వసూలు చేయరాదు. ఇంగ్లీషూ తదితర భాషలు ప్రత్యేక విషయాలుగా మాత్రమే ఉండాలి. ప్రతి స్కూలులోనూ అది ఉన్న స్థానిక జనాభా ప్రాతిపదికన మాత్రమే తెలుగేతర మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలి. మనకందరికీ పుట్టుకతో వచ్చి తల్లి ఒడిలోనూ బడి లోనూ మనతో ఉండి మనకు ఇంత మానసిక ధైర్యాన్ని కలిగించి నేర్చినదాన్ని రాయడానికీ చెప్పడానికి వీలు కలిగేది తెలుగులోనే. మాతృభాషలో భావప్రకటన స్వేచ్ఛకు సంకేతం. కొత్త విషయాల ఆవిష్కరణకు మాతృభాష చిరునామా.**

*అమ్మనుడి, ఆగస్టు 2016, 9-11 పుటలలో ప్రచురితం*

*ఆంధ్రజ్యోతి దినపత్రిక, జులై 10, 2016న ప్రచురితం*

*వీరికి ధన్యవాదాలు*

# 4

# భాష–ఆర్థిక వ్యవస్థ– సామాజిక సంబంధాలు

## 1.0 పరిచయం

సమాజంలో భాషకూ సంపదకూ అవినాభావ సంబంధం ఉంది. భాషతో సంపదను సృష్టిస్తాం. ఇది, భాషను ప్రత్యేక పరిస్థితులలో వాడే ఉపాధ్యాయులూ, రచయితలూ, పాత్రికేయులూ, నటులూ మొదలైనవారికి మాత్రమే పరిమితం కాదు. భాషను వాడేవారందరికీ సంబంధించినది. బతకడానికి చేసే ప్రతి పనీ సంపద సృష్టితో ముడిపడివున్నదే. ఈ నేలపై బతికేవారందరూ సంపద సృష్టిలో పాలుపంచుకొనేవారే. సంపద సృష్టికి భాష ఒక ప్రధాన సాధనం. భాషలు సమాజంలోని ఆర్థిక లావా దేవీలను ప్రభావితం చేస్తాయని చెప్పడానికి వేరే రుజువులు అవసరం లేదనుకుంటాను. అదేవిధంగా, సమాజం కూడా భాషకు సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలపై ప్రభావం చూపించవచ్చు. ఇంకా చెప్పాలంటే సమాజంలోని వ్యక్తుల ఆర్థిక పరిస్థితి భాషతో ముడిపడివుంటుంది. ఈ సందర్భంలో భాషల ఆర్థిక విలువల గుర్తింపు అవసరం. ప్రతి భాషకూ దాన్ని మాట్లాడే సమాజంలో అంతర్లీనంగా ఒక నిర్దిష్ట విలువ ఉంటుంది. ఒక ప్రత్యేక దృక్కోణంలో, భాషను వ్యక్తి ఆర్థిక సామర్థ్యానికి ప్రతీకగానూ సామాజిక శక్తిగానూ పరిగణించాలి.

భాషాపరమైన విలువలలో అనేక ఆర్థిక అంశాలు ముడిపడి ఉన్నాయి. ప్రతి వ్యక్తికీ భాష ఒక నిధి వంటిది. భాష వ్యక్తినీ సమాజాన్నీ కలిపివుంచుతుంది. సామాజిక వ్యవస్థకు భాషే పునాది. వ్యక్తికీ ఆర్థిక వనరులకూ మధ్య సంబంధాలలో భాషకు సంబంధించిన విధి విధానాలు ఉన్నాయి. ఒక క్రమబద్ధమైన రీతిలో భాషకూ ఆర్థికవ్యవస్థకూ మధ్య అనుబంధం ఉంటుంది. ఇందులో ఒక సైద్ధాంతిక భావన ఉంది. కొన్ని భాషలు మరికొన్ని భాషల కంటే ఎందుకు ఎక్కువ అవసరం అనిపిస్తాయి? కారణం వాటి మధ్యనున్న ఆర్థిక వ్యత్యాసాలు కావచ్చు. భాషలమధ్యనున్న ఈ ఆర్థిక వ్యత్యాసాల ప్రభావం ఆ సమాజాలపై ఉంటుంది. భాషల ఎంపికలో సూక్ష్మ ఆర్థిక ప్రయోజనాలు

ఇమిడి ఉంటాయి. భారతదేశంలాంటి మిశ్రమ సామాజిక నేపథ్యంలో, సమాజంలోని చిన్నా పెద్దా ఆర్థిక విషయాలూ వాటి ప్రయోజనాలు విభిన్న భాషా సమూహాల పరస్పర ఆమోదంతో వ్యక్తం చేయబడతాయి. భిన్న భాషా సమూహాల పరస్పర ఆమోదం ఫెడరల్ వ్యవస్థకు ఆయువు పట్టు. అట్లాగే, భాషలకు సంబంధించిన ఆర్థిక విధానాలు సమాజాలలోని జాతులూ - భాషల సహజీవనాన్ని ప్రభావితం చేస్తాయి. జాతులూ తెగల వైవిధ్యాన్నీ, అల్ప సంఖ్యాక భాషల ప్రోత్సాహానికి దోహదం చేసేవీ భాషలమధ్యనున్న ఆర్థిక సంబంధాలే. సమాజపు ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభం భాష. భాషలకు వాణిజ్య పరమైన సామర్థ్యం ఉంటుంది. అంటే సమాజంలో స్థానిక వాణిజ్య శక్తులు బలపడడానికి స్థానిక భాషల ఆర్థిక స్థాయి పెరగాలి. స్థానిక భాషల ఆర్థిక స్థాయిలో పెరుగుదల ఆ సమాజపు ఆర్థిక శక్తికి నిదర్శనం. సమాజంలోని విస్తృత ఆర్థిక వ్యవస్థకు పరోక్షంగా భాషే ఆధారం. సమాజంలోని వ్యక్తుల మధ్య సంబంధాలు భాషా పరంగా ముడిపడి ఉంటై. అంటే సమాజపు ఆర్థిక వ్యవస్థకు భాషే పునాది. భాషా సంస్కృతులు ఒక సమాజపు ఆర్థిక పురోభివృద్ధిని ప్రభావితం చేయగలవు. బహుళ సాంస్కృతిక సమాజాలలో, భాషా ప్రణాళికలూ భాషా ప్రయోజనాలూ సామాజిక ఆర్థిక కోణంలో ప్రత్యక్ష సంబంధాలకు సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి.

## 2.0 అశాస్త్రీయ బోధనాపద్ధతి - ఇంగ్లీషు మాధ్యమం:

బోధన అనేది మాతృభాషలో జరగడం సహజం. అట్లాకానిది అసహజం. మాతృభాషలో లేని బోధన అశాస్త్రీయం, అనాగరికం. బోధన మాతృభాషలోనే ఉండాలి అనేందుకు కారణాలు అనేకం ఉన్నాయి. **విద్యార్థులు మాతృభాషలో నేర్పు, పటిమ కలిగి ఉంటారు. మాతృభాషలో మాట్లాడేందుకు ఎట్లాంటి అరమరికలూ, బెరుకు ఉండవు. మనో నిబ్బరం, ఆత్మవిశ్వాసం కలిగిఉంటారు. మాట్లాడే టప్పుడు తత్తరపాటు సిగ్గుపడటం ఉండదు. ప్రశ్నించడం మాతృభాషతోనే మొదలవుతుంది.** మనోవైజ్ఞానిక భాషాశాస్త్ర సిద్ధాంతాల ప్రకారం పసి వయసులో నేర్చిన భాష విద్యాబోధనకు అన్ని విధాలా అనువైనది. ఇక **బోధనా భాషగా అధిక సంఖ్యాకుల మాతృభాష ఉండటం సహజం. ప్రజల భాషలో బోధన ప్రజాస్వామిక భావనకు ఆలంబన. దీనికి విరుద్ధ భావనే పర భాషలో విద్యాబోధన. విదేశీభాషలో విద్యాబోధన అనుచితం.** ఇప్పటి వరకూ అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలలోనూ పాఠశాలవిద్య మాతృభాషలోనే కొనసాగిస్తున్నారు. ఇదే సామాజిక, పౌర న్యాయ సూత్రా లకు అనుగుణంగా నడిచే పద్ధతి.

ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ కూడా ప్రభావశీలకమైన, ప్రయోజనకారకమైన విద్యకు మాతృభాషా మాధ్యమమే కీలకమని చెబుతోంది. అంతేకాదు, పాఠశాలలో బోధనా భాషగా మాతృభాష లేనప్పుడు, పిల్లలు బడి మానేయడం లేదా మొదటి తరగతులలోనే తప్పటం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా, ఇప్పటివరకూ జరిగిన ఎన్నో పరిశోధనలు, పిల్లలు తల్లి ఒడినుండి బడికి చేరేటప్పుడు చదువుకు సరైన భాష మాతృభాషే అని నిరూపిస్తున్నాయి (యునెస్కో, 2008 ఎ). తల్లిదండ్రుల డిమాండు ఉందంటూ, కొన్ని విద్యావ్యవస్థలలో కొన్నిసార్లు మాతృభాష కాని భాషలలో బోధన నిర్ణయం సమర్ధనీయం కాదు. ఇట్లాంటి బోధన పద్ధతులు, మాతృభాష లను మినహాయించడం కాదు ఆ భాషలను మాట్లాడే పిల్లలను కూడా బోధన నుండి తప్పిస్తున్నట్లు పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా అన్నమాటలు మనం ఇక్కడ గుర్తుంచుకోవాలి, **"మీరు ఎవరికైనా వారికి అర్థమయ్యే భాషలో చెప్పితే, అది వారి తలకు ఎక్కుతుంది! నిజమే, కానీ మీరు వారి భాషలో చెప్పితే మాత్రం గుండెలకు హత్తుకుంటుంది."**

ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే ఉద్దేశ్యంతో ఉన్నత విద్యా మాధ్యమంగా మాతృభాషకు బదులు పరిధులు లేని ప్రత్యామ్నాయంగా నేడు ఆంగ్ల భాషను ఎంపిక చేసుకోవడం రేపటి ఒక చారిత్రక తప్పిదం అవుతుంది. సామాజిక, మానవీయ శాస్త్రజ్ఞులూ విద్యావేత్తలూ, పరిశోధకులూ ప్రాథమిక విద్యామాధ్యమంగా ఆంగ్లాన్ని మాతృభాషా స్థానంలో నిల్పే ప్రయత్నం తప్పు అని భావిస్తుండగా కొందరు మాత్రం ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యనూ ఎప్పటికప్పుడు విస్తరిస్తున్న ఆంగ్ల మాధ్యమ పాఠశాల లనూ చూపించి ఇంగ్లీషు మాధ్యమాన్ని సమర్థించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, ప్రభు **త్వాలు కేవలం డిమాండు-సరఫరా విధానాన్ని అమలుచేసే సంస్థలుగా కాక భవిష్యత్తులో సమాజానికి ఏది మంచిదో అది ఆలోచించి చేసే సంక్షేమ ప్రభుత్వాలుగా ఉండాలి. ధూమపానం, మద్యం వినియోగం వంటి అనారోగ్య అలవాట్లకు అత్యంత అధిక డిమాండ్ ఉన్నా మనం వాటిని నియంత్రణలో పెట్టను వెనుకాడడం లేదు గదా. మరి భాషా విధానంలో సహజ సూత్రాలకు విరుద్ధంగానూ సమాజ సంక్షోభానికి దారితీసే అనారోగ్య పద్ధతులను ఎందుకు అనుమతిస్తున్నట్లు. భాషా సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం కోసం ఎందుకు సంప్రదించటం**

**లేదు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ఆంగ్లభాషా మాధ్యమం తో ఏక భాషావిధానాన్ని అమలుపరచడం ప్రభుత్వాల హ్రస్వదృష్టి విధానానికి ఇది నిదర్శనం. ఇది ఒక దేశంపట్ల ఆ దేశ ప్రజలపట్ల అనాలోచిత ప్రవర్తనే.**

## 2.1 ముందుచూపు మందగించిన ప్రభుత్వ విద్యావిధానం:

గత ప్రభుత్వాలు, విద్యా విభాగంలో తమ బాధ్యతను తగ్గించుకొనేందుకు ప్రైవేటు యాజమాన్యంలో ఇంగ్లీషు మీడియంకు అపరిమితంగా ముందూ వెనుకలు చూడకుండా అనుమతులు మంజూరు చేశాయి. 2003 నుండే మునిసిపాల్టీ, ప్రైవేటు యాజమాన్య స్కూళ్లలో ఇంగ్లీషు మీడియంను ప్రవేశపెట్టేందుకు మొదలు పెట్టారు. ఇప్పటికే ప్రైవేటు యాజమాన్యం లో ఉన్న 95 శాతం స్కూళ్లు ఇంగ్లీషుమీడియంలోనూ, 98శాతం ప్రభుత్వ స్కూళ్లు తెలుగు మాధ్యమంలోనూ నడుస్తుండగా, వాటిల్లో ప్రైవేటు (ఇంగ్లీషు మీడియం) స్కూళ్లు అన్నీ పట్టణాలలోనూ, తెలుగు మీడియం స్కూళ్లలో చాలా భాగం పల్లెటూళ్లలోనూ ఉన్నాయి. ఐతే, పల్లెటూళ్లలో ఉన్న చిన్నకారు రైతుకుటుంబాలూ వ్యవసాయ కార్మిక కుటుంబాలూ సాంప్రదాయవృత్తులవారూ షెడ్యూల్డు కులాలూ తెగల కుటుంబాలకూ చెందినవారు ఆంగ్లభాషామాధ్యమంలో చదివే సదుపాయం లేనందువలననూ, అట్లాంటి ఆంగ్లభాషా మాధ్యమ సదుపాయాన్ని పల్లెటూళ్లకు విస్తరించే విధంగా ప్రభుత్వ స్కూళ్లలో కూడా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలనుకున్నారు. ఈ ఆలోచన వచ్చిందే తడవుగా 'సక్సెస్' ప్రణాళిక పేరుతో ఇంగ్లీషు మీడియంను అమలుచేసేందుకు వీలుగా, ఉన్న ఇంగ్లీషు మీడియమ్ స్కూళ్ల పని బావుంది అంటూ తీర్మానించారు. కానీ ఇట్లాంటి కీలక తీర్మానానికి ముందస్తుగా ఎలాంటి నివేదికనూ తయారుచేయించినట్లు లేదు. దీనికి అనుగుణంగా, 2008 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక జి.ఓ.ను (ఎమ్.ఎస్.నం. 76) విడుదల జేసింది. దాని ప్రకారం, 6500 స్కూళ్లలో ఇంగ్లీషు మీడియంను ప్రవేశ పెట్టేందుకు చర్యలు తీసుకోవాలి అని నిర్ణయించింది. ప్రైవేటు యాజమాన్యంలో వచ్చే ఉద్యోగావకాశాలను అందుకునేందుకు వీలుగానూ, ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకొనేందుకు వీలుగా ఆంగ్లమాధ్యమం అవసరం అంటూ తేల్చేసింది.

## 2.2 ఆంగ్లమాధ్యమంతో విద్యాబోధన-అక్షరాస్యతకు అడ్డుగోడ:

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 2011-12 గణాంకాల ప్రకారం 1వ

తరగతిలో 15లక్షలకు పైగా పిల్లలు ప్రవేశం పొందుతుంటే 8వ తరగతికి చేరుకొనేటప్పటికి 15%, 10వ తరగతికి 28%, 12వ తరగతికి చేరుకొనేటప్పటికి 46% మంది బడి మానేస్తున్నారు. 6, 9, 11 తరగతులలో చాలా స్కూళ్లలో ఇంగ్లీషు మాధ్యమం ప్రవేశపెట్టడమే బడి మానేసేవారి సంఖ్య పెరుగుదలకు కారణం. అంటే మన జనాభాలో 1వ తరగతి నుండి 12వ తరగతివరకూ చదివేవారు మొత్తం 1 కోటీ 87 లక్షలకుపైగా ఉండాల్సివుండగా వీరిలో బడిమానేసేవారు షుమారు 40 లక్షలమంది వరకూ ఉన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో బడిమానేసెయ్యి డానికి బలవత్తరమైన కారణాలలో ఒకటి ఇంగ్లీషు మాధ్యమం. 2003-4 సంవత్సరాలలో 6,9,11 తరగతులలో ప్రవేశపెట్టిన ఇంగ్లీషు మాధ్యమమే ప్రధానకారణం. లక్షలాదిగా బడిమానేసిన పిల్లలు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకూ, పట్టణ మురికివాడలలో ఉంటున్న పేద కుటుంబాలకు చెందినవారు అని గణాంకాలు తెలుపుతున్నాయి. అయితే, అక్షరాస్యత తక్కువ ఉన్న ఇతర రాష్ట్రాలలోకూడా బడిమానేసే పిల్లలు ఎక్కువ ఉన్నచోట ఆంగ్లమాధ్యమాలు ఎక్కువ ఉండడం కనిపిస్తోంది. **ఆంగ్ల మాధ్యమం- బడిమానేయటం- నిరక్షరాస్యతల మధ్య ఒక సూత్ర ప్రాయ సంబంధం ఉన్నట్లు కనబడుతోంది.** ఇది వెనుకబడిన వర్గాలూ, పేద కుటుంబాల పిల్లలు ఇంగ్లీషు మీడియం క్లాసు నుండి ఇంటికి వచ్చిన తర్వాత మళ్లీ క్లాసుకు వెళ్లేవరకూ వారు ఇంగ్లీషులో నేర్చిన విషయాలకు ఎట్లాంటి సహాయక ప్రోత్సాహకాలు అందకపోవడమూ, క్లాసులోనే నాణ్యతలోపించిన ఇంగ్లీషు మాధ్యమ బోధనలూ కారణాలు. తెలుగు రాష్ట్రాలలో వివిధ మాధ్యమాలలో విద్యాబోధనకూడా ఇదే విషయాన్ని గుర్తుచేస్తోంది. 5వ తరగతి నుంచి 6వ తరగతిలోకి ప్రవేశించే విద్యార్థుల సంఖ్యలో తెలుగు మాధ్యమంలో గణనీయమైన తరుగుదల కనిపిస్తోంది. ఐతే ఇందులో ఒక విశేషం ఏమంటే ఈ తరుగుదలకు సమాంతరంగా ఆంగ్లమాధ్యమంలో ప్రవేశం పొందుతున్నవారి సంఖ్య పెరుగుదలకు దరిదాపుల్లో ఉంది. అంటే ఆరవ తరగతిలో తెలుగు మాధ్యమ ప్రవేశాలు తగ్గించి వేశారన్నమాట. తెలుగు మాధ్యమ బడులను తగ్గించడమూ తెలుగు మాధ్యమ ప్రవేశాలను కుదించి వేయడంతో ఇంగ్లీషు మాధ్యమ ప్రవేశాలు ఊపందుకున్నాయి అని చెప్పాలి. దీన్ని ఈ కింది పట్టిక నిరూపిస్తోంది. అంతే కాదు ఆంధ్రప్రదేశ్‌లో 5వ తరగతి నుండి 6వ తరగతికి తెలుగు మాధ్యమంలో ప్రవేశానికి 24 శాతం పైగా తరుగుదల ఉంటే అదే ఇంగ్లీషు మాధ్యమంలో 21 శాతం పెరుగుదల

పట్టిక–1 తెలుగు మాట్లాడే రాష్ట్రాలలో ★తరగతులవారీ మాధ్యమాల వారీ విద్యార్థుల ప్రవేశాలు (2013–14)

| క్ర.సం. | | తరగతి | తెలుగుమాధ్యమం | ఆంగ్లమాధ్యమం | ఇతరాలు | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| 1. | ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం | I | 453708 | 300861 | 16242 | 770811 |
| 2. | | II | 476043 | 277364 | 16944 | 770351 |
| 3. | | III | 481262 | 273150 | 17573 | 771985 |
| 4. | | IV | 491540 | 263428 | 17106 | 772074 |
| 5. | | V | 477155 | 272458 | 16499 | 766112 |
| 6. | | VI | 359994 (-24.55%) | 345669(+21.18%) | 8273 | 713939 |
| 7. | | VII | 369884(+2.74%) | 332898(-03.69%) | 8198 | 710980 |
| 8. | | VIII | 363447(-01.74%) | 302318(-09.19%) | 7152 | 672917 |
| 9. | | IX | 358279(-01.42%) | 268370(-11.23%) | 6250 | 632899 |
| 10. | | X | 312188(-12.86%) | 245033(-08.70%) | 5339 | 562560 |
| 11. | | XI | 3749 | 15216 | 0 | 18965 |
| 12. | | XII | 3882 | 6657 | 0 | 10539 |
| 13. | | మొత్తం(I-XII) | 4151131 | 2903422 | 119576 | 7174129 |
| 14. | | % | 57.86 | 40.47 | 1.67 | 100.00 |

| క్ర.సం. | | తరగతి | తెలుగుమాధ్యమం | ఆంగ్లమాధ్యమం | ఇతరాలు | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| 1. | తెలంగాణ రాష్ట్రం | I | 352356 | 333237 | 26095 | 711688 |
| 2. | | II | 309425 | 299629 | 25575 | 634629 |
| 3. | | III | 309505 | 295000 | 25587 | 630092 |
| 4. | | IV | 308654 | 284959 | 24582 | 618195 |
| 5. | | V | 304065 | 285015 | 23274 | 612354 |
| 6. | | VI | 250345(-17.66%) | 320874(+11.17%) | 18571 | 589790 |
| 7. | | VII | 262035(+04.67%) | 307753(-09.09%) | 18494 | 588282 |
| 8. | | VIII | 265791(+01.50%) | 277486(-09.83%) | 16910 | 560187 |
| 9. | | IX | 267879(+01.43%) | 247966(-10.64%) | 14729 | 530574 |
| 10. | | X | 254137(-05.13%) | 228759(-07.75%) | 12391 | 495287 |
| 11. | | XI | 1361 | 14437 | 0 | 15798 |
| 12. | | XII | 2036 | 6360 | 0 | 8396 |
| 13. | | మొత్తం | 2887589 | 2901475 | 206208 | 5995272 |
| 14. | | % | 48.16 | 48.40 | 3.44 | 100.00 |

16–17 వయసులోని ఇంటరు విద్యార్థులు ఇందులో చేరలేదు; బ్రాకెట్లలోని +/– తో మొదలయ్యే సంఖ్యలు ప్రతి ఏడాదీ విద్యార్థుల సంఖ్యల పెరుగుదల/తరుగుదలలో వచ్చిన మార్పులను తెలుపుతాయి.

కనిపిస్తోంది. తెలంగాణలో అయితే తెలుగు మాధ్యమంలో 17 శాతం తగ్గితే ఇంగ్లీషు మాధ్యమంలో 11 శాతం పెరిగారు. తెలుగు మాధ్యమంలో తరుగుదల, ఇంగ్లీషు మాధ్యమంలో పెరుగుదల, తగ్గిన తెలుగు మాధ్యమ పాఠశాలలనూ, ప్రవేశాలనూ సూచిస్తుంది. ఈ అంచనా సరైనదేనని 6వ తరగతినుంచి 10వ తరగతికి తెలుగు మాధ్యమంలో ప్రతి ఏడాదికీ తరుగుదల గణనీయంగా తగ్గితే, ఆంగ్ల మాధ్యమంలో మాత్రం తరుగుదల గణనీయంగా పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమంలో 6 నుంచి 10వ తరగతి వరకు 14 శాతం దాకా తరుగుదల కనిపిస్తే ఇంగ్లీషు మాధ్యమంలో మాత్రం 31 శాతం పైగా తరుగుదల కనిపిస్తోంది. అంటే **ఇంగ్లీషు మీడియంలో చేరినవాళ్ళు 30 శాతం దాకా మధ్యలో ఆపేసి వెళ్లిపోతున్నారన్నమాట. ఇదే వైపరీత్యం తెలంగాణలో ఇంకా ఎక్కువగా కనబడుతోంది. తెలంగాణలో తెలుగు మాధ్యమంలో తరుగుదలకు బదులు పెరుగుదల, ఇంగ్లీషు మాధ్యమంలో తరుగుదల ఇంకా పెరిగి 35 శాతానికి ఎందుకు చేరిందో మన విద్యా ప్రణాళికలు మదింపు చేసే అధికారులూ నాయకులూ ఆలోచించాలి.**

**2.3 ఆంగ్లమాధ్యమం అమలు-సమాజంలో సంక్షోభం:**

ప్రతి సంవత్సరం శైశవస్థాయి పరిచయ తరగతి, ఆపైన 1 వ తరగతినుండి 12వ తరగతివరకు చదివే పిల్లల సంఖ్య తెలుగు రాష్ట్రాలలో మొత్తం రెండుకోట్లు ఉంటుంది అన్నాం. ఈ రెండు కోట్ల మంది 12 వ తరగతి పూర్తిచేసుకోడానికి 23 ఏండ్లు పడుతుంది. అంటే 23 ఏండ్లలో 2 కోట్లమంది ఇంగ్లీషు మాధ్యమంలో మాత్రమే చదివినవారు తయారవు తారు. ఇక ఊహించండి ఏం జరుగుతుందో. **పిల్లలు ఇంగ్లీషు మాధ్యమంలో చదువుతుంటే తల్లిదండ్రులు వాళ్ల పిల్లలకోసం ఇంగ్లీషులోనే మాట్లాడడానికి ప్రయత్నిస్తారు. ప్రతి విషయం లోనూ అన్ని సందర్భాలలోనూ ఇంగ్లీషును వాడే ప్రయత్నం చేస్తారు.నానమ్మలూ అమ్మమ్మలూ, తాతయ్యలూ సొంత ఇంటిలోనే తెలుగు మాట్లాడేవారు ఎవరైనా ఉన్నా రేమోనని వెతుక్కోవాలి. లేదంటే బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా కూర్చోవాలి. ఒక వేళ ఎవరైనా దొరికినా ఏ గోడ చాటుకో పోయి మాట్లాడుకునే కాలం దాపురిస్తుంది. ఇంగ్లీషు పుస్తకాలనే కొంటారు. తెలుగు పుస్తకాలు రాసేవాళ్లూ కొనేవాళ్లూ ఉండరు. ఇంగ్లీషు సినిమాలకే అలవాటు చేస్తారు. తెలుగు సినిమాలు తీయరు. తీసినా ఆడవు. ఆడినా ఇంగ్లీషు టైటిల్సుతోనో లేక డబ్బింగు చేసో ఆడించాలి. ఇంట్లో ఇంగ్లీషు టీవీ చానెళ్లే నడుస్తాయి. ఇంగ్లీషు**

**వార్తాపత్రికలే అమ్ముడుబోతాయి. ఇంగ్లీ షులో చెప్పగలిగినవారి ఉద్యోగ అవసరాలే తీరతాయి. మాళ్లూ, మార్కెట్లూ, హాళ్లూ, హోటళ్లూ, షాపులూ అన్నింటా డబ్బు నీళ్లలా ఖర్చయ్యే ప్రతి చోటా ప్రతివారూ మరొకరిని మెప్పించటానికి ఇంగ్లీషు వాడే ప్రయత్నం చేస్తారు. దీనితో ఊహించరాని వేగంతో ఇంగ్లీషు వరద ముంచెత్తుతుంది. ఆయితే ఇదంతా ఉన్నత, మధ్యతరగతి వర్గాలకు మాత్రమే పరిమితం అవుతుంది. ఇది సమాజంలో అనేక ఉద్రిక్తతలకు దారి తీస్తుంది. సమాజం పూర్తిగా ఇంగ్లీషును వాడేవారూ అసలు ఇంగ్లీషును వాడనివారు అని రెండు భాగాలుగా చీలిపోతుంది.**

**ప్రభుత్వ బడులలో ఇంగ్లీషు మాధ్యమంలో చదివే బడుగు, బలహీన, కింది - మధ్యతరగతి వర్గాలకు ఇది పిడుగుపాటు లాంటిదే. కార్పొరేట్ స్కూళ్ల లోనూ ప్రైవేటు బడులలోని ఇంగ్లీషుమాధ్యమంలో చదివే ఉన్నత మధ్య తరగతివారి పిల్లలతో పోటీ పడలేక ప్రభుత్వబడులలోని ఆంగ్లమాధ్యమ విద్యార్థులు పూర్తిగా నష్టపోయే పరిస్థితులు ఎదురవుతాయి. బడుగు వర్గాల పిల్లల తల్లిదండ్రులు తలతాకట్టు పెట్టైనా తమ పిల్లల్ని ప్రైవేటు స్కూళ్లకు పంపటానికి ప్రయత్నిస్తారు. మళ్లీ ప్రభుత్వ బడులకు విద్యార్థులు రావటం లేదని చెప్పి మూసేసే పరిస్థితి వస్తుంది. అంటే మెల్లగా విద్య ప్రైవేటు పరమైపోతుంది. ఉన్న ఉద్యోగాలు అన్నీ ప్రైవేటు పరమై పోతాయి. బడుగువర్గాలవారు విద్యలోనూ ఉద్యోగాలలోనూ అవకాశాలు తగ్గి రిజర్వేషన్లు అమలు చేసే అవకాశాలుకూడా అడుగంటుతాయి. అప్పటికి స్థానికభాషల ఆధారంగా పనిచేసే పరిశ్రమలూ మూతపడతాయి. దీనితో సమాజం సంక్షోభంలో పడుతుంది.**

### 2.4 ఆంగ్లమాధ్యమం ఎందుకు ఉండకూడదు?

ఇంగ్లీషు అత్యధిక ప్రజల మాతృభాష కాదు. ఇంగ్లీషు ఈ దేశంలో ఎక్కువమందికి తెలిసిన భాషకాదు. 2001 జనాభా గణాంకాల ప్రకారం ఇంగ్లీషు కేవలం 2.3 లక్షల మంది భారతీయులకు ప్రాథమిక భాషగా ఉంది. ఐతే, 8.6 కోట్ల మంది తమ ద్వితీయ భాషగానూ మరో 3.9 కోట్ల మంది తమ మూడవ భాష గానూ జనాభా లెక్కల సేకరణలో చెప్పుకున్నారు. అంటే ఈ లెక్కన, భారతదేశంలో ఎంతో కొంత ఇంగ్లీషును వాడగలిగేవారి సంఖ్య మొత్తం 12.5 కోట్లు అంట. వీరిలో ఎంతమందికి వాడకానికి అవసరమైనంత ఇంగ్లీషు వచ్చో? దీనిని ఎవ్వరూ కొలిచి మదింపుచేసే ప్రయత్నం చేయలేదు. కొన్ని ఇంగ్లీషు పదాలు మాట్లాడగలిగినంత మాత్రాన ఆ భాష వచ్చినట్లగాదు. ఆ లెక్కన మన దేశంలోనూ మరికొన్ని దేశాలలోనూ అందరికీ

సంస్కృతం వచ్చినట్లే. మన దేశంలో ఉన్నత విద్య అంటే గ్రాడ్యుయేషన్ ఆపైన చదువుకున్నవారి సంఖ్య, 2011 జనాభా లెక్కల ప్రకారం 8.15% మంది మాత్రమే. వీరిలో 30% పైగా గ్రామీణ ప్రాంతాలవారే. అందులోనూ అరవై శాతంపైగా విజ్ఞాన సాంకేతిక రంగాలుకాని భారతీయ భాషా సాహిత్యాలూ సామాజిక శాస్త్రాలు చదివినవారే.

ఇంగ్లీషు భాషలో నైపుణ్యం ఉన్నవారు అతి తక్కువమంది. నూట పాతిక కోట్లమందికి ఇంగ్లీషు నేర్పే సమయంగానీ వనరులుగానీ మనకు లేవు. ఒక భాషను నేర్చుకోవడం అంటే ఆ భాష వ్యాకరణాన్ని నేర్చుకుంటే చాలదు ఆ భాషకు సంబంధించిన ఎంతో కొంత సాంస్కృతిక వారసత్వాన్ని వంటబట్టించుకోవాలి. ఇక్కడే వచ్చింది చిక్కు. ఈ పరిస్థితులలో నేర్చుకున్న భాషలో సృజనాత్మక విలువలున్న రచనలు చేయగలగడం  అసాధ్యం. భారతదేశంలో ఉన్న వందలాది విశ్వవిద్యాలయాలలోని వేలాదిమంది ప్రొఫెసర్లు దశాబ్దాల తరబడి పనిచేస్తున్నా వీరిలో బహు తక్కువమంది మాత్రమే ఆంగ్లంలో టెక్ట్సు బుక్కులు రాస్తున్నారు. కానీ, ఇంగ్లండు, అమెరికా సం.రా.లలోని జూనియర్ ప్రొఫెసర్లు కూడా అతి తేలికగా విరివిగా టెక్ట్సుబుక్కులు రాయడానికి కారణం ఇంగ్లీషు వారి మాతృభాష కావటమే. వచ్చీరాని ఇంగ్లీషు మాధ్యమం ద్వారా నేర్చిన విద్యతోనూ ఇంగ్లీషులో ప్రావీణ్యం లేకపోవడంతోనూ అడు గడుగునా తత్తరపాటుతో ఆత్మవిశ్వాస లోపంతో అన్నింటా వెనకడుగు వేయడం జరుగుతోంది.

అత్యంతవేగంతో అభివృద్ధి చెందుతున్న ఆధునిక సమాచార సాంకే తిక యుగంలో ఇంగ్లీషు మాధ్యమ విద్యాబోధనతో రెండు దశాబ్దాలలో స్థానిక భాషల ఆధారంగా నడిచే దేశీయ పరిశ్రమలు అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, సృజనాత్మక రచనలూ, పుస్తక ప్రచురణలూ, ముద్రణ, చిత్రపరిశ్రమ, టీవీ, తరతరాల వారసత్వ జ్ఞానసంపద ఆధారంగా నడిచే వృత్తి వ్యాపారాలూ మొదలైనవి. ఈ

పట్టిక–2 భారతదేశంలో మాతృభాషామాధ్యమంలో ప్రాథమిక విద్యాబోధన

| క్ర.సం. | ★అభాపావిస. | మొత్తం | పట్టణప్రాంతం | గ్రామీణప్రాంతం |
|---|---|---|---|---|
| 1. | 8 (2009) | 86.62% | 80.99% | 87.56% |
| 2. | 7 (2002) | 92.07% | 92.39% | 90.39% |
| 3. | 6 (1997) | 91.65% | 91.32% | 91.70% |

పరిశ్రమలు అంతరించ డంతోబాటు వాటి ఆధారంగా ఉపాధి పొందుతున్న లక్షలాది పనివారు వీధిన బడతారు. భారతదేశ జనాభాలో 68% గ్రామీణులే. వీరిలో అధిక శాతం ఇప్పటికీ సాంప్రదాయ వృత్తులు చేసుకొనేవారే. ఇవే వారి జీవికకు ప్రధాన ఆధారం. ఇంగ్లీషు విద్యతో ఇవి అర్థరహితం ఔతాయి. ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకున్నవారితో మన సమాజంలో కొత్త అంతరాలు మొలకెత్తి మన ఉనికికిస్పందించని కొత్త పోకడలున్న తరం తయారౌతుంది.

**3.0 బోధనా మాధ్యమాల స్థితి-గతి :**

మన దేశంలో ఉన్న మొత్తం గ్రాడ్యుయేట్ల (పోస్టుగ్రాడ్యుయేట్లూ, ఇంజనీర్లూ, డాక్టర్లూ, డాక్టరేట్లూ) సంఖ్య పదమూడు కోట్ల అరవై అయిదు లక్షలకు పైనే (13,65,77,942) ఉంది. తెలుగు రాష్ట్రాలలో అయితే, గ్రాడ్యుయేట్లు కోటీ పదకొండు లక్షలకు పైగానే (1,11,54,774) ఉన్నారు; మన గ్రాడ్యుయేట్లలో 60% ఆర్ట్సూ, సామాజికశాస్త్రాలకు చెందినవారే. తెలుగు రాష్ట్రాలలో(2011) 5-17 సంవత్సరాల వయస్సు వారి జనాభా రెండు కోట్లకు పైగానే (2,02,00,638) ఉండగా, 18-23 సం. వయస్సువారి జనాభా తొంభై లక్షలకు పైనే (90,28,047) ఉంది- రెంటినీ కలుపుకుంటే ఏడాదికి మూడు కోట్ల మంది విద్యార్థుల వరకూ ఏదో ఒకచోట చదువుకుంటూ ఉంటారు. ఐతే, తెలుగు రాష్ట్రాలలో పాఠశాల విద్యలోనూ జూనియర్ కాలేజీ విద్యలోనూ రెండు కోట్లమంది వరకూ ఉంటే ఉన్నత విద్యలో మిగిలిన కోటిమందీ ఉంటారు.

షుమారుగా గ్రాడ్యుయేటు స్థాయిలో అత్యధికంగా అంటే 34% శాతం ఆర్ట్సులోనూ ఆపైన ఇంజనీరింగూ టెక్నాలజీలో 19%, కామర్సులో 14.5%, సైన్సులో 12%, మిగిలిన పది శాతం ఇతర విషయాలలోనూ చేరుతున్నారు. భారతదేశంలో మొత్తం 17 లక్షల 40 వేల 614 పాఠశాలలున్నాయి. వీటిలో 10 లక్షల 31 వేల 361 స్కూళ్లు ప్రాథమిక పాఠశాలలే. ఐతే 4,72,350 ప్రాథమికోన్నతపాఠశాలలూ 1,74,240 మాధ్యమిక పాఠశాలలూ, 62,663 మాత్రమే ఉన్నత పాఠశాలలు ఉన్నాయి (8వ అభాపావిస, 2015). 8వ సర్వే ప్రకారం పాఠశాల విద్యలో 86.62% శాతం మాత్రమే మాతృభాషలో బోధన జరుగుతోంది. ఇది 7వసర్వే నుంచి 5.55శాతం తరుగుదల.పట్టణ ప్రాంతాలలో మాతృభాషలో బోధన ఇంకా తగ్గి 81 శాతానికి పడిపోయింది (7వ సర్వేలో 90 శాతం పైనే).

ఇంగ్లీషు మాధ్యమంలో పాఠశాల విద్యాబోధన 1997 లో ప్రాథమిక విద్యాబోధనలో 5శాతం ఉండగా 2002కి అది 13శాతం అయి 2009కి 15.50 శాతానికి చేరింది. ఇంగ్లీషు మాధ్యమంలో ఉన్నతపాఠశాల విద్యాబోధన 33 శాతానికి చేరుకోవడం ఏమంత సంతోషించదగ్గ విషయం కాదు. ఇక్కడే అసలు సమస్య మొదలవుతోంది. ఇంగ్లీషు మాధ్యమంలో పాఠశాల స్థాయిలో విద్యాబోధన అంచెలంచెలుగా పెరగడం సరిగ్గా ప్రాథమిక స్థాయినుండి ఉన్నత పాఠశాల స్థాయివరకూ బడిమానేసే విద్యార్థుల పెరుగుదలతో సమాంతర నిష్పత్తిలో ఉండటం ఆలోచించవలసిన విషయం.

| పట్టిక–3 భారతదేశంలో ఇంగ్లీషుమాధ్యమంలో పాఠశాల విద్యాబోధన | | | | | |
|---|---|---|---|---|---|
| క్ర.సం. | అభాపావిస. | ప్రాథమికస్థాయి | ప్రాథమికోన్నతస్థాయి | మాధ్యమికస్థాయి | ఉన్నతస్థాయి |
| 1. | 8 (2009) | 15.49% | 21.08% | 28.73% | 33.06% |
| 2. | 7 (2002) | 12.98% | 18.25% | 25.84% | 33.59% |
| 3. | 6 (1997) | 4.99% | 15.91% | 18.37% | 28.09% |

ప్రజా ప్రభుత్వాలు ప్రజల భాషలో పరిపాలన, విద్యాబోధన చేయవలసివున్నా ఎలాంటి శాస్త్రీయ సైద్ధాంతిక ఆధారాలు లేకుండా ఇంగ్లీషు మాధ్యమాన్ని అమలు జేయడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నాయి? దీనివలన భవిష్యత్తులో దేశ ఆర్థికవ్యవస్థ ఎంత ఛిన్నాభిన్నమై పోతుందో ఆలోచించే ప్రయత్నం ఎందుకు చేయటం లేదు. తేట తెలుగనీ, తీయనిదనీ, అమ్మనుడి అనీ, అధిక సంఖ్యాక ప్రజల భాష అనీ, వేల ఏండ్ల చరిత్ర, సంస్కృతి గలదనీ చెబితే వినే రోజులు కావు ఇవి. వాస్తవాలను మరుగుపరిచి, ఇంగ్లీషు నేర్చితేనే ఉపాధి ఉద్యోగావకాశాలు వస్తాయని భ్రమలు కల్పించి ఆంగ్ల మాధ్యమం వైపు చూసేవారికి, ఒక శాస్త్రీయమైన ఆలోచనా విధానంలో తెలుగూ తదితర దేశ భాషల శక్తి సామర్థ్యాలను–ఆర్థిక కోణం నుండి చూపించాల్సిన అవసరం ఉంది.

**ఆధునికత, అభివృద్ధి, ఉద్యోగాల పేరుతో ఇంగ్లీషు మాధ్యమాన్ని తవ్వి తలకెత్తు కుంటున్నాం. ఊహాజనిత ప్రకటనలూ కథనాలద్వారా యువతకు ఇంగ్లీషు మాధ్యమంపై విపరీతమైన ఆశలను కల్పిస్తున్నాం. ఇంగ్లీషుకు లేనిపోని గొప్పతనాన్ని అంటగడుతున్నాం. మంచి విద్యా విధానం అంటే ఇంగ్లీషు చదువేనన్నట్లుగా వ్యాఖ్యానించటం అలవాటయింది. తెలుగుమాధ్యమ విద్యను అన్ని విధాలా**

**ఆగమాగంచేసి ప్రభుత్వ బడుల్లో నుంచి కూడా తరిమేస్తున్నాం.** ఇంగ్లీషు పేరుతో విద్యను వ్యాపారంగా మలిచి సమాజంలో కింది వర్గాలవారికి అందరాని మానిపండుగా చేశాం. ఇంగ్లీషు మాధ్యమంలో నేర్చితేనే ఉద్యో గావకాశాలు వస్తాయనీ, అధిక సంపాదనకు ఆస్కారం ఉంటుందనే భ్రమను కల్పిస్తున్నాం. విద్యార్థులకూ, తల్లిదండ్రులకూ ఆ భాషపై మోజు పెరగడానికి ఇదే కారణం. ఈ కథనాల జాబితాలో ఎంత నిజం ఉందో, చెప్పేవాళ్లల్లో ఎంత నిజాయితీ ఉందో ఎప్పుడన్నా ఎవరన్నా శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి చూశారా? భారతీయ ఆర్థిక వ్యవస్థకు ఇంగ్లీషూ తదితర భారతీయ భాషల ఆర్థిక సామర్థ్యాన్నీ వాటిద్వారా సమాజానికి ఉద్యోగాల రూపంలో కలుగుతున్న ఆర్థిక ప్రయోజనాలనూ మనం ఒక్కసారి బేరీజు వేసి చూసుకోవాలి. మాతృభాష వాడకం మన జన్మహక్కు. మాతృభాష ఆర్థిక స్వావలంబనకు ఆధారం. ఈ స్థానాన్ని మరొక భాష ఆక్రమణకు అవకాశం కల్పించడం మన హక్కులను కాలరాయడమే ఔతుంది. భాషా హక్కులను గుర్తించివాటిని పరిరక్షించే బాధ్యత ప్రజా ప్రభుత్వాలదే. అట్లా జరగనప్పుడు జనభాషలు న్యాయం చేయండి అంటూ జనతా గ్యారేజీ ముందుకు రాక తప్పదు.

అదే ఇప్పుడు తెలుగు భాష లేక జననుడికి వచ్చిన సమస్య. ఈ సమస్య పరిష్కారానికి అవసరమైనది కొన్ని విషయాల వివరాలూ వాటిపట్ల అవగాహన. ఈ అవగాహనను తెలుగు మాట్లాడేవాళ్లందరికీ కల్పించాలి. ఈ అవగాహనకోసం కొన్ని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాలి.

1. వాణిజ్య వ్యాపార రంగాలలో స్థానిక భాషల వాడకం ఎంత?
2. స్థూల జాతీయోత్పత్తిలో మాతృభాషల భాగస్వామ్యం ఏమిటి?
3. వివిధ రాష్ట్రాలలో స్థూల రాష్ట్ర ఉత్పత్తులలో మాతృభాషల భాగ స్వామ్యం ఏమిటి?
4. ఉద్యోగ ఉపాధి రంగాలలో భారతీయభాషల భాగస్వామ్యం ఎంతెంత?
5. ప్రాథమిక స్థాయినుండి ఉన్నత విద్యాస్థాయి వరకూ ఏ స్థాయిలలో భారతీయ భాషల వాడకం ఎంతెంత?

ఈ పై ప్రశ్నలకు రాబట్టిన సమాధానాలే మన మాతృభాష పట్ల సమాజంలో దాని స్థానంపట్ల మన అవగాహనను ఒక శాస్త్రీయ పద్ధతిలో తర్కబద్ధంగా ఆలోచింపజేస్తుంది.

## 4.0 విరుద్ధ వాదనలూ ప్రతికూల ఆధారాలూ:

2011 జనాభా లెక్కల ప్రకారం నాటి ఆంధ్రప్రదేశ్ మొత్తం జనాభా 8 కోట్ల 45 లక్షల 8 వేల 777 మంది (ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లో :4, 93, 86,799- నేటి తెలంగాణలో :3, 52, 86,757). వైశాల్యంలో 2,75,045 చ. కిమీ. లేక 1,06,195 చదరపు మైళ్ళు (ఇప్పటి ఆంధ్రప్రదేశ్ : 160,205 చ. కిమీ., 61,855 చ.మై.- నేటి తెలంగాణ : 114,840 చ. కిమీ., 44,340 చ.మై.). జనాభా సాంద్రతలో చదరపు కిలోమీటరుకు 308 మంది లేదా చదరపు మైలుకు 796 మందితో (ఇప్పటి ఆంధ్రప్రదేశ్: చ. కిమీ.కి 308, చ. మై.కి 800- నేటి తెలంగాణా: చ.కిమీ.కి 307, చ.మై.కి 800). సగటు భారతదేశ జనసాంద్రతకంటే తక్కువే. తెలుగు రాష్ట్రాల జనాభాలో షుమారు 11 శాతం 6 ఏండ్ల లోపువారే. 67 శాతం అక్షరాస్యులతో దేశంలో అట్టడుగు స్థానం మనది. ఆంధ్రప్రదేశ్ (తెలుగు రాష్ట్రాల)లో చదువుకున్నవారూ చదువులేనివారూ, చిన్నా పెద్దా ఉద్యోగస్తులు అనే తేడా లేకుండా (అధ్యాపకులూ, లాయర్లూ, డాక్టర్లూ, ఇంజనీర్లూ, వ్యాపారస్తులూ అందరినీ, ఇంటిపనీ బైటిపనీ అన్నీ కలుపుకొని) కార్మిక శ్రామిక శక్తి మొత్తం సంఖ్య 3,48,93,859 మంది. ఇది మొత్తం భారత దేశంలో పనిచేసే జనాభాలో 8.67%. వీరిలో అక్షరాస్యులు 1 కోటీ 50 లక్షల మంది అంటే 42.85%. ఐతే కొద్దోగొప్పో ఇంగ్లీషు వాడగలిగినవాళ్లు (గ్రాడ్యుయేట్లూ పోస్టు గ్రాడ్యుయేట్లూ) 16 లక్షల 86 వేల104 మంది అంటే 4.85% మాత్రమే. తెలుగు రాష్ట్రాలలోని మొత్తం పనివారిలో 80.74 శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందగా 19.26 శాతం మాత్రమే పట్టణ ప్రాంతాలవారు. స్థూల జాతీయ ఉత్పత్తికి తోడ్పాటునందించే పనివారిలో 34.33 శాతం గ్రాడ్యుయేట్లు గ్రామీణ ప్రాంతంనుండే. భారతదేశంలో ప్రతి ఏటా 15 లక్షలమంది ఇంజనీర్లు తయారవుతున్నారు. ఐతే వారిలో 20% మాత్రమే ఉద్యోగాలు పొందగలుగు తున్నారు. భారతదేశంలో 2011-12 సంవత్సరంలో మొత్తం నిరుద్యోగులలో 30 శాతం మంది గ్రాడ్యుయేట్లే ఉన్నారు. భారతదేశంలో పనివారిలో నిరుద్యోగ రేటు 9.4 శాతం కాగా, యువతలో ఇది 20% గా అంచనా. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో షుమారు 80% మంది నిరుద్యోగులే. భారతదేశపు 2013 జాతీయ ఉపాధి నివేదికలో ఇంజనీర్లలో 21% మాత్రమే వాస్తవానికి ఉద్యోగాలు పొందినవారు. భారతదేశంలో యూనివర్సిటీ విద్యార్థులలో 16% మాత్రమే సాంకేతిక విద్యను అభ్యసించినవారు. ఆంగ్లం-మాట్లాడే

జనాభా పెద్దగా ఉందనుకుంటున్న భారతదేశం, వ్యాపార వాణిజ్య సేవలతోపాటు సమాచార సాంకేతిక సేవలకూ, సాఫ్ట్‌వేర్ కార్మికులకూ ప్రధాన ఎగుమతిదారు. అయితే ఈ సేవలకు ఇంగ్లీషు మాట్లాడే దేశాలకంటే ఇంగ్లీషేతర దేశాలే ప్రధాన ఆధారం.

స్థూలజాతీయోత్పత్తి ఆధారంగా (2011-12) దేశంలో నాల్గవ అభివృద్ధి చెందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి ప్రధానంగా వ్యవసాయం, పరిశ్రమలూ సేవారంగాల ద్వారా జరుగుతుంటుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఆహార ప్రాసెసింగ్, సాఫ్ట్‌వేర్ ఎగుమతులు, ఆర్థిక సేవలూ, ఎలక్ట్రానిక్స్, విద్యుత్తు, వస్త్రాలూ పర్యాటక రంగాలు ప్రధానమైనవి. ప్రస్తుతం స్తూలరాష్ట్ర జాతీయోత్పత్తి 464, 184 కోట్లు. వ్యవసాయాధారిత ఉత్పత్తులద్వారా 87,096 కోట్లూ (19.04%), పరిశ్రమలు గనుల తవ్వకంద్వారా 1,08,000 కోట్ల రూపాయలు (23.61%), సేవారంగం ద్వారా 2,62,256 కోట్ల రూపాయల (57.34%) సంపదను మన పనివారు సృష్టిస్తు న్నారు. సుమారు వెయ్యి కిలోమీటర్ల పొడవున్న తీరప్రాంతంతో భారత దేశ మొత్తం సముద్ర ఉత్పత్తులలో ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్యం 22 శాతంపైగానే (7500 కోట్లు),

స్థూలజాతీయోత్పత్తి దేశ ఆర్థిక వ్యవస్థకు అద్దం పడుతుంది. మొత్తం స్తూలజాతీయో త్పత్తికి వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు అనేవి మూడు ప్రధాన అంగాలు. వ్యవసాయ అనుబంధ ఆర్థిక వనరులకింద పాడిపంటలూ, చేపలపెంపకం, అడవులూ, గనుల తవ్వకం మొదలైనవాటి నుంచి వచ్చే రాబడి కాగా పరిశ్రమలకింద వస్తువుల తయారీ, విద్యుత్ ఉత్పత్తి, నిర్మాణాలు మొదలైనవి ఉంటే, సేవలకింద ప్రభుత్వ కార్యకలాపాలు, సమాచార, రవాణా, ఆర్థిక, ఇంకా వస్తూత్పత్తి లేని ఇతర ఆర్థికవనరులకు సంబంధించిన కార్య కలాపాలు ఉంటాయి.



జాతీయ నమూనా అధ్యయన కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) 2011-12లో నిర్వహిం చిన సర్వే ప్రకారం భారతదేశంలోని మొత్తం శ్రామిక శక్తి (అన్ని వర్గాల ఉద్యోగస్తులను కలుపుకొని) 47.41 కోట్లు. ఐతే, వీరిలో 40 కోట్లకు పైగా గ్రామీణ ప్రాంతంలోనే ఉన్నారు. ఇది ప్రపంచంలోనే 2వ స్థానం. వృత్తిపరంగా చూస్తే, వీరిలో 49% వ్యవసాయంలో, 20% పరిశ్రమలలో, 31% సేవారంగంలో ఉన్నారు. భారతదేశంలో గ్రామీణ జనాభా 68.84%. వ్యవసాయాధారిత స్థూల జాతీయ ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న దేశం మనది. 2014 సిఐఏ ఫాక్టుబుక్ ప్రకారం, భారతదేశపు వ్యవసాయ రంగంలో స్థూల జాతీయ ఉత్పత్తుల విలువ 25 లక్షల కోట్ల రూపాయిల పైనే. ఇది మన దేశ స్థూలజాతీయోత్పత్తిలో సుమారు 18 శాతం. పరిశ్రమల రంగంలో స్థూల జాతీయ ఉత్పత్తుల విలువ 33 లక్షల కోట్ల రూపాయలు అంటే స్థూల జాతీయోత్పత్తిలో 31 శాతం పైనే. ఇక సేవారంగంలో స్థూలజాతీయ ఉత్పత్తుల విలువ 79.46 లక్షల కోట్ల రూపాయిలు ఇది స్థూల జాతీయోత్పత్తిలో 51 శాతం.

## 4.1 అక్షరాస్యత-భాష-స్థూలజాతీయఉత్పత్తి

2011 జనాభా లెక్కల ప్రకారం, 125 కోట్లమంది ఉన్న మన దేశంలో అక్షరాస్యుల సంఖ్య 56.1 కోట్లు. వీరిలో 52% 'ప్రాథమిక' స్థాయి దాటనివారే. అట్లాగే, 30.20% మంది సెకండరీ స్థాయిని మించనివారు. ఇక మొత్తం అక్షరాస్యులలో 4 కోట్లమంది మాత్రమే 'పట్టభద్రులు'. అంటే, భారతదేశం మొత్తం జనాభాలో వీరు 6.59% శాతం మాత్రమే. సాంప్రదాయికత మేళవించిన ఆధునిక వ్యవసాయం, హస్తకళలూ, విస్తృత ఆధునిక పరిశ్రమలూ పలు రకాల సేవలూ కలిగిన వైవిధ్య భరితమైన భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే బహు అరుదు. మన శ్రామిక వర్గంలో సగం వ్యవసాయంలోనే ఉంది. ఐతే మన ఆర్థికాభివృద్ధికి వ్యవసాయేతర సేవలు ప్రధాన కారణమవుతున్నాయి. మన శ్రామికశక్తిలో ఒక వంతు ఉద్యోగులతో భారతదేశపు స్థూలజాతీయ ఉత్పత్తిలో దాదాపు నాల్గింట రెండు వంతులవరకూ సేవారంగంద్వారా సమకూడుతోంది. శ్రామిక శక్తిలో మిగిలిన ఒక వంతు వివిధ పరిశ్రమలలో వస్తూత్పత్తిలోనూ గనులతవ్వకంలోనూ ఉంటూ స్థూలజాతీయ ఉత్పత్తికి నాలిగింట ఒక భాగాన్ని అందిస్తున్నారు.

ఆర్థిక శాస్త్ర సిద్ధాంతాలలో 'మూడు విభాగాల సిద్ధాంతం' అని ఒకటి ఉంది. అది ఆర్థిక వ్యవస్థను మూడు విభాగాలుగా విభజిస్తుంది, మొదటిది ప్రాకృతిక వనరుల

నుండి ముడి పదార్థాల వెలికితీత, రెండవది ముడిపదార్థాల నుండి ఉత్పత్తుల తయారీ, మూడవది సేవలు.

ఆర్థిక వ్యవస్థకు మొదటిరంగంలో జీవనాధారమైన వ్యవసాయం, పాడి ఇతర ఆహార ఉత్పత్తులూ. అటవీ వనరులు, వేట, మేత, ఆహారసేకరణ, చేపలపెంపకం, గనుల తవ్వకం మొదలైనవి ఉన్నాయి.

ఆర్థిక వ్యవస్థ రెండవ రంగంలో వస్తూత్పత్తి ప్రధానం. వస్తువుల తయారీ, ఉత్పాదనా ప్రక్రియలతో నిర్మాణాలూ, లోహాలనుంచి వస్తు వాహనాల త యా రీ , వస్త్రఉత్పత్తి, రసా యన, ఇంజనీరింగ్ పరిశ్రమలలో వస్తువుల తయారీ, విద్యుత్తు తయారీ దాని వినియోగాలు, మద్యపానీయాల తయారీ, నౌకానిర్మాణం, భవన నిర్మాణాలూ మొదలైనవి ఉన్నాయి.

ఆర్థిక వ్యవస్థ తృతీయ రంగం సేవా పరిశ్రమగా గుర్తించవచ్చు. ఈ రంగం సాధారణ జనాభాకూ భిన్న వ్యాపారాలకు కావాల్సిన సేవలను అందిస్తుంది. ఈ రంగంలో కార్యకలా పాలు చిల్లర, టోకు అమ్మకాలు, ముద్రణా, రవాణా, పంపిణీ ఇంకా వినోదం (చలన చిత్రాలు, టెలివిజన్, రేడియో, సంగీతం, సినిమా హాళ్లు మొదలైనవి), గుమస్తా సేవలు, ప్రసార మాధ్యమాలూ, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, పర్యాటకం, రెస్టారెంట్లూ హోటళ్లూ, ఆరోగ్యం-సంరక్షణ, విద్య ఇంకా న్యాయసంబంధ లావాదేవీలు ఉంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉద్యోగావకాశాలు పెరుగుదలకు ఈ రంగమే ప్రధాన ఆకర్షణ.

**మన చుట్టూతా ఉన్న ఆర్థిక వనరుల ఆధారంగా శ్రమ శక్తితో సంపదను సృష్టిస్తాం. సంపద సృష్టికి మనం చేసే ప్రతి పనిలోనూ ఏదో ఒక జ్ఞానం ఎంతో కొంత అవసరం అవుతుంది. సంపదను సృష్టించే ప్రతి పనిలోనూ శ్రమే ప్రధాన సాధనం. ఈ శ్రమకు ఆధారం జ్ఞానం. ఆ జ్ఞానం మనకు అనుభవం ద్వారా వస్తుంది. ఈ అనుభవం ఇంటా బైటా, చదువుతోనూ చదువులేకుండానూ సంపాదించవచ్చు. సాంప్రదాయకంగానూ వారసత్వంగానూ వచ్చిన జ్ఞానానికి చదువు తోడైతే వచ్చే జ్ఞానంతో తక్కువకాలంలో ఎక్కువ సంపదను సులువుగా సృష్టించే వీలు కలుగుతుంది. ఈ చదువుకి భాష ఆధారం. అంటే భాషతో జ్ఞానార్జన జరుగుతుంది. ఈ భాష మన మాతృభాష అయితే జ్ఞానార్జన సులువు అవుతుంది. ఇది మళ్లీ నేర్చుకోవాల్సిన అవసరం ఉండదు. దీనితో తరగతిగది సహజంగా అనిపిస్తుంది.** మన రాష్ట్రంలో పనిచేస్తున్నవారు ఏయే భాషలు వాడుతూ సంపద సృష్టిస్తున్నారో తెలుసుకోవడానికి ఈ కింద చూపిన పట్టిక చూస్తే తెలుస్తుంది. ఈ పట్టికలో ఇచ్చిన ఆర్థిక వనరులూ (నిలువుగడి-2),

సంఖ్యలూ (3-10 నిలువగడులలో) 2001-2011 సంవత్సరాల జనాభా గణాంకాలనుండి తీసుకున్నవి. ఈ పట్టికలో మన తెలుగు రాష్ట్రాలలో స్థూల రాష్ట్ర ఉత్పత్తీ, దాన్ని సృష్టించిన పనివారూ (వ్యవస్థిత, అవ్యవస్థిత రంగాలలోనూ), ఆ పనివారల చదువుల స్థాయికి సంబంధించిన గణాంకాలూ ఉన్నాయి. వీటి ఆధారంగా ఎవరెవరు ఎంతెంత సంపదను సృష్టించారో తేలికగా కనుక్కోవచ్చు. మొత్తం పనివారిలో నిరక్షరాస్యులు 32.50 శాతం. గ్రాడ్యుయేషనూ అంతకంటే ఎక్కువ చదివిన పనివారి శాతం 15.48 మాత్రమే. వివిధ ఆర్థిక వనరుల కార్యకలాపాలలో పాల్గొన్న గ్రాడ్యుయేట్లైనవారి సంఖ్యలూ శాతాలు 8వ నిలువు గడిలో కనిపిస్తాయి. గ్రాడ్యుయేట్ అయిన పనివారు తాము చేసేపనిలో ఎంతో కొంత ఇంగ్లీషును వాడివుంటారు. అంటే 15.48శాతం మంది తాము చేసేపని ఇంగ్లీషు వాడి చేసి వుంటారని అనుకుందాం. ఇక, తెలుగు రాష్ట్రాల ఆదాయానికి షుమారు లక్షన్నర కోట్లు సంపాదించి పెట్టే వ్యవసాయ అనుబంధ ఆర్థిక వనరులలో నేలను చదును చేసి, దుక్కి దున్ని, నీరు పెట్టి, నారు పోసి, నాట్లు వేసి, కలుపు తీసి, ఎరువు వేసి, మందు చల్లి, పంట కోసి మార్కెట్లకు తరలించే పనిచేసే పనివాళ్లు తెలుగునో మరో మాతృభాషనో వాడతారు కానీ ఇంగ్లీషు కాదు. ఈ రంగంలో గ్రాడ్యుయేట్లైనవారు కూడా మాతృభాషలను వాడతారేగానీ ఇంగ్లీషును వాడరు. ట్రాక్టరుతో దున్నినా, రసాయనిక మందులు వేసినా, ఆధునిక ఎరువులు వేసినా అన్నీ మాతృభాషలను వాడుతూనే గానీ ఇంగ్లీషుని వాడుతూ పనిచేయరు. ట్రాక్టరుతో దున్న డానికి ఇంగ్లీషు అవసరంలేదు. ఈ పనిలో ఇంగ్లీషునుంచి అరువు తెచ్చుకున్న కొన్ని పదాలు వాడినంతమాత్రాన ఇంగ్లీషు వచ్చు అని కాదు. అయితే, ట్రాక్టరు తయారీలో ఇంగ్లీషు వాడలేదా అంటే వాడి వుండవచ్చు కానీ అది తయారీ మరమ్మతుల కింద వస్తుంది. అక్కడ దాని తయారీలో పాలుపంచుకున్న ఇంజనీర్లూ సైంటిస్టులూ 5.43 శాతంమంది(3వ వరుస) ఇంగ్లీషు వాడినవారిలో భాగమే. అట్లాంటిదే రసాయనిక మందులూ ఎరువుల వాడకం. వాటిని వాడటానికి ఇంగ్లీషు అవసరం లేదు. కానీ వాటి తయారీలో కొంతమేరకు ఇంగ్లీషు వాడివుంటారు. ఆ లెక్క 3వ వరుసలోకి వస్తుంది.

*అమ్మనుడి, జనవరి 2017, 9-23 పుటలలో ప్రచురితం*

*ఆంధ్రజ్యోతి దినపత్రికలకు ధన్యవాదాలు*

## పట్టిక–4 తెలుగురాష్ట్రాలలో ఆర్థిక వనరుల కార్యకలాపాలు – వాడుక భాషలూ వాటి భాగస్వామ్యం

| క్ర. సం. | ఆర్థిక వనరులూ – కార్యకలాపాలు | వివిధ రంగాలవారీ స్థూరాఉ | రంగాలవారీగా పనివారు | నిరక్షరాస్యులైన పనివారు | ప్రాథమిక నిద్యావంతులైన పనివారు | మాధ్యమిక నిద్యావంతులైన పనివారు | గ్రాడ్యుయేట్లైన పనివారు | ఆర్థికకార్యకలాపాల వాడుకభాష | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | మాతృభాష | ఇంగ్లీషు |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9(5+6+7) | 10(8) |
| 1. | వ్యవసాయ అను. | 1,46,926 26.07% | 632,750 | 3,81,860 60.35% | 180,560 | 42,060 | 28,270 4.47% | 95.53 | 4.47 |
| 2. | గనులూ తవ్వకాలు | 11,704 2.08% | 286,030 | 1,72,380 60.26% | 64,680 | 33,440 | 15,530 4.30% | 95.70 | 4.30 |
| 3. | తయారీ– మరమ్మతులు | 1,60,246 28.44% | 16,38,810 | 8,05,490 49.15% | 583,850 | 179,070 | 70,400 5.43% | 94.57 | 5.43 |
| 4. | విద్యుత్తు, గ్యాస్, నీటి పంపిణీ | | 1,01,420 | 9,290 9.16% | 25,940 | 46,430 | 19,760 19.48% | 80.52 | 19.48 |
| 5. | నిర్మాణ రంగం | | 10,95,380 | 5,14,760 46.99% | 378,030 | 141,920 | 60,670 15.77% | 85.33 | 15.77 |
| 6. | టోకు వ్యాపారం, చిల్లర వర్తకం | | 24,04,700 | 5,74,440 23.89% | 828,740 | 731,950 | 269,570 11.21% | 88.79 | 11.21 |
| 7. | హోటళ్లు – రెస్టారెంట్లు | 2,44,633 43.41% | 2,32,440 | 76,110 32.74% | 94,580 | 44,400 | 17,350 07.46% | 92.54 | 07.46 |
| 8. | రవాణా, నిల్వలూ సమాచార ప్రసారాలు | | 11,18,350 | 2,35,830 21.09% | 402,910 | 355,840 | 123,770 11.07% | 88.93 | 11.07 |
| 9. | ఆర్థిక వాణిజ్య, వ్యాపారాలు .... | | 5,06,250 | 29,800 5.89% | 63,750 | 165,420 | 247,280 49.85% | 51.15 | 49.85 |
| 10. | ప్రభుత్వ పాలన, న్యాయ, రక్షణ, విద్య, వైద్య ... | | 27,61,820 | 7,03,080 25.46% | 510,540 | 732,920 | 815,280 29.52% | 70.48 | 29.52 |
| | మొత్తం అంకెలలో | 5,63,509 | 1,07,77,950 | 35,03,040 | 31,33,580 | 24,73,450 | 16,67,880 15.48% | 84.52 | 15.48 |
| | మొత్తం శాతం | 100% | 100% | 32.50% | 29.07% | 22.95% | 15.48% | 84.52 | 15.48 |
| | | | | 84.52% + 05.16 (1/3) = | | | | 89.67% | 10.33% |

**పటం-2 తెలుగు రాష్ట్రాలలో**
**ఆర్థిక కార్యకలాపాల వాడుక భాషలు**




తెలుగు రాష్ట్రాలలోఉన్న మొత్తం 1 కోటీ 7 లక్షల 77 వేల 950 మంది ఉద్యోగులలో 32.50 శాతం మంది నిరక్షరాస్యులే. ఇక మిగిలిన 67.50 శాతం అక్షరాస్యులలో 15.48 శాతం మాత్రమే గ్రాడ్యుయేట్లూ ఆ పైన చదువుకున్నవారు. అంటే నిరక్షరాస్యులనూ గ్రాడ్యుయేట్లుకాని అక్షరాస్యులనూ(52.02%) కలుపుకుంటే మొత్తం 84.52 శాతం ఉద్యోగులు మాతృభాషను మాత్రమే వాడగలిగినవారు. వీరిలో మెట్రిక్ చదివిన 22.95 శాతం మందికి మాత్రమే కొద్దోగొప్పో ఇంగ్లీషు భాషతో పరిచయం ఉంది. ఇక స్థూలరాష్ట్ర ఉత్పత్తికి తోడ్పడుతున్న ఉద్యోగులలో గ్రాడ్యుయేట్లను(15.48%) మాత్రమే కొంత వరకూ ఇంగ్లీషు వాడగలిగినవారిగా గుర్తించవచ్చు. ఐతే, వ్యవసాయ అనుబంధ శాఖలలోనూ, తయారీ మరమ్మత్తులలోనూ, నిర్మాణరంగం లోనూ, హోటళ్లు-రెస్టారెంట్లలోనూ, టోకు వ్యాపారం, చిల్లర వర్తకం, ఇంకా రవాణా, నిల్వలూ సమాచార ప్రసారాలు మొదలైన రంగాలలో గ్రాడ్యుయేట్లైన పనివారు కూడా తెలుగే వాడతారని అనుకోవడం సమంజసమే. ఎంతలేదనుకున్నా గ్రాడ్యుయేట్ పనివారలలో మూడింట ఒక వంతు (15.48%/3-5.16%) తెలుగే (మాతృభాష) వాడతారనుకుంటే, తెలుగురాష్ట్రాల స్థూలరాష్ట్ర ఉత్పత్తి షుమారు 90 (వ84.52/5.16%) శాతం తెలుగుభాష వాడుక ద్వారానే సమకూరుతోందని అని ఈ పట్టిక నిరూపిస్తోంది.

ఇక కింద చూపిన పట్టిక, భారతదేశంలో వివిధ ఆర్థిక కార్యకలాపాలలో పాలుపంచు కొని మాతృభాషలూ ఇంగ్లీషూ ఎంతెంత వాడి 48 లక్షల 79 వేల కోట్ల విలువ (2010-11 మార్కెట్ ధరలలో దీని విలువ 78 లక్షల 77 వేల 947 కోట్లు) చేసే దేశ స్థూల జాతీయోత్పత్తి సృష్టికి కారణమయ్యారో తెలుపుతోంది. 2010-11 స్థూల జాతీయోత్పత్తి సాధనలో పాల్గొన్న మొత్తం పనివారలలో గ్రాడ్యుయేట్లైన పనివారు 14.83 శాతం కాగా నిరక్షరాస్యుల మొత్తం 25.50 శాతం. ఇక మిగిలినవారు (ప్రాథమిక విద్య, సెకండరీవిద్యా స్థాయి వారు 59.63 శాతం. గ్రాడ్యుయేట్లు కాక మిగిలినవారు మొత్తం 85.13 శాతం. స్థూల జాతీయోత్పత్తిలో వీరి మొత్తం తోడ్పాటు 82.73 శాతం. అంటే స్థూల జాతీయోత్పత్తిలో 17.26 శాతం మాత్రమే ఇంగ్లీషు ద్వారా సమకూరుతోంది.

## పట్టిక – 5 భారతదేశంలో ఆర్థిక కార్యకలాపాలు – స్థూల జాతీయోత్పత్తి (2010–11)

| క్ర. సం. | ఆర్థిక వనరులూ కార్యకలాపాలు | రంగాలవారీ అం.లలో | రంగాలవారీ శాతం | గ్రాడ్యుయేట్లైన పనివారి% | గ్రాడ్యుయేట్లైన పనివారి తోడ్పాటు% | గ్రాడ్యుయేట్లుకాని పనివారు% | గ్రాడ్యుయేట్లుకాని పనివారి తోడ్పాటు% | అక్షరాస్యుల మొత్తం % | నిరక్షరాస్యుల మొత్తం % | నిరక్షరాస్యుల తోడ్పాటు% | గ్రాడ్యుయేట్లు కాని పనివారి తోడ్పాటు% | ఆర్థికవనరుల కార్యకలాపాల వాడుకభాష% మా.భా / ఇం. |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8(4+6) | 9 | 10 | 11(7+10) | 12 (11 / 5) |
| 1. | వ్యవసాయ అనుబంధాలు | 6,92,499 | 14.19 | 04.63 | 0.65 | 47.61 | 6.76 | 52.24 | 47.76 | 6.78 | 13.54 | 13.54 / 0.65 |
| 3. | తయారీ– మరమ్మతులు | 7,76,337 | 15.91 | 05.37 | 0.85 | 51.54 | 8.20 | 56.92 | 43.10 | 6.86 | 15.06 | 15.06 / 0.85 |
| 5. | నిర్మాణ రంగం | 3,84,282 | 07.90 | 05.45 | 0.43 | 58.18 | 4.60 | 63.63 | 36.37 | 2.87 | 07.47 | 07.45 / 0.43 |
| 2. | గనులూ తవ్వకాలు | 1,10,482 | 02.26 | 07.61 | 0.17 | 48.51 | 1.10 | 56.12 | 43.88 | 0.99 | 02.09 | 02.09 / 0.17 |
| 7. | హోటళ్లూ రెస్టారెంట్లు | 13,24,049 | | 08.49 | | 71.85 | | 80.34 | 19.66 | | | |
| 8. | రవాణా, సమాచార ప్రసారాలు | | 27.13 | 10.07 | 2.81 | 70.90 | 19.29 | 80.97 | 19.03 | 5.02 | 24.31 | 24.31 / 2.81 |
| 6. | టోకువ్యాపారం, చిల్లరవర్తకం | | | 12.53 | | 70.52 | | 83.05 | 16.95 | | | |
| 4. | విద్యుత్తు, గ్యాస్, నీటి పంపిణీ | 93,133 | 01.90 | 18.73 | 0.36 | 74.34 | 1.41 | 93.08 | 06.92 | 0.13 | 01.54 | 01.55 / 0.36 |
| 10. | ప్రభుత్వ పాలన, రక్షణ | 6,44,656 | 13.21 | 29.78 | 3.93 | 54.71 | 7.23 | 84.49 | 15.51 | 2.05 | 09.28 | 09.28 / 3.93 |
| 9. | ఆర్థిక వాణిజ్య వ్యాపారాలు | 8,53,795 | 17.50 | 46.07 | 8.06 | 48.11 | 8.42 | 94.18 | 05.82 | 1.02 | 09.44 | 09.44 / 8.06 |
| | మొత్తం అంకెలలో | 48,79,232 | 100.00 | 14.83 | 17.26 | 59.63 | 56.99 | - | 25.50 | 25.72 | 82.73 | 82.73 / 17.26 |

పట్టికలో వాడిన సంక్షేపాల వివరణ : ఆర్థిక కార్యాచరణ ద్వారా (2004-05 స్థిరాంక ధరలలో) స్థూలజాతీయోత్పత్తి= స్థూ.జా.ఉ./ ముందస్తు అంచనాలు కోట్ల రూ.లలో (2011). వ్యవసాయ అను.= వ్యవసాయం, పశుపాలన, చేపల పెంపకం/ గ్రా. ఐన= గ్రాడ్యుయేట్లు ఐన/ గ్రా. కాని= గ్రాడ్యు యేట్లు కాని/ గ్రా.ఏతర= గ్రాడ్యుయేట్లు కాక మిగిలిన పనివారు.

**అక్షరాస్యతలో వెనుకబాటుతనం:** 36 రాష్ట్రాలూ కేంద్రపాలిత ప్రాంతాలలో మనది 32వ స్థానం. అది భారత సగటుకంటే 7 స్థానాల కింద. అక్షరాస్యతలో వెనుకబాటుతనానికి రాష్ట్ర ఆర్థిక వెనుకబాటుతనం కారణంకాదు. తెలుగు రాష్ట్రాల స్తూలజాతీయోత్పత్తి భారతరాష్ట్రాలలో రెండు మూడుస్థానాలకు పోటీపడుతోంది. తెలుగు రాష్ట్రాలలో ఇంగ్లీషు మాధ్యమం 1981-1991 మధ్యన ప్రవేశ పెట్టడం మొదలుపెట్టారు. అప్పటిదాకా మధ్యస్థంగా ఉన్నా 1991 నుండి నానాటికి తీసికట్టుగా మారి జాతీయ సగటు కంటే తగ్గి ప్రతి దశాబ్దం కిందికి జారుతూ ఇప్పుడు తెలుగురాష్ట్రాలు దక్షిణాది రాష్ట్రాలన్నిటికంటే తక్కువ అక్షరాస్యత కలిగివుండడమే గాక, అక్షరాస్యతలోనూ అభివృద్ధిలోనూ అట్టడుగునవున్న బీమారు (బీహారు, మధ్యప్రదేశ్, అరుణాచలప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్) రాష్ట్రాల వరుసలో చేరింది. ఇంకా చెప్పాలంటే మన పక్కనే ఉన్న ఒడిశా కంటే తక్కువలోకి దిగిపోయాం. మరి కారణం ఏమిటోనని వెదికితే అక్షరాస్యతలో మన తగ్గుబాటు ఇంగ్లీషు మాధ్యమం ప్రవేశంతో మొద లైనట్లు తెలుస్తోంది. అంటే అక్షరాస్యతలో తక్కువ ఆర్థికంలో ఎక్కువను ఎట్లా అర్థంచేసుకోవాలి.

పట్టిక-6 తెలుగు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్) అక్షరాస్యత స్థాయి భారతదేశ సగటు అక్షరాస్యత స్థాయితో తులనం

| జనాభా దశకం | భా.దే. అక్షరాస్యత% | సగటు రాంకు | తె.రా.ల లో అక్షరాస్యత% | తె.రా.ల రాంకు | దేశ-రాష్ట్ర రాంకుల తేడా |
|---|---|---|---|---|---|
| 1951 | 18.33 | (10) | - | - | - |
| 1961 | 28.30 | (14) | 21.19 | (21) | -06 |
| 1971 | 34.45 | (15) | 24.57 | (25) | -10 |
| 1981 | 43.57 | (18) | 35.66 | (23) | -05 |
| 1991 | 52.21 | (24) | 44.08 | (28) | -04 |
| 2001 | 64.84 | (23) | 60.47 | (29) | -06 |
| 2011 | 74.04 | (25) | 67.66 | (32) | -07 |




పటం-3 రాష్ట్రాలవారీ అక్షరాస్యతా గతి 1951-2011

**పట్టిక–7 రాష్ట్రాల వారీ అక్షరాస్యత (శాతాలలో) (1951-2011)**

| క్ర.సం. | రాష్ట్రాలు/ కేంద్రపాలితాలు | 1951 | 1961 | 1971 | 1981 | 1991 | 2001 | **2011 (P)** |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | బీహార్ | 13.49(13) | 21.95(18) | 23.17(29) | 32.32(30) | 37.49(34) | 47.00(36) | *63.82(36)* |
| 2. | అరుణాచల్ | NA(36) | 7.13(29) | 11.29(34) | 25.55(33) | 41.59(30) | 54.34(34) | *66.95(35)* |
| 3. | రాజస్థాన్ | 8.5(20) | 18.12(26) | 22.57(30) | 30.11(32) | 38.55(33) | 60.41(30) | *67.06(34)* |
| 4. | జార్ఖండ్ | 12.93(15) | 21.14(22) | 23.87(28) | 35.03(24) | 41.39(31) | 53.56(35) | *67.63(33)* |
| 5. | **ఆంధ్రప్రదేశ్** | **–(35)** | **21.19(21)** | **24.57(25)** | **35.66(23)** | **44.08(28)** | **60.47(29)** | ***67.66(32)*** |
| 6. | జమ్మూకాశ్మీర్ | –(34) | 12.95(28) | 21.71(31) | 30.64(31) | NA(35) | 55.52(33) | *68.74(31)* |
| 7. | ఉత్తరప్రదేశ్ | 12.02(17) | 20.87(23) | 23.99(27) | 32.65(28) | 40.71(32) | 56.27(32) | *69.72(30)* |
| 8. | మధ్యప్రదేశ్ | 13.16(14) | 21.41(20) | 27.27(22) | 38.63(21) | 44.67(27) | 63.74(25) | *70.63(29)* |
| 9. | ఛత్తీస్ గఢ్ | 9.41(19) | 18.14(25) | 24.08(26) | 32.63(29) | 42.91(29) | 64.66(24) | *71.04(28)* |
| 10. | అస్సాం | 18.53(9) | 32.95(11) | 33.94(17) | –(34) | 52.89(23) | 63.25(26) | *73.18(27)* |
| 11. | ఒడిషా | 15.80(11) | 21.66(19) | 26.18(23) | 33.62(26) | 49.09(26) | 63.08(27) | *73.45(26)* |
| మొత్తం | **భారతదేశం** | **18.33(10)** | **28.30(14)** | **34.45(15)** | **43.57(18)** | **52.21(24)** | **64.84(23)** | ***74.04(25)*** |
| 12. | మేఘాలయ | NA(33) | 26.92(16) | 29.49(21) | 42.05(20) | 49.10(25) | 62.56(28) | *75.48(24)* |
| 13. | కర్ణాటక | –(32) | 29.80(13) | 36.83(14) | 46.21(15) | 56.04(21) | 66.64(21) | *75.60(23)* |
| 14. | హర్యానా | –(31) | –(36) | 25.71(24) | 37.13(22) | 55.85(22) | 67.91(20) | *76.64(22)* |
| 15. | పంజాబ్ | –(30) | NA(35) | 34.12(16) | 43.37(19) | 58.51(17) | 69.65(16) | *76.68(21)* |
| 16. | పశ్చిమబంగ్లా | 24.61(5) | 34.46(10) | 38.86(11) | 48.65(14) | 57.70(19) | 68.64(19) | *77.08(20)* |
| 17. | దాద్రా నాగర హవేలి | –(29) | –(34) | 18.13(32) | 32.90(27) | 40.71(32) | 57.63(31) | *77.65(19)* |

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 18. | గుజరాత్ | 21.82(7) | 31.47(12) | 36.95(13) | 44.92(17) | 61.29(14) | 69.14(17) | *79.31(18)* |
| 19. | ఉత్తరాంచల్ | 18.93(8) | 18.05(27) | 33.26(19) | 46.06(16) | 57.75(18) | 71.62(14) | *79.63(17)* |
| 20. | మణిపూర్ | 12.57(16) | 36.04(7) | 38.47(12) | 49.66(13) | 59.89(16) | 70.53(15) | *79.85(16)* |
| 21. | నాగాలాండ్ | 10.52(18) | 21.95(17) | 33.78(18) | 50.28(11) | 61.65(13) | 66.59(22) | *80.11(15)* |
| 22. | తమిళనాడు | –(28) | 36.39(6) | 45.40(10) | 54.39(10) | 62.66(12) | 73.45(12) | *80.33(14)* |
| 23. | సిక్కిం | –(27) | –(33) | 17.74(33) | 34.05(25) | 56.94(20) | 68.81(18) | *82.20(13)* |
| 24. | మహారాష్ట్ర | 27.91(4) | 35.08(9) | 45.77(9) | 57.24(9) | 64.87(10) | 76.88(10) | *82.91(12)* |
| 25. | హిమాచల్ ప్రదేశ్ | –(26) | –(32) | –(36) | –(36) | 63.86(11) | 76.48(11) | *83.78(11)* |
| 26. | అండమాన్ | 30.30(3) | 40.07(5) | 51.15(8) | 63.19(7) | 73.02(8) | 81.30(7) | *86.27(10)* |
| 27. | ఢిల్లీ | NA(25) | 61.95(1) | 65.08(3) | 71.94(3) | 75.29(6) | 81.67(6) | *86.34(9)* |
| 28. | చండీగఢ్ | –(24) | NA(31) | 70.43(1) | 74.80(2) | 77.81(4) | 81.94(5) | *86.43(8)* |
| 29. | పాండిచ్చేరీ | –(23) | 43.65(4) | 53.38(5) | 65.14(6) | 74.74(7) | 81.24(8) | *86.55(7)* |
| 30. | డామన్ దీవ్ | –(22) | –(30) | –(35) | –(35) | 71.20(9) | 78.18(9) | *87.07(6)* |
| 31. | గోవా | 23.48(6) | 35.41(8) | 51.96(6) | 65.71(5) | 75.51(5) | 82.01(4) | *87.40(5)* |
| 32. | త్రిపుర | NA(21) | 20.24(24) | 30.98(20) | 50.10(12) | 60.44(15) | 73.19(13) | *87.75(4)* |
| 33. | మిజోరం | 31.14(2) | 44.01(3) | 53.80(4) | 59.88(8) | 82.26(2) | 88.80(2) | *91.58(3)* |
| 34. | లక్షద్వీప్ | 15.23(12) | 27.15(15) | 51.76(7) | 68.42(4) | 81.78(3) | 86.66(3) | *92.28(2)* |
| 35. | కేరళ | 47.18(1) | 55.08(2) | 69.75(2) | 78.85(1) | 89.81(1) | 90.86(1) | *93.91(1)* |

| క్ర.సం. | రాష్ట్ర/ కేంద్రపాలితాలు | ప్రాథమిక ఇం.మా. | ప్రాథమిక మా.మా. | ప్రాథమికోన్నత ఇం.మా. | ప్రాథమికోన్నత మా.మా. | మాధ్యమిక ఇం.మా. | మాధ్యమిక మా.మా. | మాధ్యమికోన్నత ఇం.మా. | మాధ్యమికోన్నత మా.మా. | మొత్తం పాఠశాలలు ఇం.మా. | మొత్తం పాఠశాలలు మా.మా. | ఇం./మా నిష్పత్తి | అక్షరాస్యత స్థాయి | స్థూజాఉ స్థాయి | జనాభాలో స్థాయి |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1. | బిహార్ | 10304 | 59261 | 3976 | 17245 | 1322 | 4440 | 183 | 458 | 15785 | 81404 | **1:5.5** | *63.82 36* | 2.93 14 | **03I** |
| 2. | అరుణాచలప్రదేశ్ | 1862 | - | 561 | - | 204 | - | 72 | - | 2699 | 0 | **2699:0** | *66.95 35* | 0.11 30 | **27II** |
| 3. | రాజస్థాన్ | - | 60490 | - | 32806 | - | 8871 | 192 | 3023 | 192 | 105190 | **1:547** | *67.06 34* | 4.70 9 | **08I** |
| 4. | ఝార్ఖండ్ | 3882 | 25764 | 1275 | 6877 | 416 | 1578 | 134 | 164 | 5707 | 34383 | **1:6** | *67.63 33* | 1.51 18 | **13I** |
| 5. | ఆంధ్ర ప్రదేశ్ | **7490** | **74654** | **5258** | **26075** | **3063** | **11801** | **1445** | **2689** | **17256** | **115219** | **1:6.6** | ***67.66 32*** | **7.57 4** | **05I** |
| 6. | జమ్మూకశ్మీర్ | 12684 | 25349 | 5081 | 8771 | 1811 | 2813 | 380 | 508 | 19956 | 37441 | **1:2** | *68.74 31* | 0.76 21 | **19I** |
| 7. | ఉత్తర ప్రదేశ్ | - | 131696 | 3550 | 39284 | 1614 | 11884 | 1107 | 7347 | 6271 | 190211 | **1:30** | *69.72 30* | 7.80 3 | **01I** |
| 8. | మధ్య ప్రదేశ్ | 5102 | 71032 | 3434 | 32880 | 1206 | 7747 | 694 | 3749 | 10436 | 115408 | **1:10** | *70.63 29* | 3.61 10 | **06I** |
| 9. | ఛత్తీసగఢ్ | - | 25637 | - | 7835 | 190 | 2617 | 135 | 1452 | 325 | 37541 | **1:115** | *71.04 28* | 1.65 17 | **16I** |
| 10. | అస్సాం | 5883 | 31340 | 2674 | 12196 | 1037 | 5482 | 291 | 863 | 9885 | 49881 | **1:5** | *73.18 27* | 1.38 19 | **14I** |
| 11. | ఒడిశా | 25145 | 44335 | 8792 | 18356 | 4273 | 13376 | 387 | 507 | 38597 | 76574 | **1:2** | *73.45 26* | 2.51 16 | **11I** |
| – | **భారత్** | 94453 | 896435 | 59672 | 351045 | 33276 | 136219 | 14736 | 40727 | 202137 | 1424426 | 1:6.5 | ***74.04 25*** | 93.88 1 | **-** |
| 12. | మేఘాలయ | 607 | 5811 | 1337 | - | 594 | - | 83 | - | 2621 | 5811 | **1:2** | *75.48 24* | 0.19 26 | **23II** |
| 13. | కర్నాటక | - | 51548 | 2078 | 22733 | 1922 | 7974 | 746 | 1475 | 4746 | 83730 | **1:18** | *75.60 23* | 5.22 8 | **09I** |
| 14. | హరియాణా | 3265 | 12194 | 2882 | 8458 | 2071 | 5822 | 850 | 1795 | 9068 | 28269 | **1:3** | *76.64 22* | 3.41 12 | **17I** |
| 15. | పంజాబు | 899 | 15598 | 890 | 7197 | 785 | 4410 | 534 | 1962 | 3108 | 29167 | **1:9.5** | *76.68 21* | 2.85 15 | **15I** |

| | | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 16. | పశ్చిమ బంగ్లా | - | 51179 | 644 | 9751 | 582 | 7595 | 349 | 2811 | 1575 | 71336 | **1:45** | *77.08 20* | 6.03 7 | **04I** |
| 17. | ఢిల్లీ | 1823 | 3307 | 1584 | 1922 | 1083 | 1394 | 801 | 955 | 5291 | 7578 | **1:1.4** | *77.65 19* | 3.34 13 | **18I** |
| 18. | గుజరాతు | - | 38723 | 1924 | 29857 | 899 | 6936 | 450 | 2294 | 3273 | 77810 | **1:24** | *79.31 18* | 6.58 6 | **10I** |
| 19. | ఉత్తరాఖండ్ | - | 14545 | 306 | 4788 | 224 | 1678 | 165 | 962 | 695 | 21973 | **1:31** | *79.63 17* | 1.08 20 | **20I** |
| 20. | మణిపుర్ | 1500 | 4914 | 925 | 1720 | 473 | 707 | 98 | 74 | 2996 | 7415 | **1:2.5** | *79.85 16* | 0.12 29 | **24II** |
| 21. | నాగాల్యాండ్ | 1817 | 1794 | 750 | 930 | 282 | 348 | 27 | 16 | 2876 | 3088 | **1:1.1** | *80.11 15* | 0.15 28 | **25II** |
| 22. | త్రిపుర | - | 3210 | 72 | 1034 | 45 | 613 | 20 | 260 | 137 | 5117 | **1:37** | *80.33 14* | 0.22 25 | **22II** |
| 23. | సిక్కిమ్ | 745 | 36 | 263 | 27 | 130 | - | 42 | 5 | 1180 | 68 | **17:1** | *82.20 13* | 0.10 31 | **31III** |
| 24. | మహారాష్ట్ర | - | 68150 | 2485 | 35891 | 2016 | 15540 | 709 | 3146 | 5210 | 122727 | **1:23** | *82.91 12* | 13.22 2 | **02I** |
| 25. | హిమాచలప్రదేశ్ | 2075 | 11478 | 1281 | 4105 | 860 | 2166 | 684 | 804 | 4900 | 18553 | **1:4** | *83.78 11* | 0.73 22 | **21II** |
| 26. | అండమాన్ నికోబరు | 75 | 316 | 45 | 149 | 34 | 106 | 20 | 52 | 174 | 623 | **1:4** | *86.27 10* | 0.05 33 | **32III** |
| 27. | తమిళనాడు | 7161 | 50980 | 5057 | 13518 | 4084 | 7074 | 2297 | 3146 | 18599 | 74718 | **1:4** | *86.34 9* | 7.44 5 | **07I** |
| 28. | చండీగఢ్ | 86 | 157 | 87 | 146 | 83 | 139 | 47 | 47 | 303 | 489 | **1:1.6** | *86.43 8* | 0.25 24 | **30II** |
| 29. | పాండిచ్చేరీ | 316 | 402 | 201 | 222 | 121 | 114 | 70 | 37 | 708 | 775 | **1:1** | *86.55 7* | 0.16 27 | **28II** |
| 30. | డామన్ దీవ్ | 8 | 47 | 5 | 35 | 7 | 17 | 3 | 5 | 23 | 104 | **1:5** | *87.07 6* | - 34 | **34III** |
| 31. | గోవా | 85 | 1263 | 427 | 36 | 361 | 30 | 75 | 6 | 948 | 1335 | **1:1.5** | *87.40 5* | 0.42 23 | **26II** |
| 32. | దాద్రా నగరహవేలీ | 25 | 248 | 31 | 134 | 13 | 37 | 3 | 5 | 72 | 424 | **1:6** | *87.75 4* | - 35 | **33III** |
| 33. | మిజోరం | 500 | 1049 | 341 | 668 | 348 | 133 | 43 | 8 | 1232 | 1858 | **1:1.2** | *91.58 3* | 0.08 32 | **29II** |
| 34. | లక్షద్వీప్ | - | 29 | 3 | 31 | 3 | 9 | 5 | 1 | 11 | 70 | **1:6** | *92.28 2* | - 36 | **35III** |
| 35. | కేరళ | 1114 | 9899 | 1453 | 5368 | 1120 | 2768 | 1595 | 101 | 5282 | 18136 | **1:3.5** | *93.91 1* | 3.47 11 | **12I** |

ఫిలిప్పిన్సు సాహితీవేత్త శాన్ జువాన్  ఇంగ్లీషుభాష గురించి చెబుతూ, ఇంగ్లీషు మధ్యవర్తిత్వం ద్వారానే ఫిలిప్పిన్సు అమెరికీకరణం జరిగిందని అంటారు. ఇదంతా అక్షరాలా విద్యా, వ్యాపార, ప్రభుత్వ  రంగాలలో అధికారిక మాధ్యమంగా ఆంగ్లం విస్తరించటం ద్వారానే జరిగింది. **సామాన్య పౌరులను, వారి మూలాల నుండి విడగొట్టి, ఆంగ్లో-సాక్సన్ ఆధిపత్యానికి తలవంచి సేవలు అందించే మధ్యతరగతి బుద్ధిజీవులను సృష్టించేందుకు వీలుగా, ఆంగ్లభాష ఒక ఉపకరణంగా, ఆశ, ఆకాంక్షలే ఆలంబనగా ఆంగ్ల మాధ్యమ బోధనా వ్యూహం రూపొందించబడింది.**

## 4.2 వలసవాదాలు- భారతదేశంలో వలసలు:

భారతదేశంలో వలసల గురించిన జనాభా గణాంకాలు (భారతదేశం, 2001 ప్రభుత్వం) కొన్ని ముఖ్యమైన నిజాలను తెలుపుతున్నాయి. వలసల గురించిన అనేక విషయాలు భాషాపరమైన పునరావాసం  వారి స్థితిగతుల గురించి అర్థం చేసుకోడానికి ఎంతో ముఖ్యమైనవి. బహుభాషా దేశంగా పేరుపొందిన మనదేశంలో, భాషకు సంబంధించి నంతవరకూ జనాభా వలసల అధ్యయనం దేశంలోని వివిధ ప్రాంతాల్లోని భాషలూ వారితోపాటు సమాజ స్థితి గతులను అర్థం చేసుకోవడానికి పనికివస్తుంది. దేశంలో,  ముఖ్యంగా పలు రాష్ట్రాల్లో వేగవంతమైన ఆర్థికాభివృద్ధి, ముఖ్యంగా  వస్తువుల తయారీ, సమాచార సాంకేతిక సేవా రంగాలలో పనిచేసేందుకు వలసవెళ్ళే జనం వారి భాషల గురించిన సమాచారం సందర్భోచితం అవుతుంది. భారతదేశంలో వలసపోయేవారు  ఎక్కువనీ, అందుకని ఇంగ్లీష్ వంటి ఒక సాధారణ ఉమ్మడి భాష ఒకటి అవసరమనీ తరచు మనం వింటుంటాం. అయితే, జనాభా గణాంకాల (2001) ప్రకారం, ఈ వలసలలో సుమారు 85% రాష్ట్ర పరిధులకే పరిమితం కాగా రాష్ట్రాల మధ్య వలసలు 13% మాత్రమేనని తెలుస్తోంది. ఇక దేశం వెలుపలి నుండి వలసలు 2% మాత్రమే. మరొక అధ్యయనంలో అంతర రాష్ట్రీయ వలసలు పొరుగునున్న రాష్ట్రాలకే ఎక్కువ పరిమితం. పనీ లేదా ఉపాధి అనేది 3% సందర్భాల్లో మాత్రమే వలసలకు కారణంగా ఉంది. ఇట్లాంటి వాస్తవాలు వలసదారుల భాషలలో ఎట్లాంటి గణనీయమైన మార్పునూ  కలిగించటం లేదు. అందుకే, విద్యాబోధనలో ఒక సాధారణ ఉమ్మడి మాధ్యమంగా ఆంగ్లం అవసరం అనే వాదనకు ఎట్లాంటి ఆధారమూ లేదు.

## 4.3 అంతర్జాతీయ వలసలు:

విదేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MOIA) ప్రకారం, భారతదేశం

ప్రపంచంలో కెల్లా రెండవ అతి పెద్ద ప్రవాసుల దేశం. దాదాపు 110 దేశాలలో 25 మిలియన్ల మంది నివసిస్తు న్నారు. ప్రవాస భారతీయులలో దేశాంతరం వెళ్లిన భారతీయులు, భారత సంతతివారు అని రెండు రకాలు. ఇటీవల వలసలలో అధిక నైపుణ్యం గలిగిన విద్యా వంతులు కొంతవరకూ ఉన్నా నైపుణ్యం లేనివారూ, ఎంతోకొంత వృత్తి నైపుణ్యం కలిగిన వారే ఎక్కువ శాతం. ప్రవాసభారతీయుల నుండీ భారతదేశానికి వచ్చే రాబడిలో వీరిదే ఎక్కువ శాతం.

భారతదేశం నుండి అంతర్జాతీయ వలసలు: ప్రధాన ప్రాంతాలవారీగా కింది పట్టికలో చూడవచ్చు.

| క్ర.సం. | **పట్టిక-9.** భారతదేశంనుండి అంతర్జాతీయ వలసలు | ప్రాంతాలవారీ % |
|---|---|---|
| 1. | గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ | 42% |
| 2. | ఇతర దక్షిణాసియాదేశాలు | 21% |
| 3. | యునైటెడ్ స్టేట్స్ | 12% |
| 4. | కెనడా | 4% |
| 5. | యునైటెడ్ కింగ్డమ్ | 5% |
| 6. | సంయుక్తఐరోపా (మహాబ్రిటన్ కాని) | 2% |
| 7. | ఇతరులు | 14% |




**పటం–4.** ప్రాంతాలవారీ భారతీయుల వలసలు

ప్రస్తుతం చాలామంది అనుకొనేది ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకుంటే అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్ లాంటి విదేశాలకు వెళ్లి అక్కడ ఉద్యోగాలు చేయవచ్చునని. కానీ ఈ వాదనలో ఉన్న లొసుగును తెలుసుకుంటే ఇది ఎంతటి అర్ధరహితమైన వాదనో తెలిసిపోతుంది. ప్రతి ఏడాదీ అమెరికా వెళుతున్నవారిలో 95% మందికి పైగా తాత్కాలికంగా వెళ్లివస్తున్నవారే. వీరివలన అమెరికాకు విపరీతమైన రాబడీ అక్కడి మార్కెట్లకు ఇబ్బడిముబ్బడిగా పెరిగే కొనుగోళ్లూ. ఇదీ అమెరికా వీసా పిచ్చి. చదువుకోసం వెళ్లే మనవాళ్లు ఖర్చుపెట్టేది లక్ష కోట్ల రూపాయలకు పైగానే. గత సంవత్సరం (2015) అ.సం.రా. ఒక కోటీ పధ్నాలుగు లక్షలకు పైగా వీసాలు ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తే అందులో 95.35 శాతం తాత్కాలిక వీసాలే. అంటే వివిధ దేశాలనుండి జనం అధికార అనధికార పర్యటనలకో, విద్యా వాణిజ్య వ్యాపారాలకోసమో పోతున్నారు. శాశ్వత వలసవీసాలు వీటిలో 4.65% మాత్రమే. వీటిలో విద్యార్థి వీసాలు (ప్రపంచవ్యాప్తంగా) 6.77లక్షలు (6%) మాత్రమే (ఇక వీటితో ఏటా అమెరికాకు వచ్చే ఆదాయం రెండున్నర లక్షల కోట్లకు పైనే). ఐతే, ఈ మొత్తం వీసాలలో 25% జనాభా కలిగిన ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాలూ యూరపు, యూరేశియా దేశాలకు 50 శాతం వీసాలు ఇచ్చి ప్రపంచ జనాభాలో 26% ఉన్న భారతదేశంతో కూడిన దక్షిణమధ్య ఆసియాకు 8.72% వీసాలు మాత్రమే ఇవ్వటం అంటే అమెరికావారి పక్షపాతానికి నిదర్శనం. ఇక విద్యార్థి వీసాలలో 10 నుంచి 15 శాతం (60-70 వేలు) భారత దేశానికి దక్కుతున్నాయి. ఇట్లా అమెరికా వెళ్లగోరే విద్యార్థులలో, ప్రపంచంలోని పది అగ్రగామి పట్టణాలలో ఎనిమిది మనదేశం లోనివే. ఐతే, ఆశ్చర్యం కలిగించే విశేషం ఏమంటే, మొదటి ఐదింటిలో నాలుగు తెలుగు రాష్ట్రాలలోనే ఉన్నాయి. (విజయవాడ, విశాఖపట్నం, చెన్నై, హైదరాబాదు, సికింద్రాబాద్, పూనే, టెహరాన్, బెంగళూరు, కోల్కత, ఢాకా మొ.) ఇక మనదేశం నుంచి విద్యార్థులుగా వెళ్లేవారిలో సగంమందికైనా స్కాలర్షిప్పులు వచ్చినా మిగిలినవారి ఫీజులకూ ఉండటానికీ అయ్యే ఖర్చు మొత్తం లక్షకోట్ల రూపాయలకుపైనే.

“భారతీయ విద్యార్థులకు...ఇంగ్లండులో స్కాలర్షిప్పులు పొందడం ఊహించ నంతగా కష్టమే కాక ఒక యు.కె. పౌరుడు చెల్లించిన దానికంటే మూడు రెట్లు ఎక్కువ రుసుము చెల్లించాలి. అందుకనే ఎక్కువమంది అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వెళ్లడానికి ఇష్టపడతారు”, అని భారతదేశం యొక్క వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి, నిర్మల సీతారామన్, ఈ నెల లండన్‌లో ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ అన్నారు.

| క్ర.సం. | పట్టిక–10 అమెరికా సంయుక్తరాష్ట్రాల వీసావిధానం (2015) | | |
|---|---|---|---|
| 1. | మొత్తం వీసాలూ– ప్రాంతాలూ | వర్గాలవారీ వీసా పంపిణీ (శాతం–లోటు) | ప్రపంచంలో ప్రాంతాలవారీ జన |
| 2. | మొత్తం వీసాలు | 1,14,23,208 | – |
| 3. | తాత్కాలిక వీసాలు | 1,08,91,745 (95.35%) | – |
| 4. | వ్యాపారవాణిజ్య వీసాలు | 85 లక్షలకుపైగా (85%) | – |
| 5. | విద్యార్థి వీసాలు | 6.77లక్షలు (6%) | – |
| 6. | శాశ్వత వలస వీసాలు | 5, 31,463 (4.65%) | – |
| 7. | ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాలు | 44,82,630 (39.24%+26.24) | 13% |
| 8. | యూరపు, యూరేశియా | 11,15,116 (9.76%–2.25%) | 12% |
| 9. | మధ్యధరా దేశాలు | 6,39,413 (5.60%,+0.6%) | 5% |
| 10. | తూర్పుఆసియా పసిఫిక్–దేశాలు (25ల. చైనాతోసహా) | 32,81,441 (28.73%–3.27%) | 32% |
| 11. | దక్షిణమధ్యఆసియా (భారతదేశం8.50ల.) | 9,95,672 (8.72%–17.28%) | 26% |
| 12. | ఆఫ్రికా దేశాలు | 3,59,569 (3.15%–8.85%) | 12% |

## 4.4 విదేశాలనుంచి రాబడి:

ప్రపంచవ్యాప్తంగా సుమారు యాభై లక్షల మంది భారతీయ పనివారు విదేశాల్లో పనిచేస్తున్నారు వీరిలో 90% గల్ఫ్ దేశాలలోనూ ఆగ్నేయ ఆసియాలోనూ ఉన్నారు. ఇక, 2014 లెక్కలప్రకారం దాదాపు 8.04 లక్షల మంది పనివారు భారతదేశం నుండి విదేశాలకు వలస వెళ్లారు. వీరిలో 3.29 లక్షలమంది సౌదీ అరేబియాకు, 2.24 లక్షలమంది సంయుక్త అరబ్బు అమీరేట్లకు (యు.అ.ఎ.), 0.75 లక్షలు ఖతర్ కూ, 0.51 లక్షలమంది ఒమాన్‌కు, 0.22 లక్షలమంది మలేషియాకు వెళ్లారు. మిగిలిన ఒక లక్షా మూడు వేలమంది అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, మొదలైన దేశాలకు వెళ్లారు. ఇట్లా వెళ్లినవారిలో ఎక్కువగా ఉత్తరప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, బీహార్, కేరళ, తమిళనాడు, మొదలైన రాష్ట్రాలవారే ఉన్నారు.

మనదేశంనుండి విదేశాలకు భారతీయ సేవల ఎగుమతుల గణనీయమైన పాత్ర చాలా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. ఐతే విదేశాలలోని భారతీయులు దేశానికి పంపే ఆర్థికవనరుల సంపదను అంతగా ఎవరూ పట్టించుకోలేదు. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక వలసవాసుల చెల్లింపులను స్వీకరించే దేశాలలో ఒకటిగా ఉంది. వ్యక్తిగత చెల్లింపులూ లేక బదిలీలు స్థూల జాతీయోత్పత్తికి నికరంగా 4% సంపాదించిపెడుతున్నాయి.

2012 లో భారతదేశానికి చేరిన నికర వ్యక్తిగత చెల్లింపులు సుమారు 4 లక్షల74 వేల 565 కోట్ల వరకూ ఉంది. ఇది తెలుగు రాష్ట్రాల స్థూలజాతీయోత్పత్తిలో సగం.

ఈ విషయంలో, సాంప్రదాయకంగా గల్ఫ్ దేశాలనూ ఉత్తర అమెరికాని రెండు ఆర్థిక ప్రాబల్యంగల ప్రదేశాలుగా గుర్తించాలి. ఉదాహరణకు 2008-09లో భారతదేశానికి వచ్చిన చెల్లింపుల-స్వీకరణ సర్వే ఆధారంగా చేసిన అంచనాలు ఇట్లా ఉన్నాయి:

| క్ర.సం. | పట్టిక-11 ప్రవాస భారతీయుల వలస దేశం | చెల్లింపుల % |
|---|---|---|
| 1. | గల్ఫ్ దేశాలు | 30.80% |
| 2. | ఉత్తర అమెరికా | 29.40% |
| 3. | యూరోప్ | 19.50% |
| 4. | ఇతర దేశాలు | 20.30% |

అయితే, అ.సం.రా. కెనడా, యూరోప్ వలస పోయినవారు అధిక నైపుణ్యం కలవారు అనీ మరోవైపు, గల్ఫ్ దేశాలకు వలస పోయినవారు ఎక్కువగా అర్ధనైపుణ్యం లేదా నైపుణ్యతపెద్దగా అవసరం లేని పెట్రోలియం, నిర్మాణం, ఇంకా సేవలూ పరిశ్రమలలో నిమగ్నమై ఉన్నట్టుగా కొంతమంది నమ్మకం. ఐతే, ఈ మొత్తంలో సాఫ్ట్‌వేర్, ఐటీ నిపుణుల భాగస్వామ్యం సంఖ్యాపరంగా 26 ప్రముఖంగా కనిపిస్తున్నా ఇతర వృత్తులవారి చెల్లింపులే ఎక్కువగా (74%) కనిపిస్తున్నాయి. వృత్తి సాఫ్ట్‌వేర్ నిపుణుల భాగస్వామ్యం వివిధ దేశాలవారీ ప్రాతినిధ్యం ఇట్లా ఉంది:

గల్ఫ్ దేశాల్లో సాఫ్ట్‌వేర్–సంబంధిత సేవల నియామకం అమెరికా కంటే గణనీయమైన పరిమాణంలో ఉండటాన్ని గమనించండి. అమెరికాపై ఇప్పటివరకూ మనకున్న అవగాహన ఈ ఆధారాలను బట్టి ఎట్లా అర్థం చేసుకోవాలి.

## 5.0 స్థానిక భాషల ఆధారిత పరిశ్రమలు:

భాషా పరిశ్రమ ఒక పెద్ద వ్యాపారం. గత 15 సంవత్సరాలుగా ఈ ప్రపంచీకరణ స్థానికీకరణ సందర్భాలలో భాషాసేవలూ ఉత్పత్తుల పరిశ్రమ అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ. అనువాదం, భాషా శిక్షణ, యంత్రానువాదం, బహుభాషీయ అంత ర్జాలానికి సంబంధించి ఉత్పత్తులూ సేవల ఆవశ్యకత గణనీయంగా విస్తరించింది. అనేక పరిశ్రమల రంగాల్లో వ్యక్తులూ సంస్థలూ ప్రభుత్వం, సాంకేతిక, వైద్య, చట్టపరమైన కార్యకలాపాలలోనూ, ఆర్థిక శాస్త్ర విధులలోనూ, ఆసుపత్రులూ, న్యాయస్థానాలూ, పాఠ శాలలూ విశ్వవిద్యాలయాలూ, ప్రభుత్వ కార్యాలయాలూ, సైనిక స్థావరాలలో అనువాద కులూ, వ్యాఖ్యాతలూ భాషాసాంకేతిక తంత్రజ్ఞులూ, శిక్షకులూ ఇతర భాషా సేవల నిపుణుల అవసరాలు ప్రత్యేకంగా గుర్తింపు పొందాయి.

భాష ఒక పరిశ్రమగానూ పెద్ద వ్యాపారంగానూ పరిణామం చెందింది. భాషా సేవలు ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లో 5.52% వార్షిక రేటు చొప్పున పెరుగుతున్నాయి. కొత్తతరం స్థానీకరణ కేంద్రం స్థానికీకరణాన్ని అమెరికా సంయుక్తరాష్ట్రాలలో 4 వ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమగా పేర్కొంది. ఇంకా, కొత్తగా వ్యాపారం మొదలుపెట్టేందుకు భాషా పరిశ్రమ నేటి అగ్రశ్రేణి వ్యాపార పరిశ్రమల జాబితాలో ఒకటిగా గుర్తింపుపొందింది. ఈ పరిశ్రమ భిన్న సాంకేతిక పద్ధతులపై ఆధారపడి నడుస్తోంది. రోడురోజుకూ పెరుగు తున్న దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగానూ ప్రాంతీయంగానూ రెండు ఆర్థికవ్యవస్థలపైనా కనబడుతోంది.

2016 లో మొత్తం ప్రపంచ భాషా పరిశ్రమ సేవలూ ఉత్పత్తుల విలువ షుమారు 2 లక్షల 70వేల కోట్ల రూపాయలు. ఏడాదికి వృద్ధి రేటు అంచనా 6.5-7.5% గా ఉంది. ఇంకా, భాషా సాంకేతిక పరిశ్రమ షుమారు 2 లక్షల కోట్ల రూపాయల వరకూ ఉండవచ్చని అంచనా. సంయుక్త ఐరోపా డైరెక్టర్ జనరల్ నివేదిక ప్రకారం, 2012 లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 3 లక్షల30 వేల భాషా సాంకేతిక నిపుణులు భాషా పరిశ్రమలో పనిచేస్తున్నారని లెక్కగట్టింది. **బహుభాషా దేశమైన భారతదేశానికి భాషావైవిధ్యాన్ని కాపాడుకోవటానికీ భాషావైవిధ్యంతో ఉపాధీ ఉద్యోగావకాశాలను విస్తృతంగా అందించే పరిశ్రమగా ప్రభుత్వాలు గుర్తించాలి. ఆంగ్లమాధ్యమ విస్తరణ భారతీయభాషలను కబళించే దిశలో నడుస్తోంది. ఇది మన భవిష్యత్ ఉపాధీ ఉద్యోగావ కాశాలను దెబ్బతీస్తుంది.**

## 5.1 ముద్రణా పరిశ్రమ:

భారత ముద్రణా మార్కెట్ అత్యంత వేగంగా అభివృద్ధిచెందుతున్న ఆర్థిక రంగం. భారతదేశం లో సుమారు 2 లక్షల 50వేల ముద్రణదారుల ఉన్నారు. అచ్చు పరిశ్రమ గత దశాబ్దంలో గణనీయంగా ఆధునీకరణ చెందింది. భారత ముద్రణా మార్కెట్ 2016 కి 2 లక్షల కోట్ల రూపాయలు విలువ చేసే వ్యాపారానికి చేరింది. ఇది మన దేశ జిడిపి వృద్ధి వేగాన్ని అధిగమించింది. భారతదేశంలో ప్రింటింగ్ పరిశ్రమ- వార్తాపత్రికలు (70,000 పైనే), పుస్తకాలు, తదితరాలతో అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా తయారయింది. ఈ పరిశ్రమలో 25 లక్షలకు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. భారతదేశంలో ముద్రణా రంగం బహుముఖీన వ్యాపారంతో దినదినాభివృద్ధి చెందుతోంది. సరుకుల ప్యాకేజీ కాగితాల ముద్రణ15 శాతంవరకూ, ప్రకటనా లేబుళ్ల ముద్రణ 10 వేల కోట్ల రూపాయల వ్యాపారంవరకూ చేరింది. ప్రకటనల ముద్రణ 18 వేల కోట్ల రూపాయల వ్యాపారం వరకూ చేరింది. వీటిలో 60 శాతం పైగా ముద్రణ భారతీయ భాషలలోనే.

## 5.2 సినిమా పరిశ్రమ:

ఒక లక్షా 15 వేల కోట్ల రూపాయల వ్యాపారంతో ( ఫిక్కి 2014), భారతదేశంలో ఆర్థిక పరిపుష్టికి తోడు శక్తివంతమైన ఆకర్షణ కలిగిన వినోద మాధ్యమ పరిశ్రమ. 600 పైగా టెలివిజన్ ఛానళ్లు, 10 కోట్ల పే-టీవీ గృహాలు, ఏటా 1,000 పైగా చిత్రాలతోనూ, 10,000 కుపైగా సినిమా హాళ్లతోనూ ఆకర్షణీయమైన అభివృద్ధి

అవకాశాలతో సరళీకృత ఆర్థిక విధానాలతో రెండంకెల వార్షిక వృద్ధితో అంతర్జాతీయ విపణిసీమను ఆకర్షిస్తోంది. సినిమాహాళ్ల సంఖ్యలో అసంరా. (40,194), చైనా (36, 112) తర్వాత ఇండియా 10,189తో మూడవస్థానంలో ఉన్నా ముందు ముందు పెరగడానికి విపరీతమైన అవకా శాలు ఉన్న రంగం ఇది. ఇంకా, ఇటీవల సంవత్సరాల్లో, **శీఘ్రగతిని పెరుగుతున్న మధ్య తరగతి జనాభా, నూతన బహుళజాతి కంపెనీలు దేశంలోకి పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వనరులు విరివిగా ఉన్న నాటు భాషలపై ఆధారపడిన దేశీ పరిశ్రమ ఇది.** ఏడాదికి పదివేల కోట్ల రూపాయల బాక్సాఫీసు కలెక్షన్లతో ప్రపంచంలో 5వస్థానంలో ఉంది. ఐతే సినిమా ప్రేక్షకుల సంఖ్యలో 300 కోట్లు దాటింది. (ప్రపంచంలో అత్యధికంగా అసంరా. 130కోట్లు). **డజన్లకొద్దీ కథా, గీత రచయితలూ, గాయకులూ, దర్శకులూ, నిర్మాతలూ, వందలాది నటీనటులూ, వేలాది సాంకేతిక సిబ్బందితో దేశంలోనే అత్యంత ప్రభావశీల పరిశ్రమగా పేరుపొంది 20 లక్షలమందికి జీవనోపాధిని కల్పిస్తోంది. ఇది పూర్తిగా దేశీయ భాషలపై ఆధారపడి లక్షలాదికి జీవనోపాధి కల్పిస్తున్న పరిశ్రమ.**

## 6.0 ముగింపు :

ప్రస్తుతం చదువుకోడానికీ, ఉద్యోగావకాశాలకూ సాంప్రదాయ పిరమిడ్ విధానాన్ని అనుసరిస్తున్నాం. అంటే ఈ విధానంలో **అవసరాలు అత్యధికం గానూ పంపిణీ అత్యల్పం గానూ ఉన్నప్పుడు పిరమిడ్ విధానం ఏర్పడుతుంది. ఉన్న కొన్ని అవకాశాలు కొందరికే సమకూడుతాయి. అందరికీ అవకాశాలు సమస్థాయిలో అందేటట్లుగా చేయాలంటే అవకాశాలను పెంచాల్సి వుంటుంది. దీన్ని సరిచేసే మార్గాలలో ఒక్కటి వైవిధ్యీకరణం. అంటే మనం చేసే పనులలో వీలైనన్ని రకాల మార్పులు తీసుకురాగలగడం. ప్రపంచీకరణ అంటే ఆంగ్లీకరణ కాకుండా స్థానికీకరణ జరగాలి.** అంటే ప్రపంచంలోకి కొత్తగా వచ్చే ప్రతిదీ అందరికీ అందుబాటులోకి రావాలి. ఒక వస్తువును గురించిన సమాచారం స్థానిక భాషలో ఉండాలి. ఉదాహరణకు, రకరకాల అంగళ్లూ, దుకాణాలూ కొట్లూ షాపులూ సంస్థల పేర్లు తప్పనిసరిగా ఆయా రాష్ట్రాలను బట్టి రెండూ అంతకంటే ఎక్కువ భాషలలో ఉండాలి అనే చట్టం వలన పేర్లపలకలు తయారీలో ఉద్యోగావకాశాలు రెట్టింపు అవుతాయి. అట్లాగే మనం తయారుచేసేవి గానీ, దిగుమతులద్వారావి గానీ వచ్చే అన్ని ఉత్పత్తులకూ తప్పకుండా స్థానిక భాషలలో ప్రకటనల లేబుళ్లు ఉండాలనే చట్టంతో స్థానిక భాషలో అనువాదకులకూ, రాసేవారికీ, అచ్చువేసేవారికీ ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

ప్రపంచంలోని ఎక్కడి ఉత్పత్తి అయిన వస్తువైనా ఇక్కడ అమ్మాలంటే ఇక్కడి భాషలో తప్పక ఉండాలి అనేది మన వాణిజ్య విధానం కావాలి. ఇప్పటివరకూ 2లక్షలకోట్ల వ్యాపారంలో 15శాతం మాత్రంగా ఉన్న ప్రకటనా లేబుళ్ల ముద్రణా వ్యాపారం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి ఉద్యోగావకాశాల్ని పెంచుతుంది. ఇదంతా భాషావైవిధ్యం ద్వారానే సాధ్యం. **పాఠశాల స్థాయిలో ఇంగ్లీషుమాధ్యమం ఈ వైవిధ్యాన్ని నాశనం చేస్తుంది. అంతేకాదు వందలాది స్థానీయ సాంప్రదాయ వృత్తివ్యాపారాలను ఆధునీకరించి వేలాది మందికి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు మాతృభాషలద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది. స్థానిక భాషలలో విద్యాబోధన, వృత్తివ్యాపారాలూ వాణిజ్యం, పరిశ్రమలను చవకగానూ, సులువుగానూ ఎక్కువమందిని కలుపుకుంటూ నిర్వహించే వీలు కలుగుతుంది.**

2026 కి, భారతదేశం జనాభాలో 80% పైగా 15–59 మధ్య వయస్కులే ఉంటారు. అప్పటికి ప్రపంచ పనివారిలో 25% మంది భారతీయులే ఉంటారు. అంటే ప్రతి నలుగురిలో ఒకరు భారతీయులే. ఉద్యోగాల కోసం విపరీతమైన ఒత్తిడి తప్పదు.

భాషావైవిధ్యాన్ని కాపాడుకుంటేనే విద్యా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి. మాతృభాషా మాధ్యమంతో వ్యవహార నైపుణ్యాలనూ ఇంగ్లీషూ ఇతర భాషలలో నైపుణ్యాన్నీ సంపాదించటం సులువు అవుతుంది.

# 5

# తెలుగు వాడుకపై కొన్ని ప్రశ్నలూ సమాధానాలూ

**1. భాష పట్ల ప్రభుత్వాల నిర్ణయాలలో శాస్త్రీయత ఎంత?**

ప్రభుత్వాలు ముందుచూపుతో సక్రియంగా క్రియాశీలంగా ఉండాలి అని ప్రజలు అనుకోవడంలో తప్పులేదు. ప్రజలు వోటువేసి ప్రభుత్వాలను ఏర్పాటుచేశారు. ప్రభుత్వాలు ప్రజలకు చేయాల్సిన పనులను తామే అన్నీ 'అనుకొని' చేయగూడదు. ఆయా రంగాలలో ప్రావీణ్యం, నైపుణ్యం ఉన్నవారితో సలహా సంఘాలను ఏర్పరిచి అవి చెప్పిన ప్రకారం నడుచుకోవాలి. తెలుగును ప్రోత్సహించడం అటుంచి ఇంగ్లీషును రుద్దడానికి ప్రయత్నించ డంలో ఏ భాషాశాస్త్రజ్ఞుడూ సలహా ఇచ్చి వుండడనుకుంటాను.

**2. భాషగురించి ఎందుకు ఇంత ఆక్రోశం ?**

బోధన మాధ్యమంగా ఇంగ్లీషు తెలుగును తొలగించే ప్రయత్నం చేస్తోంది. అందుకే ఈ ఆక్రోశం. ఒకనాడు, సంస్కృత ప్రాకృతాలను వాడినా, అవి కొన్ని రంగాలకే పరిమితం. తెలుగును ఆక్రమించే ప్రయత్నం చేయలేదు, పరిపుష్టం చేశాయి. మాతృభాషలకు ముప్పు తెస్తున్న ఇంగ్లీషు మాధ్యమం నుండి విముక్తికి మరో స్వాతంత్ర్య పోరాటం తప్పదు. మాతృభాష వేల సంవత్సరాల మన సాంస్కృతిక వారసత్వానికి వారధి. జీవవైవిధ్యంలో భాషకూడా ఒక భాగమే. అది చెరిగినా చెదిరినా తరతరాల నాగరికత మాసిపోతుంది. భాషా ధ్వంసం జీవధ్వంసమే. భాషా వికాసం సామాజిక వికాసం కలిసిమెలిసి నడుస్తాయి. భాషలో ప్రతి అణువూ మన సామాజిక చేతనత్వాన్నీ, మన నడవడికనూ, జాతి జీవనాన్నీ ప్రతిబింబిస్తాయి. మన మాటా మంతీ, తెలుగు పదం పలుకుబడీ మన ఉనికికే ఆనవాళ్లు. ప్రాణులన్నీ బతకడం కోసం తింటే, మనిషి లక్ష్యం కోసం కూడా బతుకుతాడు. లక్ష్యానికి బాసట భాష. **ఈ చరాచర జీవరాశిలో మనిషి ఒక్కడే భాషకు ఆధారమైన జన్యువుల్ని వారసత్వంగా పొందాడు. అమ్మనుండి సంక్రమించిన ఈ జీవం అమ్మనుడితో నిండుదనాన్ని పొందుతుంది.**

**తల్లి ఒడిలో పసిప్రాయంలో నేర్చిన మాట జ్ఞాన వికాసానికి పాదు.** ఇప్పుడు చెప్పండి, మన భాషలో మనం చదువుకునే హక్కు ఉండాలనుకోవడం తప్పా? తెలుగువారు అందరూ తెలుగు భాషపట్ల కొన్ని నిర్దుష్టమైన అభిప్రాయాలు కలిగివుండాలి.

**3. అసలు సిసలైన తెలుగు ఎక్కడ? అందరూ ఇంగ్లీషు పదాలతోనో సంస్కృత పదాలతోనో కలిసిన తెలుగే మాట్లాడుతున్నారు.**

తెలుగు మాట్లాడేటప్పుడు ఇంగ్లీషు పదాలనూ కొన్నిసార్లు ఇంగ్లీషు వాక్యాలను కలిపి మాట్లాడటమనేది 'తప్పు' అని అంత తేలికగా కొట్టిపారెయ్యలేము. ఇది చాలా సంక్లిష్ట విషయం. కారణాలు సవాలక్ష. ప్రధాన కారణం మాతృభాషామాధ్యమం తగ్గుతుండడం, దినసరి కార్యక్రమాలలో కొందరికి ఇంగ్లీషు ఎక్కువగా వాడవలసిరావడం. అందరం మాతృభాషామాధ్యమంలో చదువుకొనివుంటే ఇంతగా కలగాపులగం చేసి మాట్లాడమేమో. నిన్నటి మహాకవులు శ్రీశ్రీ, జాషువా, విశ్వనాథ, దాశరథి, సి.నారె. గానీ ఇంకా మొన్నటి పోతన, శ్రీనాథుడూ నన్నయగానీ సంస్కృతభూయిష్టమైన తెలుగును వాడినప్పుడు ఇట్లాగే అనేవాళ్లమా? ఇతర భాషాసంపర్కంతో భాష పరిపుష్టం ఔతుంది. ఐతే, మాతృభాషను వీలైనంతవరకూ అన్ని రంగాలలోనూ వాడుతుండాలి. దేనినైనాసరే వాడుతుంటే సానబెట్టినట్లే.

నిజంగా చెప్పాలంటే ఏది తెలుగు పదమో ఏది కాదో వాటిగురించి చదువుకున్నవాళ్లకు తప్ప తెలియదు. ఇంగ్లీషుకూడా మనకు వచ్చుగాబట్టి ఇంగ్లీషును కలిపి వాడుతున్నాం. మాతృభాషా మాధ్యమాన్ని తగ్గించి తెలుగు వాడుకను తగ్గించటంతో ఇంగ్లీషువాడుక ఎక్కువవుతోంది. అందుకనే విద్యాబోధన తెలుగు మాధ్యమంలోనే ఉండాలని మొత్తుకొనేది. ఇక ఇంగ్లీషో లేక ఇంకో భాషా పదమో అసలు లేకుండా తెలుగులో మాత్రమే మాట్లాడ మనడం, అట్లాంటివాటికి పోటీలు పెట్టి ప్రోత్సహించడం అనాలోచిత చర్యలు. భావప్రకటన తెలుగులో ఉండాలేగానీ అది ఎట్లాంటి తెలుగూ ఎవరి తెలుగూ అని ఉండకూడదు. అన్ని రకాల తెలుగులూ అవసరమే. ఇంగ్లీషు కలిపి మాట్లాడడంకూడా ఒక మాండలికతే. అట్లా కొందరు కొన్ని చోట్ల వాడుతుండవచ్చు. మన సమాజంలో అనేక రంగాలలో పనేచేసేవారు ఉన్నారు కాబట్టి ఇది తప్పదు. ఐతే ఎక్కువమందికి అర్థమయ్యే తెలుగులో మాట్లాడడానికి ప్రయత్నించాలి. మాతృభాషా మాధ్యమం ఒక్కటే దీనికి సరైన మందు.

కొత్త పదాలను వద్దనవద్దు. ప్రజల వాడుకే వాటికి కొలమానం. నిలవగలిగినవి

నిలుస్తాయి అట్లా లేనివి పోతాయి. కొన్ని సార్లు అవి ఎప్పుడో ఉపయోగపడవచ్చు. మనం సృష్టించుకున్న పదం నిలబడాలంటే చిన్నదిగానూ ఉన్నపదాలలో కలిసిపోయేది గానూ ఇంకా అర్థమయ్యే రీతిలో ఉంటే చాలు. ఉదా. కంప్యూటర్ ను మహా గణక యంత్రం అనకుండా సంగణకం అంటే 'కంప్యుటర్' అనీ, గణనం అంటే 'కాంప్యుటేషన్' అనే అర్థంలో వాడుక చెల్లుబాటుకావచ్చు. వీటిలో ఉన్న గణ మనకు పరిచయం ఉన్న 'లెక్క' అనీ, -క అంటే చేసేది అనీ, -న అంటే చేత అనీ తెలుగువారికి అర్థమయ్యే విధానం ఇది. అనేక సంస్కృత పదాలలో, ఉదా. పాలన, పాలక, దర్శన, దర్శక, సాధన, సాధక, మొద.వాటిలో ఉండే ప్రత్యయాలే ఇవి.

**4. "ఇంటర్మీడియేట్ విద్య వరకూ మాతృభాషా మాధ్యమమే ఉండాలనీ అదీ ప్రభుత్వ బడులూ, ప్రైవైటు బడులూ కార్పోరేట్ బడులూ అనే తేడాలేకుండా అందరికీ తెలుగు మాధ్యమంలోనే విద్యను అందించాలని చట్టం ఎందుకు చేయకూడదు?"**

ఔను, అట్లాంటి చట్టం ఉండాలి. బోధనా మాధ్యమంగా మాతృభాషా మాధ్యమమే ఉండాలనుకోవడం ఆరోగ్యవంతమైన సమాజ లక్షణం. అందులో ప్రైవైటు బడులూ కార్పోరేట్ బడులూ అనే తేడాలేకుండా అన్నింటా ఒకే మాధ్యమం మాతృభాషామాధ్యమం ఉండాలి. ఇది ఇట్లాగే ఉండాలి అనే చట్టం చేయడం భారత రాజ్యాంగ పరిధిలో హక్కుల ఉల్లంఘన ఔతుంది. ఐతే అందరినీ ఒప్పించి సామాజికపరమైన ఒక మంచి ఆలోచనా ఒరవడిలో చట్టం చేయాల్సివుంది.

**5. విద్యావంతులైన తల్లిదండ్రుల అలోచనా విధానంలో మార్పు ఎప్పుడు వస్తుంది?**

ఈ ప్రశ్నను కొద్దిగా మార్చుదాం. తెలుగువారి ఆలోచనా విధానంలో మార్పు ఎప్పుడు వస్తుంది?

ఇంకా, ఎప్పుడు వస్తుందనే ప్రశ్న కంటే ఎలా వస్తుంది అనేదే ముఖ్యం.

ఇట్లాంటి బానిస సమాజంలో పుట్టిపెరిగిన పిల్లలకు ఎలాంటి అవగాహనా ఉండదు. ఈ అవగాహనను కలిగించాల్సినది తల్లిదండ్రులే. అందుకని తల్లిదండ్రులే ముందుగా ఈ బానిసత్వంనుండి బయటపడాలి. దానికోసం మాతృభాషా మాధ్యమాన్ని చట్టపరిధిలోకి తెచ్చేటట్లు కృషిచేయాలి. ఎవరికివారు తెలుగు వాడకాన్ని ప్రోత్సహించాలి. తెలుగురాష్ట్రాలలో తెలుగే మాట్లాడుదామని నిర్ణయం తీసుకోవాలి.

**6. అసలు మార్పు ఎందుకు రావాలి? జరుగుతున్నదాన్ని జరగనివ్వచ్చుగదా.**

జనాభాలో ప్రపంచంలో 15 దేశాలే మనకంటే పెద్దవి కాగా, విస్తీర్ణంలో షుమారు

120 దేశాలు తెలుగు రాష్ట్రాలకంటే చిన్నవి. కోట్లకొద్దిగా వున్న తెలుగు జనం భాషను మార్చుకోడం అంటే ఏమిటో ఊహించగలరా?

షుమారు రెండుకోట్లమంది విద్యార్థులు ఇంగ్లీషు మీడియంలోకి మళ్లడమంటే ఏమిటో ఊహించగలమా? ఈ యేడు ఇంగ్లీషు మీడియం మొదలుపెడితే 15 యేండ్లకి మొదటి బ్యాచీ బయటికి వస్తుంది ప్రస్తుత అంచనాల ప్రకారం మూడింట రెండింతలు తప్పడమో మధ్యలో విద్యను వదిలిపోవడమో జరుగుతోంది. ఇప్పుడు ఇంగ్లీషు మీడియంలో చదివిన ఒక కొత్తరకం జనాన్ని తయారు చేస్తున్నాం. వీళ్లకీ మిగిలినవాళ్లకీ మధ్య మాటల్లోనూ, చేతల్లోనూ, నడవడికలోనూ, దేశంపట్లా, జనంపట్లా అభిప్రాయాలకూ, విశ్వాసాలకూ, నమ్మకాలకూ ఎక్కడా పొంతన ఉండదు. ఇది వారిమధ్య సంఘర్షణకు దారి తీస్తుంది. ఈ సంఘర్షణలు ఇంటా బయటా ప్రతిచోటా ఉంటాయి. ఇది మారి మామూలు కాలం రావడానికి అంటే అందరూ ఇంగ్లీషుకు మళ్లడానికి పట్టే కాలం షుమారు 70 యేళ్లు. ఆలోచించండి. ఈ లోపల ఈ ఘర్షణలు అనేక ఘోరాలూ నేరాలకు దారితీస్తాయి.

ఇట్లా మాతృభాషను మార్చుకోవలసిరావడాన్ని తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా చూడాలి. దీన్ని విద్యా హక్కు ఉల్లంఘనగా పరిగణించాలి. (Magga et al, 2005;. Tomaševski 2000; http://www.right-to-education.org/content/primers/rtem3.pdf). ఇది ఐరాస నిర్వచనాల ప్రకారం భాషాపరమైన జీవ విధ్వంసానికి దారి తీస్తుంది (Dunbar & Skutnabb-Kangas 2008).

ప్రస్తుతం 10వ క్లాసు పరీక్షకు కూచొని పాసైనవారు 88% వరకూ ఉంటే, ఇంటర్మీడియేట్ పరీక్షకు కూచొని పాసైనవారు 70% వరకూ మాత్రమే ఉంటున్నారు. అంటే 10వ తరగతికీ ఇంటర్మీడియేటుకూ పాసయ్యేవారిలో లోటు 18%. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి. ఇంకా, మన పిల్లల పాఠశాల విద్యలో డ్రాపౌట్లు (బడిమానేసినవారు) 5వ తరగతివరకు 12% ఉంటే 8వ తరగతికి వచ్చేటప్పటికి 25% కాగా, 10 వ తరగతికి 32% ఔతోంది. ఎందుకో గమనించారా? ఈ మూడంచెలలో కొంతమంది ఇంగ్లీషు మీడియంకి బదిలీ అవడమే ప్రధాన కారణం. ఇక ఇంటర్లో పాస్ 70% అంటే 30% మంది చదువు మానేస్తున్నట్లే. దీనికి ప్రధానకారణం 10వ తరగతిలో తెలుగులో చదివినవాళ్ళు ఇంటర్లో ఇంగ్లీషుకు మళ్లవలసిరావడమే. అంటే వీటిని ఎట్లా అర్థం చేసుకోవాలి. **అంచెలంచెలుగా**

**మాధ్యమం మారినప్పుడల్లా 10% విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. ఇప్పటికే అరకొరగా ఉన్న ఇంగ్లీషు మాధ్యమం మన పిల్లల్ని విద్యకు దూరం చేస్తోంది. ఇక రేపటి విద్యా విధానంలో పూర్తిగా ఇంగ్లీషుకు మారితే జరిగే వినాశనం, అనర్థం ఊహించరానిది. ఇప్పుడు మూడింట ఒక వంతు విద్యకు దూరమైతే రేపు కనీసంగా రెండింతలు దూరమౌతారు. ఇదేనా మనం కోరుకున్న విద్యా విధానం? ఈ నష్టానికి బాధ్యత ఎవరు వహిస్తారు? మప్పై శాతంమంది చదువుమానేస్తుంటే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు దానికి అడ్డుకట్టవేయకుండా ఏంచేస్తున్నట్లు? ఇది పూర్తిగా ప్రభుత్వాల నిష్క్రియాపరత్వమే.**

చరిత్ర పుటల్ని తిరగవేస్తే బలవంతులు బలహీనుల్ని లొంగదీసుకోడానికి వాడిన మొదటి ఆయుధం భాషే. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పోగొట్టుకున్న మనిషికి మిగిలేది భాషా బానిసత్వమే.

అందుకు ఏం చెయ్యాలి? ఉద్యమించాలి. ఈ బానిస విద్యా విధానాన్ని నిరసించాలి. మనదేశం స్వయం సమృద్ధి సాధించాలంటే మన పిల్లలు మాతృభాషలో చదువుకోవాలి. ఇంగ్లీషును ప్రత్యేక విషయంగా ఎంచుకొని చదవాలి. దీనికి మాతృభాషా చట్టం చేయాలి. మాతృభాషలో విద్యను అందించని విద్యా యాజమాన్యాలు మన విద్యా హక్కును అతిక్ర మిస్తున్నాయి. ఇది ప్రాథమిక హక్కును కాలరాయడమే. ఇది భాషా విధ్వంసానికీ జాతి విధ్వంసానికీ దారితీస్తుంది. ఇది సాంస్కృతిక వైవిధ్యాన్ని ధ్వంసంచేయటమే. విద్యా విషయం సాంస్కృతికపరంగా సముచితమైనదీ, వివక్షారహితమైనదిగానూ ఉండాలి. విద్య స్థానీయ నిర్దిష్ట అవసరాలకూ సందర్భాలకూ తగినట్లుగా ఉండాలి.

### ఇంకా కొన్ని శేష ప్రశ్నలు.

**7. తెలుగు నేర్చుకోవాలంటే, ఇంగ్లిష్ మాధ్యమం వదిలెయ్యాలని పదుగురి అభిప్రాయంగా తెలుస్తోంది. అవునా?**

క్షమించాలి. మనం కోరేది ఏమిటో కొంచెం గమనించండి. తెలుగు నేర్చుకోవడం కాదు, ఉన్నది తెలుగే, తెలుగు మాధ్యమం ఉండాలి, ఇంకా ఇంగ్లీషూ నేర్చుకోవాలి కానీ అది బోధనామాధ్యమం కాదు అని. రెండు భాషలే ఏమిటి అవసరమైతే అంతకంటే ఎక్కువే నేర్చుకోవాలి.

**8. ఇంగ్లీష్ ఎంతో గొప్పగా అభివృద్ధైన అంతర్జాతీయ భాష; వాణిజ్య మాధ్యమ భాష;**

**ఉన్నత విద్యామాధ్యమ భాష. ఒకప్పుడు ఎంతో ప్రాముఖ్యం లోఉన్న French, German భాషలను అధిగమించి ముందుకు వెళ్ళి వర్ధిల్లుతున్న భాష. ఇంగ్లీషు ఉంటే తప్పేమిటి?**

ఒక భాష అభివృద్ధి చెందినదా లేదా అనేది భాషా తత్త్వంలో లేదు, ఆ భాషను వాడే రంగాలనుబట్టి ఉంటుంది. అంటే సామాజిక రాజకీయ విధివిధానాలకు సంబంధించినది. అనేక రంగాలలో మాధ్యమంగా వాడుతుంటే భాష అభివృద్ధి చెందుతుంది. అందుకనే తెలుగును అన్నిచోట్లా వాడాలి అంటున్నాం. ఏ భాష ఎక్కడ వాడాలో అక్కడ వాడాలి. అట్లా వాడనప్పుడు ఆ భాష వాడకం కొంతమందిని భయపెడుతుంది. కొందరు దూరమవు తారు. కొందరికి నిరుపయోగం. మరికొందరికి ప్రాణంమీదికి రావచ్చు.

**9. ఇంగ్లీషు బారినుండి తెలుగుని ఎలా రక్షించు కోవాలి అని ఆలోచించే దానికన్నా దానితో ఎలా సహజీవనం చెయ్యాలో తెలుసుకోవాలి? ఇంగ్లిష్ వస్తే గాని sales girl ఉద్యోగం కూడా రాని ఈ రోజుల్లో English మాధ్యమాన్ని అందరూ కోరుకోవడంలో తప్పేంటి?**

ఔను. మన ఆలోచనకూడా ఎలా రక్షించుకోవాలి అనేదానికంటే తెలుగుకు దాని ఉచిత స్థానాన్ని ఎలా తిరిగి రాబట్టాలనే. ఎంత దౌర్భాగ్యం మనది! తెలుగుతో సేల్స్ గర్ల్ ఉద్యోగంకూడా తెచ్చుకోలేని పరిస్థితిని కల్పించుకున్నాం! వంకాయలూ ఉప్పూ పప్పూ కొనుక్కోవటానికి కూడా ఇంగ్లీషు అవసరమనిపించేలా మన విద్యావ్యవస్థను తయారుచేసు కున్న మన బానిస బతుకుల మానసిక స్థితిని గురించి ఏమని చెప్పుకోవాలి. తెలుగు మాధ్యమం మనందరికోసం, మన సమాజంలో అందరికీ సమస్థాయిని కల్పించగల తెలుగును వదిలి ఆంగ్లమాధ్యమమా? ఉన్నత విద్య అనంతరం ఎవరికి అవసరమైతే వాళ్లు ఆంగ్ల మాధ్యమంలోకి మారవచ్చు. ఆంగ్లమేకాదు ఇతర భాషలలోకి కూడా మారవలసిన అవసరం రావచ్చు. అసలు ఇంగ్లీషు మాధ్యమం ఎందుకు అనే ప్రశ్న లేవనెత్తాలి. అసలు ఇంగ్లీషు రాని చోట, ఇంగ్లీషు అవసరమే లేని చోట, ఇంగ్లీషును నేర్పేవాళ్లు తగినంతమంది లేని చోట ఇంగ్లీషు మాధ్యమం వల్ల ప్రయోజనం ఏమిటి.

సేల్స్‌గర్ల్ ఉద్యోగం కీలకమైదీ, కష్టమైనదీ. ప్రతిరోజూ వందలాది కొనుగోలుదార్లతో వందలకొలదీ వెచ్చాలూ, దినుసులూ, కిరాణం సామగ్రుల పేర్లు గుర్తునెట్టుకొంటూ,

పైసా లెక్క పొల్లు బోకుండా బిల్లు చేసి ఇచ్చే సేల్స్‌గర్ల్‌ది కీలకమైన ఉద్యోగం. అక్కడే అంతటా తెలుగు కనపడాలి, వినబడాలి. ఎక్కడో 10-15శాతం మందికి తెలుగురాని కొనుగోలుదార్లకోసం ఇంగ్లీషు వస్తేనే ఉద్యోగం గాకుండా తెలుగు వచ్చినవారికే ఉద్యోగం అని అభిమానంతోనూ, గర్వంగానూ ప్రకటించగలిగిన పౌరులుగా మనం ఎదగగలగాలి.

**10. సంస్కృతం నేర్చుకుంటే రాజపోషణ ... పారశీకం నేర్చుకుంటే నవాబుల ఆదరణ ... ఉర్దూ నేర్చుకోన్నవారికే నిజాం లాంటి సుల్తానుల దగ్గర కొలువులు ... ఇంగ్లిష్ రాజ్యమేలే రోజుల్లో ... ఇంగ్లిష్ నేర్చుకోవాలనే ఆత్రుత......**

సంస్కృతం, పారశీకం, ఉర్దూ, ఇంగ్లీషు ఇవ్వన్నీ మనకు పరాయి భాషలే. మనం అవినేర్చుకున్నప్పుడే బ్రతుకు తెరువు, అనడంలోనే పరాయీకరణ అని తెలుస్తోంది. ప్రజలభాషలను కాదని పరాయి భాషలను మనం నేర్చుకోలేదా పొట్టకూటికి అని ఉదహరించడం మన బానిస వాసనలకూ వారసత్వానికీ మళ్లీ తలూపడమే. ఇక, పూర్వం అందరూ సంస్కృతం నేర్చుకోలేదు. మన సమాజంలో నూటికి ఒకరికి కూడా సంస్కృతం, పారశీకం వచ్చివుండవు. అవికూడా ఒకటి రెండు రంగాలకే పరిమితం. ఇక వీటిని ఉదాహరణలుగా తీసుకుంటే మన స్వాతంత్ర్యానికి అర్థం లేకుండా పోతుంది. దేనికి ఈ స్వాతంత్ర్యం? మన భాషను మనం వాడుకోలేని చోట. ఇంగ్లీషు నేర్చుకోవద్దని ఎవరంటు న్నారు. తెలుగు మాధ్యమం ఉండాలంటున్నాం. మనం స్వయం సమృద్ధిని ఎప్పుడు సాధిస్తాం. ఇక ఎప్పుడూ బొచ్చేసుకోని ఎవరినో దేబిరించడమేనా? (ఇక, ఒకనాడు ఉర్దూ, దండనీతితో మనమీద రుద్దబడిన భాషే. ఐతే ఈనాడు అది సామాన్యుల భాషగా మనలో కలిసిపోయిన మనలో కొందరి భాషగా గౌరవం పొందుతోంది).

**11. వెనుకబడినవారే సర్కారు బడులకు పిల్లలను పంపుతున్నారు కాబట్టి వారిమీద మనం తెలుగు మాధ్యమం రుద్దితే దాన్ని అగ్రకులాల కుట్రగా చూస్తారు, చూస్తున్నారు.**

ఔను మీరు అన్నది నిజమే. కొందరు తెలుగు మాధ్యమాన్ని అగ్రకులాల కుట్ర అని అనుకొంటున్నారు. కానీ అంతర్లీనంగా ఉన్న నిజం ఏమిటి? ఇది ఎట్లా ఉందంటే రెండు కోతులు కొట్టుకొని పిల్లికి పెత్తనం ఇచ్చినట్లుంది. ఇది మన స్వయంకృతాపరాధమే. కంపుకొడుతున్న మన కులవ్యవస్థే కారణం. సమాజంలో అట్టడుగువర్గాలవారి భయాన్ని పోగొట్టడానికి మనం త్యాగం చెయ్యక తప్పదు.

అంతేగానీ మళ్లీ బానిసత్వంలోకి కూరుకు పోగూడదు. ఆలోచించండి. ప్రభుత్వం ఇంగ్లీషు మీడియం పెడితే అగ్రకులాలవారు కార్పోరేట్ ఇంగ్లీషు స్కూళ్లకు తమ పిల్లల్ని పంపకుండా ఉంటారా. ప్రభుత్వ ఇంగ్లీషు మీడియంలో చదువుకున్నవాళ్లు కార్పోరేట్ ఇంగ్లీషు మీడియంవాళ్లతో పోటీపడగలరా. కార్పోరేట్ ఇంగ్లీషు మీడియం స్కూళ్లు తామర తంపరగా పెరిగిపోయి ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం స్కూళ్లు మూతపడే స్థితికి వస్తాయి. అసలు ప్రభుత్వ స్కూళ్లలో ఇంతమందికి ఇంగ్లీషు మాధ్యమంలో బోధించగల అధ్యాపకులు ఉన్నారా? అటు ఇంగ్లీషూ రాక, ఇటు తెలుగూ రాక ఆత్మన్యూనతా భావంతో నిరాశా నిస్పృహలకు లోనై ఆత్మహత్యలకు దిగితే దానికి ఎవరు బాధ్యత వహి స్తారు? ఇప్పటికే తెలుగు బోధనకే గతిలేక, మానవీయ విలువలున్న సాహిత్యాన్ని చదవ గలిగిన శక్తిలేక  ఇంకో మనిషితో ఎలా మెలగాలోకూడా తెలియక ఓర్పు వీసమెత్తుగూడా లేక, సహనం నశించి, తన మాట కాదన్న మనుషులతో సహజీవనమే చేయలేని స్థితికి వచ్చి హత్యలూ, ఆమ్లదాడులూ ఎక్కువై సమాజం ఏ దారిపడుతోందో చూస్తున్నాం కదా! ఇంకా మనకు కనువిప్పు కావడంలేదా. ఇంటర్మీడియేట్ విద్య వరకూ మాతృభాషా మాధ్యమమే ఉండాలని అది ప్రభుత్వ బడులూ, ప్రైవేటు బడులూ కార్పోరేట్ బడులూ అనే తేడాలేకుండా అందరికీ తెలుగు మాధ్యమంలోనే విద్యను అందించాలని చట్టం చేయాలి.  ఇట్లాంటి విద్య చైనా, జపాన్, కొరియా, ఇంకా అన్ని అభివృద్ధిచెందిన దేశాల్లోనూ ఉంది. ఇది నేడు అత్యవసరంకూడా. **మాతృభాషా మాధ్యమంతోనే చిన్నవయసులో జాతీయ స్పృహతో, దేశీయ పద్ధతిలో, మానవీయ విలువలున్న మనదైన సమసమాజ నిర్మాణానికీ దేశ ఐక్యతకూ దోహదంచేసే విద్యను అందించగలుగుతాం. అప్పుడే తీవ్రవాదం, ఉగ్రవాదాలు తగ్గుముఖం పడతాయి.**

**12. తెలుగును బతికించుకోవడానికి వేరే మార్గాలు వెతకాలి.**

ప్రత్యామ్నాయాలను పరిశీలించవచ్చు. కానీ ఇలాంటివి మళ్లీ ఈ దారే పడతాయి. మాతృభాషలు బతికి ఉండాలంటే బోధన మాధ్యమంగా కొనసాగటం ఒక్కటే మార్గం.

**13. తెలుగు లిపి ఇంకా computer-friendly కావాలి.**

ఔను. ఇవన్నీ జరగాలంటే తెలుగు వాడే రంగాలు విస్తరించాలి. అది తెలుగు మాధ్యమంతోనే  సాధ్యం. ఎన్నో లిపిసంస్కరణలకు సంబంధించిన సూచనలు వచ్చాయి, వస్తున్నాయి. బుల్లి తెరలపై ఎక్కువ పంక్తులు పట్టేవిధంగా వత్తులను ఒకదానికింద ఒకటి రాయకుండా పక్కపక్కన రాసే విధానం దానికి కావలసిన

తెలుగు ఖతి (ఫాంట్) కూడా వాడుకలోకి వచ్చింది (చూ. తెలుగు భాషా సంగణనం ( Telugu language computation: ఉమామహేశ్వరరావు, 2012, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ). ఇంకా ఎన్నో ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయి, వస్తున్నాయి (సందర్శించండి: caltslab.uohyd.ac.in). మీ సూచన తప్పక పాటించవలసిందే. కానీ మాతృభాషా మాధ్యమమే మన ముందున్న ప్రధాన సమస్య.

**14. తెలుగు పదాలు వున్నచోట సంస్కృతం గాని, ఆంగ్లం గాని వాడ వలసిన అవసరం లేదు గదా?**

ఇక ఏ పదం వాడాలి, అరువు పదాలు ఉండాలా లేదా అనేది అసలు సమస్యే కాదు. ప్రతివారికి వారి నేపథ్యం, శిక్షణ, పనిచేసే రంగాన్నిబట్టి వాడుకలో తేడాలు ఉంటాయి. ఎవరు ఎలా రాయాలో మనం నియంత్రించగూడదు. రాయనీయండి, ఎవరికి ఇష్టమైన పద్ధతిలో వారిని. నేటి కంప్యూటరు మనకు ఇష్టమైన రీతిలో మన మాండలికంలో మనం చదువుకొనేందుకు ఒక్క క్షణంలో మార్చి మనముందు ఉంచుతుంది. దీన్ని తయారు చేయడానికి పెద్ద పరిజ్ఞానమూ తెలివీ అవసరం లేదు. ఇది త్వరలో అందరిముందుకూ రానున్నది. ఎవరి మాండలికంలో వారు రాసుకుంటే చదువుకునేవారు తమకు ఇష్టమైన మాండలికంలో చదువుకునే ప్రత్యామ్నాయాలు వచ్చాయి.

**15. ప్రజలు మాట్లాడేదే భాషగానీ పండితులు రాసేది మాత్రమే కాదు గదా?**

భాషనుగురించిన చేసిన ఈ సూచన అక్షరాలా నిజం. మన భాషా తత్త్వం గురించి చాలామంది చాలా చెప్పారు. ఇప్పుడు మన తక్షణ కర్తవ్యం, మన జన బలమూ, తెలివీ, సమయమూ అన్నింటినీ కలిపి తెలుగు మాధ్యమాన్ని నిలుపుకొనేందుకు కృషిచేయడమే. మనందరం తెలుగు మాధ్యమంలో చదువుకొని ఇంగ్లీషు నేర్చుకున్నవాళ్లమే. ఇప్పుడు విదేశాల్లో ఉన్నవారిలో 90% తెలుగుమాధ్యమంలో చదువుకున్నవారే. ఇంతమంది తెలుగు మాధ్యమం లో చదువుకున్నవారు జీవితంలో గెలిచి వెలుగుతున్నప్పుడు మనం భాషను బలిపెట్టవలసిన అవసరం లేదు.

ఈ కింద చర్చించిన ఎన్నో అభిప్రాయాలు చాలావరకు (ప్రత్యేకంగా చివరి భాగం) మనకు తెలిసినవే. ఐతే కొన్నింటిని మాత్రం స్పష్టతకోసం చర్చిస్తాను.

**16. సంస్కృతం విశ్వ భాష. దాన్ని పలకడమంటే ప్రపంచంలో ఏ భాషనైనా మనం పలకగలమనే గదా అర్థం.**

అది సంస్కృతం మీద ఉన్న ప్రేమ లేక ఇష్టంతో అన్నమాటే కానీ నిజం కాదు. సంస్కృతంలో లేని ధ్వనులు డజన్లకొద్దీ ఇతర భాషలలో ఉన్నాయి. ఉదా. తమిళంలోనూ, ప్రాచీన తెలుగులోనూ ఉన్న టి కార ఱ కారాలు కారం, హ్రస్వ ఎ, ఒ, ఌ, సంస్కృతంలో లేవు. ప్రతి భాషకూ దాని ప్రత్యేక వర్ణమాల ఉంటుంది. సంస్కృతం గొప్పతనం 'భాష'ది కాదు ఆ భాషలో ఉన్న సాహిత్యానిదీ, జ్ఞాననిధిదీ. ఆ భాషను వర్ణించిన వ్యాకరణానిదీ.

**17. మహాప్రాణ అక్షరాలు ఉన్న పదాల అర్థాల విశిష్టతను తెలియజేయడానికే ఈ మహాప్రాణాల సృజన జరిగిందనిపిస్తుంది. ఉదాహరణకు వ్యాఘ్రం అంటే పెద్ద పులి అని మనకు తెలుసు. అంది భయంకరమైనదని శబ్దంలోనే అర్థం అయిపోతుంది కదా! అలాగే "బాధ". "ద"కు బదులు "ధ" వాడటం వలన ఆ నొప్పి ఎంత అనేది బహుశా ఆ పదం అర్థం కాకపోయినా పలుకులోనే కొంత అర్థం అయిపోతుంది.**

అది నిజంకాదు. అట్లా అయితే భాద అనికూడా అనవచ్చు కదా. భార్యా భర్తలు భయంకరమైనవాళ్లు కాదుగదా. మైధునంలో ఆ ఒత్తు ఎందుకు. బరువుకు వత్తు ఉంటే బావుండేదేమో. ఐతే సంస్కృత మహాప్రాణాల వాడుకకూ తెలుగులో మహాప్రాణాల వాడుకకూ చాలా తేడా ఉంది. తెలుగులో తత్సమ తద్భవాలలోని మహాప్రాణాలని సాధారణంగా తేల్చి పలుకుతాం. తెలుగులో వాటిని అర్థాన్ని నొక్కి చెప్పడానికి వాడతాం. ఉదా. గట్ఠిగా, ధారం, ఘాలి, మొదలైనవి. ప్రకృతిలోని శబ్దాలను అనుకరించగా వచ్చిన పదాలు అన్ని భాషలలోనూ ఉంటాయి, ఉదా, గడగడ, లొడలొడ, జరజర, గరగర, సలసల, భగ్గుమను, ధామ్మను లాంటివి, భళ్లున, ఇలాంటి ధ్వని అనుకరణ శబ్దాలు మామూలు పదాలతో పోల్చితే చాలా తక్కువ.

**18. తెలుగు భాషలో లేని కొన్ని అక్షరాలు తెలుగు లిపిలో ఉన్నాయి గదా, వాటిని తీసివేసి లిపిని సంస్కరించవచ్చుగదా?**

" ఙ, ఞ, ళ, శ, ష వంటివి, ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ, లాంటివాటి వాడకం చాలా తక్కువగా కొన్నింటి అవసరం అసలే లేకపోయినా అవి లిపికి సంబంధిం చినవి. ఇతర భాషా పదాలను రాయడానికీ నేర్చుకోవడానికి తప్పనిసరిగా ఉపయోగ పడతాయి. వీటిని పనిగట్టుకొని తీసివేయాల్సిన అవసరం లేదు గానీ అవసరం మేరకు వాడుకోవచ్చు. లిపి చారిత్రక ఆనవాలు. కంప్యూటరు యుగంలో లిపిలో పెద్దపెద్ద మార్పులు అవసరం లేదు. నేటి అవసరాలకు దీటుగా మార్పులు అవసరం.

ఇతర భాషలను నేర్చుకోవడానికి మనభాషలో అవసరం లేకపోయినా కొన్ని శబ్దాలు ఉండాల్సిన అవసరం లేదు. తెలుగులో ఉన్న కొన్ని ధ్వనులు చారిత్రకంగా లిపి ద్వారా వచ్చినవే. మన తెలుగు లిపి ఇతర లిపులలాగా భారతదేశ పశ్చిమోత్తర భాగం నుండి రావడం వలన ఆ భాషలలో ఉన్న ధ్వని చిహ్నాలు మనకు అవసరం లేకపోయినా వర్ణమాలలో నిలిచివున్నాయి. తెలుగు లిపిని సంస్కృతం, ప్రాకృతం, ఒడియా, భాషలను రాయడానికి వాడేవారు. అట్లాగే, అసలు ఏ భాషనైనా ఏ లిపిలోనైనా రాసే వీలుంది.

**19. అయితే ఇలాంటివి ఎంత తక్కువ ఉంటే అంత తక్కువ గురుప్రమేయంతో భాష నేర్చుకోవడం సాధ్యమవుతుంది గదా.**

తక్కువ అక్షరాలు ఉంటే తక్కువ సమయం, తక్కువ ప్రయాసతో నేర్చుకోవడం అనేది నిజంకాదు. భాషలో వర్ణాలు (అక్షరాలు అనుకుందాం) తక్కువైతే వాటిని వాడే పద్ధతి కష్టమౌతుంది. ఉదా. తమిళంలో చాలా తక్కువ అక్షరాలు ఉన్నాయి అయితే దాని వలన ఎన్నో కష్టాలు. అక్షరాన్ని ఏ సందర్భంలో ఎలా పలకాలో తెలుసుకోవాలి ఇక్కడ ప్రయాస ఎక్కువ. లిపి పరిమాణాన్ని బట్టి ఒక భాషకన్నా ఇంకో భాష కష్టమైనదనీ ఇంకొకటి తేలికైనదనీ అనుకోవడంలో శాస్త్రీయత లేదు. లిపిని వాడేవిధానం వలన భాషను నేర్చుకోవడ కొంత కష్టం కావచ్చు. భాషలలోని వివిధ వ్యవస్థలమధ్య సాపేక్షత ఉంటుంది.

**20. స్థూలంగా చూస్తే తెలుగు లిపి, పదాల అల్లిక శాస్త్రీయంగా ఉన్నట్టనిపిస్తుంది గదా?**

తెలుగు లిపిలోగానీ లేక ఏ లిపిలోనైనా శాస్త్రీయత కంటే వరవడీ, పద్ధతులే ఎక్కువ ఉంటాయి. ఇవి చారిత్రకంగా ఏర్పడినవి. ప్రతిలిపిలోనూ కావలసినంత అశాస్త్రీయతా, పద్ధతులూ కూడా ఉంటాయి. తెలుగులిపిలో అక్షరాలను రాసే వరస పలికే వరుసకు భిన్నంగా ఉంటుంది. ఒక రకంగా ఇది అశాస్త్రీయం. మన రాత ఎడం నుండి కుడికి, పైనుండి కిందికి అనుకుంటాం. కానీ ఎడమనుండి కుడికీ, ఆపైన కిందికీ, మళ్లీ పైకి రాస్తాం. ఉదా. త్రాగు (తా+ర్+గు) రాసే వరస అయితే పలికే వరస ఇట్లా (త్ +రా +గ్+ఉ). ర మీద ఇవ్వాల్సిన దీర్ఘం త మీద ఇస్తున్నాం. ఇది అంతా అశాస్త్రీయం. కానీ ఇదొక పద్ధతి, చారిత్రక వికాసంలో వచ్చిన వరవడులు. అంతే.

**21. ఆధునిక ప్రపంచం అంతా ఒక కాలమానానికి తప్ప మిగిలిన కొలతలకన్నింటికీ ఫ్రెంచివారు ప్రవేశపెట్టిన దశాంశ పద్ధతిని అనుసరిస్తోంది.**

అది నిజంకాదు, అమెరికా దశాంశ పద్ధతిని అనుసరించటంలేదు.

**22. ఈ రోజు ప్రపంచంలో అత్యధికులకు అర్థమయ్యేది మాట్లాడేది ఇంగ్లీషే. అది వావి వరసలు లేని భాషని మనకు తెలుసు.**

ఇదీ నిజం కాదు. ప్రపంచ జనాభా లెక్కలు తీయండి. ఎక్కువమంది మాట్లాడేవి వ్యవహారం నడిపేవాటిలో వరుసగా చైనీసు, హిందీ, స్పానిషు, ఇంగ్లీషు, అరబిక్, బెంగాలీ ..... . ఈ వరుసను మార్చి రకరకాలుగా ప్రాముఖ్యతను బట్టి కొందరు వేరుగా ఇవ్వవచ్చు. పేరుకు హిందీ, ఉర్దూ రెండు భాషలైనా ఉన్నది ఒకటే. లిపి తేడాతోనూ సంస్కృతం, అరబికు నుండి అరువు తెచ్చుకున్న పదాలచేత అవి రెండు భాషలని అనిపించవచ్చు. ఢిల్లీ రోడ్డుమీదో, అలహాబాదు రోడ్లమీదో ఒకేభాషలో మాట్లాడుకొంటున్న ఇద్దరిని మీది ఏ భాష అని అడిగితే ఒకరు హిందీ అని మరొకరు ఉర్దూ అని చెబుతారు. ఇక భాషలకి వావివరసలు ఉండటం లేకపోవటం అని ఏమీ ఉండదు.

**23. సంస్కృత ప్రభావితమైన మన తేటతెలుగు పుణ్యమా అని మన తెలుగు వారికి ఇంగ్లీషులో బాగా communication సామర్థ్యాలు అబ్బుతున్నాయి.**

ఇంగ్లీషులో చక్కటి కమ్యూనికేషన్ సామర్థ్యాలు అబ్బటానికీ సంస్కృత ప్రభావిత తేటతెలుగు పుణ్యం కాదు. ఇంగ్లీషు మీడియం స్కూళ్లు ఎక్కువ అవడంచేత అని తెలుసుకోవాలి. తెలుగువాళ్ళకు తెలింగ్లీష్ బాగనిపించవచ్చు. ఇతరులకు చాలాతప్పుగానూ, ఇంగ్లీష్ వాళ్ళకు అసలు అర్థం కాకుండాను ఉంటుంది.

**24. అరకొర సౌకర్యాలున్నందున తెలుగు బడులకు ఎవరు వస్తారు? ఐనా, అన్నీ ఉన్నా తెలుగు బడులకు ఎవరు వస్తారు?**

అరకొర సౌకర్యాలు ఉంటే మరి ఎవరు మాత్రం పిల్లల్ని అలాంటి స్కూళ్లకు పంపిస్తారు. ఐతే ఒకటి నిజం. మంచి సౌకర్యాలు కల్పించినా తెలుగు బడులకు పిల్లలు రారని. అవును నిజమే. ఎందుకంటే తెలుగు చదువుకుంటే ఉద్యోగ భాద్రత లేకపోవటమే. మన వాదన అంతా దీనిచుట్టూతానే తిరుగుతోంది. తెలుగు మాధ్యమంలో చదువుకున్నవారికే ఉద్యోగాలు అని చట్టం చేయండి. తెలుగు బడులకు విద్యార్థులు వస్తారో లేదో చూడండి. తెలుగు మాతృభాషగా ఉన్నవారు 85-90%

ఉన్నచోట తెలుగు మాధ్యమంలో విద్యాబోధన లేకపోవడం మన మానసిక దౌర్బల్యమూ, హేతుబద్ధంకాని నిర్ణయాలే కారణం. ఇది కొత్త వలసవాదం (neocolonialism) లో భాగమే. వీటి వలనే రోజూ మనం వింటున్న హత్యలూ ఆత్మహత్యలూ, మనుషులమధ్య అసహనమూను మానవతా విలువల హననమూ. ఇవే రేపటి సమాజ దుర్గతికి నేటి బాటలు. ఇంగ్లీషు చదువులద్వారా ఎంతమందికి ఇతర దేశాలలో ఉద్యోగాలు వస్తున్నయ్యో (దీన్ని ఇంతకుముందు చర్చించాం) తెలుసుకుంటే మనం ఇంగ్లీషు కోసం ఇంత వెంపర్లాడడం, తాపత్రయం ఉండదేమో. ఇంగ్లీషును ఒక భాషగా నేర్చుకోవడం వేరు దాన్ని బోధనా మాధ్యమంగా ఎంచుకోవడం వేరు.

**25. ఈనాడు ప్రపంచ సమాచార సాంకేతికతకు (ITకి) ఇంటర్నెట్ ఎంత ముఖ్యమో ఆధునిక జీవన గతికి ఇంగ్లీష్ అంతే ముఖ్యమని ప్రజలు భావిస్తున్నందున మనం వారిని అనుకరించక తప్పదు.**

ఆధునిక జీవనగతికి ఇంగ్లీషు ఎలా ముఖ్యం ఔతుంది. ఇంగ్లీషు చదివితేనే ఉద్యోగాలూ అంటూ జీవనానికి ఇంగ్లీషు ముఖ్యమని చెప్పటం మోసగించటమే ఔతుంది. తెలుగు చదువుకున్నవారికే ఉద్యోగాలు అని చట్టంచేస్తే అప్పుడు ఏమౌతుంది. అందుకని మీ వాదన వర్తులంగా (గుండ్రంగా) ఉంది.

**26. కోటి చదువులు కూటికోసమే అనే మాట ఎప్పుడూ ఉన్నదే. కూడు పెట్టలేని విద్య ఎందుకూ కొరగాదు గదా?**

మన మాతృభాషా సాహిత్యాలూ సామాజిక శాస్త్రాలూ మెల్లగా ఉపాధికి దూరం అవడానికి ఇదొక కారణం. ఐతే ఈ పరిస్థితికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఈ రెండూ ఒకదానికొకటి లంకెవేసుకొన్నవే. మన భాషా మాధ్యమంలో విద్యా, వాణిజ్య వ్యాపార, పాలన మొదలైన అన్ని రంగాలలోనూ వ్యాసంగం జరుగుతుంటే మనకి తెలుగులో చదవడం నేర్వడం ఒక అవసరం అయ్యేది. దానితో తెలుగుభాషకు గిరాకీ పెరిగేది. రెండవది పెరుగుతున్న జనాభా దాని అవసరాలు తీర్చడానికి బయలుదేరిన విజ్ఞాన తంత్ర (సైన్స్ అండ్ టెక్నాలజీ) శాస్త్ర జ్ఞానసృష్టి తెలుగులో జరగక పోవడం. విద్య విజ్ఞానం కోసమే. అయితే, దాన్ని ఉపయోగంలో పెట్టడమే ఇంజనీరింగు. అందుకనే సమస్యలను తీర్చేది ప్రతిదానినీ ఇంజనీరింగ్ అనాలి. ఇంజనీరింగ్ అంటే భౌతిక వస్తూత్పత్తే కాదు సమస్యలకు సమాధానాలను అందించే అమూర్త జ్ఞానం కూడా ఇంజనీరింగే లేక తంత్రమే (తంత్రం అనే మాటకు కొంత

విపరీతార్థం వచ్చినా కొన్ని చోట్ల 'టెక్నాలజీ' అనే అర్థంలో వాడుతున్నాం. ఉదా. యుద్ధ తంత్రం). ఇక ఒకప్పుడు భాషలూ, సాహిత్యం, సామాజిక శాస్త్రాలు చదువుకొన్నవారు సమాజంలో గొప్పగౌరవాన్ని పొందిన నాగరికులుగా చెలామణి అయ్యేవారు. తఆ రోజుల్లో వనరులు ఎక్కువగా, జనాభా తక్కువగా ఉండటంతో ఉత్పత్తి సాధనాల అవసరం కూడా తక్కువగా ఉండేది. అయితే క్రమేణా జనాభా పెరగడంతో ఎక్కువ వస్తూత్పత్తి అవసరం అయింది. భౌతిక అవసరాలను తీర్చే దిశలో మరలనూ యంత్రాలనూ ప్రవేశపెట్టడం, ఆ పైన పారిశ్రామిక రంగం విపరీతమైన వేగాన్ని పుంజుకొని మార్కెట్ శక్తులు బలపడి సమాజాన్ని శాసించే వరకూ వెళ్లాయి. వస్తూత్పత్తికి దోహదం చేసే విజ్ఞానమే జ్ఞానం అనే దశకు చేరుకొంది. అందుకనే ఇంజనీరింగ్‌కి అంత గిరాకీ. కారణం వస్తూత్పత్తిలో పాలుపంచుకొనేవాళ్లు నేరుగా సంపదను సృష్టిస్తున్నారు. మరి తెలుగూ తదితర భాషలలో సాహిత్యాలతోనూ సామాజిక శాస్త్రాలతోనూ పనిచేసేవాళ్ళు ఎలాంటి సంపదను సృష్టిస్తున్నారు? నేడు సమాజం వీరిని చిన్నచూపు చూస్తోంది. ఇది ఆలోచించవలసిన విషయం.

భాషా సాహిత్యాలూ సామాజిక శాస్త్రాలూ ఇంజనీరింగ్ దిశలో ప్రయాణించాలి. అంటే అవసరాలను తీర్చే దిశలో నడవాలి. సమాజంలో తెలివిగలవాళ్లూ సమయస్ఫూర్తిగలవాళ్లూ ఎలాంటి జ్ఞానానంతోనైనా అవసరాలను తీర్చే విషయాలను సృజించగలరు. మన అవసరా లను తీర్చేవాటిని ఆధునిక పద్ధతులలో అందజేయాలి. భాషా తంత్రం (లాంగ్వేజ్ టెక్నాలజీ), సాహిత్య తంత్రం (లిటెరరీ టెక్నాలజీ), సామాజిక, రాజనీతి తంత్రం సోషియో, పొలిటికల్ టెక్నాలజీ) లాంటివాటిని మన అవసరాలు తీర్చే విధంగా తీర్చిదిద్దాలి. అప్పుడే ఈ రంగాలకు గిరాకీ పెరుగుతుంది. ఇందులో మనవ సంబంధాలనూ వాటి విలువలనూ సామాజిక విలువలనూ పూర్తిగా ఆధునిక పద్ధతులలో అందించాల్సివుంటుంది. అప్పుడే వీటితో పనిచేసేవారికి ఉపాధి భరోసా. దీన్ని సాధించాలంటే మనపై పెను భారమే ఉంది. ఒకటి తెలుగు భాషకు రావలసిన స్థానాన్ని సంపాదించాలి. రెండవది ఆధునిక అవసరాలు తీర్చే పద్ధతులను అవలంభించాలి.

**27. మాతృభాషా మాధ్యమం కోసం అలజడులూ, ఆందోళనలూ, దీక్షలూ, ధరణాలూ, సమ్మెలూ, న్యాయపోరాటాలూ జరుపుతున్నాం ఏమన్నా ఉపయోగం ఉందా?**

ఎంతోమంది ఎన్నో ప్రయత్నాలు చేశారు, చేస్తున్నారు. ఇట్లాంటి ప్రయత్నాలు కొన్ని ఇప్పటికిప్పుడు విజయం కాలేకపోయినా అవి ఆంగ్లమాధ్యమాన్ని సమర్థించే అధికారులకూ, రాజకీయులకూ ఇతరేతరులకు ఒక రకమైన అవగాహన కల్పిస్తాయి. తెలుగు ఒంటరి కాదనీ దాని వెనుక జనం ఉన్నారనీ తెలియజేస్తాయి. ఇది అవసరం. ఇక రెండవది, మనం అనుకున్నదే. విద్యామాధ్యమంగా **తెలుగు భాషాబోధన జీవికకూ జీవనోపాధికీ ప్రధానాధారమని నమ్మకం కలిగించడమే కాదు, అది నిజంగా జరగాలి.తెలుగు మాధ్యమంలో చదివినవారికి ఉద్యోగ భద్రత ఉండాలి. తెలుగు రాష్ట్రాలలో ఉద్యోగాలకు తెలుగు భాషామాధ్యమం తప్పనిసరి చేయాలి. అందుకు చట్టాలు చేయాల్సిందే. దీనికి ఉద్యమించక తప్పదు. ఉద్యమానికి తగినట్లుగా ప్రజల్ని తయారుచేయాలి.** ముందుగా ఇలాంటి ఆలోచనలు ఉన్నవాళ్లందరం కొన్ని సార్లు కలిసి విధివిధానాలను రూపొందించుకోవాలి. ఒక నియమావళి అవసరం. జన సమీకరణకు ముందు ఇలాంటి కార్యకర్తల సమావేశాలు అవసరం. ఒక పకడ్బందీ పథకం ప్రకారం పని చేయాలి.

"నేటి తెలుగు నడక, రేపటి తెలుగు పడక- మన ముందున్న కర్తవ్యం", అనే అంశం ఒకటి తీసుకొని చర్చకు పెట్టినపుడు అనేక మంది ప్రశ్నోత్తరాలతో ముందుకువచ్చారు. వాటిలో కొన్ని ఇవి. ఇక్కడ నేను రాసిన మాటలకే ఇప్పటికే మీలో చాలామందికి బాధ కలిగించివుంటుంది. ఇంకా ఆవేదన, ఆక్రోశం, కోపం, భయం, చింత, అశాంతి, దిక్కుతోచని స్థితి లాంటివెన్నో అనుభవంలోకి వచ్చివుండవచ్చు. ఐతే మనం ఏం చేయాలి. తెలుగు వారందరూ కలిసికట్టుగా ఏం చేయాలో ఆలోచించండి, రాయండి, ఈ విషయమై మీ కోపతాపాలను ప్రదర్శించండి మాటల రూపంలో. అందరం నిశ్చయంగా ఒక నిర్ణయానికి రావాలి.

ఇవాళ తెలుగుగురించి ఏం జరుగుతోంది. రాష్ట్రప్రభుత్వాలు పట్టించుకోవడం మానేశాయి. వోట్లు అడగడానికి తెలుగు, మిగిలినచోట్ల ఇంగ్లీషు. కేజీ టూ పీజి ఇంగ్లీషంట.

రాష్ట్రాలలో అధిక శాతం తెలుగువాళ్లు ఉంటే వాళ్ల మాతృభాష కాకుండా బోధనా మాధ్యమంగా ఇంగ్లీషు ఎందుకు? ఎవరు కోరుతున్నారు? పాలకులు ప్రజలమీద రుద్దుతున్నారా? లేక ప్రజలు కోరుకుంటున్నారా? ఇంగ్లీషువలన వెంటనేగానీ ముందు ముందు గానీ అధిక ప్రయోజనాలు ఉన్నాయా? ఇంగ్లీషు మాధ్యమంలో చదవకపోతే

'పనికి' మాలినవాళ్లు అవుతారా?, వాళ్లు పనికిరారా? ఎవరిపనికోసం మనం మన రాష్ట్రాలలో మనకోసం బతకడానికి తెలుగు కాకుండా ఇంగ్లీషా? తెలుగు భాష తీయనిది, తేనెలాంటిది, ఇంపైనది, విన సొంపైనది ఇవన్నీ తెలుగుపై ప్రేమతో అనేవి, అవి కాస్త పక్కనబెట్టండి.

తెలుగులో మాటలు చాలవు, తెలుగు ఇంకా అభివృద్ధిచెందాలి, పారిభాషిక పదాలు కావాలి. ఆధునిక అవసరాలకు కావలసిన తెలుగును తయారుచేసుకోవాలి. ఇట్లాంటివన్నీ బండి ముందా గుర్రం ముందా లాంటి మాటలే. ప్రపంచంలోని భాషలన్నీ పూర్తిగా వికసించినవే. అభివృద్ధిచెందినవే. ఒకటి గొప్పదీ ఒకటి పేదదీ కాదు. కాకపోతే ఒకభాషలో ఉన్నవి వేరొక భాషలో ఉండకపోవచ్చు. అవసరానికి అన్నీ సమకూరుతాయి. ఐతే ప్రతి భాషా, ఆ సమాజానికి వేల యేండ్ల గుప్త నిధి, విజ్ఞానసర్వస్వం, నాగరికతకు చిరునామా, జన జీవం, జాతి జీవన ప్రతిబింబం.

ఆలోచించండి, స్పందించండి, అందరూ రాయండి. మీ స్పందన తెలియజేయండి.

తెలుగు మాధ్యమంలో చదివిన ఎందరో విదేశాలలోనూ మన దేశంలోనూ ప్రొఫెసర్లు గానూ, డాక్టర్లుగానూ ఐఏఎస్‌లు గానూ, ఐపీఎస్‌లుగానూ ఐఆరెస్‌లుగానూ ఇంకా అనేకమంది పరిశ్రమల యజమానులుగా, అనేక రంగాలలో వెలిగిపోతున్నవారందరూ తెలుగు మాధ్యమంలో చదివినవారే. ప్రఖ్యాతిపొంది పాలనాధిపతులుగా రాణించిన ముఖ్యమంత్రులూ మంత్రులూ ఎమ్మెల్యేలూ ఎంపీలు ఎందరో తెలుగులో చదివి ప్రజలను తెలుగులో ఓట్లడిగినవారే. ఈ విషయాలు అందరికీ తెలియాలి. ఇలాంటివారిని చూసుకొని తెలుగువారం గర్వపడతాం, మురిసిపోతాం. కానీ ఏమైపోయింది. ఎందుకు కేజీ టూ పీజీ అని పరిగెడుతున్నాం. ఇంగ్లీషు నేర్చుకోవడానికి, చక్కగా నేర్పేవాళ్లు కావాలిగానీ వచ్చీరాని టీచర్లూ తెలిసీ తెలియని వయసులో పిల్లలూ ఏళ్లతరబడి నేర్చుకున్నా వచ్చేదేమీ ఉండదు. మాతృభాషలో రాయడం చదవడం నేర్చుకున్న పిల్లలు మిగిలినవి ఏమైనా నేర్చుకోగలుగుతారు. రెండవభాష నేర్చుకోవడం తేలికవుతుంది. ఇది భాషాశాస్త్రవేత్తలూ, మనస్తత్త్వ శాస్త్రజ్ఞులూ సామాజిక శాస్త్రవేత్తలూ కూడా చెప్పేది. ఐతే మనం ఎందుకు పట్టించుకోవడంలేదు? తప్పు ఎక్కడ ఉంది?

1. ఉద్యోగం ఉపాధి భరోసా ఇవ్వగలిగేది ఇంగ్లీషు మాత్రమే అనే తప్పుడు నమ్మకం, దురభిప్రాయం ఎలా కలిగించాం. దీన్ని ముందు సరిదిద్దాలి.

2. ఆధునిక విజ్ఞానం, సమాచారం అంతా ఇంగ్లీషులోనే ఉంది. అని అనడం పూర్తిగా నిజంకాదు. చాలా భాషలలో లభ్యమౌతోంది. ప్రపంచంలో అనేక చోట్ల జ్ఞాన సృష్టి జరుగుతోంది. అదంతా అన్ని భాషలలోకి అవసరం మేరకు కావలసినవారు తెచ్చుకొంటు న్నారు. సాంకేతిక సమాచార యుగంలో జ్ఞానాన్ని ఒక భాషనుండి మరొక భాషకు మార్పిడి చేసుకొనే అవకాశాలు ఎన్నో ఉన్నాయి. ఇంకా రోజురోజుకూ ఈ అవకాశాలు పెరుగుతున్నాయి. **ఒకే భాషలో ప్రపంచ విజ్ఞానం అంతా ఉండడం నియంత్రణకూ, నియంతృత్వానికి దారితీస్తుంది. ఇంగ్లీషును నియంత్రించగలిగిన ఆంగ్లేయ మార్కెట్ శక్తుల ప్రాబల్యానికి దారితీస్తుంది. జ్ఞానం అందరికీ అన్ని భాషలలోనూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. జ్ఞానం కొందరి దగ్గరే ఉండటం, అదీ ఒక భాషలో ఉండటం ఆటంబాంబులు ఒక్కరి దగ్గరే ఉన్నంత ప్రమాదం. గుర్తు పెట్టుకోండి చావుకు పేరంటానికి పిలుపు ఇచ్చినట్లే.**

3. తెలుగూ లేక మిగిలిన భారతీయ భాషలను వదిలిపెట్టడం అంటే వేలసంవత్సరాల విజ్ఞానాన్ని వదులుకున్నట్లే. మన భాష వేల సంవత్సరాల తరబడి వికసిత సమాజానికి ప్రతిబింబం. ఇంట్లోనూ బయటా, చిన్నా పెద్దా, ఆడా మగా మనుషులతో ఎట్లా మెలగాలో చెప్పే తెలుగు సాహిత్యాన్ని చదవడం మానివేస్తున్నాం. చిన్నప్పటినుండి అలవాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించలేకపోతున్నాం. నేటికి నాది నా ఆస్తి నా సంపాదన అనే యువజనాన్ని తయారుచేసే పనిలో పడ్డాం. నేడు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న హత్యలూ, ఆత్మహత్యలూ, విధ్వంసకాండలూ, అత్యాచారాలూ మనలో తగ్గిపోతున్న సహనం ఓర్పు ఓర్మికి గుర్తులే. రేపటి అశాంతికి ఎవరు బాధ్యత వహిస్తారు?

4. నేటి టెక్నాలజీ ఈ అశాంతి, ఓర్పులేమికీ అసహనానికీ కొంత కారణమైనా టెక్నాలజీ తోపాటు మానవీయ విలువలను నేర్చుకోవడం తప్పనిసరి అని తెలుసుకోలేకపోతున్నాం. ముఖ్యంగా **టెక్నాలజీ మానవుడి శ్రమను తగ్గిస్తుంది. అన్నిటినీ అందరికీ అందించే ప్రక్రియలకు దోహదం చేస్తుంది. దీనితో మనం కోరుకోనిది కొంత మనను ఆవహిస్తోంది. మీట నొక్కితే లైటువెలగాలి, ఫ్యాను తిరగాలి, తలుపులు తెరుచుకోవాలి, టీవీ మోగాలి, చెయ్యి పెడితే నీళ్లు జలజలా రాలాలి. ఇట్లా మనం అనుకొన్నది చూపులతో, స్పర్శతో, మాటతో వెంటనే జరిగిపోవాలి. అట్లా కాకుంటే మనసులో తిట్టుకుంటూ అసహనంతో ఊగిపోతాం.**

**పరికరాలైతే పర్వాలేదు మరి అవతలివాళ్లు మనుషులైతే, రెచ్చిపోతాం, దుడుకుతనాన్ని ప్రదర్శిస్తాం. ఇదే పెచ్చుమీరి దురంతాలకు దారితీస్తోంది.**

వీటిని ఆపడానికి మన సమాజాన్ని రక్షించుకోవడానికి మాతృభాషలు కనుమరుగు కాకూడదు. ఆలోచించండి. చిన్నప్పుడు ఇట్లాంటి పనిముట్లతో ఎట్లా మెలగాలో మనుషులతో ఎట్లా మసులుకోవాలో తెలుగు పాఠాలలో చెబితే అది వారి మనసులలో చెరపరాని ముద్రబడిపోతుంది.

"అన్ని విద్యా దశలలోనూ మాతృభాష, బోధనా భాషగా ఉండాలి అని" కొఠారి కమిషన్ చెప్పినమాట.

# 6

# తెలుగు–ఆంగ్లభాషల సంబంధం: ప్రభావాలూ పర్యవసానాలూ

ప్రవహించే నదికి నిలకడ ఉండదు. ఎన్నింటినో తనలో కలుపుకుంటూ, తాను ఎన్నింటిలోనో కలుస్తూ ఎల్లప్పుడూ మార్పులకు లోనవుతూ ఉంటుంది. భాషకూడా అంతే. ఒక కాలంలోని భాషనుగానీ ఒక ప్రాంతంలోని భాషనుగానీ తీసుకొని భాషాస్వరూపమూ, స్థితీ ఇది అనీ, ఎప్పటికీ ఇవి ఇలాగే ఉంటాయనీ నిర్ణయించలేం. నదిలో నీటి ప్రవాహ వేగం, రంగూ రుచీ ప్రాంతాన్ని బట్టీ మారుతున్నట్లే కాలాన్ని బట్టీ భాషలలో మార్పులు కనబడుతుంటాయి. భాషలలో మార్పులతోబాటు కొన్నిసార్లు భాషల పేర్లు మారుతుంటాయి. కాలానుగుణంగా వచ్చిన రాజకీయ, సామాజిక కారణాలవలన భాషల వాడుకలోనూ వాటి స్థాయిలోనూ మార్పులు చోటుచేసుకోవచ్చు. దక్షిణాపథంలో ఎప్పుడూ ప్రజల వాడుకలో తెలుగు ప్రాచుర్యంలో ఉన్నా, కొన్నిసార్లు ప్రాకృతం, సంస్కృతం, పర్షియను, ఉర్దూ భాషలు అధికార భాషలయ్యాయి. ఈ భాషలవలన ఒకటిరెండు రంగాలలో మాత్రమే తెలుగు వాడుకకు నష్టం కలిగింది. అయితే, నేడు అతివేగంతో నడిచే సమాచార సాంకేతిక యుగంలో మార్కెట్ శక్తుల బలమే పునాదిగా భాషల ఉనికికే ప్రమాదం ముంచుకొచ్చింది. ఈ సందర్భంలో భారతీయ భాషల నేటి దుస్థితికి కారణాల్ని వాటి నేపథ్యాలను ఒక సారి సమీక్షించుకోవలసిన అవసరం ఉంది.

**వలస భారతంలో భారతీయ భాషలు:**

ఒకప్పటి భారతదేశానికి గవర్నర్ జనరలైన విలియం బెంటింక్ 'కొత్త విద్యా విధానంతో', ఈ దేశ 'అధికారిక భాషగా ఇంగ్లీష్' పరిచయం అయింది. ఆ విధానం ఆంగ్ల భాషా మాధ్యమం ద్వారా భారతదేశంలో పడమటి దేశాల విద్యా

వ్యాప్తికీ ఆ పై సంస్కృతి వ్యాప్తికీ దారితీసింది. ఆధునిక విజ్ఞానం, పడమటి విద్యావిధానంతో ప్రభావితులైన కొందరు భారతీయులు రామ్మోహన్ రాయ్ నాయకత్వంలో ఆంగ్ల భాషవైపు మొగ్గుచూపారు. ఐతే, అప్పట్లో వ్యతిరేక అభిప్రాయాలు కలిగిన రెండు వర్గాలు ఉండేవి. తూర్పు దేశాల సాంస్కృతిక భాషలైన సంస్కృతం, అరబిక్ పర్షియన్‌కు అనుకూలమైనవారు ప్రాచ్యవాదులనీ ఇంగ్లీష్ కు అనుకూలం అనుకునేవారిని ఆంగ్లవాదులనీ పిలిచారు. ఇదే ఆ తరువాత ఆంగ్ల–ప్రాచ్య వివాదంగా ప్రసిద్ధి చెందింది.

ఈ వివాదం పది సంవత్సరాలు నడిచింది. బెంటింక్ భారతదేశానికి గవర్నర్ జనరల్ గా వచ్చేముందు కూడా ఐదు సంవత్సరాలు ఈ వివాదం నడిచింది. రామమోహన్ రాయ్ – సంస్కృతానికి వ్యతిరేకంగా ఆనాటి బ్రిటిషు ప్రభుత్వానికి ఒక అభ్యంతరపత్రాన్ని సమర్పిస్తూ అందులో “ఇప్పటికే అటువంటి విద్యను బోధిస్తుండగా, మళ్లీ ప్రభుత్వంవారు హిందూ పండితులతో ఒక సంస్కృత పాఠశాలను (కలకత్తాలో) ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిసింది. ఈ నిర్ణయం వ్యక్తికీ సమాజానికీ ఉపయోగపడని వ్యాకరణ సౌందర్యాలనూ అధిభౌతిక తత్త్వశాస్త్ర సూక్ష్మభేదాలనూ యువత బుర్రలలో నింపుతుందని మాత్రమే అనుకోవచ్చు.” అని తన అభ్యంతరాన్ని తెలియజేశాడు. ఆయన తన అభ్యంతరపత్రంలో “గణితం, సామాన్య తత్త్వశాస్త్రం, రసాయన, శరీర సంరచన లాంటి ఇతర ఆచరణాత్మక శాస్త్ర విషయాలను ఎన్నిటినో బోధించే ఉదారవాద జ్ఞానసంపన్న వ్యవస్థ” కోసం అభ్యర్థించాడు. క్లుప్తంగా చెప్పాలంటే, రామ్మోహన్ రాయ్ తన మద్దతుదారుల్తో కలిసి ఇంగ్లీషు మాధ్యమంలో పడమటి విద్యకోసం వాదించాడు.

ప్రాచ్యవాదులకు తూర్పుదేశాల లేక భారతీయ విద్యా వ్యవస్థ అతి విలువైనదిగా కనబడింది. వారిలో కొంతమంది గంభీరమైన పాండిత్యం గలవారు ఉన్నారు. వారు ప్రాచీన భాషలను ఎంతో కష్టపడి చదివారు. కొంతమంది సంస్కృతాన్ని జ్ఞాననిధిగా భావించారు. వారిలో కొంతమంది పాశ్చాత్యులే. భారతీయులు తమ దేశ సంస్కృతీ శాస్త్రాలను తమ భాషలలోనే నేర్చుకోవాలని వాదించారు. వారిలో గుర్తింపుపొంది ప్రసిద్ధులైనవారు హోరేస్ హైమన్ విల్సన్, ఎచ్.టి. ప్రిన్సెప్, ఇంకా డబ్లూ ఎచ్. మెక్నోటెన్ మొదలైనవారు. వారిలో కొంతమంది, “సంస్కృతం అరబ్బీ భాషలలో ఉన్న తత్త్వశాస్త్రాలు ఇతర భాషలలో అధ్యయనం చేసినట్లే ఆ భాషలలోకూడా

చదవవచ్చు" అని అన్నారు. "భారతీయుల అంకగణితం, బీజగణితం అవే ఫలితాలను ఇస్తాయి. యూరపులో ఉన్న నియమాలపై ఆధారపడినవే. మద్రసాలలో నేర్పే గణితశాస్త్ర మౌలికాంశాలు యూక్లిడ్ కి సంబంధించినవే" అంటూ వాదించారు.

ఈ వివాదం తీవ్రంగా ఉన్నప్పుడు బెంటింక్ భారతదేశం చేరుకున్నాడు. గవర్నర్-జనరల్ దీన్ని చాలా సంక్లిష్ట విషయంగా పరిగణించాడు. చాలా పరిపాలనా విభాగాలలో భారతీయులను నియమించాలి అనుకుంటున్నాడు కాబట్టి దానికోసం ఇంగ్లీషులో విద్య అవసరం అని అనుకొన్నాడు. కానీ నిర్ధారణకు వచ్చేందుకు కొంత కాలంగా వేచిచూస్తున్నాడు.

అప్పుడే, అంటే 1834లో మెకాలే ఇండియా రావటం జరిగింది. ఇతనికి గవర్నర్ జనరల్ మండలిలో న్యాయ సభ్యుడిగానేగాక విద్యా విషయాల బాధ్యతనుగూడా అప్పజెప్పాడు. ఈ పరిస్థితిలో మెకాలే ఆనాటి భారతదేశానికి విద్యావిధానాన్ని తయారుచేసే పనిలో మునిగిపోయాడు. ఐతే, ఆయనకు ప్రాచ్య దేశాలగురించి తెలిసింది తక్కువ. ప్రాచ్య విద్యపైగానీ ప్రాచ్య భాషలన్నాగానీ గౌరవం లేదు. సహజంగానే ప్రాచ్యవిద్యావాదులను ఈసడించుకొని ఆంగ్లవాదులను సమర్థించాడు. 1835 ప్రారంభంలోనే భారతదేశపు విద్యావిధాన నివేదికను పరతంత్ర భారత ప్రభుత్వ పరిశీలనకు సమర్పించాడు.

'మెకాలే విద్యావిధాన నివేదిక'గా కుఖ్యాతిని సంపాదించుకున్న ఈ నివేదికలో మెకాలే పనిగట్టుకొని సంస్కృత అరబ్బీ భాషలనూ ప్రాచ్య దేశాల సాహిత్యాన్నీ, విజ్ఞానాన్ని నిశితంగా విమర్శించాడు. ప్రాచ్య భాషాసాహిత్యాలను విమర్శిస్తూనే ఆంగ్ల భాషను బాగా ప్రశంసించాడు. అందులో ఇంగ్లీషును భారతదేశపు పాలక భాషగానూ అభివర్ణించాడు. ఐతే మెకాలే ఊహించనిది నేడు కొంత నిజం ఔతున్నదేమోనన్న అనుమానం కలుగుతోంది. ఇంగ్లీషు భాష భారతీయ సామాన్య జనవ్యవహారంలోకి త్వరత్వరగా వచ్చేస్తోంది. కానీ మెకాలే అనుకున్నదల్లా ఇంగ్లీషు భాష ప్రాచ్య విద్యా విధానంద్వారా ప్రాచ్య దేశాల వ్యాపార భాషగానూ సామ్రాజ్యాధిపత్య భాషగానూ విస్తరిల్లాలని మాత్రమే. ప్రజల భాషగా కాదు.

మెకాలే దేశభాషల ద్వారా జనాదరణ కలిగిన విద్యావిధానంగురించి ప్రస్తావించలేదు. నాడు బ్రిటిషు ప్రభుత్వ పాలకులకూ కోట్లాది జనులకూ మధ్య దుబాసీలుగా పనిచేసే భారతీయులను రక్తమూ రంగూ భారతీయమైనా రుచీ

అభిరుచులలోనూ ఆచారాలూ ఆలోచనలలోనూ నీతికీ బుద్ధికీ ఆంగ్లమానస పుత్రులైన ఒక వర్గాన్ని తయారు చేయాలన్నదే ఆయన కోరిక. ఈ వర్గమే దేశభాషలను సంస్కరించి, శాస్త్ర పరిభాషను రూపొందించి, వాటిని ఆధునిక అవసరాలకు మహాజనసామాన్యానికి జ్ఞానాన్ని అందించే దిశగా సాగాలని ఉద్దేశించాడు. ఇట్లా మెకాలే ఇంగ్లీషును భారతదేశపు ఉన్నత విద్యాభాషగానూ పడమటి విజ్ఞానాన్ని అధ్యయన అధ్యాపన విషయాలుగా చేయాలని సూచించాడు. ఇలాంటిదానికే ఎదురుచూస్తున్న బెంటింక్ వెంటనే దీనికి తన ఆమోదం తెలిపాడు. దీని ఆధారంగా, 1835 మార్చి 7వ తేదీన ప్రభుత్వం ఒక తీర్మానం చేసింది. ఆ తీర్మాన సారాంశమే, 'ఏలినవారి అభిప్రాయం ఏమిటంటే బ్రిటిషు ప్రభుత్వంవారి ఘనమైన లక్ష్యం యూరోపియన్ సాహిత్యమూ విజ్ఞానాన్ని భారతీయులలో పెంపొందించడం. ఇలాంటి విద్యకోసం ఉద్దేశించిన నిధులను పూర్తిగా ఇంగ్లీషు విద్యకోసమే వినియోగించాలి' అని.

**భారతీయ భాషల హక్కుల హరణం:**

బెంటింక్ ప్రవేశపెట్టిన ఈ ప్రతిపాదన భారతీయ విద్యావ్యవస్థ చరిత్రలోనే ఓ కొత్త అధ్యాయానికి తెరతీసింది. ఆనాటినుంచే పడమటి విద్యావిధానంతోపాటు ఇంగ్లీషు వాడకం వేళ్లానుకొంది. కొత్తగా ప్రారంభించిన కాలేజీలూ విశ్వవిద్యాలయాలతోనూ వాటివల్ల వచ్చిన ఉద్యోగాల లభ్యతవలన ఇంగ్లీషు నేర్చుకోవాలనే తపన పెరిగింది. ఈ చారిత్రాత్మక మార్పు భారతదేశపు వేల సంవత్సరాల వారసత్వ సంపదగా సంక్రమించిన భాషా సంస్కృతులకు పోయేకాలం దాపురించిపెట్టిన ఘనత మెకాలేకు దక్కుతుంది.

1854 వరకూ భారతదేశం వచ్చిన ఆంగ్లేయులూ, యూరోపియన్లూ, తదితర అధికారులూ అందరూ స్థానిక భాషలను అధ్యయనం చేస్తూ స్థానిక పండితులనుండీ స్థానిక భాషలను నేర్చుకొంటూ ఉండేవారు. ఈస్టు ఇండియా కంపెనీ ఏలుబడిలో భారతీయ భాషలలోనే పాలన సాగేది. అయితే, **నూట ఎనభై ఏళ్లకిందట ప్రారంభమైన ఆంగ్ల విద్యావిధానం ఒకరకంగా దేశీయ భాషల ప్రయోజకత్వాన్ని ప్రశ్నించేదిగా తయారైంది.** దానికి కారణం1857 నుండి ప్రారంభమైన కేంబ్రిడ్జి, ఆక్స్ఫర్డు మాదిరి విశ్వవిద్యాలయాలూ, కళాశాలలూ, ఉన్నత పాఠశాలలూ, వాటిలో చదివినవారికే బ్రిటీషు పాలనలో ఉద్యోగాలూ. దీనితో **భారతీయ విద్యాబోధన ఒక్కసారిగా ఇంగ్లీషుకు**

**మళ్లడం, ఆంగ్లవిద్యను జీవనానికి ముడిపెట్టడం ఒకేసారి జరిగిపోయింది. ఇది భారతీయ భాషలకు ఊహించరాని దెబ్బ.** బ్రిటిష ఇండియాలో ప్రభుత్వం ఆధికారికంగా ఒకే భాషతో పనిచేసింది. అదే ఇంగ్లీషు. ఆనాడే భారతీయ భాషలకు చెల్లుచీటీ రాయడం జరిగింది. ఐతే ఉద్యోగాలు తక్కువ అవడం, అత్యధిక జనం 99% స్థానిక సాంప్రదాయిక వనరులైన వ్యవసాయమూ, వృత్తిపనులపై ఆధారపడడం చేత భారతీయ భాషలకు ఏమంత నష్టం జరగనట్లే అనుకోవాలి. ఇంగ్లీషు విద్యావిధానంతో హైస్కూలు విద్యవరకూ తెలుగులోనూ ఆపైన కళాశాల లేక విశ్వవిద్యాలయ చదువులు ఐచ్ఛికంగా ఇంగ్లీషులో ఉండడం వలన ఇంగ్లీషు పరిపూరక స్థితిలో ఉండేది. అంటే ఇంగ్లీషు కొన్ని రంగాలకే పరిమితమై ఉండేది. ఉదాహరణకు ఉన్నత విద్య, ప్రభుత్వ పాలనా న్యాయ రంగాలకే పరిమితం. తెలుగూ తదితర భారతీయ భాషలను ఇతర రంగాలన్నింటా స్వేచ్ఛగా వాడుతుండేవారు. ఇదే కాలంలో ఇంగ్లీషు విద్య వలన దాని ప్రభావంతో భారతీయ భాషల వాడకంలో మార్పులు చోటుచేసుకున్నాయి. తెలుగులో ఆంగ్ల లేక యూరోపియను భాషా సరళిలో వ్యాకరణాల రచనా, నిఘంటువుల నిర్మాణం, వచన రచనల వాడకం పెరగడం ఒకరకంగా రచనా భాషను ప్రజలకు చేరువచేసే ప్రయత్నం జరిగింది. **అయితే ఉన్నత విజ్ఞాన భాషలుగా పాలనా భాషలుగా వాడకానికి వీలులేకుండా చేయడం కాళ్లూ చేతులూ విరిచి రెక్కలు కట్టినట్లు ముందుకు సాగడానికి వీలులేకుండా శాశ్వతంగా వైకల్యాన్ని అంటగట్టింది. ఇది తెలుగుకూ తదితర భారతీయ భాషలకూ కోలుకోలేని స్థితికి తీసుకువెళ్లింది.**

ఆధునిక యుగంలో ఏర్పడిన సామాజికభాషా సంక్లిష్టతకు వ్యాపారం, ఉద్యోగం, సంస్కృతి, విజ్ఞానంవంటివి ఎన్నో కారణాలు ఉన్నాయి. ఈ ప్రభావాలవల్ల ఆధునిక సమాజంలో వినిమయ వస్తుసముదాయాన్ని పునర్నిర్వచించవలసివస్తోంది. నేడు 'భాష' ఒక వినిమయ వస్తువు. ఒకప్పటి సాంస్కృతిక ఉపకరణం అత్యంత వేగంతో నేడు సామాజిక ఉన్నతికి ఉపకరణంగా మారుతోంది.

భారతదేశపు మొత్తం జనాభా నూట పాతిక కోట్లు కాగా, వారిలో సగం 25 ఏళ్లవారు –అంటే వారిలో 55 కోట్లమంది యువకులే. ఇంగ్లీష్ మాట్లాడేవారి శాతం వయోజన భారతీయుల్లో కంటే యువ భారతీయుల్లో ఎక్కువ. ఇంగ్లీష్ మాట్లాడేవారు మొత్తం భారత జనాభాలో (రెండవ భాషగా మాట్లాడేవారినీ మూడవభాషగా మాట్లాడేవారినీ కలుపుకొని) 9 శాతం ఉన్నట్లు అంచనా.

వైవిధ్యంలో, భారతదేశాన్ని మొత్తం ఐరోపా ఖండంతో పోల్చవచ్చు. భారతీయ రాష్ట్రాలు కొన్ని యూరోపియన్ దేశాల కంటే పెద్దవిగా ఉన్నాయి. ప్రతి రాష్ట్రానికీ దాని సొంత సంస్కృతీ దాని స్వంతభాష ఉన్నాయి. ప్రతి భారతీయ భాషా మరో భారతీయ భాషకు భిన్నంగా ఉంటుంది. ప్రతి భారతీయ భాషకూ దాని సొంత లిపి – ఉంటుంది. నేడు, విద్యావంతులైన భారతీయుల్లో ఇంగ్లీషు ఒక అనధికారిక "ఉమ్మడి" భాష. ఉన్నత విద్యను అభ్యసించిన భిన్నరాష్ట్రాల భారతీయులు ఇద్దరు కలిస్తే, వాళ్ల సంభాషణ ఇంగ్లీష్ లోనే ఉండటం సర్వసాధారణం. నేడు కార్పొరేట్ వ్యాపారం, బ్యాంకింగ్, విద్య, ప్రభుత్వపాలనా రంగాలలో ఆంగ్లానిదే పైచేయి. భారతదేశంలో కంప్యూటర్ వినియోగదారులు ఉపయోగించేది – ఇంగ్లీషే. భారతదేశపు సమాచార ప్రసార సాధనాలలో ప్రధాన నగరాలలో ఇంగ్లీష్ ఛానెళ్ల వాడకం తక్కువేమీ కాదు. ప్రపంచంలోనే అతిపెద్ద వార్తా పత్రికలలో మొదటి రెండు స్థానాలలో ఉన్న హిందుస్తాన్ టైమ్స్ మరియు ది హిందూ ఆంగ్ల దినపత్రికలు భారతదేశంలోనివే. భారతదేశపు సామాజిక కలనేతలో ఇంగ్లీష్ పాత్ర చాలా విలక్షణమైనది. భారత దేశానికి పట్టణం, గ్రామీణం అనే రెండు ముఖాలు ఉన్నాయి. గ్రామీణ భారతదేశం ఇంగ్లీష్ మాట్లాడటం లేదు, అయితే పట్టణ ప్రజలలో చెప్పుకోదగినంత మంది ఇంగ్లీష్ వాడుతుండవచ్చు. భారతదేశంలో ఇంగ్లీష్ సామాజిక ఉన్నతికి సూచికగా మారింది. భారతీయ సమాజంలో ఉన్నత, మధ్య తరగతి వర్గాలు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగలవు. నేడు, ఆంగ్లభాషా పరిజ్ఞానం సామాజిక ఉన్నతికి ఒక అత్యవసరంగా మారింది.

భారతదేశపు ఉన్నత విద్యా మాధ్యమ భాషగా పిలవని పేరంటానికి వచ్చిన ఇంగ్లీష్, ఆధిపత్య ధోరణిలో నెరపుతున్న దాని కర్రపెత్తనం, భారతీయ భాషలను అటకెక్కించివేసే దిశలో సాగుతోంది. ఈ విషయాన్ని ఆలంకారికంగా చెప్పాలంటే భారతీయులు ఇంగ్లీషు సరొగేట్ తల్లికి మారుటి పిల్లలు అని చెప్పవచ్చు.

**భారతీయ భాషలూ– ఇంగ్లీషూ: స్థితి – పరిస్థితి: సాహిత్య, విద్యారంగాలు:**

భారతీయ భాషలు గడచిన రెండువందల ఏండ్లలో ఇంగ్లీషు తదితర పాశ్చాత్య భాషా ప్రభావానికి గురయ్యాయి. పరభాషా ప్రభావం భారతీయ భాషలకు కొత్త విషయమేమీ కాకపోయినా పాశ్చాత్య భాషల ప్రభావం భారతీయ భాషలలో అనేక రకాల మార్పులు చోటుచేసుకునేందుకు దోహదంచేశాయి. ఈ ప్రభావం భారతీయ భాషలలో

గుణాత్మకమైన మార్పులకూ పరిపుష్టికీ దోహదంచేసినా ఉత్తరోత్తరా వాటి ఉనికే ప్రశ్నార్థకమయ్యేలాగా చేసింది అనాలి. ఆధునిక యుగంలో ఆంగ్లభాషా పరిచయం వలన మన సాహిత్యం పరిపుష్టి అయిందని చెప్పవచ్చు. ఆంగ్లసాహిత్యాన్ని చదివి, అక్కడి భావజాలమే కాకుండా సాహితీ ప్రక్రియలు సైతం దిగుమతి అయ్యాయి. కథ, నవల, ఖండకావ్యం, ఆత్మకథ, జీవితచరిత్ర లాంటి ప్రక్రియలెన్నో తెలుగులో ఆవిర్భవించాయి. ఉదాహరణకు 'సత్యరాజా పూర్వదేశయాత్రలు' అనే రచననే తీసుకుంటే దీనికి మూలం జోనాథన్ స్విఫ్ట్ రాసిన 'గలివర్ ట్రావెల్స్' అనే రచన మూలం. తర్వాతికాలంలో అనేక రచయితలు విదేశీ రచయితలచేత ప్రభావితులయ్యారు. ఎడిసన్ రాసిన 'స్పెక్టేటర్'ను చదివిన తరువాతే పానుగంటివారు 'సాక్షి'ని సృష్టించారు. భమిడిపాటి, మొక్కపాటివారి నాటక సృజన మోలియర్ నాటకాలు చదివిన ప్రభావమే. పిజి ఉడ్‌హౌస్ రచనలకు ప్రభావితులైన తెలుగు రచయితలలో పాలగుమ్మి పద్మరాజుతో సహా ఎందరో రచయితలు వున్నారు. శ్రీశ్రీ, ఆరుద్ర వంటి మహామహుల హాస్యపద్య రచన ఆగ్డెన్ నాష్ రాసిన లిమరిక్స్ ప్రభావమే అంటారు. ఆధునికి విమర్శ కూడా భారతీయ అలంకారశాస్త్ర పరిధిని దాటి పాశ్చాత్య ప్రభావంతో కొత్తపుంతలు తొక్కింది. సంప్రదాయ సాహిత్యంపైనే కాక అలంకారాది శాస్త్రాలపై కూడా సంస్కృత భాషాప్రభావం అధికంగా ఉన్న కాలంలో తెలుగు వ్యాకరణ రచన సంస్కృత వ్యాకరణ సంప్రదాయాలను అనుసరించింది. కొన్ని వ్యాకరణాలు, వ్యాఖ్యానాలు సంస్కృతవ్యాకరణ ప్రభావంతో వెలుగు చూశాయి.

తరువాత కాలం మారింది. కాలంతోపాటు అవసరాలూ మారాయి. ఆంగ్లేయులు తెరమీదికి వచ్చారు. వారి రాక భారతీయ సంస్కృతి సంప్రదాయాలనే కాక భాషా సాహిత్యాలనూ ప్రభావితం చేసింది. ప్రాచీనపద్ధతిలో వచ్చిన సంస్కృతంలో ఉన్న తెలుగు వ్యాకరణాలు విద్యార్థులకు సులభంగా అర్థం కావడంలేదనే భావన కలిగింది. పద్యరూపంలోనో, సంస్కృతంలోనో సూత్రప్రాయంగానో ఉండడం వల్ల వ్యాకరణాన్ని సులభంగా అర్థం చేసుకోవడంలో వైఫల్యాలు తొంగిచూశాయి. ఈ అవసరాన్ని పూరించేందుకు ఆంగ్ల విద్యావిధానం ఫలితంగా తెలుగులో లఘువ్యాకరణ రచన ప్రారంభమైంది. ప్రాచీన వ్యాకరణాలను, వాటిపై గల ప్రభావాలను అన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ప్రసిద్ధ భాషా పండితులు కొందరు విద్యార్థులకు వ్యాకరణాన్ని బోధించే అధ్యాపకులుగా ఉండటం ఈ రకమైన వ్యాకరణాలు రావడానికి దోహదం చేసింది.

తెలుగు దేశంలో తమ వ్యవహార కార్యకలాపాలను సమర్థంగా నిర్వర్తించడానికి తెలుగు భాషను నేర్చుకోవలసిన అవసరం ఆంగ్లేయులకు ఏర్పడింది. ముఖ్యంగా వచన భాషలోనూ, వాడుక భాషలోనూ ప్రావీణ్యం సంపాదించడానికి, తెలుగు పండితుల చేత ఆంగ్లేయులు వ్యాకరణాలను రాయించుకొన్నారు. ఆ విధంగా తెలుగు వ్యాకరణాలు ఆంగ్లంలో కూడా వెలుగు చూశాయి. పుదూరి సీతారామశాస్త్రి (క్రీ. శ. 1834) ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణం, రావిపాటి గురుమూర్తిశాస్త్రి (1770-1836) తెనుఁగు వ్యాకరణం, వడ్లమూడి గోపాలకృష్ణయ్య (1958) వ్యావహారిక భాషావ్యాకరణం, మల్లాది సూర్యనారాయణశాస్త్రి (క్రీ. శ. 1926) ఆంధ్రభాషానుశాసనం, వి. వేంకటేశ్వర్లు (క్రీ. శ. 1982) ప్రామాణికాంధ్రవ్యాకరణం ఆంగ్లభాషావిధానాన్ని అనుసరించి వచ్చిన వ్యాకరణాలే.

**తెలుగు నిఘంటువులపై ఆంగ్లభాషా ప్రభావం:**

వైదిక, లౌకిక సంస్కృత పదాలకు వ్యత్యాసం ఉండడం వల్ల నిఘంటు నిర్మాణావశ్యకతను ప్రాచీనకాలంలోనే మనవారు గుర్తించారు. సంస్కృతనిఘంటువులలో వైదిక నిఘంటువు, యాస్కుని నిరుక్తం, అమరకోశం ఈ మూడూ సలక్షణమయిన నిఘంటువులు. ప్రాచీన అర్వాచీన నిఘంటు నిర్మాణపద్ధతులకు మూలాలు ఈ నిఘంటుత్రయం నుండే అభివృద్ధి చెందాయని చెప్పవచ్చు. తెలుగుభాషకు సంబంధించి నిఘంటురచన క్రీ. శ. 17వ శతాబ్ది నుండి ప్రారంభమైంది. తెలుగు భాషా సాహిత్యాలపై సంస్కృత భాషా ప్రభావం ఉండటం వల్ల సంస్కృతంలోని అమరకోశాదుల అధ్యయనం తెలుగు వారికి అవసరమైంది. అందువల్ల 17వ శతాబ్ది వరకు నిఘంటునిర్మాణానికి ప్రయత్నాలు జరగలేదు. అనంతర కాలంలో అచ్చతెలుగు కావ్యాలు ఆవిర్భవించాయి. అన్యదేశ్య ప్రయోగాలు కూడా కావ్యాలలో పెరిగాయి. కాబట్టి తెలుగుభాషకు సంస్కృత కోశాలు పరిపూర్ణంగా ఉపయుక్తాలు కావనే భావన కల్గింది. అప్పటి నుండి పద్యనిఘంటువులు ఆవిర్భవించాయి. అయితే ఇవి కూడా సంస్కృత కోశాదుల పద్ధతిలోనే ఉన్నాయి. పాశ్చాత్యుల రాకతో, వారి సంపర్కం వల్ల అకారాది నిఘంటువులు వెలిశాయి. అకారాది క్రమంలో ద్విభాషాకోశాలు, ఏక భాషాకోశాలు పారిభాషిక నిఘంటువులు, పదపట్టికలు, వైద్య నిఘంటువులు, లఘుకోశాల వంటి విలక్షణమైన గ్రంథాలు ఆవిర్భవించాయి. ఆధునిక విద్యలో భాగంగా ఆంగ్లభాషావిధానాన్ని అనుసరించి తెలుగులో భాషాశాస్త్ర

అధ్యయనం ప్రారంభమయ్యింది. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి వంటివారు తెలుగు భాషాశాస్త్ర పరిశోధనకు పునాదులు పటిష్టంగా వేశారు. అందులో భాగంగానే మాండలిక భాషా పరిశోధన ప్రారంభమయ్యింది. తెలుగు రాష్ట్రాలలో ఉన్న అనేక వృత్తులవారు మాట్లాడే వివిధ రకాల తెలుగు మాండలిక భేదాలకు సంబంధించిన వివరాలను సేకరించి వ్యవసాయం, చేనేత, కమ్మరం, కుమ్మరం, వడ్రంగం, వాస్తు, మేదర వంటి సుమారు 25 వృత్తిమాండలికాలలో పదకోశాల నిర్మాణం జరిగింది. సామాజిక భాషాశాస్త్ర పరిధిలో జరిగిన ఈ పని వలన ప్రపంచ భాషలలోనే తెలుగు ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది.

**తెలుగుభాషపై ఆంగ్ల భాష ప్రభావం:**

ఇక తెలుగు భాష విషయానికి వస్తే... తెలుగు భాషపై సంస్కృత, ప్రాకృత, ఉర్దూ, ఇంగ్లీషు భాషల ప్రభావం ఉంది. నేడు ఆంగ్లభాష ప్రపంచ భాషలలో 3వ లేక 4వ భాషగా అధిక వాగ్వ్యవహారంలో ఉంది. దానికి సామాజిక, చారిత్రకాది అనేక కారణాలు ఉన్నప్పటికీ భాషాపరంగా చూసినట్లయితే ఎటువంటి కొత్త భావాలనైనా తనలో ఇముడ్చు కొని వాటికి స్వీయభాషాలక్షణాలను జతకలిపి ప్రయోగార్హంగా మార్చుకోగలగడం ఆంగ్లభాష కు ఉన్న ప్రత్యేకతలలో ఒకటి. అసాధారణ స్వీకరణ అనుకరణ లక్షణాలు (extraordinary receptive and adaptability), భిన్నజాతీయాత్మకత (heterogeneousness), స్వతంత్రత (Individuality) మొదలైన లక్షణాలతో ఆంగ్లభాష విశ్వప్రఖ్యాతిని సాధించు కొంది. వీటిని దృష్టిలో ఉంచుకొనే ప్రఖ్యాత అమెరికా తత్వవేత్త రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ ఆంగ్ల భాష అనే సముద్రం ప్రపంచంలోని అన్ని ప్రాంతాల కాలువల నుండి నీటిని స్వీకరించింది అన్నారు. ఈ లక్షణాలవల్ల పరిపుష్టమైన ఆంగ్లభాషనుండి పాలనా పరంగా సంపర్కం ఏర్పడిన కారణంగా ఎన్నో పదాలు భారతీయభాషలలోకీ అలాగే తెలుగులోకీ ప్రవేశించాయి. ఉదాహరణకు కోర్టు, కోచ్, రౌడీ, ర్యాలీ, జడ్జీ, ఫీజు, టైం, కారు, లారీ, బస్సు, రోడ్డు, లైటు మొదలైనవి ఆంగ్లపదాలే. ఆయా కాలాల్లో ఆయా భాషల నుంచి ఎన్నో పదాలు, సమాసాలు, ప్రత్యయాలు, వాక్యనిర్మాణాలు తెలుగులోకి ప్రవేశించాయి. అంతకుముందు మహమ్మదీయుల పరిపాలన కారణంగా అరబ్బు, పర్షియన్ భాష పదాలు తెలుగులోకి వచ్చాయి. మహమ్మదీయులు 13వ శతాబ్దంలో తెలుగునాట దండయాత్ర జరుపక ముందే మహాకవి తిక్కన సోమయాజి (13వ

శతాబ్దం)  తరాజు (త్రాసు) అనే పదాన్ని రెండుసార్లు తన భారతరచనలో ప్రయోగించాడు. అంటే మహమ్మదీయులు వచ్చీరాక ముందే తరాజు అనే పదం తెలుగులోకి వచ్చిందని తెలుస్తోంది.

విజయనగర రాజులకాలంలో మహమ్మదీయ సైనికులు హిందువులతో సఖ్యంగా ఉండటం వల్ల వారు మాట్లాడే పంజాబీ, హర్యానీ, అరబిక్, పర్షియన్ పదాలు తెలుగువారి పదాలుగా మారిపోయాయి. మహమ్మదీయుల పరిపాలన కాలంలో ప్రభుత్వ ఉద్యోగులు, పాలకులు కూడా పర్షియన్ భాషను నేర్చుకున్నారు. తద్వారా పర్షియన్ పదాలు అనేకం తెలుగులోకి వచ్చిచేరాయి. దివాన్, కొత్వాలు మొదలైన పర్షియన్ పదాలు పరిపాలనా సౌలభ్యం కోసం 1580 సంవత్సరంలో మహమ్మద్ కులీకుతుబ్‌షా కాలంలో దిగుమతి అయ్యాయి. మాతృభాష అయిన తెలుగునే కాకుండా సామాన్య ప్రజలు కూడా కుతుబ్‌షా కాలం నుంచి పర్షియన్, ఉర్దూ, హిందుస్తానీ పదాలను విరివిగా నేర్చుకోవాల్సిన అవసరం ఆనాటి పాలకులవల్ల కలిగింది.  ఉదా. జమ, దఫా, కబ్జా, ఖాతా, హోదా, గూండా, అర్జీ, గస్తీ, కుస్తీ, బస్తీ, కూపీ, మాఫీ, హామీ, లాఠీ, బాకీ, పేచీ, రద్దు, బంద్, జప్తు, షురూ మొదలైనవి. దీనిని బట్టీ సామాజిక సాంస్కృతిక, రాజకీయాది ప్రభావాలు తెలుగు భాషపై ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదే ఒరవడిలో ఆంగ్ల భాషనుండి కేవలం పదాలే కాక ఆంగ్లంలోని నుడికారాలు కూడా తెలుగులోనికి ప్రవేశించాయి. ఉదా. రెడ్ హాండెడ్ గా పట్టుకొను, రెడ్ అలర్ట్ ప్రకటించు, బ్లాక్ మెయిల్ చేయు, బ్లాక్ లిస్టులో పెట్టు, క్లీన్ చిట్ ఇచ్చు, హాట్ కేక్ లా అమ్ముడుపోవు మొదలైనవి. ఇచ్చిపుచ్చుకొనే ఏ రెండు భాషా(వ్యవహర్తల) సమూహాల మధ్యనైనా కొంతకాలానికి వారి సంస్కృతీ, సాంప్రదాయాలూ, జీవన విధానంలో ఉన్న కొన్ని భేదాలు తగ్గి ఎంతోకొంత సామ్యం కనబడటం మొదలౌతుంది. అట్లాంటిదే భారతీయభాషలూ ఆంగ్లభాషల మధ్యనున్న సంబంధం. ఆంగ్లభాషాప్రభావంతో తెలుగులోనికి ఇంచుమించు సమానార్థకాలుగా ప్రవేశించిన కొన్ని ప్రయోగాలు కన్పిస్తాయి.  ఉదాహరణలు చూడండి.

He talks in the air.  'వాడు గాలిమాటలు చెప్తున్నాడు'

Who bells the cat?  'పిల్లి మెడలో గంటెవరు కడతారు?'

Bird's eye view -  'విహంగ వీక్షణం'

Prime minister took a bird's eye view 'ప్రధానమంత్రి విహంగ వీక్షణం చేశారు'

To have a hand - 'హస్తం ఉంది '

Crocodile tears - 'మొసలి కన్నీరు '

Out of date - 'కాలం చెల్లిన'

Jack pot - 'నక్కను తొక్కు'

అనువాదాలను అన్వేషిస్తే ఇటువంటి నుడికారాలూ కుప్పలుతెప్పలుగా తప్పక దొరుకుతాయి. కొన్ని కొన్ని ఆంగ్లభావాలకు అనుగుణంగా తెలుగులో నూతన పదాలను సృష్టించుకొని తెలుగులో వాడడం కన్పిస్తుంది. ఉదా. నగ్నసత్యం, శ్వేతపత్రం, కంటితుడుపు చర్య, పచ్చజండా ఊపు, కుంటిసాకులు చెప్పు, బాల్చీతన్నివేయు మొదలైననవి. ఎన్నో విరామ చిహ్నాలు కూడా ఆంగ్లం నుండే తెలుగుభాషలో ప్రవేశించాయి.

పత్రికలు భాషా వినిమయానికి ప్రధాన సాధనాలు. ఇందులో నివేదికలు, రాజకీయ, క్రీడా, వ్యాపార వార్తలూ ఇలా ఎన్నో అన్నీ పత్రికల పరిమితులకు లోబడి ఉంటాయి. ఆంగ్ల భాషలోని వార్తలనూ, కథనాలనూ అనువదించి తెలుగులో ప్రచురించటం వల్ల ఆంగ్లభాషా ప్రభావం ఎక్కువగా కన్పిస్తుంది. మౌఖిక భాషలో లేని ప్రయోగాలూ వాక్య విన్యాసాలూ పత్రికలలో కన్పిస్తుంటాయి.

ఉదా. అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నాయి.

కర్మణిప్రయోగం తెలుగు భాషకు అసహజం. నన్నయ పూర్వయుగ శాసనాలలోనూ కర్మణి ప్రయోగాలూ యత్తదర్థక ప్రయోగాలు అత్యంత స్వల్పం. నన్నయ భాషలో సంస్కృత ప్రభావం వల్లనే కన్పిస్తున్నాయి. ఆధునిక భాషలో ముఖ్యంగా పత్రికా భాషలో ఆంగ్ల ప్రభావం వల్ల 'బడు' ప్రయోగం కన్పిస్తుంది.

ఉదా. కళాశాల ప్రారంభిస్తున్నామని చెప్పటానికి సంతోషిస్తున్నాం.

ఇలాంటి వాక్యాలు మౌఖిక భాషలో ఉండవు. ముఖ్యంగా ప్రచారం కోసం చేసే ప్రకటనలలో ఎక్కువగా కన్పిస్తాయి.

శ, ష, స లు ఆధునిక తెలుగులో ఆంగ్ల, హిందీ భాషల ప్రభావం వల్ల ఒకదాని స్థానంలో మరొకటి ఉచ్చరింపబడతాయి. అవ్యుత్పన్నత కూడా దీనికి కారణంకావచ్చు.

ఉదా. ఆంధ్ర ప్రదేశ్ – ఆంధ్ర ప్రదేష్,

అరుణాచల ప్రదేశ్ – అరుణాచల ప్రదేష్, రమేశ్– రమేష్

రాతలో 'శ' కారమే ఉంటుంది. ఉచ్చారణ లోనే 'ష' కారం విన్పిస్తుంది. 'దేశం'

అని విడిగా రాసినప్పుడూ పలికినప్పుడూ శకారమే ఉంటుంది. ఇలా ఎన్నో భాషాపరిణామాలు ఆంగ్లభాషాప్రభావం వల్ల తెలుగులో ఏర్పడ్డాయి.

**భాషలో మార్పులూ-ప్రపంచీకరణ:**

సంస్కృతీ సాంప్రదాయాలూ కట్టూబొట్టూ ఆహారపుటలవాట్లూ, విద్యా వ్యాపార రంగాలూ మొదలయినవాటిల్లో వచ్చిన పరిణామాలవల్ల తెలుగుపదజాలం కూడా నిత్యవ్యవహారంలోంచి జారిపోతోంది. సామాన్యజన వ్యవహారం కూడా దీనికి అపవాదం కాదు. శాస్త్రసాంకేతికరంగాలకు సంబంధించిన పదాల విషయంలో మూలభాషాపదాలను వాడడం సహజంగానే జరుగుతుంది. వీటికి కూడా తెలుగు పదాలను తయారుచేసుకోవచ్చు. సామాన్యవ్యవహారంలో అన్యభాషాపదాలను వాడవలసివచ్చినప్పుడు తెలుగులో ఉన్న పదాలనే ఆయా అర్థాలకు సంబంధించిన వాటిని వ్యాప్తి చేయవచ్చు. లేకపోతే కొత్తపదాలను సృష్టించవచ్చు. అయితే తెలుగులో ఈ రెండింటికీ విరుద్ధంగా జరిగింది. కొత్తగా పరిచయ మయిన వాటికి కొత్తపదాలను సృష్టించకపోగా తెలుగులో ఉన్నపదాలకు బదులుగాకూడా ఆంగ్లపదాలనే వాడుతున్నారు. తెలుగులో మాటాడడాన్ని తక్కువగా భావించడం, పరిభాషను తయారు చేసుకోలేకపోవడం దీనికి కారణాలు.

బంధుత్వాలను తెలిపేందుకు నేడు ఆంగ్లాన్నే ఎక్కువ వాడుతున్నారు. ఆంటీ అనే పదం పిన్ని, చిన్నమ్మ, అత్త, పెద్దమ్మ ఇంకా తనకంటే వయసులో పెద్దైన తన తల్లి వయసుకు అటూ ఇటుగాఉన్న స్త్రీనీ; అంకుల్ అనే పదం బాబాయి, చిన్నాన్న, మామ, పెద్దనాన్న తనకంటే వయసులో పెద్దైన తన తండ్రి వయసుకు అటూ ఇటుగాఉన్న మగవాడినీ; ఇంకా బ్రదర్, సిస్టర్ అనే పదాలు అన్నాతమ్ముళ్లనూ, అక్కా చెల్లెళ్లనూ తోసిరాజం టున్నాయి. ఇక మమ్మీ, డాడీ, గ్రాండ్ మదర్, గ్రాండ్ ఫాదర్ వంటిపదాలు సరేసరి.

నేటితరానికి వారి శరీరభాగాల పేర్లు పూర్తిగా తెలుగులో తెలీనే తెలియవు. అంగిలి, ఉల్లం, ఎమ్ము, కీలు, నరం, నెరిడె, మణికట్టు, మీగాలు, ముంజేయి, మునివేళ్ళూ, మూలగ లాంటి శరీరభాగాల పేర్లు తెలీదు.

ఆహారపుటలవాట్లు కూడ మారడంతో – చపాతీ, రోటీ, లడ్డూ, జిలేబీ, జాంగ్రీ, పూరీ, పుల్కా వంటి హిందూస్థానీ వంటకాలకు సంబంధించిన పదాలు; పిజ్జా, బర్గర్, సూప్, బ్రెడ్, బిస్కెట్ లాంటి ఆంగ్లపదాలు వ్యాప్తిలోకి వచ్చాయి.

నిత్యవ్యవహారంలో ఉపయోగించే కూరలపేర్లు, దినుసులపేర్లు, వస్తువులు, జంతువులు, కట్టడాలు, ఆటలు, కాలం మొదలయిన వాటిని సూచించే పదాలు, సంఖ్యావాచకాలు, వస్త్రవిశేషాలు... ఇలా చెప్పుకుంటూపోతే మానవజీవనంతో సంబంధం ఉన్న ప్రతి  అంశంలోనూ తెలుగు పదాల్ని కుప్పలుకుప్పలుగా ఆంగ్లపదాలు ఆక్రమించాయి. ఐతే, ఇట్లా ఆంగ్ల పదాలనుకొంటున్న వేలాది పదాలు ఇంతకుముందే లాటిను, ఫ్రెంచి, జర్మానిక్ భాషలూ ఇంకా అనేక ప్రపంచ భాషలనుండి ఇంగ్లీషులోకి ప్రవేశించినవే.

తెలుగు భాష లోని పదాల స్థానే ఆంగ్లపదాలు వ్యవహారంలోనికి రావడానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. సమాజంలో అతి వేగంగా వస్తున్న కొత్తకొత్త భావనలూ దానికి అనుగుణమైన మార్పులూ, అత్యంత ప్రభావశీల పారిశ్రామికీకరణం, అంతర్జాలం ద్వారా వాడుకలోకి వస్తున్న వాణిజ్యం మొదలైనవి. ఉదా. గ్యాస్ స్టవ్. ఈ పదం ఇదివరకు లేదు. పొయ్యి, కుంపటి వంటివే వాడుకలో ఉండేవి. ఇక తెలుగు పొయ్యీ, కుంపటికీ పొయ్యేకాలం వచ్చేసినట్లే.

గ్యాస్ స్టవ్ వాడకం పెరగడంతో పొయ్యి, కుంపటితో పాటుగా పొంత, గొట్టం, నుసి, పిడక, కచ్చిక వంటి పదాలెన్నో వ్యవహారంలోంచి జారిపోతున్నాయి. అలవాట్లు మారినా నష్టం భాషకే. గ్యాస్ స్టవ్ ను 'గ్యాసుకుంపటి' అని తెలుగులోకి అది ప్రవేశించి నప్పుడే చేసుకొని ఉంటే కనీసం కుంపటి అనే పదమయినా మిగిలి ఉండేది.

ప్రాచీనకాలపు పనిముట్ల వాడకంకూడా నేడు తగ్గింది. అందువల్ల ఆ పదాలు కూడా అందరికీ తెలియవు. ఇవేకాకుండా సామాన్యజనుల వ్యవహారంలో ఉన్న వివిధ రంగాలకు చెందిన పదాల స్థానంలోనూ ఆంగ్లపదాలు వ్యాప్తిలోకి వస్తున్నాయి. వైద్యం, ఆరోగ్యం, న్యాయం, పరిపాలన, ఆర్థికం, సామాజికం, వ్యవసాయం, వృత్తులు, వ్యాపారాలు, విద్య, వంటి రంగాలలోనూ అధికంగా ఆంగ్లభాషాపదాల వాడుక కన్పిస్తుంది. పాశ్చాత్యసంస్కృతి ప్రభావం వల్ల పాశ్చాత్యుల అలవాట్లు కూడా ఇక్కడికి దిగుమతి అవుతూనే ఉన్నాయి. దీని వల్ల కూడా ఆంగ్లపదజాలాన్ని తప్పనిసరిగా ఆశ్రయించవలసివస్తోంది.

ఉదాహరణకి షాపింగ్ మాల్ సంస్కృతి. అందులో అమ్మే వస్తువులలో చాలావాటికి తెలుగులో పేర్లూ పదాలూ ఉన్నప్పటికీ ఆంగ్లంలోనే రాస్తున్నారు. వ్యవహరిస్తున్నారు. వీటన్నింటికీ ప్రపంచీకరణ, ప్రతిష్ఠాపాదకత కూడా కొంత కారణాలు అవుతున్నాయి. వాటివల్ల తెలుగుపదాలు మరుగునపడిపోతున్నాయి.

ఇక నుడికారం సంగతి సరే సరి. తామరతంపరగా వ్యాప్తిలోకి వస్తున్న పదాలకు అడ్డుకట్టవేసే విధానం ఎప్పుడూ భాషావ్యవహర్తలలోనే ఉంటుంది. వారు ఆయా వస్తువుల స్వరూపాన్ని బట్టి సహజంగా సులభంగా మూలానికి దగ్గరగా ఉండే పదాలు తయారు చేస్తారు. వాటిని గుర్తించి వ్యవహారంలోకి తెచ్చేప్రయత్నం చేయాలి. ఏదయినా ఒకపదం చక్కగా తెలిగించితే అది తప్పకుండా సర్వజనామోదాన్ని పొందుతుంది. భాష నష్టపోవ డానికి మన పరభాషావ్యామోహం మాత్రం కారణం కాకూడదు.

జనవ్యవహారం చాలా పదునైనది. కొత్త భావనలకు కొత్త పదాలు అవసరమైనపుడు వాటిని ముఖ్యంగా తెలుగులో వాడడానికి అవకాశం ఉన్న సందర్భాలలోకూడా మన పత్రికలు ఆంగ్లపదాలనే వాడుతున్నాయి. ఉదా: స్వైన్ ఫీవర్ సామాన్యజనాన్ని వణికించిన రోగం. దాన్ని పందిజ్వరం అని ఒక్క పత్రిక కూడా రాయలేదంటే తెలుగుభాషని వాడాలనే తపన పత్రికలవారికి ఎంత ఉందనేది తెలుస్తోంది. దీనికే కన్నడంలో 'హందిజ్వర' అని ప్రాచుర్యం. మరి పక్కవాళ్లని చూసి మార్చుకుందామని పత్రికలవాళ్లకి ఆసక్తి కలగలేదంటే కొత్తదనాన్ని మనవాళ్లు ఆహ్వానించడంలేదనే అనుకోవాలి.

ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన పారిభాషికపదాలకు తెలుగులో కూడా ఆంగ్లపదాలనే ఉపయోగిస్తున్నాం. ఇవి ఇప్పటికే అధికప్రాచుర్యాన్ని పొందాయి. నామవాచకాల సంగతి అటుంచి క్రియలను కూడా యథేచ్ఛగా ఆంగ్లక్రియలనే వాడుతున్నాం. వీటి బాహుళ్యాన్ని తగ్గించి, తెలుగు క్రియా వినియోగాన్ని పెంచాలంటే- ప్రయత్నం నిరంతరం చేయాలి. అలాగే భాషాశాస్త్ర పరిభాషలోనూ, యంత్రానువాద పరిభాషలోనూ ఆంగ్లపదాలకు సమానార్థకాలను కల్పించవచ్చు, ఉదా. Spell-checker 'దిద్దరి', icon 'రూపు', internet 'అంతర్జాలం', (word) generator '(పద) జనకం', మొదలైనవి. అలాగే సరళీకరణ ప్రపంచీకరణ లాంటి పదాల ప్రభావంవల్ల గ్లోబలీకరణ, ప్రైవేటీకరణ మొదలయిన పదాలు అర్థబోధకశక్తి ఉన్నందువల్ల వ్యాప్తిలోకి వచ్చాయి. వీటినీ స్వీకరించాలి.

**మాతృభాషామాధ్యమం -ఆంగ్లభాషాప్రభావం**

క్రిస్టియన్ మిషనరీలు ఈస్టిండియా కుంఫిణీ ఏలుబడి మొదలుకాక ముందునుంచే విద్యారంగంలోకి ప్రవేశించాయి. ఈ మిషనరీలు 1717 నుండే కొన్ని పాఠశాలలు ఏర్పాటు చేసి, తెలుగు తదితర భారతీయ భాషలలోనే లౌకిక విద్యావిషయాలనూ

వాటితోపాటు క్రైస్తవ తత్త్వజ్ఞానాన్నీ బోధించడం ప్రారంభించాయి. 1813లో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వం మొదటిసారి తమ అధీనంలో వున్న ప్రజలకు విద్యను అందించటం తన బాధ్యతగా స్వీకరించింది. అప్పటికి ధనవంతులు తమ పిల్లలకు గుడుల్లోనో, గ్రామ చావిళ్లలోనో లేక ఇళ్లల్లోనో చదవనూ రాయనూ నేర్పించేవారు. వీటిలో సాహిత్య, ధార్మిక, తాత్త్విక, గణితాది విషయాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. అవి పూర్తిగా సంస్కృతం తోపాటు తెలుగులోనే సాగేవి. అయితే 1813లో కుంఫిణీ ప్రభుత్వం భారతీయులకు విద్యను అందించే ప్రక్రియలో కొన్ని మార్పులు ప్రవేశపెట్టారు. ఈ మార్పులు తామస్ మన్రోతో ప్రారంభం అయ్యాయి. మన్రో 1826లో ప్రజావిద్య పేరుతో మౌలికమార్పులు తీసుకువచ్చాడు. వాటిలో ముఖ్యంగా ప్రతి తాలూకాలో ఒక తహశీల్దారీ పాఠశాల, ప్రతి జిల్లాకి ఒక కలెక్టరేటు పాఠశాల పెట్టి నడిపించాడు. తహశీల్దారీ పాఠశాలల్లో పూర్తిగా తెలుగు మాధ్యమంలోనే చరిత్ర, రాజనీతి, భూగోళం, సాహిత్యం, గణితం నేర్పించేవారు. ఐతే జిల్లా స్థాయి కలెక్టరేటు పాఠశాలల్లో తెలుగూ తదితర భారతీయ భాషలు తప్ప, ఇంగ్లీషు భాషతో పాటు యూరోపీయ సాహిత్యం, చరిత్ర, రాజనీతి, భూగోళం, విజ్ఞానం, గణితం లాంటివి అన్ని విషయాలూ ఆంగ్ల మాధ్యమంలోనే సాగేవి. బ్రిటిషువారు కొత్తగా స్థాపించిన ఆంగ్ల మాధ్యమ పాఠశాల వ్యవస్థ భారతీయ వారసత్వం నుండి భారతీయ యువతను విముఖం చేయడమేగాదు, చాకచక్యంగా వారిలో విజాతీయతను పాదుకొల్పు తోంది అని అనీబిసెంట్ (1897) భావించింది. అయితే, సర్ జార్జ్ కేంబెల్ ఆనాటి పల్లెటూరి బడులలో భారతీయ భాషలూ భారతీయ సాంప్రదాయిక విషయాలూ నేర్పుతుండే వారు అని 1872లో తన నివేదికలో పొందుపరిచాడు. అంటే ఆనాడు భారతీయ భాషలకు వెంటనే ఎలాంటి ప్రమాదమూలేదని తెలుస్తోంది.

**అధికారంతో, అహంభావ పూరితమైన బ్రిటిష్ చరిత్రకారులు భారతదేశం బ్రిటిష్ సృష్టి అని వాదించేవారు. ఒక ఉమ్మడి భాష, మతం లేకుండా, భారతదేశం అనే భావనలేదు అనీ ఒక దేశం కాదు అనీ వాదించారు.** జాన్ స్టువర్ట్ మిల్ ప్రకారం, జాతీయవాదానికి గతకాలపు ఉమ్మడి సంఘటనలు ఉమ్మడి చారిత్రక జ్ఞాపకాలే మూలాలు. భారతదేశానికి గతంలో, అతను సూచించినట్లు, భారతదేశంపట్ల భారతదేశంలోని ప్రజలందరూ విధేయత గానీ అణకువగానీ ప్రదర్శించడం లేదు. ఇంకా, ఆ దేశం అటువంటి బంధాలనూ భావజాలాన్ని గానీ అందించడంలేదు

అంటాడు. అయితే భారతీయుల పట్ల భారతదేశంపట్ల గౌరవం, ఆదరణ ఉన్న ఎందరో పాశ్చాత్యులూ భారతీయులూ ఇట్లాంటి సంకుచిత జాతీయవాదానికీ అట్లాంటి ఆలోచనలకూ దీటుగా జవాబు చెప్పారు. **ఒకే భాష, ఒకే మతం జాతీయతకు గుర్తింపు అని నమ్మడం సంకుచిత అభిప్రాయమనీ పలు భాషలూ, పలు మతాలూ, పలు సంస్కృతుల మేళవింపుతో వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భారతదేశానికి పాశ్చాత్య జాతీయవాదం గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లుందని ఎందరో రాజనీతిజ్ఞులు ప్రకటించారు.**

**భారతీయ భాషలూ  తరిగిపోతున్న వ్యవహార రంగాలు:**

భారతదేశంలో ఆర్యభాషల మీద ద్రావిడభాషల (తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం) ప్రభావం భాషా నిర్మాణం మీదా,  అలాగే ద్రావిడ భాషలపై ఆర్యభాషల ప్రభావం పదజాలంమీదా ఎక్కువగానూ  కనిపిస్తుంది. ఆస్ట్రో-ఏషియాటిక్, సైనో-టిబెటన్ భాషలపై కొంతమేరకు ఆర్య, ద్రావిడ భాషల ప్రభావం కనబడుతోంది. వివిధ భారతీయ భాషలూ,  ప్రత్యేకంగా తెలుగుభాషపై మొదట సాంస్కృతికంగా సంస్కృతం, పరిపాలనాపరంగా ప్రాకృతాలూ తమ ముద్రవేశాయి. సంస్కృత ప్రాకృతాల ప్రభావం చరిత్రకందనంత కాలంనుండీ 10వశతాబ్దం వరకూ సాగింది.

సమకాలీన సమాజంలోని అన్ని పాఠశాలలలోనూ దాదాపుగా ఆంగ్లమాధ్యమంలోనే శాస్త్రసాంకేతిక విషయాలను బోధిస్తున్నారు. బహు భాషా వ్యవహర్తలు గల భారతదేశంలో 200 పైగా భాషలు ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ ఎక్కువమంది ఏ భాష మాట్లాడితే ఆ భాష ఆ ప్రాంతీయ భాష. ఐతే దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య అనుసంధాన భాషగా హిందీనీ  అంతర్జాతీయ కార్యకలాపాలకు ఆంగ్లాన్నీ వినియోగిస్తున్నారు.

శాస్త్రసాంకేతిక వికాసం వలనా సామాజిక అవసరాల నిమిత్తమూ ఒక ప్రాంతీయ భాషతోపాటు ఇతర భాషలూ నేర్చుకోవలసిన అవసరం ఏర్పడింది. భారతదేశంలో కొన్ని రాష్ట్రాలలో ఒకటికంటే ఎక్కువ భాషలు మాట్లాడే సందర్భాలు ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం భాషా సమస్య ఉంది. 2 వ అధ్యాయంలో చెప్పుకున్నట్లు బోధన మాధ్యమంగా ఆంగ్లం, సంస్కృతం, పార్శీ భాషలలో ఏది ఉండాలన్న దానిపై వివాదాలు తలెత్తాయి. చివరకు మెకాలే ప్రతిపాదనల ద్వారా ఆంగ్లం అధికార భాషగానూ బోధనా భాషగానూ స్థిరపడి చివరకు జాతీయ భాషా స్థానాన్ని ఆక్రమించింది.

**విద్యామాధ్యమం: మాతృభాషలూ – ఆంగ్లభాష :**

20 వ శతాబ్దిలో ద్విభాషా సూత్రం అమలులో ఉండేది. ఆంగ్లం ప్రథమ భాష. ప్రాంతీయ భాష ద్వితీయ భాష. స్వాతంత్రోద్యమ కాలంలో ప్రజలకూ, నాయకులకూ, ప్రభుత్వానికీ ఆంగ్లం అనుసంధానంగా ఉన్నప్పటికీ ఆ భాష తెలిసినది కొద్దిమందికే. స్వాతంత్రోద్యమంలో ఏదో ఒక దేశ భాష మాత్రమే అధికార భాషగా ఉండాలనే అభిప్రాయం బలపడింది. అధిక సంఖ్యాకుల మాతృభాష హిందీ (హిందీ అనేక భాషలకు కలిపి పర్యాయంగా వాడే ఊతపదం) కావడంతో హిందీ వెలుగులోనికి వచ్చింది.

స్వాతంత్ర్యానంతరం హిందీ అధికార భాష అయ్యింది. దేశమంతటా హిందీభాషను అమలు చేయాలనీ పాఠశాలలో తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. హిందీయేతర ప్రాంతాలలో దీనికి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. తమిళనాడులో ఏకంగా హిందీ వ్యతిరేక ఉద్యమాలు చెలరేగాయి. హిందీ భాషా వాదుల బలం ఎక్కువగా ఉన్నప్పటికీ హిందీని ఇతర భాషా రాష్ట్రాలపై రుద్దడానికి కేంద్రప్రభుత్వం ఒప్పుకోలేదు. ఈ పరిస్థితిపై సమీక్షించడానికి కొఠారి కమిషన్ వేసింది. వారి సిఫార్సుల మేరకు ఏర్పడిందే త్రిభాషా సూత్రం. దీని ప్రకారం: హిందీయేతర రాష్ట్రాలలో పిల్లలు నేర్చుకోవలసిన భాషలు: 1. మాతృభాష లేదా ప్రాంతీయ భాష, 2. జాతీయ అధికార భాష (Union Official Language) హిందీ, 3. అంతర్జాతీయ భాష ఆంగ్లం. హిందీ మాతృభాషగా గల రాష్ట్రాలలో నేర్చుకోవలసిన భాషలు: 1. మాతృభాష లేదా ప్రాంతీయభాష – హిందీ, 2. అంతర్జాతీయ భాషగా–ఆంగ్లం, 3. ఒక భారతీయ భాష (దక్షిణ భారత భాషకు ప్రాధాన్యం).

1964లో కొఠారీ కమీషన్ ప్రతి విద్యార్థి ప్రాంతీయ భాషతోపాటు విధిగా హిందీ, ఆంగ్ల భాషలను అభ్యసించాలని ప్రతిపాదించింది. 1978లో ఎన్సిఇఆర్టీ (NCERT) రూపొందించిన విద్యాప్రణాళికలో కూడా త్రిభాషా సూత్రాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని నిర్ణయించారు. 1986 జాతీయ విద్యావిధానం (NPE 1986) కూడా త్రిభాషా సూత్రానికి ఆమోదం తెలిపింది.

స్వాతంత్ర్యం తర్వాత భాషా ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరణ చెందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. అయితే ఆంధ్రప్రదేశ్ లో నైరుతి సరిహద్దులో కన్నడ–తెలుగు, దక్షిణ ప్రాంతంలో తమిళం–తెలుగు వాడకంలో ఉన్నాయి. తెలంగాణా ప్రాంతంలో తెలుగు,

మరాఠీ, ఉర్దూభాషలూ వ్యవహారంలో ఉన్నాయి, ఆంగ్లేయుల పాలనలో ఆంగ్లం అధికార భాషగా బోధనభాషగా ఉండటంవల్ల దేశ భాషలకంటే అధికంగా అది ప్రాచుర్యం పొందింది. దేశ భాష అయిన తెలుగు వెనకబడింది. ఉపాధి సముపార్జన ఆంగ్ల మాధ్యమంలో చదివిన వారికే. తెలుగు మాధ్యమంలో చదివినవారికి ఉద్యోగ భద్రత లేదు. దీనివల్ల బోధనలోగానీ పాలనలోగానీ ఆశించినంతగా తెలుగు వ్యవహారంలో లేదు. దేశంలోని చాలా రాష్ట్రాలలో హిందీని తృతీయభాషగా ప్రవేశపెట్టారు. మన రాష్ట్రంలో వారానికి మూడు గంటలు హిందీకి కేటాయించారు. అంటే కొఠారి కమీషను సూచనల ప్రకారం హిందీయేతర రాష్ట్రాల విద్యావిధానం, భాషావిధానం, ఆచరణలలో భాగంగా త్రిభాషా సూత్రం జాతీయ స్ఫూర్తిని కలిగిస్తుంది. ఇతర ప్రాంతాలతో సంబంధ బాంధవ్యాలు కలిగేలా చేస్తుంది. అనువాదాలను, మాతృభాషా ప్రాధాన్యాన్నీ ప్రోత్సహిస్తుంది. తద్వారా అంతర్జాతీయ అవగాహన కలుగుతుంది.

దీనితోపాటు ఉన్నత విద్యాస్థాయిలో కూడా విద్యా బోధన ప్రాంతీయ భాషల్లోనే జరగాలని సిఫారసు చేసిన మొట్టమొదటి నిపుణుల కమిటీ డా. రాధాకృష్ణన్ కమిషన్ (క్రీ.శ.1948). దీనికి మద్దతుగా కాశ్మీర్, నాగాలాండ్ లలో ఆంగ్లభాషా మాధ్యమం విఫలమయ్యిందని విద్యావేత్త శ్రీ.ఎం.వి. రాజగోపాల్ గారు పేర్కొన్నారు. ఇవన్నీ మాతృభాషా మాధ్యమం కాకపోవడం వల్ల కలిగే అనర్థాలు. మనోవైజ్ఞానికంగా చూస్తే –అజ్ఞాత విషయాన్ని అపరిచిత మాధ్యమం ద్వారా సాధించటం అవాంఛనీయం. జాతీయ విద్యా విధాన ప్రణాళిక 1968, విద్యా విధాన ప్రణాళిక 1986, త్రిభాషాసూత్రం అమలు కోసం విద్యావిధానంపై పునరుద్ఘాటిస్తూ 1992లో భారతచట్టసభ చేసిన కార్యాచరణ ప్రణాళికా ఇవన్నీ అక్షరాలా చిత్తశుద్ధితో అమలులోనికి రావాలి. కనీసం ప్రాథమిక విద్యాస్థాయిలోనైనా మాధ్యమంగా మాతృభాష ఉండాలి.

పాఠశాల ప్రక్రియలో మరిన్ని భాషలు నేర్చుకోవడం విద్యార్థికి భారం కాకుండా చూడటమే సరైన పద్ధతి. అసలు ఎవరికీ మాతృభాషకాని ఆంగ్లమాధ్యమం ఎవరికోసం? ఎందుకోసం? దీనికి కొందరు చెప్పే జవాబు ఉద్యోగభద్రత. భారతదేశం లోపలా భారతదేశం బయటా ఉద్యోగాలకోసం భారతీయభాషలను వాడే పద్ధతికి తగిన విద్యావిధానం భారతదేశంలో లేదు. దీనికి చైనా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ వంటి ఆంగ్లేతర భాషలు మాట్లాడే దేశాలే తార్కాణాలు. ఉదాహరణకు, కర్ణాటక రాష్ట్ర

ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో రెండు భాషలలో ఒకటిగా కన్నడ (ప్రాంతీయ భాష) భాషను పరిచయం చేసింది. ఆ స్థాయిలో మార్గదర్శకాలుగా మూడు భాషలు ఉన్నాయి. అవి, మాతృభాష / ప్రాంతీయ భాష, ఒక ఆధునిక భారతీయ భాష మరియు విధిగా ఆంగ్లం. మూడు భాషలు బోధించడం ప్రాథమిక విద్యావిధానంలో సర్వసాధారణం. ప్రాంతీయభాషా మాతృభాషా ఒకటి కాని విద్యార్థులు తమ మాతృభాషను ఎంచుకుంటే గనక తమ రాష్ట్ర అధికార భాషనే ప్రాంతీయభాష లేక ఆధునిక భారతీయ భాషల విభాగంలో ఏదో ఒక దానినే విధిగా స్వీకరించాలనే నియమం రాష్ట్రప్రభుత్వమే విధించవచ్చు.

పాలన వ్యవహారాలలో అధికారభాషా విధానాన్ని కచ్చితంగా అమలుచేయడానికి రాష్ట్రానికి ఇది అవకాశం కల్పిస్తుంది. ఉదాహరణకు, కన్నడం మాతృభాషగా కలవారు. కన్నడం తనసొంత మాతృభాష కాకపోయినా కర్ణాటక రాష్ట్రంలో నివసించేవారందరూ తప్పనిసరిగా త్రిభాషాసూత్రంలో భాగంగా కన్నడభాషను తప్పక చదవాలని కర్ణాటకప్రభుత్వం నియమం పెట్టింది. అందుకు కావలసిన ఉత్తర్వులను జారీచేసింది. అయితే విద్యామాధ్యమంగా ఒక భాషను తప్పనిసరి చేయడం వ్యక్తుల ప్రాథమిక హక్కులను హరించడం అవుతుందని భారల అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది (2014). తల్లిదండ్రులకు తమ పిల్లల విద్యావసరాల నిమిత్తం భవిష్యత్తు ప్రణాళిక కోసం భాషను ఎంచుకునే సౌకర్యం రాజ్యాంగం కల్పించిన హక్కు అని న్యాయమూర్తుల అభిప్రాయం. ఇది పూర్తిగా సమాజంలోని వ్యక్తుల అభిప్రాయానికి అనుగుణంగా ఉండాలి. అంటే ఐచ్ఛికంగా సాగాలి.

# 7

# నేడు నేర్వడానికి ఉండని భాష, రేపు వాడకానికి మిగలదు

ప్రజలు కోరుకున్న భాషలోవ్యవహారాలు సమాజంలోని వ్యక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా సాగాలంటే, ముందు సమాజంలో మాతృభాషామాధ్యమంగురించి శాస్త్రీయ అవగాహన కలిగించాలి. అందరినీ ఒకతాటి పైకి తీసుకురావాలి. అనేక సందర్భాలలో, సభలలో వేదికలపైనుంచి తెలుగు శ్రేయస్సు కోరుతూ పండితులూ, రచయితలూ, సాహితీవేత్తలూ, పాత్రికేయులూ, విజ్ఞానశాస్త్ర, సాంకేతిక తంత్రజ్ఞులూ, సామాజిక, రాజనీతికోవిదులూ, అధికారులూ, రాజకీయులూ, పాలకులూ ఇంకా అనేకమంది తెలుగు భాష ఇంకా అభివృద్ధి చెందాలి, పారిభాషిక పదాలను నిర్మించుకోవాలి, నిఘంటువులు కూర్చాలి, అనువాదాలు రావాలి, కొన్ని అక్షరాలను తగ్గించుకోవాలి, తెలుగుకోసం కొత్త సంస్థలను ఏర్పాటు చేద్దాం, ఆధునిక భాషగా తీర్చిదిద్దుకోవాలి ఇట్లా వందలాది సూచనలూ, ప్రస్తావనలూ, ప్రతిపాదనలూ చేస్తున్నారు. ప్రస్తుతం ఇవన్నీ అప్రస్తుత ప్రసంగాలే. విద్యా మాధ్యమంగా తెలుగును తొలగించే జీవోలు విడుదలైనప్పుడు ఇవన్నీ కాలయాపనకే పనికొస్తాయి. తెలుగును బోధనా మాధ్యమానికి దూరంచేస్తే, వచ్చే రెండు దశాబ్దాలలో జరగబోయే విధ్వంసం దానితో కలిగే సామాజిక సంక్షోభం యుద్ధంకంటే భయానకమైనది. నేరుగా మనుషులను చంపటం అనాగరికం. అది నిన్నటి మాట. భాషల్ని చంపితే చాలు. ఇది నేటి మాట. ఇప్పటివరకూ స్థానిక భాషలపై ప్రత్యక్షంగా ఆధారపడి నడుస్తూ లక్షలాది మందికి జీవనోపాధినిస్తున్న టీవీ చానెళ్లు, సినిమాలూ, పత్రికా ప్రచురణలూ, ప్రకటనా వ్యవస్థలూ, గ్రంథ ప్రచురణలూ, వీటిలోపనిచేస్తున్నవారూ, రచయితలూ, కవులూ, గాయకులూ, అధ్యాపకులూ, ఇతర సాంప్రదాయ వృత్తిపనివారలమీదే దీని

ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరందరూ తెలుగూ తదితర మాతృభాషలే ఆధారంగా సంపద సృష్టిలో పాలుపంచుకుంటున్నవారు. రెండు దశాబ్దాల తర్వాత వచ్చే ఇంగ్లీషు నేర్చిన యువజనానికి వీటి అవసరాలు లేక వీటి ప్రాముఖ్యత తగ్గి ఇవన్నీ అంతరించే ప్రమాదం అంచుకు చేరతాయి. ఇప్పటివరకూ లక్షలాదిమందికి జీవనాధారమైనవి మూలబడి పోతాయి. దీన్ని అడ్డుకోవాలంటే మాతృభాషామాధ్యమమే ఉండాలి.

తెలుగులో పనిచేయాల్సిన మన న్యాయవ్యవస్థలో వందలాదిమంది జిల్లా, తాలూకా జడ్జీలతోనూ, వేలాదిమంది అడ్వకేట్లూ వారిపై ఆధారపడ్డ లక్షలాదిమంది చిరుద్యోగులూ (జిల్లా స్థాయి న్యాయవ్యవస్థ తెలుగులో పనిచేయాలని జీ.ఓ.ఉంది) ఉన్నారు. మాతృభాషా మాధ్యమానికి న్యాయవ్యవస్థ పాదుకాపు కావాలి. భారత న్యాయవ్యవస్థలోని నిష్పాక్షిక నేరవిచారణ సూత్రాల ప్రకారం, ఎవరికి వ్యతిరేకంగానైనా నేరారోపణ జరిగిన పక్షంలో, సంపూర్ణ సమధర్మవిధానంలో, నేరారోపణ స్వభావం, దాని కారణం, ముద్దాయికి తెలిసిన భాషలో పూర్తి సమాచారాన్ని వివరించాలి. ఒకవేళ, నేరారోపణకు ఆధారమైన సాక్ష్యం, తెలియని భాషలో కనుక నమోదు చేయబడితే, దాన్ని నిందితునికి తెలిసిన భాషలో వివరించాలి. అంటే, దోషారోపణ సమాచారాన్ని ముద్దాయికి తప్పనిసరిగా వారి సొంతభాష లోకి అనువదించి అందించాలని అర్థం. ఆరోపణలకు సంబంధించిన ఆధారాల వివరణ లను నిందితవ్యక్తికీ లేదా వారి తరఫు న్యాయవాదికి అందించడం అవసరం.అంటే, ముద్దాయికి వ్యతిరేకంగా వారికి తెలియని భాషలో సాక్ష్యం గనక ఉంటే, దాన్ని వారికి తెలిసిన భాషలో వివరించాలి; ఒకవేళ ముద్దాయి తరఫు న్యాయవాదికి తనకు తెలియని భాషలో గనక సాక్ష్యం ఉంటే, దాన్ని తనకి తెలిసిన భాషలో వివరించాలి. మన న్యాయ వ్యవస్థ న్యాయస్థానాలలో సొంతభాష వాడకం గురించి ఇంత నిక్కచ్చిగా చెబుతుంటే మనం ఏం చేస్తున్నాం. జిల్లాస్థాయి వరకూ న్యాయస్థానాలలో భాషావినిమయం పూర్తిగా స్థానిక భాషలలో జరిగే అవకాశం ఉన్నా నీరుగార్చేస్తున్నాం.

# 8

# తెలుగుభాషా ప్రాధికార సంస్థ

## 1.0 భూమిక:

తెలుగు భాషా ప్రాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ అధికారభాషగా తెలుగు అభివృద్ధికీ వికాసానికీ  నియమ నిబంధనలు రూపొందించడానికి ఉద్దేశించిన ఒక స్వయంప్రతిపత్తి గలిగిన  నియంత్రణా సంస్థ (2016). ఈ కింది పనులను సమర్థవంతంగానూ వేగంగానూ అమలు చేసేందుకు ఎప్పటికప్పుడు ప్రణాళికాపూర్వక చర్యల  సమీక్షనూ పునఃరూపకల్పననూ నిర్వహించాలి:

- ➪ తెలుగు భాషా వికాసం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలూ ఇతర ప్రాతినిధ్యసంస్థలతో కలిసి తెలుగు భాషాప్రణాళికను అమలు పరచడం;
- ➪ ప్రజల జీవనోపాధికి ఆధారమయ్యేట్లుగా తెలుగు భాష వాడకాన్ని పెంచడం కోసం తెలుగు భాషాప్రణాళికను అమలు పరచడం;
- ➪ అత్యాధునిక జ్ఞానాన్ని ఆలంబనగా చేసుకొని తెలుగు భాషనూ తెలుగువారినీ సాధికారత దిశగా ముందడుగు వేయించడం;
- ➪ శాస్త్ర విజ్ఞానం, పరిపాలన,న్యాయవ్యవస్థలకు సంబంధించి జ్ఞానానువాదం, జ్ఞానసృష్టి, జ్ఞాన పరివర్తనను తెలుగులో నిర్వహించడం;
- ➪ రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు ప్రధాన కారణమైన భాషా సామర్థ్యంపై అవగాహన కల్పించడం;
- ➪ జాతి వారసత్వ సంపదనుపదిలపరిచేందుకే కాక యువతరాన్ని సాంస్కృతిక అనుసంధానానికి కూడగట్టే ప్రయత్నం చేయడం.

## 2.0 లక్ష్యాలు:

ప్రజాస్వామ్యదేశంలో ప్రజా క్షేమంతోబాటు భాషాక్షేమం బాధ్యత కూడా ఎన్నికైన ప్రభుత్వానిదే. ఇది వివిధ ప్రభుత్వ విభాగాలూ సంస్థలూ లేదా ఇతర వ్యవస్థల

మధ్య తెలుగు భాషలో కార్యకలాపాల వినియోగాన్ని ప్రోత్సహించడంతోబాటు భాషాపరమైన పరిశోధనలకు అవసరమైన పెట్టుబడుల వెసులుబాటు కల్పిస్తూ స్థానికభాషల విలువలనూ ప్రాముఖ్యతలనూ గుర్తించి ప్రోత్సహించేట్లు చేయాలి. తెలుగుభాషా ప్రాధికారసంస్థ విధులలో భాషాబోధనా ప్రణాళికలపై నిర్ణయాలూ ఒప్పందాలకు మాత్రమే పరిమితంకాక, భాషా సమస్యలపై కీలకమైన వ్యూహాత్మక నిర్ణయాలు అవసరాన్ని గుర్తించాలి.

- **అమ్మనుడిలో విద్యాబోధనతో ఆర్థిక భద్రతను కల్పించడం;**
- **ప్రజలభాషలో పరిపాలనద్వారా సామాజిక భద్రతను కల్పించడం;**
- **స్థానికభాషల వాడకంతో సమాజంలో హెచ్చుతగ్గుల నిర్మూలన చేయడం.**

భాషల అభివృద్ధికి చేపట్టిన విజయవంతమైన వ్యూహాలలో ఒకటి సమాజ ఆర్థిక వ్యవస్థకు భాషల తోడ్పాటును గుర్తించడమే. వారసత్వ భాషలతోనే ఆర్థికాభివృద్ధీ సంపద సృష్టీ జరుగుతుంది. ఇవి భాషా వ్యూహాల తోడ్పాటుతోనే సాధ్యం. భాషాపరిరక్షణ ప్రజల శ్రేయస్సూ సౌభాగ్యాలతో ముడిపడివుంది. మాతృభాషలు సంభాషణా నైపుణ్యాలపై ప్రభావంచూపిస్తాయని విషయనిపుణుల అభిప్రాయం. విద్యాబోధన, శిక్షణకు మాతృభాషలే సహజ మాధ్యమాలు.

## 3.0 తెలుగుభాష- ప్రస్తుత స్థితి:

3.1 పరిపాలనా, న్యాయ రంగాలలోనూతెలుగు వాడుకలోగణనీయమైనతరుగుదల;

3.2 పాఠశాలవిద్యలోనూఉన్నత విద్యలోనూభాషావినిమయంలో తరుగుదల;

3.3 వివిధ ఆర్థిక కార్యకలాపాల్లో భాషా వాడకంలోఉపేక్షా, ఉదాసీనతాధోరణి ఎక్కువయింది;

3.4 సమాజంలో వెనుకబడిన వర్గాల ఆర్థిక భద్రత విషయంలో జనభాషల ప్రాముఖ్యతను పట్టించుకోకపోవడం;

3.5 అక్షరాస్యతలో తెలుగు రాష్ట్రాల వెనుకబాటుతనం ఇంగ్లీషుమాధ్యమం ప్రవేశపెట్టడంతో మొదలయింది;

3.6 సమాజ ఆర్థిక కార్యకలాపాలలో భాషాప్రయోజనంపై అవగాహనారాహిత్యంతో తెలుగుభాష విలువ తెలియడం లేదు;

3.7 స్థానిక ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపర్చుకోడానికి స్థానిక భాషలద్వారా సమర్థవంతంగా నిర్వహించుకొనేలా ప్రయత్నాలు జరగడం లేదు;

3.8 విస్తృత భాషా పరిధిలో విద్యా బోధనసామాజిక, వ్యక్తిగతప్రయోజనాలను కలిగిస్తుందని నిపుణులు సూచిస్తున్నా పట్టించుకోవడం మానివేశాం;

## 4.0 తెలుగు భాషాప్రాధికరణం:

తెలుగు భాషాప్రాధికరణంకింద కార్యకలాపాలు మూడు ప్రధాన దిశలలో సాగాలి. తెలుగు భాషాప్రాధికారసంస్థ నిర్మాణంలో ఉద్దేశించిన లక్ష్యాల సాధన కోసం మూడు విభాగాలు కావాలి:

**ప్రణాళికా విభాగం** : అవసరాలమేరకుభాషా ప్రాధికారసంస్థచే ప్రణాళికా రచన;

**రూపకల్పనా విభాగం** : ప్రాధికారసంస్థసహాయంతో ప్రణాళికా రచనకు సరైన రూపకల్పన చేసి అందించడం;

**ఆచరణ విభాగం** : అమలుజరపవలసిన విధానంపై విశ్లేషణ జరిపించడం;

## 5.0 చర్యలు:

తెలుగు భాషాప్రాధికారసంస్థ కార్యకలాపాలుఆధునికఅవసరాలకు అనుగుణంగా ప్రజలను జాగృతంచేస్తూ ఎప్పటికప్పుడు ఉత్తేజపరిచే విధంగా భాషాసంబంధాలపై నిర్ణయాలు తీసుకోవాలి.

- ➪ అమ్మనుడితోనే ఆకలి అంతం. ఉద్యోగావసరాలను తీర్చి ఉపాధి కల్పించే వనరుల అభివృద్ధి తెలుగుభాషావినియోగంతోనే సాధ్యం.
- ➪ తెలుగుభాషకూ రాష్ట్ర స్థూలజాతీయోత్పత్తికీ ఉన్న సంబంధంపై ఆర్థికపరమైన విశ్లేషణ: ఏ భాష స్తూల జాతీయోత్పత్తికి ఎంత దోహదం చేస్తుందో అందరికీ, ప్రత్యేకంగా చట్టాలు చేసేవారికీ వాటిని అమలు పరిచేవారికీ తప్పనిసరిగా తెలియజేయాలి.
- ➪ జ్ఞాన వనరుల అభివృద్ధి:సమగ్ర విజ్ఞాన సర్వస్వాలు, నిఘంటువులూ, మాండలిక కోశాలూ, వివిధ రంగాలకుసంబంధించిన వృత్తి పదకోశాలు, పర్యాయపద కోశాల సంకలనం.
- ➪ తెలుగు భాషాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక. తెలుగు భాషా ప్రాధికారసంస్థ నియంత్రణలో వివిధ విభాగాల్లో వివిధ సంస్థలలో తెలుగు భాషాభివృద్ధి కోసం ప్రణాళికలు అమలు చేయాలి.
- ➪ పరిశోధన –శిక్షణ, ప్రచురణ–వ్యాప్తి, ప్రోత్సాహం–ప్రచారం.

## 6.0 తెలుగు భాష:

ప్రపంచంలోఅత్యంత విస్తృతంగా మాట్లాడే పదమూడు భాషలలో తెలుగుఒకటి. భారతదేశపు మొదటి మూడు ప్రధాన భాషలలో ఒకటి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధికార భాష. ప్రపంచం నలుమూలలా తెలుగు భాషను మాట్లాడేవారు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఇది సుసంపన్నమైన సంస్కృతీ, విస్తారమైన జానపద సంగీత, నృత్యనాటక సాహిత్యాలు కలిగిన భాషలలో ఒకటి.

## 6.1 భాషా సరిహద్దులు:

ప్రపంచంలో తెలుగు భాష మాట్లాడేవారి సంఖ్య, తెలుగు డయాస్పోరా, వికీ ప్రకారం నూటపది మిలియన్లు. శతాబ్దాల కిందటే తెలుగు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులను దాటి చుట్టుపక్కలనున్న అనేక రాష్ట్రాలలోకి విస్తరించింది. ఉత్తరానమహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్, తూర్పునఒడిషా, పశ్చిమ బెంగాల్ వరకూ,దక్షిణాన పాండిచ్చేరి, తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలఅంతటా వ్యాపించింది.

భారతదేశంలోనేకాక విదేశాలలో సైతం ఎంతోమంది తెలుగువాళ్లు ఉన్నారు. మయన్మార్ (0.15 మిలియన్ల), బంగ్లాదేశ్, శ్రీలంక, మారిషస్ (20, 000), మలేషియా (0.11 మిలియన్ల), దక్షిణాఫ్రికా, ఫిజీ (35, 000), అమెరికా సం.రా. (0.25 మిలియన్ల) గ్రేట్ బ్రిటన్, గల్ఫ్ (0.50 మిలియన్ల) మొదలైన ఎన్నో దేశాలలో తెలుగు భాషను మాట్లాడేవారు గణనీయ సంఖ్యలో స్థిరపడ్డారు.

## 7.0 తెలుగు భాషా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ కింద పేర్కొన్న పనులు జరగాలి:

తెలుగు భాషాప్రాధికరణంలో తెలుగు భాషాభివృద్ధికీ, వికాసానికీ ఈ కింది కార్య కలాపాలను ప్రణాళికలమేర అమలుజరపాలి.

i. ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలూ తదితరులు నడిపే సమస్తవార్తా మాధ్యమాలలో;

ii. ప్రభుత్వ ప్రభుత్వేతరచానెళ్ల ద్వారా జరిగేవ్యాపార వాణిజ్య సమాచార ప్రకటనలలో;

iii. ఎప్పటికప్పుడు తెలుగు భాషా వినిమయంపై సమగ్ర విశ్లేషణ చేసి దానికి అనుగుణంగా రాష్ట్ర భాషాప్రణాళికపై సలహాలు ఇవ్వడం;

iv. శాస్త్ర సాంకేతికరంగాలలో తెలుగు భాష అమలుకు పథకాలు;

v. పరిపాలన, న్యాయ,బోధన రంగాలలో తెలుగులో అభివృద్ధికి ప్రణాళికలు;

vi. సదస్సులు, సమావేశాలు, చర్చాగోష్టులు, కార్యశాలలుమొదలైనవాటిద్వారా సంస్థ పథకాలగురించి ప్రజలకుఅవగాహన కల్పించడం;

vii. సాంఖ్యికపరిక్రమం (డిజిటల్ ప్రాసెసింగ్), భాషా సాంకేతిక సాధనాల నిర్మాణం, వాటి అభివృద్ధికీవ్యాప్తికీ నిరంతర కృషి;

viii. తెలుగు రాష్ట్రాల విద్యా విధానాల్లో తెలుగు అమలును ప్రోత్సహిస్తూ అభివృద్ధికి పథనిర్దేశనం చేయటం;

ix. పుస్తకప్రచురణలూ, పత్రికా ప్రచురణలతో తెలుగు ద్వారా జ్ఞాన వనరుల వ్యాప్తికి కృషి చేయడం;

x. తెలుగు భాషకు సంబంధించిన పరిశోధనలకు సహాయసహకారాలను అందించడం.

# 9

# బోధనా మాధ్యమంగా మాతృభాషలు తూర్పు ఆసియా దేశాల అభివృద్ధి - భారతదేశం

**జు**లై 13-16 మధ్య జరిగిన 13వ అల్టాయిక్ భాషలపై అంతర్జాతీయ సమావేశంలో పాల్గొని ద్రావిడ భాషలూ మంగోలు భాషల జన్య సంబంధాలపై పత్ర సమర్పణ చేయడానికి హైదరాబాదు నుండి తూర్పు ఆసియా దేశాలగుండా వెళ్లవలసివచ్చింది. ఒక విచిత్రం ఏమిటంటే- మన దేశం అభివృద్ధి సాధించాలంటే మన కొంత మంది నాయకుల ప్రకారం మనం కేజీటూపీజీ ఇంగ్లీషులోనే చదవాలి అనే కురచ ఆలోచనలు అక్కడ కానరాలేదు. ఆ సందర్భంలో థాయిలాండ్, తైవాన్, చైనా, కొరియా, మంగోలియా దేశాలు సాధించిన అభివృద్ధిని ప్రత్యక్షంగా చూశాను. ఆయా దేశాలు సాధించిన ప్రగతి ప్రశంసనీయం. 70 ఏండ్ల కిందట ఈ దేశాలు అన్ని రంగాలలోనూ వెనుకబడి ఉన్నవే. పేద దేశాలే. అక్షరాస్యతలో అట్టడుగున ఉన్నవే. పారిశ్రామికీకరణకు నోచుకోనివే. అప్పటికి, పరదేశ దురాక్రమణలకు గురై, వలసవాద ఫ్యూడల్ వ్యవస్థనుండి బయటపడే ప్రయత్నం చేస్తున్న దేశాలే. నేటి ఆ దేశాల ప్రగతి మన భారత దేశ ప్రగతితో పోల్చి చూసుకోవలసినదే. ఈ దేశాలను మనతో పోల్చుకోవడానికి మరో రెండు కారణాలు కూడా చెప్పవచ్చు. ప్రత్యేకంగా, చైనాను కాసేపు పక్కనబెడితే, మిగిలినవాటిని -థాయి లాండ్ (వైశాల్యం 5,13,000 చ.కిమీ., జనాభా 6 కోట్ల 72 లక్షలు), తైవాన్ (35 వేల చ.కిమీ., జనాభా 2 కోట్ల 35 లక్షలు), ద.కొరియా (వైశాల్యం 1,00,210 చ.కిమీ., జనాభా 5 కోట్ల15 లక్షలు) మంగో లియా (వైశాల్యం 15 లక్షల చ.కిమీ., జనాభా 30 లక్షలమంది) తెలుగు రాష్ట్రాలతో (ఆం.ప్ర. వైశాల్యం 1,62,970 చ.కిమీ., జనాభా 4,93,86,799 మంది కాగా తెలంగాణా వైశాల్యం 1,12,077 చ.కిమీ., జనాభా 35,193,978 మంది) పోల్చిచూడడంలో కొంత వరకు సమంజసం అనిపిస్తుంది. దక్షిణ కొరియా,

థాయిలాండ్ దేశాలు జనాభాలోనూ భౌగోళికంగాను చారిత్రకంగానూ తెలుగు రాష్ట్రాలతో పోల్చదగినవి. మంగోలియా భౌగోళికంగా పెద్దదేశమైనా జనాభాలో అతి చిన్నదేశమే. ఇక తైవాన్ భౌగోళికంగా చిన్నదైనా జనాభాలో చెప్పుకోదగ్గ దేశమే. అటూ ఇటుగా సమానంగా అంటే, చైనా (135 కోట్ల జనాభా), ఇండియా (125 కోట్లతో) కలిసి ప్రపంచ జనాభాలో 35 శాతంతోనూ భౌగోళికంగా సుమారు 96 లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో చైనా, అందులో మూడింట ఒక వంతు భూభాగం గలిగిన ఇండియాలు పోల్చదగినవే.

ఇక అసలు విషయానికి వస్తే ఈ దేశాలు సాధించిన అభివృద్ధి ఏమిటి? వాటితో మనకు పోలిక ఎందుకు? ఇవి 95 శాతం పైగా అక్షరాస్యత సాధించిన దేశాలు: కొరియా (97.90%), థాయిలాండ్ (97.60%), మంగోలియా (97.30%), తైవాన్ (97.15%), చైనా (95.90%), ఇండియా (74%, ఆం.ప్ర. 67.41%, తెలంగాణ 66.46%). ఈ దేశాల అక్షరాస్యత ఆ దేశాల విద్యారంగంలో సాధించిన విప్లవా నికి ప్రతీక. ఇది వాటి పారిశ్రామికీకరణానికీ, ఆర్థికాభివృద్ధికీ, ఎగుమతులే ప్రాధాన్యంగా నడుస్తున్న వాణిజ్యానికీ, హైటెక్, ఎలెక్ట్రానిక్ పరికరాల నిర్మాణానికి నిదర్శనం. ఈ అభివృద్ధికి ప్రధాన కారణం ఏమిటని ప్రశ్నించుకుంటే మనకు వచ్చే జవాబు స్థానిక భాషలలో నడుస్తున్న విద్యావిధానమేనని వారు గర్వంగా చెప్పుకుంటారు. 1940–50 మధ్య ఈ దేశాల అక్షరాస్యత 25% కంటే తక్కువే ఉండేది. అంటే ఆనాడు ఆ దేశాలు మనకంటే తక్కువ అక్షరాస్యతా స్థాయిలోనే ఉన్నాయన్నమాట. **అయితే 1960–90 మధ్య ఆ దేశాలలో వచ్చిన నిశ్శబ్ద అక్షరాస్యతా విప్లవం ఆ దేశాలను ఆర్థికంగా నిలదొక్కుకోటానికి తిరుగులేని పునాది వేసింది. ఐతే, భారతదేశంలో అలాంటి నిశ్శబ్ద అక్షరాస్యతా విప్లవానికి ఉనికీ ఊసూ లేనేలేదు. కారణం రాజ్యాంగం విధించిన విద్యాహక్కును నిర్వీర్యం చేశాం, చేస్తూనే ఉన్నాం. విద్యాబోధనలో మాతృభాషా మాధ్యమాలను పక్కనబెట్టి ఇంగ్లీషు మాధ్యమ విద్యాబోధనతో అందరికీ అందు బాటులో ఉండాల్సిన విద్యను అటకెక్కించేస్తున్నాం.** ఇంగ్లీషు మాధ్యమం తప్పనిసరి, మాతృభాషను ఒక విషయంగా నేర్చుకోవచ్చు అనేవారికి ఈ దేశాలు మాతృభాషలను బోధనా మాధ్యమంగా నిల్పి సాధించిన ఆర్థిక పురోగతి ఒక కనువిప్పు కావాలి.

ఈ రచయిత పైన చెప్పిన అల్టాయిక్ భాషలపై జరిగిన అంతర్జాతీయ సమావేశంలో

పాల్గొనడానికి వచ్చిన ఆయా దేశాల ప్రొఫెసర్లను 'మీరు మీ యూనివర్సిటీలో మీ స్టూడెంట్సుకు ఇంగ్లీషులో బోధిస్తారా లేక మీ స్థానిక భాషలలో బోధిస్తారా?' అనే ప్రశ్న వేసినపుడు 'కొరియను', 'మంగోలియను' అనో, 'థాయి' అనో లేక 'మాండరిన్' అనో సమాధానం. ఐతే, తరగతి గదిలో విదేశీ విద్యార్థులు ఉన్నప్పుడూ, ప్రొఫెసర్లు విదేశీయు లైనప్పుడూ, ఇంగ్లీషులో బోధన జరుగుతుంది. ఇది ప్రొఫెసర్లకు ఇంగ్లీషు రాక కాదు. ఈ దేశాలలోని చాలా యూనివర్సిటీలలో ఎందరో ప్రొఫెసర్లు విదేశాలలో చదువుకొని వచ్చినవారుగానీ, అక్కడ పనిచేసి వచ్చినవారుగానీ కావటం సర్వసాధా రణమే. ఈ దేశాలన్నింటా ఇంగ్లీషును ఒక ప్రముఖ విదేశీ భాషగా, జ్ఞాన సంధాన భాషగా గుర్తించి ప్రత్యేకంగా నేర్పటం జరుగుతోంది. ఐతే బోధనా మాధ్యమంగా మాతృభాషలనూ స్థానిక భాషలనూ తోసిరాజనడానికి మనవారు పేర్కొన్న కారణాలు వారి అవగాహనా లేమినీ, ఆ వాదనలో కొరవడిన తర్కాన్ని ఎత్తి చూపుతాయి. కొందరు పేర్కొన్నట్లు ఆంగ్ల భాష, ఒక అంతర్జాతీయ భాషగా, బహుభాషలు మాట్లాడే సందర్భా లలో శాస్త్రీయ సమాచార భాషగానూ, 'ఆధునికీ కరణకు చిహ్నం' గానూ వాడుతుండవచ్చు. ప్రపంచవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాల యాల్లో బోధనా మాధ్యమంగా వాడటంవలననూ, ముఖ్యంగా ఆంగ్లేతర భాషలు మాట్లాడే దేశాల్లో భవిష్యత్తులో శాస్త్రీయ జ్ఞానాన్ని పొందే దృష్టితోనూ, ఇతర అభివృద్ధి చెందిన దేశాలలో సాంకేతిక పురోగతికి గానూ వాడటంవలన అన్ని దేశాలలోనూ స్థానిక భాషలకు బదులు ఇంగ్లీషును బోధన మాధ్యమంగా అన్ని స్థాయిలలోనూ వాడవలసిన అవసరం కనిపించదు.

ఇక కొందరి వాదన- ఇది విదేశీ విద్యకు వీలు కల్పిస్తుంది. ఏ దేశంలోనైనా ఎంతమంది విద్యకోసం విదేశాలకు వెళుతున్నారు. మరికొంతమంది వాదన, ప్రభుత్వ లేక ప్రభుత్వేతర సంస్థలలో ఉద్యోగ సంపాదన మొదలైనవాటి పురోగతికి సహాయపడుతుంది. ఏదైనా ఒక దేశంలో ఒక ప్రభుత్వ సంస్థలో లేదా ప్రభుత్వేతర సంస్థలో ఉద్యోగం చేయడానికి కావలసిన భాష ఆ సంస్థల స్థానిక అవసరాలను బట్టి ఉంటుంది. ప్రపంచమంతటా ఇంగ్లీషు వాడకాన్ని ప్రోత్సహిస్తున్న బ్రిటిష్ కౌన్సిల్ ఈ మధ్య తెచ్చిన వాదన, దేశాల మధ్య శాంతి భద్రతలకు కూడా ఇది ఉపయోగ పడుతుందట. ఇంతకంటే అశాస్త్రీయ ఆలోచన ఏముంటుంది. చివరిగా, బోధనా మాధ్యమంగా ఇంగ్లీష్ వాడకాన్ని అవలంబిస్తున్న విశ్వవిద్యాలయాలు వారి వ్యాప్తికీ

పెరుగుదలకూ ప్రోత్సాహకంగానూ ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మార్కెట్లకు అవసరమైన రీతిలో స్థానీయ విద్యార్థుల శిక్షణావసరాలను తీర్చేందుకూ ఉపయోగ పడుతోంది. ఇది కూడా ఈ మధ్యనే ఇంగ్లీష్ బిజినెస్ మొదలెట్టిన ప్రైవేటు విశ్వవిద్యాలయాల యాజమాన్యాలు చేస్తున్న వాదన. ఐతే, ఇలాంటి అశాస్త్రీయ ఆలోచనలకు తావివ్వకుండా దేశ ప్రజల మూకుమ్మడి విద్యాబోధనా, అక్షరాస్యతా సాధనే ప్రాతిపదికగా, ప్రజల జీవన అవసరాలను తీర్చేదిగా, ఆర్థిక ప్రగతే ధ్యేయంగా కొరియా, థాయిల్యాండ్, తైవాన్, చైనా, మంగోలియా, మొదలైన దేశాలు అవలంబించిన భాషావిధానాన్ని చూద్దాం :

**కొరియా:** విద్యారంగంలో భారీ పెట్టుబడులతో, కొరియా సామూహిక నిరక్షరాస్యత నుండి ఒక ప్రధాన అంతర్జాతీయ సాంకేతిక శక్తికి కేంద్రంగా తయారైంది. అత్యంత నైపుణ్యం గల ఉద్యోగులతో ఈ దేశపు జాతీయ ఆర్థిక ప్రయోజనాలు ముడిపడివున్నాయి. ప్రపంచం లోని అత్యంత విద్యావంతులున్న దేశాల్లో ఇది ఒకటి. తృతీయస్థాయి విద్యా డిగ్రీ కలిగిన పౌరులు అత్యధిక శాతం ఉన్న దేశం. ప్రపంచం లోని అధిక విద్యావంతులైన కార్మిక శక్తులు ఉన్న దేశాలలో ఇది ఒకటి. 1945 లో 22% ఉన్న అక్షరాస్యత స్థాయి నుంచి 1970 లో 87.60%కి, ఇక 2017 నాటికి 97.90%కి అక్షరాస్యత చేరుకోవటం కొరియా దేశపు ప్రత్యేకత. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో19.8% విద్యకు ఉపయోగించటం మరో ప్రత్యేకం. ఈ సంవత్సరం, దక్షిణ కొరియా తన 1 కోటి 10 లక్షల మంది విద్యార్థుల విద్యకోసం 5 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టింది. చదువుకొనే వయసువచ్చిన వారిలో 99% పిల్లలు ప్రాథమిక పాఠశాలలో ప్రవేశం పొందటం సర్వసాధారణం. ప్రాథమిక విద్యలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థీ మధ్య స్థాయికి చేరటమూ అంతే. ఇక ఇక్కడినుండి ఉన్నత పాఠశాలకు చేరేవారు 96.6%. ఆపైన తృతీయ విద్యకు చేరేది 82.8%. అయితే, ఈ విద్యార్థుల్లో 40% మాత్రమే తమ కళాశాల విద్యను పూర్తి చేస్తున్నారు. ఎందుకంటే, వీరిలో 36.50% మంది ఉద్యోగాలలో చేరటం జరుగుతోంది. ఉన్నత డిగ్రీలు లేని, గ్రాడ్యుయేట్లు కానివారి కోసం కూడా పెరుగుతున్న ఉద్యోగ నియామ కాలను ఇది ప్రతిబింబిస్తోంది.

ఎన్నో దక్షిణ కొరియా బ్యాంకులూ బహుళ-జాతీయ సంస్థలూ (శామ్సంగ్, ఎల్.జి, హ్యుందయ్, మరియు ఎస్.కే వంటివి) గ్రాడ్యుయేట్లు కానివారికి ఉద్యోగాల

తలుపులు తెరిచాయి. ఉన్నత పాఠశాల విద్యాలయాలకు చెందిన విద్యార్థులకోసం 30,000 ఉద్యోగాలనూ వారు కేటాయించారు. కళాశాల డిగ్రీ లేకుండా అందుబాటులోకి వస్తున్న ఉద్యోగాలతో, దక్షిణ కొరియా తృతీయ విద్యా వ్యవస్థలో 60% డ్రాప్-అవుట్ రేటును చూడటం అసాధారణం కాదు. దక్షిణ కొరియా దేశంలో విద్య సాధారణంగా అన్ని స్థాయిల లోనూ కొరియను భాషలోనే జరపటం సాధారణం. ఐతే ఇప్పుడిప్పుడే అక్కడక్కడ మొదలైన ఇంగ్లీషు మాధ్యమ విద్య (కొన్ని విషయాలలో మాత్రమే) ఎన్నో విమర్శలకు దారితీసింది. కొన్ని చోట్ల ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టిన యూనివర్సిటీ వైస్-చాన్సలర్లను ప్రభుత్వం ప్రజలనుంచీ వచ్చిన విమర్శలకు తలవంచి పదవులనుండీ తప్పించ వలసి వచ్చింది.

ఇటీవలే, ప్రతిష్టాత్మక కొరియను యూనివర్సిటీలలో ఒకటి, ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 20 శాతం వరకు ఆంగ్లంలో బోధించే కోర్సుల శాతాన్ని పెంచాలంటే తన విశ్వవిద్యాలయానికి 10 సంవత్సరాలు పడుతుంది అని ప్రకటించింది. అంటే, ఆంగ్ల బోధన మాధ్యమంగా ఉపయోగించినట్లయితే చాలామంది విద్యా ర్థులూ, ఇంకా విద్యార్థుల కంటే ఆచార్యులే ఎక్కువ ఇబ్బందుల పాలవుతారని అక్కడ జరిపిన ఒక సర్వేలో తేలింది. ఒక కారణం, ఎవరికీ తగినంత ఆంగ్ల సామర్థ్యం లేకపోవటం. ఫలితంగా ఆంగ్ల మాధ్యమ తరగతుల నాణ్యత తక్కువగా ఉంటోందట.

ద.కొరియాలో టీవీ కార్యక్రమాలు కొరియనులో ఉండటం సర్వసాధారణమే. అయితే కొన్ని విదేశీ సినిమాలూ, నాటకాలూ డాక్యుమెంటరీలు కొరియను ఉపశీర్షికలతో ఇంగ్లీష్‌లో ప్రసారం చేయబడుతున్నాయి.

**థాయిలాండ్:** సామాజిక, ఆర్థిక అభివృద్ధి సూచికల ప్రకారం 'ఆసియాలో గొప్ప అభివృద్ధిని సాధించిన దేశంగా థాయిలాండ్ ఎన్నో విజయగాథల కీర్తి సంతరించుకున్న దేశాలలో ఒకటి' గా ప్రపంచ బ్యాంకుచేత గుర్తింపు పొందింది.

ప్రస్తుతం, థాయిలాండ్‌లో పెద్ద సంఖ్యలో విద్యాసంస్థలు ఆంగ్ల భాషా బోధనను మొదలుపెట్టాయి. ద్విభాషా పాఠశాలలు ప్రపంచ స్థాయిలోని విదేశీ భాషా నైపుణ్యాల కోసం పెరుగుతున్న డిమాండుకు ప్రతిస్పందనగా వివిధ స్థాయిలలో ఇవి పనిచేస్తున్నాయి.

**విద్యా వ్యయం:** స్థూల జాతీయోత్పత్తిలో 4.1 శాతం (2009). ప్రతి ఒక్కరూ 12 సంవత్సరాల పాటు ప్రాథమిక విద్యను ఉచితంగా పొందటానికి హక్కు కలిగి ఉంటారని

రాజ్యాంగం హామీ ఇస్తుంది, దీన్ని ప్రభుత్వమే భరిస్తుంది.

తన సొంత భాషనూ లిపినీ నిలుపుకోడానికి, థాయిలాండ్ నిరం తరం అధికారికంగానూ అనధికారికంగానూ థాయి భాషను నేర్చు కోవడాన్ని ప్రోత్సహిస్తోంది. థాయ్‌లాండ్, ఆసియా దేశాలలో కెల్లా అత్యధిక స్థాయిలో క్రియాత్మక అక్షరాస్యత గలిగిన దేశాలలో ఒకటి.

అభివృద్ధి చెందుతున్న దేశాలలోకెల్లా అత్యధిక తలసరి ప్రచురణ ఖర్చు చేస్తున్న దేశం. 1982 లో 5,645 పుస్తకాలు ప్రచురించ బడ్డాయి. 70 లక్షలకు పైగా రేడియో రిసీవర్లు, 8,30,000 టెలివి జన్లు, 69 రోజువారీ వార్తాపత్రికలూ 175 పత్రికలూ ఉన్నాయి. ఆంగ్ల–భాషా బెస్ట్–సెల్లర్స్ లేదా 'ఏది ఎట్లా' లాంటి పుస్తకాలకు తరచూ థాయి–భాషలో అనువాద పాఠకులు విస్తృతంగా ఉండటం సాధారణమే. దేశీయ మార్కెట్‌లో 60 శాతం ఉన్న కేల్డ్ థాయ్ అనే ప్రచురణ సంస్థ, ప్రతి నెలా 80,000 మరియు 1,20,000 ప్రతులను పంపిణీ చేసింది.

థాయి భాష, థాయిలాండ్ దేశపు అధికారిక భాష. దైనందిన సమాచార ప్రసార మాధ్యమాలలోనూ, విద్యా బోధనలోనూ ప్రతి ఒక్కరూ వాడేది ఉపయోగించేది థాయినే. ఆంగ్ల భాష ప్రాభవం పెరుగుతున్నప్పటికీ, మొదటినుంచీ ఉపయోగిస్తుండడంవలన థాయి భాషే విశ్వవిద్యాలయాలలో బోధనామాధ్యమంగా ప్రాధాన్యతా స్థానంలో ఉంది. ఐతే, ఆధునిక అవసరాలకు తోడుగా థాయిలాండ్ పాఠశాలల్లో ప్రధాన అంశంగా ఇంగ్లీష్ భాష ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించి వివిధ స్థాయిలలో తప్పనిసరి విషయంగా నేర్పేందుకు అన్ని రకాల వ్యవస్థలనూ సమకూర్చుతోంది.

**చైనా:** చైనాలో ఇంగ్లీషు వాడకంపై చేసిన పరిశోధనా వివరాలను బట్టి చూడగా చైనాలో, అవసరమైన కొద్ది మంది మాత్రమే కొన్ని సందర్భాలలో మాత్రమే ఇంగ్లీషు వాడుతున్నట్లు తెలుస్తోంది.

2000 సంవత్సరంలో వెలువరించిన చైనా జనాభా లెక్కల ప్రకారం షుమారు 39 కోట్ల మంది ఇంగ్లీషు నేర్చినవాళ్లు ఉన్నారు. చైనాలో సెకండరీ స్థాయి విద్య చదివేవారు తప్పనిసరిగా ఇంగ్లీషు, రష్యను, జాపానీ, స్పానిషు, అరబిక్, ఫ్రెంచి లాంటివాటిలో ఏదో ఒక విదేశీ భాషను చదవాలి. వీరిలో ఇంగ్లీషు చదివినవారు 85–90% వరకూ ఉంటారు. అలా ఇంగ్లీషును చదివినవాళ్లే ఈ 39 కోట్లమంది.

అంటే చైనాలో ఇంగ్లీషును మౌలికంగా ఒక విదేశీ భాషగా, సెకండరీ స్థాయిలో చదవాలి.

ఐతే వీరి ఇంగ్లీష ప్రావీణ్యాన్ని అంచనా వేయగా వీరిలో ఇంగ్లీషును ధారాళంగా మాట్లాడగలిగినవారు 5.30% మంది కాగా 15% మంది మాత్రమే కొంత మేరకు ఇంగ్లీషును మాట్లడగలిగిన వారు. ఇక ఇంగ్లీషులో గ్రంథాలూ పత్రికలూ చదివి అర్థం చేసుకో గలిగినవారు 3.25% మాత్రమే. ఇక పోతే, వీరిలో దాదాపు 15% మంది మాత్రమే తరుచుగా ఇంగ్లీషును వాడేవాళ్లు, 60-70% మందికి ఎప్పుడోగానీ ఇంగ్లీషువాడే అవసరం కలగదు.

**తైవాన్:** 2003 లెక్కల ప్రకారం తైవాన్ అక్షరాస్యత 97.15%. అక్కడి చదువులన్నీ మాండరిన్ భాషా మాధ్యమం ద్వారానే. అది సాధించిన పారిశ్రామిక ప్రగతి స్థానిక భాషలతోనే జరిగింది. ఐతే ఆధునిక ప్రపంచీకరణలో భాగంగా స్కూలు బైట 'బుషిబన్లు' అనే పేరుతో ప్రైవేటుగా ఇంగ్లీషును ట్యూషన్లద్వారా నేర్చుకోవడం సర్వసాధారణం. అంటే సంగీతం, చిత్రలేఖనం లాంటి ఇతరత్రా కౌశలాలను నేర్చుకోవడంలో ఇదీ ఒక భాగమైంది. 1960 తర్వాత త్వరితగతిన పారిశ్రామికీకరణం చెందుతూ, ఆర్థిక ప్రగతికి బాటలు పరుచుకున్న తైవాన్ 1980-90 సంవత్సరాలమధ్య హైటెక్ ఎలక్ట్రానిక్ పరికరాల నిర్మాణంద్వారా విశ్వవ్యాప్తంగా గొప్ప ఆర్థిక శక్తిగా నిలిచింది. ఇదంతా స్థానికభాషల వాడకంద్వారానే సాధ్యమయింది.

**మంగోలియా:** 30 లక్షల జనాభా కలిగిన దేశం, 97.30% అక్షరాస్యతతో స్థూల జాతీయోత్పత్తి సుమారు లక్ష కోట్లకు పైమాటే. విశ్వవిద్యాలయాలలో ప్రత్యేకంగా తప్పించి అన్నింటా మంగోలియను మాధ్యమమే. ప్రతిచోటా వినపడేదీ కనబడేది మంగోలియనే. సాలుసరి వ్యక్తిగత ఆదాయం 2,66, 044.37.

మనలో కొంతమంది అనుకొనేటట్లు, మనదేశం చాలా పెద్ద దేశం, అధిక జనాభా గలిగిన దేశం, అందుకనే మనం అక్షరాస్యత లోనూ అభివృద్ధిలోనూ వెనుకబడి ఉన్నాం అనే వాదనలలో పసలేదు. 70 సంవత్సరాలపాటు దేశాన్ని నడిపించిన నాయకులదీ పాలకులదే ఈ పాపం. వారే ఇంకొక అడుగు ముందుకేసి అనాలోచితంగా స్థానిక, ప్రాంతీయభాషలను పూర్తిగా తుడిచిపెట్టే ప్రయత్నంలో ఉన్నారు. వీరు తూర్పు ఆసియా దేశాల విజయగాథలను అవలోకిస్తే అక్షరాస్యతనూ అభివృద్ధినీ సాధించే ప్రక్రియ మళ్లీ మొదలెట్టవచ్చు.

## ఆసియా దేశాలలో అక్షరాస్యత

తూర్పు ఆసియా దేశాలు–భారతదేశం

| క్ర. సం. | దేశం పేరు | [1]తలసరి సంవ. ఆదాయం(రూ.) | [2]అక్షరాస్యత శాతం | వైశాల్యం చ.కిమీ. | జనాభా లక్షలలో |
|---|---|---|---|---|---|
| 1. | తైవాన్ | 30,85,534 | 97.15 | 35000 | 002,35 |
| 2. | ద. కొరియా | 24,21,209 | 97.90[5] | 100,210 | 005,15 |
| 3. | థాయిలాండ్ | 10,83,449 | 96.70 | 513,000 | 006,72 |
| 4. | చైనా | 9,87,922 | 96.40 | 96,00,000 | 135,00 |
| 5. | మంగోలియా | 7,87,502 | 98.40 | 15,00,000 | 000,30 |
| 6. | భారతదేశం | 4,24,449 | 74.40[4] | 33,00,000 | 125,00 |
| 7. | ఆంధ్రప్రదేశ్ | 1,00,930[3] | 67.41[4] | 162,970 | 004,94 |
| 8. | తెలంగాణ | 1,15,836[3] | 64.46[4] | 112,077 | 003,52 |

1. ఇంటర్నేషనల్ మానిటరీఫండ్ అంచనా–2016.
2. యునెస్కో 2015 లెక్కల ప్రకారం అంచనా
3. 2015–16 స్థూలజాతీయోత్పత్తి లెక్కలప్రకారం అంచనా
4. 2011 జనాభా లెక్కల ప్రకారం
5. 2013 లెక్కల ప్రకారం

**అంతర్జాలం వాడకంలో ఆంగ్లంపై ప్రాంతీయ భాషలు విజయం** అంతర్జాలం వాడకంలో ఆంగ్లంపై ప్రాంతీయ భాషలు విజయం సాధించాయి అని ఈ మధ్యనే గూగుల్ నిర్వహించిన ఒక సర్వేక్షణలో వెల్లడయింది. ఎక్కువ మంది భారతీయులు తమ కార్యకలాపాల నిర్వహణకు ఆన్ లైన్ లోకి మళ్ళడంతో హిందీ తదితర ప్రాంతీయ భాషలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ ధోరణి మరింతగా లభ్యమౌతున్న ప్రాంతీయ సమాచారం, పడిపోతున్న సమాచార సేవల ధరలూ ఇంకా చౌకైన స్మార్ట్‌ఫోన్ల ఉత్పాదనతోనూ విస్తరిస్తున్న అంతర్జాల సేవలవలనా సాధ్యమవుతోంది.

**ఇంటర్నెట్లో ఇంగ్లీష్ భాష యొక్క ఆధిపత్యం ముగిసింది. ఇప్పటికీ ఇంగ్లీష్ భాషను ఉపయోగిస్తున్న కోట్లాది మంది భారతీ యులు ఉన్నారు. గూగుల్ ఇండియా, ఆగ్నేయ ఆసియా కార్యకలా పాల ఉపాధ్యక్షుడు రాజన్ ఆనందన్, భారతదేశంలో అంతర్జాలం వినియోగపు తదుపరి దశ గురించి మాట్లాడుతూ 'అంతర్జాలంలోకి వస్తున్న దాదాపు ప్రతి కొత్త వినియోగదారుడూ ఇంగ్లీషేతర వినియోగదారుడే',**

**అంటే సుమారుగా ప్రతి పదిమంది లోనూ తొమ్మిది మంది ఇంగ్లీష్‌లో నైపుణ్యం లేనివారు కాబట్టి  అంతర్జాలం వాడుకలో పెరుగుదల అంటే దాదాపుగా ప్రాంతీయ భాషల వాడకంలో పెరుగుదలగా ఉంటోంది.**

గూగుల్ అంచనా ప్రకారం 2021 నాటికి, హిందీలో సమాచార వినియోగం ఇంగ్లీష్‌లో వినియోగం కంటే పెద్దదిగా ఉంటుంది. హిందీ ముందుండి నడిపిస్తున్న స్థానిక భాషల  అంతర్జాల వినియోగ వేగం, ప్రజలని ఆన్‌లైన్‌లో ప్రపంచానికి పరిచయం చేయడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు.

గూగుల్ నిర్వహించిన మరొక అధ్యయనంలో కూడా ఇలాంటి ధోరణే  వెల్లడైంది. భారతదేశంలో నేడు 23.40  కోట్ల మంది భారతీయ భాషల వినియోగదారులు ఉండగా, 17.50 కోట్ల  మంది మాత్రమే ఆంగ్ల వాడుకదారులు ఉన్నారు.  వచ్చే నాలుగు సంవత్సరాల్లో, స్థానిక భాషా వినియోగదారుల సంఖ్య 53.4 కోట్లకు చేరుకోవడానికి సంవత్సరానికి 18% చొప్పున పెరుగుదల కొనసాగుతుంది.

స్థానిక భాషల ఇంటర్నెట్ వాడుకలో సందేశ సేవ (16.90 కోట్లు), డిజిటల్ వినోదం (16.70 కోట్లు), సోషల్ మీడియా (11.50 కోట్లు) ఇంకా ఆన్‌లైన్ వార్తల (10.6 కోట్లు) వంటి సేవలతో  నడుస్తోందని అధ్యయనంలో తేలింది.

మొబైల్ పరికరాల ద్వారానే 99 శాతం మంది స్థానిక భాషలను అంతర్జాలం ద్వారా యాక్సెస్ చేస్తారని ఆ అధ్యయనం వెల్లడించింది. మొబైల్ ద్వారా  అంతర్జాలంలో సమాచారాన్ని  పొందేవారి సంఖ్య 78 శాతం, అని ఆనందన్ అన్నారు.

ఈ పెరుగుదలను కొనసాగించడానికి  3,000 రూపాయలకే  మంచి నాణ్యత గలిగిన స్మార్ట్‌ఫోన్లు అవసరమవుతాయి. ఐతే, ఇవి 2,000 రూపాయల కంటే తక్కువకు కూడా దిగిరావాల్సిన అవసరం ఉంది.

హిందీ, తెలుగు, బెంగాలీ, మరాఠీ, తమిళం, కన్నడ, గుజరాతీ ఇంకా మలయాళ భాషల్లో  అంతర్జాల  వినియోగం ఎక్కువగా ఉంది. బెంగాలీ, తెలుగు, మరాఠీ ఇంకా తమిళ భాషలను కలుపుకొని దేశంలో మొత్తం స్థానిక భాషా వినియోగదారుల సంఖ్య 30% ఉన్నట్లు అంచనా.

స్థానిక భాషలలో అంతర్జాల వినియోగం పేలిపోనున్నది.  అయితే ప్రస్తుతం సృష్టించబడుతున్న సమాచారమే తగినంతగా ఉండడంలేదు.